

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు

సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు

ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

శ్రీకాకుళం

: fb.com/vaartha Digital

Published from Srikakulam ,Visakhapatnam, Vijayawada, Hyderabad,Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem

10-5-2026 ఆదివారం సంపుటి: 32 సంచిక: 99 పేజీలు: 16 వెల: 8.00


పంజాబ్ పరిశ్రమల మంత్రిని అరెస్టు చేసిన ఇడి

సిడిఎస్‌గా రాజా సుబ్రమణి నియామకం

5లో

# రబీలో భారీగా ధాన్యం సేకరణ

## బాయిల్డ్ రైస్ కొనుగోలుకు కేంద్రం అంగీకారం

## 8 లక్షల మె.ట మేర కేంద్రం కొనుగోలు

## ధాన్యానికి నిధులు 24 గంటల్లో రైతు ఖాతాల్లో జమ

## ఖరీఫ్, రబీలో 70 ల.మె.టన్నుల సేకరణ లక్ష్యం: మంత్రి నాదెండ్ల



**విజయవాడ,మే 9,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలోని రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని బాయిల్డ్ రైస్ కొనుగోలు చేయాలని కేంద్రాన్ని కోరగా, ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. రాష్ట్రం నుంచి 8 లక్షల మెట్రిక్ టన్నుల బాయిల్డ్ రైస్ సేకరించేందుకు కేంద్రం ఆమోదం తెలిపిందని వెల్లడించారు. ఇందుకు కేంద్ర ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు అన్నారు. రాష్ట్ర రైతుల ఇబ్బందులను గుర్తించి కేంద్రం పెద్ద మనసు చాటుకుంది. 8 లక్షల మెట్రిక్ టన్నుల బాయిల్డ్ రైస్ సేకరణకు అనుమతి ఇవ్వడంతో రైతన్నలకు ఊరట లభించిందన్నారు. రబీలో రూ.4,410కోట్ల ధాన్యం కొని 24 గంటల్లోనే 94 శాతం నిధులు రైతుల ఖాతాల్లో జమ చేయడం చారిత్రాత్మక రికార్డు అని పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు.రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ ఎండీ ఎస్. ఢిల్లీరావుతో కలిసి ధాన్యం కొనుగోలు తీరుతెన్నులపై సమీక్షించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా రబీ సీజన్‌లో ఇప్పటివరకు రూ.4,410 కోట్ల విలువైన ధాన్యాన్ని సేకరించామని చెప్పారు. అందులో 94 శాతం నిధులను కేవలం 24 గంటల వ్యవధిలోనే నేరుగా రైతుల ఖాతాల్లోకి జమ చేశామని పేర్కొన్నారు. ఇది చారిత్రాత్మక రికార్డు అని, గత ప్రభుత్వాల హయాంలో నెలల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి ఉండేదని గుర్తు చేశారు. రాష్ట్రంలో రైతుల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం విప్లవాత్మక మార్పులు చేపట్టిందని, ధాన్యం కొనుగోలు ప్రక్రియలో గతంలో ఎన్నడూ లేని విధంగా పారదర్శకత, వేగాన్ని తీసుకొచ్చామని మంత్రి స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆలోచనలకు అనుగుణంగా క్షేత్రస్థాయిలో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ పౌరసరఫరాల శాఖ, జిల్లా యంత్రాంగం, కార్పొరేషన్ సమన్వయంతో ముందుకు సాగుతున్నామన్నారు. రైతుల కోరిక మేరకు ఇతరజిల్లాల మిల్లర్లు వచ్చి ధాన్యం సేకరించే అంశంపై ప్రభుత్వం సానుకూలంగా ఉందని మంత్రి చెప్పారు. ప్రస్తుతం ఉమ్మడి కృష్ణా జిల్లా వ్యాప్తంగా మిల్లర్లలకు అనుమతి ఉందని, అవసరమైతే పొరుగు జిల్లాల మిల్లర్లకు కూడా వెసులుబాటు కల్పించేలా సోమవారం జరిగే ఉన్నతస్థాయి సమావేశంలో నిర్ణయం తీసుకుంటామన్నారు. లారీలు, గోనె సంచులనాణ్యత వంటి చిన్నచిన్న స్థానిక సమస్యలను సిబ్బంది ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నారని, రైతులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టంచేశారు. ఉమ్మడి కృష్ణా జిల్లాలో ధాన్యం సేకరణ, కొనుగోలు, చెల్లింపుల గురించి రైతులతో నేరుగా మాట్లాడి ఆరా తీశాం. ఎన్టీఆర్ జిల్లాలో ధాన్యం సేకరణ గణనీయంగా పెరిగింది. గత ఏడాది కేవలం 30 వేల మెట్రిక్ టన్నులు సేకరించగా, ఈ ఏడాది ఇప్పటికే 80 వేల మెట్రిక్ టన్నులు సేకరించాం. అంచనాల కంటే దిగుబడి ఎక్కువగా ఉన్నందున జిల్లా యంత్రాంగం విజ్ఞప్తి మేరకు ఎన్టీఆర్ జిల్లాకు అదనంగా మరో 30 వేల మెట్రిక్ టన్నుల కోటాను కేటాయిస్తూ నిర్ణయం తీసుకున్నాం. ఈ రబీలో జిల్లా నుంచిమొత్తం లక్షా 10వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించబోతున్నామన్నారు.



శనివారం గవర్నర్ ఆర్లేకర్‌నుంచి అనుమతిపత్రం అందుకుంటున్న టివికె అధ్యక్షుడు విజయ్

# విజయుడే..

## ప్రభుత్వం ఏర్పాటుకు గవర్నర్ గ్రీన్ సిగ్నల్

## 120 మంది ఎమ్మెల్యేల మద్దతుతో గవర్నర్‌కు లేఖ సమర్పించిన టివికె చీఫ్ విజయ్

## నేటి ఉదయం 10గం.కు చెన్నై నెహ్రూ స్టేడియంలో ప్రమాణం

**చెన్నై,మే 9:** తమిళనాట పొలిటికల్ మిస్టరీ ఎట్టకేలకు వీడింది. గడచిన ఐదురోజులుగా అటు రాష్ట్రప్రజలను ఇటు రాజకీయపార్టీల్లోను తీవ్ర ఉత్కంఠకు తెరతీసిన పొత్తులు ఇపుడు కొలిక్కి వచ్చాయి. కేవలం రెండేరెండు స్థానాలవద్ద నిలిచిపోయిన టివికె మెజార్టీ మార్కు రెండుపార్టీలు శనివారం మద్దతు ఇవ్వడంతో కొలిక్కి వచ్చింది. మెజార్టీ మార్కును దాటి 120 స్థానాలకు చేరడంతో గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ >>2



బెంగాల్ సిఎంగా ప్రమాణం చేసిన సువేందుతో ప్రధాని మోడీ, గవర్నర్ ఆర్ఎన్ రవి

# 'అధికారి' చేతికి బెంగాల్ పగ్గాలు

- 9వ సిఎంగా ప్రమాణం
- మరో ఐదుగురు మంత్రులు కూడా..
- ప్రధాని మోడీ, కేంద్రమంత్రులు, ఎన్డీయే నేతలు హాజరు

**కోల్‌కతా, మే 9:** పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రిగా సువేందు అధికారి ప్రమాణ స్వీకారం చేశారు. కోల్‌కతాలోని చారిత్రాత్మక 'బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్'లో శనివారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో సువేందు అధికారి ముఖ్యమంత్రిగా ప్రమాణం చేశారు. బెంగాల్ గవర్నర్ ఆర్.ఎన్.రవి ఆయనతో ప్రమాణం చేయించారు. కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, జెపి నడ్డా, బిజెపి జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్, ఎన్డీయే పాలిత రాష్ట్రాల సిఎంలు చంద్రబాబు నాయుడు, యోగి ఆదిత్యనాథ్, >>2



సభావేదికపై మఖన్‌లాల్ సర్కార్‌కు పాదాభివందనం చేస్తున్న ప్రధాని మోడీ- 5లో



విశాఖలోని కైలాసగిపై ఏర్పాటు చేసిన త్రిశూల్

# విశాఖలో 'త్రిశూల్' వైభవం

## కైలాసగిరిపై ఆధ్యాత్మిక శోభ

**విశాఖపట్నం, మే 9 ప్రభాతవార్త:** విశాఖ పర్యాటక మణిహారమైన కైలాసగిరి నూతనంగా ఏర్పాటు చేసిన 65 అడుగుల డమరుకం తో కూడిన త్రిశూల్ ప్రారంభోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. శనివారం కైలాసగిరి పై మహా శివుడుకి ప్రత్యేక పూజలు జరిపిన అనంతరం త్రిశూలంకు పూజలు చేశారు. రాష్ట్ర మున్సిపల్ పురపాలక >>2

# ప్రజలందరికీ సమ న్యాయం

## ■ న్యాయ మౌలిక వసతులు ప్రజల విశ్వాసానికి ప్రతీకలు కావాలి ■ రాజమహేంద్రవరంలో 10 కోర్టుల భవన సముదాయం ప్రారంభించిన హైకోర్టు సిజె లీసా గిల్



శనివారం రాజమహేంద్రవారంలో కోర్టుల భవనాలను ప్రారంభించి మాట్లాడుతున్న హైకోర్టు సిజె లీసాగిల్

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, మే9, ప్రభాతవార్త:** న్యాయ మౌలిక వసతులు కేవలం ఇటుకలు, సిమెంట్‌తో నిర్మించిన భవనాలు మాత్రమే కాకుండా ప్రజల భావోద్వేగాలకు, న్యాయ వ్యవస్థ నిబద్ధతకు ప్రతీకలని జస్టిస్ లిసా గిల్ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లిసా గిల్ శనివారం తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో నూతనంగా నిర్మించిన 10 కోర్టుల భవన సముదాయాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ప్రధానన్యాయమూర్తి జస్టిస్ లిసా గిల్ మాట్లాడుతూ, న్యాయ వ్యవస్థలో ప్రతి ఒక్కరూ తమ తమ బాధ్యతలను సమర్థంగా నిర్వర్తించి నప్పుడే న్యాయం సమాజంలోని ప్రతి వర్గానికీ చేరుతుందని అన్నారు. రాజమహేంద్రవరం, తూర్పు గోదావరి ప్రాంతాల సాంస్కృతిక, సాహిత్య, న్యాయ వారసత్వాన్ని ప్రస్తావిస్తూ,ఈ నేల నుంచి అనేక మంది ప్రముఖ న్యాయమూర్తులు,న్యాయవాదులు, సాహితీవేత్తలు, స్వాతంత్ర్య సమరయోధులు వెలుగులోకి వచ్చారని కొనియాడారు.

న్యాయ వ్యవస్థలో సాంకేతికత ప్రాధాన్యం రోజురోజుకూ పెరుగుతోందని, డిజిటలైజేషన్ ఇప్పుడు అనివార్యమైందని ఆమె అన్నారు. కోవిడ్ కాలంలో కూడా భారత న్యాయస్థానాలు ప్రజలకు అందుబాటులో ఉండటం దేశ న్యాయ వ్యవస్థ గొప్పతనమని పేర్కొన్నారు. అయితే కృత్రిమ మేధస్సు వినియోగంపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సాంకేతికతను మన ప్రయోజనానికి ఉపయోగించు కోవాలే గానీ, స్వతంత్ర ఆలోచనను కోల్పోవద్దని అన్నారు. చాట్‌జీపీటీ వంటి సాధనాలు మానవ ఆలోచనకు ప్రత్యామ్నాయం కావని స్పష్టం చేశారు.కొత్త కోర్టు భవన సముదాయానికి నిరంతర నిర్వహణ, అవసరమైనప్పుడు ఆధునీకరణ ఉండాలని, దీనిపై పరిపాలన దృష్టి సారించాలని సూచించారు.

మధ్యవర్తిత్వం (మీడియేషన్) ప్రాధాన్యాన్ని వివరించిన ఆమె, మీడియేషన్‌ను కేవలం కుటుంబ వివాదాలు లేదా మోటార్ ప్రమాద కేసులకు మాత్రమే పరిమితం చేయరాదన్నారు. వివాదాలను తీర్పుతో ముగించడమే కాకుండా, పరస్పర అవగాహనతో పరిష్కరించడమే నిజమైన విజయమని చెప్పారు. న్యాయవాదులు, న్యాయాధికారులు మీడియేషన్‌ను మరింత ప్రోత్సహించాలని ఆమె కోరారు. కోర్టులు కేవలం వివాదాలు తీర్చే స్థలాలుగా కాకుండా, పరస్పర విభేదాలు తొలగి సఖ్యత నెలకొనే వేదికలుగా మారాలని ఆకాంక్షించారు. విచారణలు వేగంగా పూర్తయ్యేందుకు సాక్షుల హాజరు తదితర అంశాల్లో పోలీసు శాఖ పూర్తి సహకారం అందించాలని సూచించారు. ఈ భవన నిర్మాణంలో పాల్గొన్న ఇంజినీర్లు, అధికారులు, కార్మికులు అందరినీ అభినందించిన ఆమె, ఈ నూతన కోర్టు భవనం సత్యం, న్యాయం, ధర్మానికి మార్గదర్శకంగా నిలిచి న్యాయ సేవలను మరింత బలోపేతం చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయ >>2

# కడపలో బాహాబాహీ

## అల్మాస్‌పేట సర్కిల్‌లో ఏరియా పేరుపై వివాదం

## రెండు వర్గాల ఘర్షణలతో ఉద్రిక్తత

## రాళ్లదాడిలో గాయపడిన సిఐ



రాళ్లదాడిలో గాయపడిన సిఐ నరసింహా

**కడప కార్పొరేషన్ మే 9 ప్రభాతవార్త:** కడప నగరంలోని అల్మాస్పేట సర్కిల్ దగ్గర శనివారం ముస్లింలు నిరసనకు దిగారు. అల్మాస్పేట సర్కిల్‌లో హనుమాన్ సర్కిల్ అని బ్యానర్లు వేయడంపై వివాదం రాజుకుంది. రెండు వర్గాలు రాళ్ళ విసురు కోవడంతో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. అక్కడికి పోలీసులు చేరుకొని పరిస్థితిని అదుపు చేయడానికి ప్రయత్నం చేశారు. ఆందోళనలు తిరిగి గొడవకు దారితీసింది. రెండు వర్గాల వారు రాళ్లు విసురుకున్నారు. రాళ్ల దాడిలో తాలూకా సిఐ నరసింహ తలకి గాయమైంది. కొంతమంది పోలీసులు గాయపడ్డారు. దీంతో పోలీసులు లాఠీ ఛార్జ్ చేశారు. కడప నగరంలో విఘ్నేశ్వరుని ఆలయం ఎదుట 12వ తేదీ హనుమాన్ విగ్రహావిష్కరణ నిర్వహకులు ఏర్పాట్లు చేసుకున్నారు.

అలాగే హనుమాన్ జయంతి సందర్భంగా హనుమాన్ బైక్ ర్యాలీ కూడా ఏర్పాటు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో హనుమాన్ సర్కిల్ అని బ్యానర్లు ఏర్పాటు చేశారు. దీంతో ముస్లింలు టిప్పు సుల్తాన్ సర్కిల్‌గా నామకరణం చేయాలని పట్టుబట్టారు. అల్మాస్పేట సర్కిల్లో టిప్పు సుల్తాన్ విగ్రహాన్ని ఏర్పాటు చేసి, టిప్పు సుల్తాన్ సర్కిల్‌గా పేరు మార్చాలని చివరి సర్వసభ్య సమావేశంలో వైసిపి పాలకవర్గం నిర్ణయం తీసుకుంది. అయితే దీన్ని వ్యతిరేకిస్తూ హిందూ సంఘాలు అలాగే బిజెపి ఆధ్వర్యంలో ఇక్కడ నిరసన కూడా తెలిపారు. అయితే ప్రస్తుతం ఇక్కడ రేపు హనుమత్ జయంతి సందర్భంగా 31 అడుగుల హనుమాన్ విగ్రహం ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో బ్యానర్లపై హనుమాన్ సర్కిల్ అని ఉండడంతో కొంతమంది ముస్లింలకు నచ్చలేదు. ఆల్మాస్పేట సర్కిల్‌కి సంబంధించి టిప్పు సుల్తాన్ బొమ్మతో కూడిన బ్యానర్ పట్టుకొని ముస్లింలు ఆందోళన చేపట్టారు. హిందువులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. హిందువులు కూడా జై శ్రీరామ్ నినాదాలు చేశారు. పరిస్థితి చేయి దాటి రాళ్లు విసురుకున్నారు. దీంతో పోలీసులు లాఠీచార్జి చేశారు. ఆందోళన కారులను చదరగొట్టారు. దీంతో పరిస్థితి కంట్రోల్ అయింది.

# పలువురు ఐఎఎస్ అధికారుల బదలీ

**విజయవాడ, మే 9, ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో పలువురు ఐఎఎస్ అధికారులు బదిలీ అయ్యారు. ఐఎఎస్ అధికారుల బదిలీలు, అదనపు బాధ్యతలపై ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. ఈమేరకు జివో ఆర్టీ నెంబర్ 918ను సిఎస్ జి.సాయి ప్రసాద్ జారీ చేశారు, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగాఉన్న శశి భూషణ్ కుమార్‌కు జల వనరులశాఖ బాధ్యతలు అప్పగించింది. జల వనరుల శాఖ స్పెషల్ సిఎస్, ఫుల్ అడిషనల్ ఛార్జ్ భాత్యతలనుంటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జీ.సాయి ప్రసాద్‌కు ఉపశమనం లభించినట్లయింది. పర్యావరణ, అటవీ శాఖ ప్రధాన కార్యదర్శి కాంతిలాల్ దండేకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ పూర్తి అధనపు భాద్యతలు అప్పగించింది. వెంటనే ఈ ఉత్తర్వులు అమలులోకి వస్తాయని ప్రభుత్వం వెల్లడించింది.

# నకిలీ డిఎస్పీ రూ. 40 లక్షల టోకరా!

## అప్పు ఎగ్గొట్టేందుకు కి(లేడి) దౌర్జన్యం

## పోలీసులను ఆశ్రయించిన బాధితుడు

## 'అనంత'లో నయా మోసం



డీఎస్పీ అవతారమెత్తిన సరస్వతి

**అనంతపురం క్రైమ్ మే 9 ప్రభాతవార్త:** ఇటీవల అనంతపురం జిల్లాతో పాటు తెలుగు రాష్ట్రాల్లో కుదిపేసిన హనీ ట్రాప్ ఉదంతం మరవకముందే మరో నయా మోసం వెలుగు చూసింది. ఆర్థిక మోసాలకు, నేరాలకు అనంతపురం జిల్లా కేరాఫ్‌గా మారిందని జిల్లా వాసులు హడలెత్తిపోతున్నారు. ఓ లేడీ తాను మహిళా పోలీస్ స్టేషన్‌లో డిఎస్పీగా పనిచేస్తున్నానంటూ మరో దందాకు తెరలేపింది. పరిచయస్తుడితో 40 లక్షల దాకా అప్పుగా వసూలు చేసింది. తీసుకున్న అప్పు మూడేళ్లుగా తిరిగి చెల్లించకపోవడంతో బాధితుడు పోలీస్ స్టేషన్ మెట్లు ఎక్కాడు. అనంతపురం రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. కట్ చేస్తే... కళ్యాణదుర్గం మండలం ముదినాయన పల్లి గ్రామానికి చెందిన సరస్వతి అనే మహిళ అనంతపురం రూరల్ మండలం ఆలమూరు గ్రామానికి చెందిన రంగనాయకులతో పరిచయం ఏర్పడింది. తాను అనంతపురం లోని >>2

# గుంతలులేని రోడ్లు లక్ష్యం

## వివిధ ప్రాంతాలలో రోడ్ల విస్తరణకు ప్రాధాన్యం

## ఆర్ అండ్ బిని నిర్లక్ష్యం చేసిన గత ప్రభుత్వం: మంత్రి జనార్దన్ రెడ్డి



శనివారం ప్రొద్దుటూరులో నిర్వహించిన సభలో మాట్లాడుతున్న మంత్రి జనార్దన్ రెడ్డి

**ప్రొద్దుటూరు మే 9 ప్రభాతవార్త:** రాష్ట్రంలో గుంతలు లేని రోడ్లు ఏర్పాటు చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి బిసి జనార్దన్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన 5 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో ప్రొద్దుటూరు పట్టణంలోని కొర్రపాడు రోడ్డు విస్తరణ పనులకు భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ టిడిపి అధ్యక్షుడు చల్లా రాజగోపాల్ యాదవ్ అధ్యక్షతన నిర్వహించిన సభలో ముందుగా మంత్రి కొర్రపాడు రోడ్డులోని వాసవీ మాత శమీ దర్శన మందిరం వద్ద అభివృద్ధి పనులకు భూమి పూజ నిర్వహించి, శిలాఫలకం ఆవిష్కరించారు. అనంతరం మంత్రి బిసి జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్సీ ప్రభుత్వం గత 5 సంవత్సరాలలో ప్రజా వేదిక కూల్చి విధ్వంసంతో మొదలుపెట్టిందని, కూటమి ప్రభుత్వం వికాసం తో పాలన ప్రారంభించిందని తెలిపారు. గత ప్రభుత్వంలో చేసిన అప్పులు చెల్లిస్తూ, గుంతలమయమైన రోడ్లకు మరమ్మత్తులు, నూతన రోడ్ల నిర్మాణం, సంక్షేమం, అభివృద్ధి, సూపర్ 6 అమలు, పారిశ్రామికీకరణ, ఉద్యోగాలు విడుదల చేస్తూ ఆదర్శవంతమైన పాలన సాగిస్తోందని వివరించారు. వైఎస్సార్సీ ప్రభుత్వం ఆర్ అండ్ బి శాఖను నిర్వీర్యం >>2

10-5pg2exHMNWJQE.qxd:10-5pg2exHMNWJQE.qxd 1/1/02 7:11 AM Page 1





శనివారం బెంగాల్ సిఎం సువేందు అధికారిని అభినందిస్తున్న సిఎం చంద్రబాబు

# పశ్చిమబెంగాల్ సిఎం సువేందు అధికారికి సిఎం చంద్రబాబు అభినందనలు

**విజయవాడ,మే 9, ప్రభాతవార్తప్రతినిధి:** పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రిగా ప్రమాణం చేసిన సువేందు అధికారిని సిఎం చంద్రబాబు అభినందించారు. ప్రజాసేవ కోసం బాధ్యతలు స్వీకరిస్తున్న ఆయన మంత్రివర్గ సభ్యులందరికీ కూడా చంద్రబాబు శుభాకాంక్షలు తెలిపారు. ప్రజల ఆశీర్వాదం, విశ్వాసంతో కొత్త ప్రభుత్వం తన పదవీకాలాన్ని ప్రారంభిస్తున్న ఈ సందర్భంగా అభినందనలు తెలుపుతున్నారు. ప్రధాని నరేంద్ర మోడీ దూరదృష్టి నాయకత్వం, 'వికసిత భారత్' స్వప్నం స్ఫూర్తిగా ఈ ప్రభుత్వం ముందుకు సాగాలని ఆకాంక్షించారు. పశ్చిమబెంగాల్‌లో కొత్త ప్రభుత్వం బాధ్యతలు చేపట్టింది. పశ్చిమబెంగాల్ సిఎంగా సువేందు అధికారి ప్రమాణస్వీకారం చేశారు. సువేందు అధికారితో సిఎంగా గవర్నర్ ప్రమాణం చేయించారు. మంత్రులుగా అగ్నిమిత్ర పాల్, దిలీప్ ఘోష్, అశోక్ కిర్తానియా, నిశిత్ ప్రామాణిక్, క్షుదిరామ్ టుడు ప్రమాణం చేశారు. కోల్‌కతాలోని బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్‌లో ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరైన ప్రధాని మోదీ, అమిత్‌షా, రాజ్‌నాథ్, జేపీ నడ్డా, ఎన్డీఏ పాలిత రాష్ట్రాల సీఎంలు, ఏపి ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరయ్యారు.

## మస్కట్ నుంచి స్వదేశానికి చేరుకున్న షహనాజ్ డి.సిఎం పవన్‌కు కృతజ్ఞతలు

**విజయవాడ మే 9 ప్రభాతవార్త ప్రతినిధి:** మస్కట్‌లో చిత్రహింసలకు గురై స్వదేశానికి చేరుకున్న షహనాజ్ అనే మహిళ డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్, మదనపల్లె ఎస్పీ, ఇతర అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. అన్నమయ్య జిల్లా వాల్మీకిపురానికి చెందిన షహనాజ్ ఉపాధి నిమిత్తం మస్కట్‌కు వెళ్లారు. అక్కడ సేఠ్ పెడుతున్న ఇబ్బందులు తట్టుకోలేక ఏడుస్తూ వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్టు చేశారు. అందులో పవనన్నా..నన్ను చంపేస్తారన్నా..ప్లీజ్ కాపాడన్నా అంటూ వేడుకున్నారు. స్పందించిన పవన్ షహనాజ్‌ను స్వదేశానికి రప్పించేందుకు చర్యలు చేపట్టారు. విదేశాంగ శాఖ, దౌత్య కార్యాలయాల అధికారులతో డిప్యూటీ సిఎం కార్యాలయం సంప్రదింపులు జరిపింది. పవన్, అధికారుల చొరవతో షహనాజ్ శుక్రవారం స్వస్థలానికి చేరుకున్నారు. ఈ నేపథ్యంలో ఆమెతో పాటు కుటుంబసభ్యులు శనివారం మదనపల్లెలోని ఎస్పీ కార్యాలయానికి వెళ్లారు. జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి, అదనపు ఎస్పీ వెంకటాద్రి, రాయచోటి డీఎస్పీ కృష్ణమోహన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ దళారుల మాటలు నమ్మి విదేశాలకు వెళ్లి ఎవరూ మోసపోవద్దని సూచించారు.

# ప్రతి ఓటరు ప్రజాస్వామ్య బలోపేతానికి భాగస్వామి కావాలి

### విజయవంతమైన ఎన్నికల నిర్వహణకు ఇది నూతన ఆరంభం

### ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్



శనివారం తిరుచానూరు ఆలయంలో అమ్మవారి ధ్వజస్తంభానికి మొక్కుతున్న సిఇసి జ్ఞానేశ్‌కుమార్

**తిరుమల,మే 9ప్రభాతవార్తప్రతినిధి:** ప్రతి ఓటరు ప్రజాస్వామ్య బలోపేతానికి భాగస్వామి కావాలని, భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ పేర్కొన్నారు. కుటుంబ ఓటర్లందరికీ ఇది ఒక కొత్త దినమని, విజయవంతమైన ఎన్నికల నిర్వహణకు ఇది నూతన ఆరంభంగా భావిస్తున్నానని అన్నారు. రెండురోజుల తిరుపతి జిల్లా పర్యటనలో భాగంగా శనివారం సాయంత్రం తిరుమల శ్రీవారి ఆలయంలోనికి సిఇసి జ్ఞానేశ్‌కుమార్ దంపతులు చేరుకున్నారు. టిటిడి జెఇఒ వీరబ్రహ్మం, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, తిరుమల డిఎస్పీ విజయశేఖర్ స్వాగతం పలికారు. ఆలయంలోపల తొలుత ధ్వజస్తంభానికి మొక్కారు. అనంతరం ఆయన శ్రీవారిని దర్శించుకున్నారు. వేదపండితులు రంగనాయకుల మండపంలో వేదాశీర్వచనం చేశారు. ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. అంతకుముందు సాయంత్రం తిరుచానూరులో పద్మావతి అమ్మవారిని భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ దంపతులు దర్శించుకున్నారు. ఆలయ అధికారులు సాదర స్వాగతం పలికి, ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేద పండితులు వేదాశీర్వచనం అందించారు. ఆలయ అధికారులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆయన వెంట తిరుపతి జిల్లా సంయుక్త కలెక్టర్ ఆర్. గోవిందరావు, జిల్లా రెవెన్యూ అధికారి జి. నరసింహులు, టిటిడి జెఇఒ వీరబ్రహ్మం ఉన్నారు.

# గుంతలులేని రోడ్లు లక్ష్యం

>> చేస్తే కూటమి ప్రభుత్వం గాడిలో పెడుతోందన్నారు. నేటికి మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి పెట్టుబడిదారులను బెదిరించాలని చూడటం దారుణమన్నారు. ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి అభివృద్ధి పట్ల నిబద్ధత కలిగిన వ్యక్తి అని, తనను ఆయన ఎప్పుడు కలిసినా అభివృద్ధి పనులే కోరతారన్నారు. ఇంత అనుభవం వున్న నాయకుడు అభివృద్ధి ని కాంక్షి స్తూ, శాంతియుత వాతావరణం నెలకొల్పితే, ప్రతిపక్షాలు బురదజల్లడం సరికాదన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్ అభివృద్ధి పట్ల చిత్తశుద్ధితో వున్నారని స్పష్టం చేశారు. కూటమి నాయకులు, కార్యకర్తలు తమ పాలనలో జరిగిన మంచిని ఇంటింటికి తెలిపి ప్రొద్దుటూరు నియోజకవర్గంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి మున్సిపాలిటీ, పంచాయితీ కైవసం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ముందుగా టిడిపి యువ నాయకులు నంద్యాల కొండారెడ్డి మాట్లాడుతూ కొర్రపాడు రోడ్డు విస్తరణ పనుల కోసం గత 10 సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న ప్రజలకు ప్రస్తుతం ఆ కల నెరవేరిందన్నారు. గత ప్రభుత్వంలో మంజూరైన ఆర్టీపిపి ధర్మల్ రోడ్డు ను కూడా కూటమి ప్రభుత్వంలో బిల్లులు మంజూరు చేయించి, పూర్తి చేస్తున్నామని వివరించారు. అదేవిధంగా పట్టణంలోని రిలయన్స్ పెట్రోల్ బంక్ నుండి డిమార్ట్ సర్కిల్ వరకు రోడ్డు విస్తరణ, రిలయన్స్ పెట్రోల్ బంక్ నుండి వాసవీ సర్కిల్ వరకు రోడ్డు విస్తరణ పనులు, అదేవిధంగా లింగాపురం, కల్లూరు రోడ్డు నిర్మాణం, పొట్టిపాడు రోడ్డు విస్తరణ పనులకు వెరసి మొత్తంగా పట్టణంలో దాదాపు 90 కోట్ల రూపాయల నిధులు మంత్రి జనార్ధన్ రెడ్డి మంజూరు చేశారని వివరించారు. ప్రొద్దుటూరు పట్టణంలోని నాలుగు ప్రధాన రహదారులు జమ్మలమడుగు రోడ్డు, మైదుకూరు రోడ్డు, ఎర్రగుంట్ల రోడ్డు, కొర్రపాడు రోడ్డు అవసరమైన మేరకు 100 అడుగుల వరకు విస్తరణ, వాసవీ సర్కిల్, రిలయన్స్ పెట్రోల్ బంక్ వద్ద వున్న సర్కిల్ ను పట్టణానికి తలమానికంగా రూపొందించడానికి ప్రణాళిక సిద్ధం చేశామని తెలిపారు. కాగా ప్రొద్దుటూరు అభివృద్ధి కోసం మంత్రులు, అధికారుల సహకారం మరువలేనిదని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి మాట్లాడుతూ ప్రొద్దుటూరు పట్టణంలో దాదాపు గత 10 సంవత్సరాలుగా అభివృద్ధి కుంటుపడిన నేపథ్యంలో ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, మంత్రుల సహకారంతో నిధులు మంజూరై అభివృద్ధి పనులు జరుగుతున్నాయని వివరించారు. తమకు ప్రభుత్వం అందించే ప్రతి రూపాయిని సక్రమంగా వినియోగిస్తున్నామని తెలిపారు. ప్రొద్దుటూరు పట్టణానికి మంత్రి జనార్ధన్ రెడ్డి వస్తున్నారని తెలిసి ఈ కొర్రపాడు రోడ్డు విస్తరణ పనుల ప్రారంభోత్సవం ఏర్పాటు చేశామని, ఆయన విచ్చేయడం ఆనందకరమన్నారు.

# బెంగాల్ పగ్గాలు

>> రేఖా గుప్తాలతో పాటు వివిధ రాష్ట్రాల సిఎంలు హాజరయ్యారు. ఇటీవల ముగిసిన అసెంబ్లీ ఎన్నికల్లో పశ్చిమబెంగాల్‌లో బిజెపి చారిత్రాత్మక విజయం సాధించిన విషయం తెలిసిందే. 207 స్థానాలను కైవసం చేసుకుని, పశ్చిమ బెంగాల్‌లో ప్రాంతీయ రాజకీయ శక్తుల దీర్ఘకాలిక ఆధిపత్యానికి తెరదించి కొత్త రాజకీయ అధ్యాయానికి నాంది పలికింది.

**ఐదుగురు మంత్రులు ప్రమాణస్వీకారం**

పశ్చిమ బెంగాల్‌లో తొలి బిజెపి ప్రభుత్వానికి ముఖ్యమంత్రిగా సువేందు అధికారి బాధ్యతలు స్వీకరించడంతో, ఆయన కొత్తగా ఏర్పాటుచేసిన మంత్రివర్గంలో పాత, కొత్త ముఖాల కలయిక కనిపించింది. ప్రాంతాలు, వర్గాల మధ్య సమతుల్యత కనిపిస్తున్నది. ఇందులో మహిళలతో పాటు రాజబన్సీ, మతువా, గిరిజన వర్గాలకు కూడా ప్రాతినిధ్యం ఉంది. అధికారితో పాటు, దిలీప్ ఘోష్, అగ్నిమిత్ర పాల్, నిసిత్ ప్రమణిక్, ఖుదీరామ్ టుడు, అశోక్ కీర్తనియాతో సహా ఐదుగురు మంత్రులు ప్రమాణ స్వీకారం చేశారు. ఘోష్, పాల్‌లను అధికారికి డిప్యూటీలుగా నియమించే అవకాశం ఉందని వర్గాలు తెలిపాయి.

**ముఖ్యమంత్రిగా నా ప్రాధాన్యతలివే!**

పశ్చిమ బెంగాల్ తొమ్మిదవ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత, సువేందు అధికారి ఒక పరిపూర్ణ రాజనీతిజ్ఞుడిలా వ్యవహరించారు. ప్రమాణ స్వీకార కార్యక్రమం రవీంద్రనాథ్ టాగోర్ జయంతి రోజునే జరగడం విశేషం. ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం, టాగోర్ జన్మస్థలమైన జోరాసంకో ఠాకూర్‌బారిని సందర్శించిన అధికారి తన తొలి వ్యాఖ్యలలో "ఇది ఒక పవిత్రమైన రోజున జరిగిన శుభారంభం" అని అన్నారు. కొత్త ముఖ్యమంత్రిగా తన ప్రాధాన్యత విద్య, సంస్కృతి వంటి రంగాలలో రాష్ట్రం కోల్పోయిన వైభవాన్ని తిరిగి తీసుకురావడమేనని, కాబట్టి ఇతరులను విమర్శించడానికి తనకు ఇప్పుడు సమయం లేదని ఆయన పేర్కొన్నారు. "బెంగాల్ ఇప్పటికే ఎన్నో నష్టాలను చవిచూసింది. పశ్చిమ బెంగాల్ గొప్ప సంస్కృతి చాలా వరకు దెబ్బతింది. విద్యా రంగం కుప్పకూలింది. ఇప్పుడు పశ్చిమ బెంగాల్‌ను పునర్నిర్మించడమే నా బాధ్యత. ఈ బాధ్యతలు చాలా భారీగా ఉన్నాయి. కాబట్టి ప్రస్తుతానికి, ఇతరులను విమర్శించడానికి నాకు సమయం లేదు" అని అధికారి వ్యాఖ్యానించారు. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రిగా తాను ఎటువంటి వివాదాస్పద వ్యాఖ్యలు చేయకుండా ఉంటానని కూడా ముఖ్యమంత్రి అధికారి తెలిపారు. "విమర్శించాలనుకునే వారు విమర్శించడం కొనసాగించవచ్చు. ప్రజలలో, ముఖ్యంగా ఈసారి పశ్చిమ బెంగాల్ ఎన్నికల ఫలితాలను ఇప్పటికీ విమర్శిస్తున్న వారిలో, సద్బుద్ధి కలగాలని కోరుకుంటున్నాను" అని పేర్కొన్నారు. "పశ్చిమ బెంగాల్ ఇప్పుడు ప్రగతి, అభివృద్ధి, పరిపూర్ణత దిశగా పయనిస్తుందని తాను దృఢంగా విశ్వసిస్తున్నాను," అని సీఎం అధికారి అన్నారు.

# విజయుడే..

>> అర్లేకర్ ప్రభుత్వం ఏర్పాటుకు ఆహ్వానించారు. దీనితో టివికె శ్రేణులు మొత్తం సంబరాల్లో మునిగిపోయారు. ఇప్పటివరకూ 107 స్థానాలు మెజార్టీ ఉన్న విజయ్ సొంతపార్టీకి కాంగ్రెస్ ఐదుస్థానాలు తోడు కావడంతో 112కి చేరింది. సిపిఐ, సిపిఎం, విసికె, ఐయుఎంఎల్ పార్టీలకు ఉన్న రెండేసి స్థానాలు మొత్తం మద్దతుప్రకటించడంతో మెజార్టీమార్కు దాటి 120కి చేరింది. దీనితో గవర్నర్ సంతృప్తివ్యక్తంచేస్తూ తమిళనాడు ముఖ్యమంత్రిగా జోసెఫ్ విజయ్‌ను నియమిస్తున్నట్లు ప్రకటించి ప్రభుత్వం ఏర్పాటుచేయాలని ఆహ్వానించారు. దీనితో పతాకస్థాయిలో జరిగిన చర్చలు, ససేమిరా అన్న డిఎంకె మిత్రపక్షాలు ఎట్టకేలకు శాంతించినట్లయింది. ముందురోజు అర్థరాత్రివరకూ తాము టివికెకు మద్దతివ్వడంలేదని విసికె, ఐయుఎంఎల్ పార్టీలు తెగేసి చెప్పాయి. డిఎంకె అధ్యక్షుడు స్టాలిన్‌ను కలిసిన తర్వాత వారు పత్తాలేకుండాపోయారు. అలాగే సిపిఐ, సిపిఎం పార్టీలుకూడా తాము బయటినుంచి మద్దతిస్తామని ప్రభుత్వంలోచేరమని ప్రకటించాయి. మతతత్వశక్తులకు ఆస్కారం ఇవ్వకూడదన్న లక్ష్యంతోనే సుస్థిర ప్రభుత్వం ఏర్పాటుకోసం టివికె పార్టీ, అధినేత విజయ్‌కు సంపూర్ణమద్దతుప్రకటిస్తున్నట్లు చెప్పాయి. వాస్తవానికి శనివారం కూడా ఉత్కంఠతోనే కొనసాగింది. సాయంత్రంవరకూ విజయ్‌కు గవర్నర్ అర్లేకర్ అపాయింట్‌మెంట్ లభించలేదు. ముందుగా ఏర్పాటుచేసుకున్న కార్యక్రమాలకారణంగా గవర్నర్ కేరళకు వెళతారని లోక్‌భవన్ వర్గాలు వెల్లడించాయి. అయితే గవర్నర్ తనపర్యటనను వాయిదావేసుకుని విజయ్‌కు అపాయింట్‌మెంట్ ఇవ్వడంతో ఈసారి తనకు మద్దతుఇస్తున్న పార్టీల నాయకులను వెంటబెట్టుకుని మరీ వెళ్లారు. అలాగే ఆపార్టీల నాయకులు ఇచ్చిన లేఖలను సైతం అందచేయడంతో సమగ్ర పరిశీలన అనంతరంప్రభుత్వం ఏర్పాటుకు ఆహ్వానించారు. మొత్తంగాచూస్తే గవర్నర్ అర్లేకర్‌ను విజయ్ నాలుగుపర్యాయాలు కలుసుకున్నారు. చివరకు సాయంత్రం 6.15 గంటలప్రాంతంలో నాలుగోసారి అపాయింట్‌మెంట్‌లో టివికె చీఫ్‌కు లైన్ క్లియర్ అయింది.

**ప్రమాణస్వీకారం సమయం మార్పు...**

ముందుగా అనుకున్నట్లు విజయ్ జవహర్‌లాల్‌నెహ్రూ స్టేడియంలో మధ్యాహ్నం 3.15 గంటలకు ప్రమాణ స్వీకారంచేస్తారని పార్టీనేతలుప్రకటించారు. అయితే గవర్నర్ ఇచ్చినలేఖలో ఉదయం పది గంటలకు విజయ్ ప్రమాణ స్వీకారంచేస్తారని ఉంది. దీనితో సమయాన్ని గవర్నర్‌ప్రకటించినట్లుగానే ఉదయం పది గంటలకు మార్చారు. అయితే అసెంబ్లీలో బలనిరూపణను విజయ్ ఈనెల 13వ తేదీలోపు నిరూపించుకోవాలని గవర్నర్ తన లేఖలో వివరించారు.

**విజయ్‌తోపాటు కేబినెట్‌లో 9 మంది...**

కాగా కేబినెట్ మంత్రులు కూడా విజయ్‌తోపాటు తొమ్మిదిమంది మొత్తంప్రమాణ స్వీకారంచేస్తారని పార్టీ వర్గాలు వెల్లడించాయి. పరిపాలన, హోంమంత్రిత్వశాఖలు విజయ్‌వద్దనే ఉంటాయని చెపుతున్నారు. ప్రజాపనులశాఖకు సెంగొట్టియాన్, అర్బన్ పాలనా శాఖకు ఎన్ ఆనంద్, విద్యుత్‌మంత్రిగా సిడిఆర్‌నిర్మల్ కుమార్; క్రీడలు మద్యనిషేధశాఖమంత్రిగా అథవ్ అర్జునలకు స్థానం కల్పిస్తారని చెపుతున్నారు. అయితే ఇవన్నీ సోషల్‌మీడియాలో వచ్చినవి మాత్రమే కావ డంతో వాటికిఅంతగా విశ్వసనీయతలేదు.

**ఎఐఎడిఎంకె చీలికవర్గం రెడీ...!**

ఇదిలా ఉంటేఅన్నాడిఎంకెలో 12 మంది ఎమ్మెల్యేలు పళనిసామి నిర్ణయాలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. వీరంతాకూడా టివికెలోని అథవ్ అర్జున్‌కుటచ్‌లోకి వచ్చారని సమాచారం. మూకుమ్మడిగా అన్నాడిఎంకెకు రాజీనామాచేసి ఒకప్రత్యేక కూటమిగా టివికె విజయ్‌కు మద్దతిచ్చేవిధంగా రహస్య మంతనాలుజరుగుతున్నాయి. అన్నాడిఎంకె ఏర్పాటుచేసినఅత్యవసర సమావేశానికి వీరెవ్వరూ కూడా శనివారం హాజరుకాకపోవడంతో మరిన్ని ఊహాగానాలకు అవకాశం ఇచ్చినట్లయింది. దీనికితోడు బయటినుంచి మద్దతుమాత్రమే ఉన్నందున ఏనిమిషంలో అయినా ముప్పు ఉంటుందని అందుకే ముందుజాగ్రత్తగా సమీకరణలు మార్చుకోవాలనికూడా విజయ్‌పార్టీ సీనియర్లు భావిస్తున్నారు.

### వారం - వర్జ్యం

10-05-2026, ఆదివారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
వైశాఖమాసం, ఉత్తరాయణం
వసంత ఋతువు, కృష్ణపక్షం, కృత్తిక కార్తె
అష్టమి మ.3.01
ధనిష్ఠ మ.12.46
వర్జ్యం : లేదు
దు.సా.4.42-సా.5.33
రాహుకాలం - సా.4.30-6.00

### వార్తాఫలం

**మేషం:** ఇంటి యందు శుభకార్యాలు జరుగుతాయి. ఒక అవకాశం వెతుక్కుంటూ రాగలదు. విందు, వినోదాలలో పాల్గొంటారు.

**వృషభం:** వ్యాపారాలకు సంబంధించిన ఒప్పందాలు కుదురుతాయి. అనూహ్యంగా స్థిరాస్తుల ధరలు పెరుగుతాయి.

**మిథునం:** రహస్య చర్యలు ఫలిస్తాయి. ఇతరులను ఆర్థికముగా ఆదుకుంటారు. పనులు విజయవంతంగా పూర్తి చేస్తారు.

**కర్కాటకం:** డాక్యుమెంట్స్ లిఖిత పూర్వము వ్యవహారముల యందు జాగ్రత్తను వహించాలి. నూతన విద్యావకాశాలు.

**సింహం:** వాక్చాతుర్యంతో ఎదుటివారిని ఆకట్టుకుని ఎంతటి కార్యాన్నైనా సాధిస్తారు. స్థలాలు కొనుగోలు యత్నాలు సాధిస్తారు.

**కన్య :** అనుకోని ఆహ్వానాలు ఆశ్చర్య పరుస్తాయి. షేర్లు, భూముల క్రియ విక్రయాలలో లాభాలు అందుకుంటారు.

**తుల :** సున్నితమైన అంశములతోటి, వివాదాస్పదమైన వ్యక్తుల తోటి ముడిపడి ఉంటాయి. ఉద్యోగులకు స్థానచలనం.

**వృశ్చికం:** ఓర్పు, నేర్పులతోనే కార్యసాధన ఔతుంది. సహనమునకు పరీక్షలు ఎదురు అవుతాయి. సేవాకార్యక్రమాలలో పాల్గొంటారు.

**ధనుస్సు:** ముఖ్యముగా గంటలు, గంటలుగా ప్రతి విషయంలో ఆలోచించే విధానానికి స్వస్తి చెప్పండి. స్పెక్యులేషన్‌కు దూరంగా వుండండి.

**మకరం:** మీ సలహాలు, నైపుణ్యము మకు కాక ఇతరులకు ఉపయోగపడతారు. పొదుపు పథకాలు కలిసి వస్తాయి.

**కుంభం:** మీకు రావలసిన ప్రతి ఫలము కొద్దిగా మాత్రమే చేతికి అందుతుంది. శుభవార్తలు అందుకుంటారు.

**మీనం:** న్యాయబద్ధమైన రావలసిన ధనము వాయిదాల పద్ధతిలో డొనేషన్స్‌ను స్వీకరించినట్లుగా తీసుకుంటారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోరి, హైదరాబాద్

## రేపు ఢిల్లీ వెళ్లనున్న సిఎం చంద్రబాబు

**విజయవాడ,మే 9,ప్రభాతవార్తప్రతినిధి:** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ నెల 11న ఢిల్లీ వెళ్లనున్నారు. కేంద్ర హోంశాఖ, జలశక్తి, ఇతర కేంద్రమంత్రులను చంద్రబాబు కలవనున్నారు. జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌తో సిఎం చంద్రబాబు భేటీ కానున్నారు. సిఎం వెంట మంత్రి నిమ్మల, సిఎస్ సాయిప్రసాద్, ఇతర అధికారులు ఉంటారు. పోలవరం పురోగతి, పునరావాసం, రెండోదశ పనులపై సీఎం చర్చించనున్నారు. అనంతరం సీఐఐ వార్షిక సదస్సుకు సీఎం చంద్రబాబు హాజరుకానున్నారు.

# సమ న్యాయం

>> మూర్తి, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి జస్టిస్ బట్టు దేవానంద్ మాట్లాడుతూ, న్యాయ వ్యవస్థ సమర్ధవంతంగా పనిచేయాలంటే బార్ మరియు బెంచ్ మధ్య పరస్పర గౌరవం, సహకారం, సమన్వయం అత్యంత అవసరమని పేర్కొన్నారు.కార్యక్రమంలో జస్టిస్ ఆర్. రఘునందన్ రావు, జస్టిస్ బి.వి.ఎల్.ఎన్. చక్రవర్తి, జస్టిస్ సుమతి జగడం, జస్టిస్ న్యాపతి విజయ్ , జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత, రాజమండ్రి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సిహెచ్.వి. ప్రసాద్, పలువుర న్యాయ మూర్తులు, న్యాయ వాదులు, బార్ అసోసియేషన్ సభ్యులు జిల్లా జాయింట్ కలెక్టర్ వై. మేఘా స్వరూప్, ఎస్పీ డి నరసింహా కిషోర్, మునిసిపల్ కమిషనర్ రాహుల్ మీనా,తదితరులు పాల్గొన్నారు.



శనివారం కైలాసగిరి కొండపై ఉన్న గ్లాస్ బ్రిడ్జిని సందర్శించిన మంత్రి నారాయణ తదితరులు

## గ్లాస్ బ్రిడ్జి ప్రధాన ఆకర్షణ: మంత్రి నారాయణ

**విశాఖపట్నం, మే 9 ప్రభాతవార్త:** కైలాసగిరి కొండపై ఇటీవల ప్రారంభించిన గ్లాస్ బ్రిడ్జిను మంత్రి పి నారాయణ సందర్శించారు. శనివారం ఉదయం కైలాసగిరి పై త్రిశూల్‌ను ప్రారంభించిన తర్వాత వి ఎంఆర్‌డిఎ చైర్మన్ ఎంవి ప్రణవ్ గోపాల్ గ్లాస్ బ్రిడ్జి గురించి మంత్రి వర్యులకు వివరించారు. దీంతో అత్యంత ప్రజా ఆదరణ పొందిన గ్లాస్ బ్రిడ్జిను ఆయన సందర్శించారు. ఆయనతో పాటు ప్రభుత్వ విప్ వేపాడ చిరంజీవి రావు, ఎమ్మెల్యేలు విష్ణు కుమార్ రాజు, బండారు సత్యనారాయణ మూర్తి, లోకం మాధవి, గ్రంధాలయ సంస్థ చైర్మన్ సతీష్, విఎంఆర్‌డిఎ చైర్మన్ ఎంవి ప్రణవ్ గోపాల్, మెట్రోపాలిటన్ కమిషనర్ ఎన్ తేజ్ భరత్ కూడా గ్లాస్ బ్రిడ్జి పై కొంత సమయం గడిపారు. గ్లాస్ బ్రిడ్జి నగర పర్యాటకులను మరింత ఆకట్టుకుంటుందని మంత్రి నారాయణ పేర్కొన్నారు.

# విశాఖలో 'త్రిశూల్' వైభవం

>> శాఖ మంత్రి పి. నారాయణ, రాష్ట్ర ఎం.ఎస్.ఎం.ఈ., సెర్ప్, ఎన్.ఆర్.ఐ సాధికారత, సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, విశాఖ పార్లమెంట్ సభ్యులు ఎం. శ్రీ భరత్ , విజయనగరం పార్లమెంట్ సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు, ప్రభుత్వ విప్ వేపాడ చిరంజీవి రావు ఎమ్మెల్యేలు విష్ణు కుమార్ రాజు, వంశీ కృష్ణ శ్రీనివాస్, పంచకర్ల రమేష్ బాబు, బండారు సత్యనారాయణ మూర్తి, లోకం నాగ మాధవి, విఎంఆర్డిఏ చైర్మన్ ఎం వి ప్రణవ్ గోపాల్ , మెట్రోపాలిటన్ కమిషనర్ ఎన్ .తేజ్ భరత్, తదితరులు పాల్గొని త్రిశూల్ శిలాఫలకం ఆవిష్కరించారు. అనంతరం రాష్ట్ర మంత్రి పి. నారాయణ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యాటకానికి పెద్ద పీట వేస్తున్నారని, పర్యాటకం ద్వారా ఆదాయం రావటమే కాకుండా ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. కైలాసగిరి ఒక పర్యాటక హబ్ గా తీర్చిదిద్దేందుకు ఇప్పటికే ప్రతిపాదనలు సిద్ధం చేయటం జరిగిందన్నారు. 65 అడుగుల ఎత్తున త్రిశూల్ ను ఏర్పాటుచేసిన వి ఎం ఆర్ డి ఎ చైర్మన్ ఎం వి ప్రణవ్ గోపాల్ ని, మెట్రోపాలిటన్ కమిషనర్ తేజ్ భరత్‌కి సిబ్బందికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ విశాఖ నగరాన్ని అత్యున్నత నగరంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎనలేని కృషి చేస్తున్నారని, వేల కోట్లు పెట్టుబడులు తీసుకువస్తున్నారు అని పేర్కొన్నారు. త్రిశూల్ అనేది వి ఎం ఆర్ డి ఎ చైర్మన్ ఎం వి ప్రణవ్ గోపాల్ కల అని, అది ఈరోజు సాకారమైందని అన్నారు. కైలాసగిరి పై ప్రారంభించిన త్రిశూల్ విశాఖ పర్యాటకానికి చిహ్నంగా నిలుస్తుందన్నారు. విశాఖ పార్లమెంట్ సభ్యులు ఎం.శ్రీ భరత్ మాట్లాడుతూ కైలాసగిరి పై నలుమూలల నుంచి కనిపించేలా ఏర్పాటుచేసిన త్రిశూల్ ప్రత్యేక ఆకర్షణగా ఉంటుందన్నారు. కైలాసగిరి నీ మరింత అభివృద్ధి చేసేలా మాస్టర్ ప్లాన్ రూపొందించటం కోసం సన్నాహాలు చేస్తున్నామన్నారు. గాలుల తీవ్రతను తట్టుకునేలా త్రిశూల్ నిర్మాణం జరిగిందన్నారు. ప్రభుత్వ విప్ వేపాడ చిరంజీవి రావు, ఎమ్మెల్యే లు పల్లా శ్రీనివాసరావు, విష్ణు కుమార్ రాజు, బండారు సత్యనారాయణ మూర్తి, పంచకర్ల రమేష్ బాబు, లోకం మాధవి, విజయనగరం పార్లమెంట్ సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

# కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడిపై పోక్సో కేసు

## బాలిక ఫిర్యాదుపై నమోదు

### సాయి భగీరథ్ ఫిర్యాదుతో బాలిక, ఆమె తల్లిదండ్రులపై కరీంనగర్‌లో మరో కేసు నమోదు

**హైదరాబాద్, మే 9, ప్రభాతవార్త:** కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి సాయి భగీరథ్‌పై పేట్ బషీరాబాద్ పోలీసు స్టేషన్‌లో పోక్సో కేసు నమోదయ్యింది. గత డిసెంబర్ 31వ తేదీన శివార్లలోని చేవెళ్ల పరిధిలోని ఆలూరులో ఒక ఫాం హౌస్‌లో జరిగిన నూతన సంవత్సర వేడుకల సందర్భంగా స్నేహితులతో కలిసి వున్న సమయంలో సాయి భగీరథ్ తన పట్ల రెండుసార్లు అసభ్యంగా ప్రవర్తించాడని, మద్యం తాగమని బలవంతం చేశాడని 17 ఏళ్ల బాలిక శుక్రవారం రాత్రి మల్కాజిగిరి కమిషనరేట్ పరిధిలోని పేట్ బషీరాబాద్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ ఫిర్యాదు మేరకు సాయి భగీరథ్‌పై బిఎన్ఎస్ 74, 75 సెక్షన్లతో పాటు పోక్సో సెక్షన్ కింద కేసు నమోదు చేశారు. కాగా ఈ ఘటనపై డిసిపి కోటిరెడ్డి ప్రభాతవార్తతో మాట్లాడుతూ బాధిత బాలిక ఫిర్యాదు మేరకు సాయి భగీరథ్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేశామని, నిందితుడికి నోటీసులు ఇస్తామని, దీనిపై సాక్షాలు, ఆధారాల ప్రకారం విచారణ వుంటుందని తెలిపారు.

**సాయి భగీరథ్ ఫిర్యాదు మేరకు కరీంనగర్‌లో బాలికతో పాటు తల్లిదండ్రులపై కేసు నమోదు**

ఇదిలావుండగా బండి సంజయ్ కుమారుడు సాయి భగీరథ్ ఫిర్యాదు మేరకు పేట్‌బషీరాబాద్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన బాలికతో పాటు ఆమె తల్లిదండ్రులపై బ్లాక్ మెయిల్ కింద మరో కేసు నమోదు చేశారు. సదరు బాలిక తనకు స్నేహితుల ద్వారా పరిచయం అయ్యిందని, ఇతర స్నేహితులతో వున్నట్లుగానే ఆ బాలికతోనూ తాను మర్యాదగా వున్నానని, అయితే కొంతకాలంగా ఆమెను వివాహం చేసుకోమని తల్లిదండ్రులు వేధించసాగారని సాయి భగీరథ్ తన ఫిర్యాదులో తెలిపారు. వీరి వేధింపులు తాళలేక ఒకసారి 50 వేల రూపాయలు ఇచ్చానని, తాజాగా ఐదు కోట్ల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారని సాయి భగీరథ్ తెలిపాడు. బాలికతో పాటు ఆమె తల్లిదండ్రులు చాలా మందిని వేధిస్తున్నారని అతను తెలిపారు. వీరిపై నిర్మల్ పోలీసు స్టేషన్‌లో గత ఏప్రిల్ నెలలో కేసు నమోదయ్యిందని సాయి భగీరథ్ తెలిపాడు.

**సాయి భగీరథ్‌పై చర్యలకు సబితా రెడ్డి డిమాండ్**

కాగా సాయి భగీరథ్ వ్యవహారంపై మాజీ మంత్రి సబితా రెడ్డి శనివారం మీడియాతో మాట్లాడుతూ మైనర్ బాలిక పట్ల అతని ప్రవర్తన దారుణంగా వుందని అన్నారు. ఈ విషయంలో పోలీసులు కఠినంగా వ్యవహరించి, సాయి భగీరథ్‌ను వెంటనే అరెస్టు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. ఇదే ఘటనపై బిఆర్ఎస్ నేత, మాజీ పోలీసు అధికారి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ మైనర్ బాలికపట్ల బండి సంజయ్ కుమారుడు అనుచితంగా ప్రవర్తించడం దారుణమని, అతన్ని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

# రూ. 40 లక్షల టోకరా!

>> మహిళా పోలీస్స్టేషన్‌లో డిఎస్పీగా డ్యూటీ చేస్తున్నానని నమ్మబలికింది. ఈ నేపథ్యంలో 2023లో రంగనాయకులు వరుసకు సోదరుడైన రామానాయుడును రంగనాయకులు సరస్వతిని పరిచయం చేశాడు. ఈ పరిచయం నేపథ్యంలో సరస్వతి రామానాయుడితో వున్న పరిచయంతో అప్పుగా డబ్బులు అడిగింది. ఇంట్లో తన పిల్లలకు ఆరోగ్యం సరిగా లేనందున ఆసుపత్రిలో వైద్యం చేయిస్తున్నానని, అత్యవసరంగా డబ్బులు అవసరమని, తనకు డబ్బులు అప్పుగా ఇవ్వాలని భరోసా కల్పించింది. ఇలా పలు మార్లు కుటుంబ అవసరాల కోసం, వ్యక్తి గత అవసరం నిమిత్తం అప్పు చేసింది. దీంతో రామానాయుడు పలు దఫాల్లో రూ.40 లక్షల దాకా సరస్వతికి అప్పు ఇచ్చాడు. తీసుకున్న అప్పుకు సరిపడా ప్రాంసరీ నోట్లు రాయించుకున్నాడు. అయితే కొంతకాలం గడిచాక తన వద్ద తీసుకున్న అప్పు తీర్చాలని సరస్వతిని కోరాడు. తనకు మంచి ఆస్తుపాసులు ఉన్నాయని, తన తమ్ముడు సాఫ్ట్వేర్ ఉద్యోగం చేస్తున్నాడని అప్పు తీర్చేస్తానని నమ్మబలికింది. ఇలా మూడేళ్లుగా ఇవే మాటలు ప్రతిసారి చెప్పసాగింది. చివరకు అప్పు తీర్చమని గట్టిగా దబాయించడంతో సరస్వతి బాధితునిపై ఎదురుదాడికి దిగింది. తీసుకున్న అప్పు ఇచ్చేది లేదని, నీ చేత ఏమైతే అది చేసుకోపో అంటూ బుకాయించింది. ఎక్కువ మాట్లాడితే నీకు ఇబ్బంది తప్పదని బెదిరించసాగింది. ఇలా పలు దఫాలుగా బాధితుడు రామానాయుడుకు సరస్వతి నుండి బెదిరింపులు రావడంతో తాను మోసపోయానని గ్రహించాడు. అయితే ఇచ్చిన అప్పు తిరిగి ఇవ్వడమే కాకుండా తనపై దౌర్జన్యానికి పాల్పడుతోందని బాధితుడు లబోదిబోమన్నాడు. పలుమార్లు సరస్వతికి ఫోన్ చేసినా అందుబాటులోకి రావడంలేదని బాధితుడు రామానాయుడు వాపోతున్నాడు. చివరకు చేసేది లేక పోలీసులను ఆశ్రయించాడు. అనంతపురం రూరల్ పోలీస్ స్టేషన్‌లో సరస్వతిపై ఫిర్యాదు చేశాడు. రామానాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇన్చార్జి సీఐ పుల్లయ్య కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

10-5Pg3exHMNWJQEP.qxd:10-5Pg3exHMNWJQEP.qxd 1/1/02 6:57 AM Page 1



## తిరుమల సమాచారం



### వేసవి సెలవులు.. వారాంతం
# భక్తులతో కొండ కిటకిట

● వెంకన్న సర్వదర్శనానికి 20గంటలు

**తిరుమల, మే 9 ప్రభాతవార్త ప్రతినిధి:** కలియుగ ప్రత్యక్షదైవం శ్రీవేంకటేశ్వర స్వామి దర్శనార్థం లక్షమంది భక్తులు తిరుమలకు చేరుకోవడంతో కొండ కిటకిట లాడుతోంది. వేసవిసెలవులు.. ఆపై వారాంతం కావడం తో శని, ఆదివారాలు కలసి రావడంతో శనివారం ఉదయం 6గంటలకే తిరుమలలో భక్తులు పోటెత్తారు. ఉదయానికే తిరుమలలో వైకుంఠం-1, 2 క్యూకాంప్లెక్స్‌లు నిండిపోయి భక్తుల క్యూలైన్లు ఆలయం వెలుపలకు చేరాయి. ఉదయం 6గంటల సమయానికి సాధారణ సర్వదర్శనం కోసం 18గంటలు సమయం పడుతోంది. వేకువ క్యూలైన్లలో ఉన్న భక్తులకు మరో ఆరేడుగంటలు అదనపు సమయం దర్శనానికి పట్టవచ్చు. దీంతో టిటిడి అధికారులు ముందస్తుగా అన్ని ఏర్పాట్లు సిద్ధంచేసి శ్రీవారి సేవకులతో భక్తులకు నిరంతరాయంగా సేవలందిస్తున్నారు. అసలే వేసవిసెలవులు.. ఆపై తమతమ మొక్కుబడులు తీర్చుకునేందుకు సామాన్యభక్తులు పెద్ద సంఖ్యలో ఏడుకొండలకు చేరుకుంటుండటంతో తిరుమల కిటకిటలాడుతోంది. వైకుంఠం కంపార్టుమెంట్లలో ఉన్న భక్తులకు అన్నప్రసాదాలు, పాలు, టీ, మజ్జిగ పంపిణీ చేస్తున్నారు. శనివారం సాయంత్రం వరకు 49వేల మంది భక్తులకు మహాలఘు దర్శనం చేయించారు. మరో 20వేల మంది భక్తులు అర్థరాత్రి వరకు దర్శనం చేసుకునే వీలుందని టిటిడి వర్గాలు తెలిపాయి. శని, ఆదివారాలు భక్తులు భారీగా తిరుమలకు రావడం పరిపాటి.



### 18న ఆన్‌లైన్‌లో ఆగస్టు నెల దర్శన కోటా విడుదల

**తిరుమల, మే 9 ప్రభాతవార్త ప్రతినిధి:** కలియుగ ప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి దర్శనాలకు సంబంధించి తిరుమల తిరుపతి దేవస్థానం రానున్న ఆగస్టు నెలకు సంబంధించిన ఆన్‌లైన్ టిక్కెట్ల కోటాను ఈనెల 18వ తేదీ నుండి 25వరకు విడుదల చేయనుంది. ఆగస్టు నెల కోటాను 18వ తేదీ ఉదయం 10గంటలకు విడుదల చేసేలా టిటిడి ఐటి విభాగం ఏర్పాట్లు చేసింది. ఆర్జిత సేవా టికెట్లు ఎలక్ట్రానిక్ డిప్ కోసం 20వ తేదీ ఉదయం 10గంటలకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చు. ఈ టిక్కెట్లు పొందిన భక్తులు మే 20వ తేదీ నుండి 22వ తేదీ మధ్యాహ్నం 12గంటల లోపు లక్కీడిప్ ద్వారా టిక్కెట్లు పొందిన భక్తులు నగదు చెల్లించి టిక్కెట్లు అందుకోవచ్చు. ఇక ఆర్జితసేవా కల్యాణం, ఊంజలసేవ, ఆర్జితబ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకరణ సేవల టిక్కెట్లు తిరుమల తిరుపతి దేవస్థానం ఈనెల 21వ తేదీ ఉదయం 10గంటలకు విడుదల చేస్తారు. వర్చువల్ సేవల టిక్కెట్లు 21న మధ్యాహ్నం 3గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు. ఆగస్టు నెల అంగప్రదక్షణ టోకెన్లను 23వ తేదీ ఉదయం 10గంటలకు విడుదల చేస్తోంది. రోజువారీగా (శుక్రవారం తప్ప)750 టోకెన్లను ఆన్‌లైన్‌లో విడుదల చేస్తున్న విషయం విదితమే. ఇదిలా ఉండగా శ్రీవాణి టిక్కెట్లు ఆన్‌లైన్‌లో 23వ తేదీ ఉదయం 11గంటలకు విడుదల చేస్తారు. 300 రూపాయలు ఎస్ఈడి టిక్కెట్లు కోటా 25వ తేదీ ఉదయం 10గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. దివ్యాంగులు, వృద్ధుల కోటా 23వ మధ్యాహ్నం 3గంటలకు,25న గదుల కోటా విడుదల చేస్తారు. భక్తులు ఈ టిక్కెట్లను ఆన్‌లైన్‌లో టిటిడివెబ్‌సైట్ ఎ.పి.జి.వి.ఇన్ వెబ్‌సైట్‌లో మాత్రమే బుక్ చేసుకోవాలని టిటిడి కోరింది.



### తిరుమలలో వర్షం... భక్తులకు ఉపశమనం

**తిరుమల, మే 9 ప్రభాతవార్త ప్రతినిధి:** బంగాళాఖాతంలో అల్పపీడనం ద్రోణి ప్రభావంతో శనివారం ఉదయం కొంతసమయం మోస్తరుగా వర్షం కురిసింది. ఉదయం నుండి ఆకాశం మేఘావృతమై చల్లటిగాలులు వీచినా కొద్దిపాటి కురిసిన వానకు భక్తులు సేదదీరారు. మళ్ళీ మధ్యాహ్నం ఎండ తీవ్రత చూపింది. బలమైన గాలులు, వర్షంతో తిరుమలకొండ సేదదీరింది. వేసవిలో ఎండవేడికి తట్టుకోలేని భక్తులకు కాస్త వర్షం ఉపశమనం కలిగించింది. ఈ వర్షానికి భక్తులు ఆనందం చెందారు. తడిసి ముద్దయ్యారు.



### చక్రస్నాన మహోత్సవంతో ముగిసిన
# వేదనారాయణ బ్రహ్మోత్సవాలు

**తిరుమల, మే 9 ప్రభాతవార్త ప్రతినిధి:** టిటిడి అనుబంధంగా తిరుపతి జిల్లా నాగలాపురంలో వేదనారాయణస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం ఉదయం చక్రస్నాన మహోత్సవంతో వైభవంగా ముగిశాయి. ఆలయం గోవింద నామస్మరణతో మారుమోగగా భక్తులు విశేష భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. ఉత్సవాల్లో భాగంగా ఉదయం 7.30 నుండి 9.30 గంటల వరకు పల్లకి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేదనారాయణస్వామివారి ఉత్సవమూర్తులతో పాటు శ్రీ సుదర్శన చక్రత్తాళ్వారుకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీరు, పసుపు, చందనాలతో విశేష అభిషేకాలు చేపట్టి ఆధ్యాత్మిక వాతావరణాన్ని సృష్టించారు. ఆ తర్వాత పుష్కరిణిలో చక్రస్నానం శాస్త్రోక్తంగా నిర్వహించగా భక్తులు పవిత్ర స్నానంలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులయ్యారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ శ్రీనివాసులు రెడ్డి, ఆలయ ఇన్‌స్పెక్టర్ చంగల్ రాయులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

# త్రిసభ్య కమిటీ లెక్కలే వేరు!

● కల్తీనెయ్యిలో సూత్రధారులను పట్టుకోవడమే కీలకం ● గుబులు రేకెత్తిస్తున్న ఉన్నతాధికారుల రాక

**తిరుమల, మే 9 ప్రభాతవార్త ప్రతినిధి:** దేవదేవుడు ఏడుకొండలస్వామి పవిత్రమైన తిరుమల లడ్డూల కల్తీనెయ్యి ఉదంతంలో అసలైన సూత్రధారులైన పెద్దలు ఎరక్కపోయి ఇరుక్కుంటారా? అందుకే ప్రభుత్వం ఉన్నతస్థాయి కమిటీ నియమించిందా అనే సంచలన చర్చ తిరుమలలో సాగుతోంది. కల్తీనెయ్యి వెనుక కీలకంగా వ్యవహరించిన పెద్దలను మాత్రం వదలిపెట్టరాదనే నిశ్చయంతో సిబిఐ సిట్ నివేదికలు, ఏకసభ్య కమిటీ నివేదికలు ఆధారంగా చేసుకుని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి చైర్మన్‌గా, పోలీస్ బాస్ డిజిపి, న్యాయ శాఖ కార్యదర్శి సభ్యులుగా త్రిసభ్య కమిటీ నియామకమైంది. ఈ కమిటీ సభ్యులు తిరుమలకు వచ్చి వారంరోజుల్లో 2019-24 మధ్యకాలంలో జరిగిన టెండర్ల ప్రక్రియ, విధానాలు మార్పు, కల్తీనెయ్యి సరఫరా జరిగినా కనిపెట్టలేని కొనుగోళ్ల కమిటీ, విజిలెన్స్ విభాగం పాత్ర వంటి వివరాలు వెల్లడించి తిరిగివెళ్లారు. నడిపించిన సూత్రదారులను బయటకు తీసుకురానున్నారనేది టిటిడి వర్గాల్లో గుప్పుమంటోంది. 2019-24 మధ్య ఐదేళ్లలో నెయ్యిసరఫరా చేయడానికి టిటిడి టెండర్ల కేటాయింపు నుండి సరఫరా వరకు ఆధారాలు సేకరించిన నివేదికలే ఇప్పుడు త్రిసభ్య కమిటీకి అస్త్రాలుగా మారనున్నాయి. పవిత్రంగా భావించే తిరుమల లడ్డూప్రసాదాల తయారీకి జంతువుల



కొవ్వునూనె, ఇతర శాఖాహారపదార్థాలతో నూనె కలిపేసిన నెయ్యి వినియోగించారనేది సిబిఐ సిట్, ఏకసభ్య కమిటీ తేల్చిన అంశాలు. ఈ నివేదికలు సాక్ష్యాలతోనే ఉన్నతాధికారుల కమిటీ (త్రిసభ్య కమిటీ) తిరుమలకు, తిరుపతికి చేరుకుని చేపట్టనున్న ఆధారాలతో దర్యాప్తు కీలకంగా మారనుంది. దేవుని లడ్డూ ప్రసాదాల తయారీలో జంతువుల కొవ్వు కల్తీనెయ్యి వినియోగించారనేది ఇప్పటికే తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు ల్యాబ్‌లకు పంపి చేపట్టిన పరీక్షల్లో ఆధారాలతో తేల్చారు. లడ్డూల తయారీకి ఐదుమంది కాంట్రాక్టర్లు టెండర్లలో దక్కించుకున్న ఒప్పందం ప్రకారం సరఫరా చేయాల్సిన నాణ్యత ప్రమాణాలతో నెయ్యికి బదులు నాసిరకంగా, జంతువుల కొవ్వునూనె కలిపారనేది ఇప్పుడు త్రిసభ్య కమిటీ ముందున్న నివేదికలు.

ఇందుకు తెర వెనుక కర్త, కర్మ, క్రియలుగా ఉంటూ తతంగం నడిపిన పెద్దలను పట్టుకోవడమే చివరి అంకంగా భావిస్తున్నారు. తిరుమల లడ్డూలు నాణ్యతలేని, రుచిలేనివనే గత వివాదం దేశవ్యాప్తంగా పెద్దదుమారం రేపిన విషయం విదితమే. సామాన్యభక్తుల నుండి ఎన్డిఏ కూటమిలోని అధికార పార్టీల ప్రజాప్రతినిధులు, రాజకీయ నేతలు, ప్రజాసంఘాలు చివరకు సినిమారంగ ప్రముఖులు ఆగ్రహం, అసహనం వ్యక్తం చేశారు. దేవదేవుడు ఏడుకొండల వేంకటేశ్వరస్వామి పవిత్రమైన లడ్డూల తయారీలో కల్తీనెయ్యితో గత వైసిపి ప్రభుత్వం, టిటిడి బోర్డు పెద్దలు, టిటిడి అధికారులు అపవిత్రం చేశారనే వాదనతో ఇప్పుడు త్రిసభ్య కమిటీ ఏకీభవించిన గుట్టువిప్పనుందనేది తెలుస్తోంది. ఈ ముగ్గురు అధికారులు ఆలయ ఆచార వ్యవహారాలు, పవిత్రత, లడ్డూప్రసాదాల తయారీపై అవగాహన కల్పించుకుని వర్గాలు తీసుకునేందుకు సిద్ధమవుతున్నారు. ఈ వ్యవహారంలో కీలకంగా గత టిటిడి ధర్మకర్తల మండలి మాజీ చైర్మన్లతోపాటు కొందరు మాజీ సభ్యులను, టిటిడిలో బాధ్యతగల అధికారులను, కొనుగోళ్ల కమిటీలో ఉన్న అధికారులను ఇప్పుడు బాధ్యుల్ని చేసి అరెస్ట్ చేసినా ఆశ్చర్యపోవలసిన విషయం లేదనేది సంచలనంగా మారింది.

# సహకార శాఖలో పారదర్శకంగా ప్రమోషన్లు, పోస్టింగులు

### - వ్యవసాయ, సహకార శాఖల మంత్రి అచ్చెన్నాయుడు

**విజయవాడ, మే 9 ప్రభాతవార్త ప్రతినిధి:** సహకార శాఖలో పారదర్శకంగా ప్రమోషన్లు, పోస్టింగులు కల్పిస్తున్నట్లు ఆ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. సహకార శాఖలో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 100 మంది వివిధ కేడర్ల ఉద్యోగులకు పదోన్నతులు కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన సందర్భంగా, ఎపి కోఆపరేటివ్ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు టి.వి. ఫణి పేర్రాజు నేతృత్వంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, వివిధ జిల్లాల అధ్యక్షులు, కార్యదర్శులు, పదోన్నతులు పొందిన ఉద్యోగులు విజయవాడలో మంత్రి అచ్చెన్నాయుడును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి ఆదేశాల మేరకు పదోన్నతులు త్వరితగతిన మంజూరు చేయడమే కాకుండా, పూర్తిస్థాయి పారదర్శకతతో పోస్టింగ్ ఆర్డర్లు జారీ చేసినందుకు ఎపి కోఆపరేటివ్ సర్వీసెస్ అసోసియేషన్ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపింది. ప్రమోషన్లు పొందిన ఉద్యోగుల అభ్యర్థన మేరకు మంత్రి అచ్చెన్నాయుడు కేక్ కట్ చేసి ఉద్యోగులతో ఆనందాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చె



న్నాయుడు మాట్లాడుతూ, ఉద్యోగులకు సకాలంలో పదోన్నతులు కల్పించడమే కాకుండా, అవినీతికి ఆస్కారం లేకుండా పూర్తిస్థాయి పారదర్శకతతో పోస్టింగులు ఇవ్వడం కూటమి ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఉద్యోగులు సానుకూల వాతావరణంలో పనిచేసేలా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటోందని, వారి హక్కులు, ప్రయోజనాల పరిరక్షణకు కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎపి కోఆపరేటివ్ సర్వీసెస్ అసోసి యేషన్ రాష్ట్ర కోశాధికారి జిసిబివి కోటేశ్వరరావు, ఉపాధ్యక్షులు డి. విజయ్ కుమార్, పి. రాజశేఖర్, కృష్ణా జిల్లా అధ్యక్షుడు మొహమ్మద్ గౌస్, ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి జి. సందీప్, సహ అధ్యక్షుడు యు. రమేష్, ఏలూరు జిల్లా అధ్యక్షుడు వై. యేసు కుమార్, గుంటూరు జిల్లా కార్యదర్శి ఎస్. భావనారాయణ

# మైనర్‌పై పాస్టర్ అత్యాచారం

### సుమోటోగా కేసు తీసుకున్న బాలల హక్కుల పరిరక్షణ కమిషన్

**విజయవాడ, మే 9 ప్రభాతవార్త ప్రతినిధి:** ఏలూరు జిల్లా కామవరపుకోట మండలం కళ్లచెరువు గ్రామంలో చర్చి పాస్టర్ మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడిన ఘటన పై బాలల హక్కుల పరిరక్షణ కమీషన్ స్పందించింది. రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపుతోంది. చర్చి పాస్టర్ చౌటపల్లి రాంబాబు, పరిచయాన్ని ఆసరాగా చేసుకుని మైనర్ బాలికపై గత కొన్ని నెలలుగా లైంగిక దాడులకు పాల్పడినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. బాధిత బాలిక కుటుంబానికి పాస్టర్ తరచూ రాకపోకలు ఉండేవి. ఈ పరిచయాన్ని దుర్వినియోగం చేసుకుని బాలికను బెదిరింపులకు గురిచేస్తూ లైంగిక దాడులకు పాల్పడినట్లు తెలుస్తోంది. ఇటీవల బాలిక అనారోగ్యానికి గురికావడంతో కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తీసుకెళ్లగా, ఆమె గర్భవతి అయిన విషయం బయటపడింది. దీంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. అయితే విషయం బయటకు రాకుండా చేయాలని ప్రయత్నించిన పాస్టర్, బాలికకు మోతాదుకు మించి గర్భస్రావ మాత్రలు ఇచ్చినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. మాత్రలు మింగిన అనంతరం బాలికకు తీవ్ర రక్తస్రావం కావడంతో పరిస్థితి విషమించింది. వెంటనే కుటుంబ సభ్యులు ఆమెను ప్రభుత్వాసుపత్రికి తరలించగా ప్రస్తుతం వైద్యుల పర్యవేక్షణలో చికిత్స కొనసాగుతోంది. బాలిక ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను తెలుసుక్కున్నట్లు సమాచారం. ఈ ఘటనపై బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సీరియస్‌గా స్పందించింది. ఘటనను సుమోటోగా స్వీకరించిన కమిషన్ చైర్‌పర్సన్ వేటుకూరి. సూర్యనారాయణ రాజు, సభ్యులు జిల్లా ఇంచార్జి ఉండవల్లి గాంధీ బాబు సోమవారం కళ్లచెరువు గ్రామాన్ని సందర్శించనున్నారు. బాధిత బాలిక ఆరోగ్య పరిస్థితి, పోలీసుల దర్యాప్తు పురోగతి, అధికారుల చర్యలపై సమగ్ర నివేదిక తీసుకోనున్నారు. అలాగే బాలికకు అవసరమైన వైద్య, న్యాయ సహాయం అందించాలని అధికారులకు సూచనలు జారీ చేసినట్లు తెలిసింది. ఇదిలా ఉండగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు సమాచారం.

# ఆకాశవాణికి 90 వసంతాలు

● నేడు తుమ్మలపల్లి కళాక్షేత్రంలో స్వర సంధ్య మ్యూజికల్ కార్యక్రమం
● విశ్వసనీయతకు మారుపేరు ఆకాశవాణి.. నేటి తరానికి స్ఫూర్తిదాయకం

**విజయవాడ, మే 9 ప్రభాతవార్త ప్రతినిధి:** తొమ్మిది దశాబ్దాలుగా ఆకాశవాణి విజయవాడ కేంద్రం సమాజంలోని ప్రతి వర్గానికి చేరువవుతూ విశిష్ట సేవలు అందిస్తోందని రీజినల్ ఛానెల్ మేనేజర్ ఎమ్. సోమేశ్వరరావు అన్నారు. ఆకాశవాణి 90 వసంతాల సంద ర్భంగా వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శనివారం ఆకాశవాణి విజయవాడ కేంద్రంలో పాత్రికేయుల సమావేశంలో రీజినల్ ఛానెల్ మేనేజర్ ఎమ్. సోమేశ్వరరావు మాట్లాడుతూ కళాకారులకు నిలయంగా, రైతులకు నేస్తంగా, యువతకు స్నేహితుడిగా నిలుస్తూ ప్రజల మన్ననలు పొందుతోందన్నారు. విద్య, వ్యవసాయం, సాహిత్యం, సంగీత, సాంస్కృతిక రంగాల్లో విజ్ఞానదాయ కమైన కార్యక్రమాలను ప్రసారం చేస్తూ ఈ కేంద్రం అగ్రగామిగా నిలుస్తోందన్నారు. ఆకాశవాణి కేవలం వార్తలకే పరిమితం కాకుండా కథలు, కళలు, సాంస్కృతిక కార్యక్రమా లను వినూత్న రీతిలో ప్రజలకు అందిస్తోందన్నారు. భారతదేశంలో సుమారు 585 స్టేషన్లతో, 92.5 ప్రజలకు, 99.17 భౌగోళిక ప్రాంతానికి ఆకాశవాణి తన సేవలను



విస్తరించిందన్నారు. ఆకాశవాణి అందించే వార్తలు అత్యంత వాస్తవమైనవని, నమ్మదగినవిగా గుర్తింపు పొందాయన్నారు. 1936లో మొదటి రేడియో స్టేషన్ ప్రారంభమైందని ఎమ్. సోమేశ్వరరావు పేర్కొన్నారు.
ప్రోగ్రామ్ విభాగాధిపతి గుడుపూడి దివ్య మాట్లాడుతూ. ప్రస్తుతం ఆకాశవాణి 90వ వసంతంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా ప్రత్యేక వేడుకలు నిర్వహిస్తున్నామన్నారు. మే 10 (ఆదివారం) సాయంత్రం 6 గంటలకు తుమ్మలపల్లి కళాక్షేత్రంలో సర్వేపల్లి సిస్టర్స్ గాత్ర కచేరీ, గరగ నృత్య ప్రదర్శనలు ఉంటాయన్నారు.
విద్యార్థులకు నిర్వహించిన పోటీల విజేతలకు మే 10న తుమ్మలపల్లి కళాక్షేత్రంలో బహుమతులు అందిస్తామన్నారు. మే 19 ఉదయం 6:30 గంటలకు విజయవాడ నగరంలో ప్రత్యేక వాకథాన్ నిర్వహిస్తున్నా మన్నారు. వాస్తవమైన వార్తలకు, ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రచారానికి ఆకాశవాణి కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తోందన్నారు. ప్రస్తుతం యూట్యూబ్, ఇన్స్టాగ్రామ్, ఎక్స్ వంటి సోషల్ మీడియా వేదికల్లోనూ కార్యక్రమాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆకాశవాణి న్యూస్ విభాగాధిపతి హెన్రీ రాజ్ మాట్లాడుతూ మారుతున్న కాలంలో సమాచార విప్లవం ఎన్ని మలుపులు తిరిగినా, ఆకాశవాణి తన విశ్వసనీయతను, ప్రామాణికతను కాపాడుకుంటూనే ఉందని పేర్కొన్నారు. సోషల్ మీడియా, టివి ఛానళ్ల హడావిడిలో నేటి తరానికి ఆకాశవాణి విశిష్టతపై అవగాహన తగ్గుతోందని, దాని ప్రాముఖ్యతను చాటి చెప్పాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఆయన కోరారు.

# వర్సిటీ అధ్యాపక పోస్టుల భర్తీకి 15న నోటిఫికేషన్

**విజయవాడ, మే 9 ప్రభాతవార్త ప్రతినిధి:** విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టుల భర్తీకి ఈ నెల 15న నోటిఫికేషన్ జారీ చేస్తామని రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ కార్యదర్శి కోన శశిధర్ చెప్పారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన చేస్తూ అధ్యాపక పోస్టుల భర్తీ డిసెంబర్ నాటికి నియామకాలు పూర్తి చేస్తామన్నారు. ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్స్‌లో మెరుగైన స్థానం సాధించేలా పరిశోధన, పరిశ్రమల భాగస్వామ్యం, అంతర్జాతీయ అవగాహన ఒప్పందాలపై దృష్టి సారిస్తునట్లు చెప్పారు. ఎఫ్ఆర్ఎస్, లీప్ హైయర్, యూనిఫైడ్ అఫిలియేషన్ పోర్టల్ వంటి డిజిటల్ వ్యవస్థల ద్వారా విద్యార్థులు, అధ్యాపకుల వివరాలను రియల్ టైంలో పర్యవేక్షించే విధానాన్ని అమలు చేస్తునట్లు తెలిపారు. ఆధార్ ఆధారిత ధృవీకరణ ద్వారా కౌన్సెలింగ్ సమయంలో కులధ్రువీకరణ పత్రాల అవసరాన్ని తొలగిస్తున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం 32 లక్షలకు పైగా విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్నారని చెప్పారు. 2026-27 విద్యా సంవత్సరానికి మరో 3.20 లక్షల మంది విద్యార్థులను చేర్చి, మొత్తం 35.21 లక్షలకు చేర్చే లక్ష్యాన్ని ప్రభుత్వం నిర్దేశించిందన్నారు.

# బెంగాల్ సిఎం సువేందుకు డి.సిఎం పవన్ శుభాకాంక్షలు

**విజయవాడ, మే 9 ప్రభాతవార్త ప్రతినిధి:** పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన సువేందు అధికారికి ఎపి డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ శుభాకాంక్షలు తెలిపారు. పశ్చిమ బెంగాల్‌లో బిజెపి విజయాన్ని భారత ప్రజల విజయంగా పవన్ అభివర్ణించారు. ముఖ్యంగా భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకులు శ్యామాప్రసాద్ ముఖర్జీ జన్మించిన బెంగాల్ గడ్డపై, ఆయన ఆశయాలకు అనుగుణంగా బిజెపి అధికారం చేపట్టడం ఒక గొప్ప నివాళి అని ఆయన పేర్కొన్నారు. దశాబ్దాల పోరాటం తర్వాత లభించిన ఈ ఫలితం కార్యకర్తల కృషికి దక్కిన గౌరవమని కొనియాడారు. సరిహద్దు రాష్ట్రమైన బెంగాల్‌లో అక్రమ వలసలు, తీవ్రవాద చొరబాట్లు జాతీయ భద్రతకు ముప్పుగా మారాయని, సువేందు అధికారి నాయకత్వంలోని కొత్త ప్రభుత్వం ఈ సమస్యలను సమర్థవంతంగా ఎదుర్కొంటుందని ఆయన ఆశించారు. హింస, అరాచకాలకు తావులేకుండా పారదర్శకమైన పాలన సాగాలని ఆయన ఆకాంక్షించారు. ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంపై ప్రజలకున్న నమ్మకమే ఈ విజయానికి పునాది అని చెబుతూ అమిత్ షా, నితిన్ నబిన్, సమిక్ భట్టాచార్యలకు ఆయన ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు.

# వైజాగ్ అంటే గూగుల్, టిసిఎస్

### - మంత్రి గుమ్మిడి సంధ్యారాణి



**విజయవాడ, మే 9 ప్రభాతవార్త ప్రతినిధి:** విధ్వంసం నుంచి వికాస పాలన వైపు రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ముందుకు తీసుకెళ్తున్నారని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ. 23 నెలల కూటమి పాలనలో భయపెట్టే రాజకీయాలకు ముగింపు పలికి, భరోసా కలిగించే పరిపాలన అందుతోందన్నారు. వైసిపి హయాంలో ప్రజల సమస్యలు చెప్పుకోవడానికే భయపడేవారని, నేడు ప్రజలకు అందుబాటులో ఉన్న ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. వైజాగ్ అంటే ఒకప్పుడు గంజాయి గుర్తొచ్చేదని, నేడు గూగుల్, టిసిఎస్ వంటి ప్రపంచ స్థాయి సంస్థలు గుర్తుకొస్తున్నాయని మంత్రి అన్నారు. అరకు, పాడేరు ప్రాంతాల్లో గంజాయి తోటల స్థానంలో కాఫీ తోటలు విస్తరిస్తున్నాయని తెలిపారు. ఉత్తరాంధ్రకు రైల్వే జోన్ సాధించడం కూటమి ప్రభుత్వ చరిత్రాత్మక విజయంగా చెప్పుకొచ్చారు. యువత చేతిలో ఆయుధాలు కాదు.. ఉద్యోగాలు, నైపుణ్యాలు, అవకాశాలు ఉండాలనేదే కూటమి ప్రభుత్వ ఆలోచన అని స్పష్టం చేశారు. అమరావతి నిర్మాణానికి రైతులు స్వచ్ఛందంగా భూములు ఇవ్వడం రాష్ట్ర చరిత్రలో గొప్ప సంఘటనన్నారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ పునరుద్ధరణకు కేంద్ర సహకారంతో వేల కోట్ల పెట్టుబడులు తీసుకువచ్చామని సంధ్యారాణి అన్నారు. గంజాయి నిర్మూలన కోసం ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి కఠిన చర్యలు చేపట్టామని తెలిపారు. జగన్‌కు ఇంట్లో వారిపైనే గౌరవం లేదని, ఇక ప్రజలపై గౌరవం ఎలా ఉంటుందని ప్రశ్నించారు. అధికార దాహం కోసం యువత చేతికి కత్తులు, గొడ్డళ్లు ఇచ్చే వైసిపి నేతల మోసపూరిత మాటలకు బలికావొద్దని, కోడికత్తి శ్రీను ఉదంతాన్ని గుర్తు తెచ్చుకోవాలని సూచించారు. సూపర్ 6 పథకాలు గిరిజనులకు ఎంతగానో తోడ్పడుతున్నాయని మంత్రి సంధ్యారాణి పేర్కొన్నారు.

# చందర్లపాడులో అదృశ్యం... శ్రీశైలంలో మృతదేహం

**విజయవాడ, మే 9 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎన్టీఆర్ జిల్లా చందర్లపాడులో అదృశ్యమైన మహిళ మృతదేహాన్ని శ్రీశైలం సమీపంలో గుర్తించారు. శ్రీశైలం సమీపంలోని కాలువలో నాగలక్ష్మి శవం లభ్యమైంది. ఇటీవల పుట్టింటికి వెళ్లిన నాగలక్ష్మి తిరిగిరాలేదు. దాంతో చందర్లపాడు పోలీసులకు ఆమె భర్త నరసింహారావు ఫిర్యాదు చేశారు. నాగలక్ష్మికి పెళ్లికి ముందు బావతో పరిచయం ఉన్నట్లు పోలీసుల గుర్తించారు. పుట్టింటికి వెళ్లిన సమయంలో బావతో నాగలక్ష్మి పలకరింపుగా మాట్లాడుకున్నారు. అది కాస్త వాగ్వాదానికి దారితీసింది. గొడవ ఎక్కువై నాగలక్ష్మిపై ఆమె బావ దాడిచేసి కాలువలో పడేసినట్లు విచారణలో వెల్లడైంది. దాంతో నాగలక్ష్మి బావను అదుపులోకి తీసుకుని పోలీసులు ప్రశ్నిస్తున్నారు. ఈ ఘటనపై ఇప్పటికే చందర్లపాడు పోలీసు స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదైంది. దాన్ని హత్య కేసుగా మార్పు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



# రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం

### వైసిపి అనంతపురం జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి

**అనంతపురం, మే 9 ప్రభాతవార్త బ్యూరో:** అనంతపురం జిల్లాలో భూ గర్భ జలాలు అడుగంటి పంటలు ఎండిపోతున్నా రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. జిల్లా వైసిపి కార్యాలయంలో శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ జిల్లాలో భూ గర్భ జలాలు అడుగంటి పోతుండటంతో ఉద్యాన పంటలు ఎండిపోతున్నాయన్నారు. ఎన్నో ఏళ్లుగా సంరక్షించుకున్న చీనీ చెట్లు ఇతరత్రా ఉద్యాన పంటలు ఎండిపోతుంటే రైతుల వేదన దయనీయంగా ఉందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలోని 20 మండలాల్లో భూ గర్భ జలాలు తగ్గిపోయాయని, 7 నుంచి 8 మండలాల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉందన్నారు. అయినప్పటికీ జిల్లాలో ముగ్గురు మంత్రులు, ఎంపిలు ఎమ్మెల్యేలు ఉన్నా ఏ ఒక్కరు రైతుల గురించి పట్టించుకోవడం లేదని ఆయన విమర్శించారు. ఎండిపోతున్న పంటలకు తడులను అందిస్తేనైనా పంటలను కాపాడే పరిస్థితి ఉందని, ఆ దిశగా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ఆయన ప్రశ్నించారు. రెండేళ్లలో జిల్లాలో 70 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని, ఎన్నికల సమయంలో ఆత్మహత్య చేసుకున్న రైతులకు రూ.7లక్షల సాయం అందిస్తామన్న మాట ఏమైందని, ఒక్క రైతుకు కూడా ఇంత వరకు పరిహారం రాలేదన్నారు. రైతాంగానికి ఇన్‌పుట్ సబ్సిడి అందించడంతోపాటు ఎండిపోతున్న పంటకు రక్షక తడులను అందించి ఆదుకోవాలని ఆయన సూచించారు.విలేకర్ల సమావేశంలో జిల్లాప్రధాన కార్యదర్శి ఆలమూరు శ్రీనివాసరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి చింతకుంట మధు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వెన్నం శివారెడ్డి, సాంస్కృతిక విభాగం నగరాధ్యక్షులు కేశవరెడ్డి, విద్యార్థి విభాగం నగరాధ్యక్షులు అవినాష్, పార్టీ సీనియర్ నాయకులు రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

# పవన్ పరామర్శకు ప్రధాని?

**విజయవాడ, మే 9 ప్రభాతవార్త ప్రతినిధి:** భారత ప్రధాని నరేంద్ర మోడీ ఆదివారం డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్‌ను పరామర్శించడానికి ఆయన ఇంటికి వస్తున్నట్లు సమాచారం. హైదరాబాద్ మాదాపూర్‌లో ఉన్న పవన్ నివాసంలో సాయంత్రం 4గంటలకు ఈ భేటీ జరగనున్నట్లు సమాచారం. అదే సమయంలో మెగాస్టార్ చిరంజీవి కూడా పవన్ కల్యాణ్ ఇంటికి వస్తుండటం ప్రాధాన్యతను సంతరించుకుంది. పవన్ అనారోగ్య కారణాలతో గత కొంతకాలంగా విశ్రాంతి తీసుకుంటున్నారు. కలెక్టర్స్ సదస్సుకు సైతం పవన్ హాజరుకాలేదు. ఈ నేపథ్యంలో పవన్ నివాసానికి ప్రధాని మోడీ రానుండటం ప్రాధాన్యత సంతరించుకుంది.



### తిరుమలలో 'ఆపరేషన్ వజ్రపహార్'

**తిరుమల, మే 9 ప్రభాతవార్త ప్రతినిది:** ఏడుకొండలపై ప్రశాంతంగా ఉండే తిరుమల పాపవినాశనం ప్రాంతంలో 'ఆపరేషన్ వజ్రపహార్' చేపట్టారు. శనివారం సాయంత్రం 110 షాపుల పరిశీలన చేసి, అనుమానితులు, గుర్తింపు లేని వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, సివిఎస్ఓ మురళీకృష్ణ, ఆదేశాల మేరకు తిరుమల డి.ఎస్.పి విజయశేఖర్ ప్రత్యక్ష పర్యవేక్షణలో పాపవినాశనం ప్రాంతంలో ప్రత్యేక నాఖాబందీ కార్యక్రమం నిర్వహించారు. సరైన గుర్తింపు కార్డులు లేని ఆరుగురు అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు. గుర్తింపు లేని 7 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. లైసెన్స్ లేకుండా నిర్వహిస్తున్న 21 షాపులను గుర్తించారు. అదేవిధంగా 24 మంది అనుమానితుల వేలిముద్రలను పరిశీలించారు.

రాష్ట్రంలో జరుగుతున్న నేరాలలో 70 శాతం ఉత్తరాది, పశ్చిమాది రాష్ట్రాలకు చెందిన వారే వుండడం ఇక్కడి పోలీసులకు తలనొప్పిగా మారింది. స్నాచింగ్‌ల వరకువస్తే ఉత్తరాది నేరగాళ్లు, దృష్టి మరల్చి నేరాలుచేసే నేరస్థులు తమిళనాడుకు చెందిన వారు ఎక్కువగా వుండేవారు. బ్యాంకు దోపిడీలు, బంగారు నగల లూటీలు, కిడ్నాప్‌లు ఉత్తరాది, పశ్చిమాది రాష్ట్రాల నేరగాళ్లు,వైట్‌కాలర్ నేరాలకు తూర్పు, ఉత్తరాది రాష్ట్రాల నేరస్థులు కారకులయ్యే వారు. ఇదే సమయంలో తెలుగు రాష్ట్రాలకు చెందిన నేరగాళ్లు కూడా కొన్ని రకాల నేరాల్లో వుండేవారు, వీరంతా స్నాచింగ్‌లు, నకిలీ కరెన్సీ చలామణి,తాళాలు వేసిన ఇళ్లకు కన్నాలు వేయడం వంటి నేరాల్లో కూడా ఇక్కడి వారు వుంటునా న్రు. అయితే ఇటీవల కాలంలో అన్ని నేరాలలో ఇతర ప్రాంతాల నేరగాళ్ల హస్తం ఎక్కువగా వుండడం వల్ల వారి గురించిన సమాచారం పోలీసులకు అందడం లేదు. నేరాలవిషయం ఇలావుంచితే కుటుంబ హత్యలు, పాత కక్షల కారణంగా జరుగుతున్న హత్యలు, పరువు హత్యలు, చిన్నపాటి గొడవల వల్ల జరిగే హత్యలు,దోపిడీ దొంగలు చేస్తున్న హత్యలు, ప్రేమ వ్యవహారం వల్ల జరిగే హత్యలు ఇటీవల కాలంలో ఎక్కువయ్యాయి. చిన్న చిన్న విషయాలకే హత్యలు జరుగుతుండడం ఇటీవల పెరిగిపోయాయి. భార్యలను భర్తలు చంపడం, భర్తలను భార్యలు హత్యలు చేయడం, దంపతులు గొడవలు పడి తమ పిల్లలను చంపుతుండడం పెరిగిపోతున్నాయి. ఇక పరువు హత్యల సంగతి సరేసరి. ఈ హత్యలకు శాంతి భద్రతలకు సంబంధం లేకున్నా సమాజంలో పెరిగిపోతున్న అశాంతికి ఒక సంకేతంగా చెప్పాలి. ఇక దీనికితోడు సైబర్ నేరాలు, డ్రగ్స్ నేరాలు మరింత పెరిగాయి. సైబర్ నేరాలపెరుగుదల రాష్ట్రంలో ఎక్కువయ్యాయని గణాంకాలు చెబుతున్నాయి. డ్రగ్స్‌కు సంబంధించిన కేసుల సంఖ్య కూడా భారీగానే వుంటోంది.

# పోలీసులకు సవాల్ విసురుతున్న వరుస నేరాలు

**డి.మురళీధర్ అమర్‌నాథ్**

రాష్ట్రంలో వరుసగా జరుగుతున్న నేరాలు, రాజకీయ ప్రేరేపిత ఘటనలు పోలీసులకు సవాల్ విసురుతున్నాయి. ఓవైపు దొంగతనాలు, పట్ట పగలు నగల దుకాణాల లూటీలు, ఇంకోవైపు సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల మాఫియా కార్యకలాపాలు, రోడ్డు ప్రమాదాలు, పోలీసులను ఉక్కిరి బిక్కిరి చేస్తుండగా మరోవైపు రాష్ట్రంలో ఆయా ప్రాంతాలలో రాజకీయ పార్టీలు ఒకరిపై మరొకరు ఇష్టానుసారం దూషించుకుంటూ పరస్పరం దాడులకు పాల్పడుతున్న ఘటనలు పెరిగిపోతున్నాయి. ఇదే సమయంలో అనేకచోట్ల పరువు హత్యలు, కుటుంబ హత్యలు, పాత కక్షల కారణంగా జరిగే హత్యలు పెట్రేగిపోతున్నాయి. నేషనల్ క్రైం రికార్డు బ్యూరో గణాంకాల ప్రకారం శాంతి భద్రతలు, నేరాలకు సంబంధించి రాష్ట్రం మంచి రికార్డులు కలిగివున్నా క్షేత్రస్థాయిలో భిన్నమైన పరిస్థితులు వుండడం గమనార్హం. తెలంగాణ పోలీసు శాఖ దేశంలోనే నంబర్‌గా వుందని సిఎం, మంత్రులు మొదలుకొని పోలీసు ఉన్నతాధికారుల వరకు పదేపదే వేదికల సాక్షిగా చెబుతున్నా నేరాల సంఖ్య పెరిగిపోతున్నాయి. టెక్నాలజీని వాడి నేరాలను నివారిస్తామని, ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో శాంతి భద్రతలను కాపాడతామని పోలీసులు చెబుతున్నా వాస్తవంలో ఇది సత్ఫలితాలను ఇవ్వడం లేదని పోలీసులే చెబుతున్నారు. ఇలా జరగడానికి అనేక కారణాలున్నాయి. ఇందులో మొదటిది బేసిక్ పోలీసింగ్‌కు పోలీసులు దూరమవుతుండడం, రెండవది పోలీసు భర్తీలు క్రమం తప్పకుండా జరగకపోవడం, జనాభాకు అనుగుణంగా కనీస స్థాయిలో అయినా సిబ్బంది పెరగక పోవడంగా నిపుణులు చెబుతున్నారు. రాష్ట్రంలో ఏయేటికాయేడు పట్టణీకరణ పెరుగుతూపోతుండగా ఆయా ప్రాంతాల పోలీసు వ్యవస్థ ఇప్పటికీ గ్రామీణ పోలీసు విభాగాల స్థాయిని దాటడం లేదనేది కాదనలేని వాస్తవం. పోలీసు సిబ్బందిని భారీ స్థాయిలో కాకున్నా కనీస స్థాయిలో అయినా నిపుణుల సూచనల మేరకు పెంచాల్సిన అవసరం ఎంతయినా వుంది. ఇకపోలీసు ఆధునీకరణ భవనాల నిర్మాణం, సిసి కెమెరాల ఏర్పాటు వరకే పరిమితం కాగా, పోలీసు శాఖలో అవినీతి అధికారుల ఏరివేత కాగితాలకే పరిమితమయ్యింది. రాజకీయ సిఫార్సులతో పోస్టింగులు విపరీతంగా పెరిగిపోతున్నాయనే విమర్శలు ఎక్కువగా వుండగా దీనివల్ల సమర్థులైన అధికారులు ఏళ్ల తరబడి లూప్‌లైన్‌లోనే వుంటూ అక్కడే పదవీ విరమణ చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక పోలీసు శాఖకు సర్కారు గతంలో ఎన్నడు లేనంతగా ప్రాధాన్యతను ఇవ్వడం తెలిసిందే. ఇదే సమయంలో కేంద్ర హోం శాఖ కూడా ఆధునీకరణ



విషయంలో పెద్దఎత్తున నిధులను మంజూరు చేస్తోంది. దీంతో పాటు పీపుల్స్ ఫ్రెండ్లీ పోలీసు అంశానికి మరింత తోడ్పాటును అందించేందుకు ప్రజలతో మరింత సత్సంబంధాలు పెంచుకునేందుకు రిసెప్షన్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. ఇక కేంద్రం అందిస్తున్న నిధులతో కమ్యూనికేషన్ వ్యవస్థను మెరుగుపరచడంతో పాటు నేరాల నివారణ, నేరగాళ్ల పట్టివేత కోసం సిసిటిఎన్ఎస్ పేరిట మరో పథకాన్ని అమలు చేస్తున్నారు. అయితే ఇదంతా నాణానికి ఒకవైపు మాత్రమేనని చెప్పాలి. రెండవ వైపు వున్న అంశాన్ని పరిశీలిస్తే పోలీసు శాఖను క్షేత్రస్థాయిలో పరిపుష్టి చేయడంతో పాటు పూర్తి స్థాయిలో బలోపేతం చేసేందుకు సర్కారు ఇంకా చాలా చేయాల్సి వుందని పోలీసు అధికారులే అంటున్నారు. తెలంగాణ పోలీసు శాఖలో ప్రస్తుతం కొత్త భవనాల నిర్మాణం ఓవైపు పాత భవనాలకు కొత్త సొగసులు అద్దడం వేగంగా జరుగుతున్నాయి. దీనివల్ల పోలీసు స్టేషన్లకు కార్పొరేట్ హంగులు సమకూరాయనడంలో ఎలాంటి సందేహం లేదు. అయితే ఇదే సమయంలో ఖాళీల భర్తీ వేగంగా జరగడం లేదు. అవసరం అయినచోట అదనపు సిబ్బంది సమకూరడం లేదు. ముఖ్యంగా హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి పోలీసు కమిషనరేట్లలో అదనపు సిబ్బంది గురించి ఇక్కడి అధికారులు చాలా కాలంగా సర్కా రును కోరుతున్నా దీనిపై పాలకుల నుంచి పెద్దగా స్పందన కానరావడం లేదు. దేశంలో ఐదవ అతిపెద్ద పోలీసు కమిషనరేట్‌గా వున్న హైద రాబాద్ సిటీ పోలీసు విభాగంలో సిబ్బంది కొరత మరింత తీవ్రంగా వుంది. దీంతో ఇక్కడి అధికారులు చాలా సందర్భాలలో హోంగార్డులతో నెట్టుకు వస్తుండడంతోపాటు సిబ్బందిపై అదనపు భారాన్ని మోపుతున్నారు. సైబరాబాద్, మల్కాజిగిరి కమిషనరేట్ల పరిధుల్లోనూ ఇటువంటి పరిస్థితులే వున్నాయని చెప్పాలి. అరకొర సిబ్బందితో శాంతి భద్రతల పర్యవేక్షణ, నేరాల నివారణ, ట్రాఫిక్ అజమాయిషీ తోపాటు వివిఐపిల బందోబస్తు ఇతరత్రా విధుల నిర్వహణ ఈ మూడు కమిషనరేట్ల అధికారులకు అనేకసార్లు తలప్రాణం తోకకు వస్తోందని చెప్పాలి. హైదరాబాద్‌లో గడచిన రెండేళ్ల కాలంలో జరిగిన ప్రపంచ స్థాయి సదస్సులు, ప్రముఖుల పర్యటనలకు బందోబస్తు ఏర్పాటు చేయడం కోసం పోలీసులు నానా కష్టాలు పడాల్సి వచ్చింది. ఓవైపు సిబ్బంది కొరత ఇంకోవైపు భర్తీ కానీ ఖాళీలతో ఇబ్బంది పడుతున్న ఇక్కడి అధికారులకు కొత్తగా వచ్చి చేరుతున్న వాహనాలకు డ్రైవర్లను సమకూర్చడం కూడా కొన్నిసార్లు కష్టంగా మారుతోంది. రాష్ట్రంలోని అన్ని జిల్లాలు, కమిషనరేట్లలోనూ దాదాపు ఇదే పరిస్థితులు వున్నాయంటే అతిశయోక్తి కాదు. రాష్ట్రంలో వరుసగా జరుగుతున్న చోరీలు, పట్టపగలు నగల దుకాణాలలో చొరబడుతూ, సిబ్బందిపై కాల్పులు జరుపుతూ నగలనులూటీ చేస్తున్న ఘటనలు, ఎటిఎంల చోరీలు, ఎటిఎంల వద్ద నగదు వుంచే వారిపై కాల్పులు జరిపి మరీ దోపిడి చేస్తున్న ముఠాల ఉదంతాలు ఆయా ప్రాంతాల పోలీసులకు పెను సవాల్‌గా మారుతున్నాయి. ఈ తరహా నేరాలలో నిందితులుగా వున్న వారిలో అనేక మంది ఇతర ప్రాంతాలకు చెందిన వారు కావడం, వీరిలో చాలామంది కొత్తవారు వుండడం, వీరికి సం బంధించిన సమాచార సేకరణ, అరెస్టు చేయడం పోలీసులకు కష్టంగా మారుతోంది. ఈ విషయంలో ఇతర రాష్ట్రాలు ముఖ్యంగా ఉత్తరాది, పశ్చిమాది రాష్ట్రాల పోలీసుల సహ కారం ఇక్కడి పోలీసులకు అంతగాలభించక పోవడం పోలీసులకు సమస్యగా మారింది. దీనిపై ఆయా రాష్ట్రాలలో కొత్తగా నేరాలు చేస్తున్న వారి వివరాలను తెప్పించుకోవడం తో పాటు ఇక్కడ జరిగిన నేరాలతో వాటిని ఎప్పటికప్పుడు సరిచూసుకుంటే ఇక్కడి నేరాలను నియంత్రించే వీలుంటుందని విశ్రాంత పోలీసులు చెబుతున్నారు. కొత్తగా నేరస్తులుగా మారుతున్న యువత విషయం లో తల్లిదండ్రుల పాత్ర కీలకంగా వుండాలని, తమ వారిని నేరాలవైపు మళ్లకుండా జాగ్రత్తగా వుండేలా పోలీసులు కృషి చేయాలని విశ్రాంత పోలీసు అధికారులు చెబుతున్నారు. ఇక గడచిన కొంతకాలంగా రాజకీయ ప్రేరేపిత ఘటనల వల్ల అనేకచోట్ల రెండు పార్టీల మధ్య వివాదాలు మొదలై, గొడవలకు దారితీస్తూ పరస్పరం దాడుల వరకు వెళుతున్నాయి. కరీంనగర్‌లో గురువారం నాడు బిఆర్ఎస్ నేతలు కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌పై చేసిన విమర్శలు శృతిమించడంతో బిజెపి నాయకులు ఒక్కసారిగా దాడికి దిగారు. ఇదే సమయంలో బిఆర్ఎస్ నాయకులు ఎదురుదాడికి దిగడంతో పరస్పరం కొట్టుకునే వరకు పరిస్థితులు వెళ్లాయి. ఈ వివాదం కారణంగా శనివారం నాడు బిఆర్ఎస్ నాయకులు కరీంనగర్ బంద్‌కు పిలుపునిచ్చారు. ఈతరహా గొడవలు ఇంతకు ముందు కూడా అనేక పార్టీల మధ్య జరిగాయి. ఈ ఘటనలు పోలీసులకు మనశాంతి లేకుండా చేస్తున్నాయి.

---

తమిళనాడు

రాజకీయ సునామీ అంటే ఎలా ఉంటుందో, అది ఎంతటి కల్లోలాన్ని సృష్టిస్తుందో గతవారం తమిళనాట అనుభవంలోకి వచ్చింది. ఏ పార్టీకి పూర్తి మెజారిటీరాని విచిత్ర పరిస్థితిలో ఒక పార్టీ లేదా కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలంటే ఎటువంటి 'విపత్కర పరిస్థితి'ని చవిచూడవలసి వస్తుందో విజయ్ ఉదంతం చాటిచెప్పింది. గత సోమవారం ఎన్నికల ఫలితాల రోజున కేవలం పది సీట్ల దూరంలో విజయ్ టివికె నిలబడవలసి వచ్చింది. ముందుకు వెళ్లాలంటే ఎవరో ఒకరి మద్దతు కావాలి. హోరాహోరీగా పోరాడి మళ్లీ వెనక్కి వెళ్లలేదు కూడా. దాదాపు ఆరు దశాబ్దాలుగా ద్రవిడ పార్టీలు మాత్రమే రాజ్యం చేస్తున్న తమిళనాటవాలు మళ్లిస్తూ విజయ్ కొత్త చరిత్రను సృష్టించారన్నది కాదనలేం. ఒకటి రెండు మినహా ఏ సర్వేలు కూడా విజయ్ ఇంతటి ఘనమైన విజయం సాధించగలరని అంచనా వేయలేకపోయాయి. జయలలిత మరణానంతరం అన్నా డిఎంకె బలహీనపడడంతో ఈసారి కూడా డిఎంకేయే అధికారంలోకి రావొచ్చని మెజారిటీ సర్వేలు పేర్కొన్నాయి. అయితే వాటి అంచనాలను తలకిందులు చేస్తూ ప్రముఖ సినిమా నటుడైన జోసెఫ్ విజయ్ నిజంగానే రాజకీయ సునామీని సృష్టించారు. ఫలితాల తర్వాతకూడా ఆ సునామీ వారంరోజుల పాటు కొనసాగిందంటే భవిష్యత్తులో విజయ్ ప్రభావం ఎంతఉంటుందో అర్థం చేసుకోవచ్చు. ద్రవిడ సిద్ధాంతాలకు,ద్రవిడ వాదానికి భిన్నంగా ఏ పార్టీ వచ్చినా, ఎవరు మాట్లాడినా తమిళనాట దానికి ఎలాంటి మద్దతు లభించదనే చెప్పాలి. ఇంతకు ముందు గొప్ప ముఖ్య మంత్రులుగా చెలామణి అయిన కరుణానిధి, ఎమ్జీఆర్, జయలలిత సినిమా రంగానికి చెందినవారే అయినా ద్రవిడ సిద్ధాంతాలపైనే తమ పార్టీ పునాదులు నిర్మించుకున్నారు. వారి అఖండ విజయాల వెనుక ఉన్న రహస్యం అదే. కానీ విజయ్ సినిమా రంగంలో తనకున్న విశేషమైన పాప్యులారిటీని రాజకీయాల్లో కూడా పరీక్షి ంచుకోవాలనుకొని ఓ 'ప్రయోగం' చేసి చూశా రు. అనుకొన్నట్లే అది 'క్లిక్' అయింది కూడా. బొమ్మ బ్లాక్ బస్టర్ అన్నట్లు సునామీనే సృష్టిం చింది. అయితే వందరోజుల

# రాజకీయ సునామీ

**ఎ.వి.వి ప్రసాద్**

పోస్టర్ పడింది కానీ లాభాలు గుప్పిట్లోకి రాలేదన్నట్లు మెజారిటీ మార్కుకు పది సీట్ల దూరంలో ఉండిపోవడంతో అసలైన 'పొలిటికల్ డ్రామా' అప్పటి నుంచే మొదలయింది. అత్యధిక సీట్లున్న పార్టీగా టివికె ఆవిర్భవించినందున తమకే తొలుత అవకాశమి వ్వాలనీ, రెండు వారాలలో అసెంబ్లీలో బలం నిరూపించుకొంటామనీ గవర్నర్ తో జరిపిన తొలి భేటీలోనే విజయ్ చెప్పారు కానీ ఆ ప్రయత్నాలు ఫలించలేదు. అప్పటి నుంచి చిన్న పార్టీల మద్దతు కూడ గట్టడానికి ఆయన చాలా ప్రయత్నాలు చేశారు.



విజయ్

తర్వాత నాలుగు రోజుల్లో మరో రెండు సార్లు గవర్నర్ అర్లేకర్‌ను లోక్ భవన్ లోనే కలిసారు. తనకు మద్దతిచ్చేవారి సంఖ్య పెరుగుతోందని చెప్పారు. ఈలోగా ఐదు సీట్లున్న కాంగ్రెస్ డిఎంకె కూటమి నుంచి బయటకు వచ్చి టివికెకు మద్దతు ప్రకటించింది. రెండు సీట్లలో పోటీ చేసిన విజయ్ తిరుచ్చి-2 సీటును వదిలేసి పెరంబూరు మాత్రమే నిలుపుకొనడంతో 107కు తగ్గిన టివికె బలం కాంగ్రెస్ చేరికతో 112కు పెరిగింది. రెండోసారి గవర్నర్‌ను కలిసినప్పుడు ఆ విషయం విజయ్ చెప్పినా, గవర్నర్ ససేమిరా అనడంతో విజయ్ మళ్లీ ప్రయత్నాలు ఆరంభించారు. అప్పటికే 'రాజకీయ ఉద్రిక్తత' పెరిగిపోయి సునామీ ప్రభావం అధికమైంది. వామ పక్షాలు తొలుత తిరస్కరించినా, తర్వాత విజయ్‌కి మద్దతివ్వడాకి ముందుకు రావడంతో నాలుగు సీట్లు పెరిగి బలం 116కు చేరింది. దానితో ఆయనలో ఆశలు కూడా పెరిగాయి. ఇక తన ప్రమాణ స్వీకారం కార్యక్రమానికి గవర్నర్ అంగీకరించవలసిందే అనుకొన్నారు. డిఎంకె కూటమిలోనే ఉన్న విసికె (విదుతలై చిరు తైగల్ కట్చిం), ఐయుఎంఎల్ కూడా మద్దతిస్తామని చెప్పడంతో బలం 120కి చేరుతున్నదనీ ఇక తిరుగులేదనీ భావించిన విజయ్ శుక్రవారం సాయంత్రం మళ్లీ గవర్నర్‌ను కలిసారు. 116 మంది ఎమ్మెల్యేల జాబితాను గవర్నర్‌కు ఇచ్చారు. ఆ సమయానికి విసికె, ఐయుఎంఎల్ మద్దతు లేఖలు గవర్నర్‌కు చేరకపోవడంతో ఆయన వారిని మళ్లీ వెనక్కిపంపారు. పూర్తి మెజారిటీతో వస్తేనే ప్రమాణ స్వీకారానికి గ్రీన్ సిగ్నల్ ఇస్తా నని చెప్పడంతో మళ్లీ ఆ రెండు పార్టీల మద్దతు లేఖల కోసం శుక్రవారం అర్ధరాత్రి దాటే దాకా ఏకబిగిన విజయ్ ప్రయత్నిస్తూనే ఉన్నారు. తొలుత మద్దతు ఇస్తానని చెప్పి అడ్డం తిరిగిన ఆ రెండు పార్టీలలో ఐయుఎంఎల్ తాము డిఎంకె కూటమిలోనే ఉంటామని ప్రకటించి ఆశ్చర్యపరచగా, విసికె తన గొంతెమ్మ డిమాండ్లను బయటపెట్టింది. డిప్యూటీ సిఎం, తిరుచ్చి సీటు, మరో మంత్రిపదవి ఇస్తేనే మద్దతు ఇస్తామని విసికె చెప్పడంతో ఆట మళ్లీ మొదటికి వచ్చింది. శనివారం నాటికి కూడాఇంకా రెండు సీట్ల దూరంలోనే టివికె నిలబడింది. ఈ మధ్యలో డిఎంకె, అన్నాడిఎంకె వేగంగాపావులు కదప డం ఆరంభించాయి. 47సీట్లున్న అన్నా డిఎంకె, 59సీట్లున్న డిఎంకె కలిసి రంగంలోకి దిగుతున్నాయనే వార్తలు గుప్పుమనడంతోఎవరు ఏం చేస్తున్నారో, ఎవరి వ్యూహాలు ఏమిటో, ఎవరు ఎవరిని పడగొట్టాలనుకుంటున్నారో అర్థంకాని రాజకీయ అయోమయ పరిస్థితి ఆవరించింది. మద్దతిస్తామన్న వారికి మంత్రి పదవులు,ఇతర ప్రయోజనాలు ఆశచూపినా,టివికెకు చివరిదాకా ఆశించిన సీట్లు రాకపోవడం కూడా విచిత్రమే. పార్టీ పెట్టిన రెండేళ్లలోపునే 35శాతం ఓట్లు టివికె సాధించిందంటే అది సినిమా రంగంలో విజయ్‌కి గల ప్రజాదరణ వల్లనే. అయితే తొలుత టివికెకు పూర్తి మెజారిటీరాకపోవడంతో అన్నిపార్టీలు తమ ఆట ఆరంభించాయి. చివరికి విజయ్ గెలుపు సాధించారు కానీ ఫలితాల అనంతరం ఇంతటి రాజకీయ

---

అమెరికా

ఇరాన్‌పై యుద్ధం, అణ్వాయుధ తయారీపై ఆంక్షలు, ప్రస్తుతం ఉన్న యురేనియం నిల్వలు తమ పరం చేసుకోవడం వంటి ఆంక్షలతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన ఏకపక్ష వైఖరికి చెక్‌పెడుతూ మధ్యవర్తుల నిర్ణయంతో దిగిరాక తప్పలేదు.పైకి గంభీరంతో ఉన్నప్పటికీ అమెరికాకు సంబంధించి 40 రక్షణరంగ స్థావరాలను ఇరాన్ దెబ్బతీసిందన్నది జగమెరిగిన సత్యం. బాహ్యప్రపంచంలో ఇలాఉంటే పాలనాపగ్గాలు చేపట్టిన వెనువెంటనే ప్రపంచ దేశాలపై సుంకాలు విధించిన ట్రంప్ ఇప్పుడు న్యాయస్థానాల్లోకూడా ప్రతికూలతలు ఎదుర్కొంటున్నారు. సుంకాలను విధించడం తప్పని పదిశాతం ప్రపంచ దేశాలపై విధించిన వాణిజ్యసుంకాలు చెల్లవని పేర్కొంటూ వాటిని తిరిగి చెల్లించాల్సిందేనంటూ అంతర్జాతీయ వాణిజ్య న్యాయస్థానం ఇచ్చిన తీర్పు ట్రంప్‌లో అసహనం పెంచింది. ముగ్గురు న్యాయమూర్తుల ప్యానెల్ ఉన్న న్యూయార్క్ కోర్టు మెజార్టీ అభిప్రాయంతో సుంకాలను తోసిపుచ్చింది. ఈ సుంకాలు చెల్లుబాటు కావని, చట్టపరిధిలో లేని అనధికారిక నిబంధనలని పేర్కొంటూ కేసుతీర్పు వెలువరించారు. ఈచట్టంతో అధ్యక్షుడికిసుంకాల విధింపుపై సమగ్ర అధికారాలిచ్చిందనడాన్ని కూడా అంగీకరించలేదు. రెండంకెల సుంకాలను సుప్రీంకోర్టు గత ఫిబ్రవరిలో కొట్టివేసిన తర్వాత ట్రంప్ తనకు విచక్షణాధికారాలున్నాయని పది శాతం తాత్కాలిక సుంకాలను ప్రపంచ దేశాలన్నింటిపైనా విధించారు. నార్వే నుంచినైజీరియా వరకూ అమెరికాలోనికి వస్తున్న 60శాతం దిగుమతులపై ఈ సుంకాలు విధిస్తామని వెల్లడించింది. పాలనా యంత్రాంగం1974 వాణిజ్య చట్టంసెక్షన్ 122 ప్రకారం కొత్తసుంకాలు విధించేందుకు అధికారాలున్నాయని ట్రంప్ ఈ సుంకాలు విధించారు. ఈ సుంకాల విధింపు నిబంధనలు జులై 24తేదీతో ముగిసిపోతుంది.ఇప్పటికే 25శాతం విధించిన సుంకాలన్నింటినీ వెంటనే వెనక్కి ఇచ్చేయాలన్న సుప్రీం కోర్టు ఉత్తర్వులతో ట్రంప్ ఖజానా దాదాపుగా ఖాళీఅయ్యేప్రమాదం ఉంది. ఓపక్క ఇరాన్‌తో యుద్ధంలో రోజుకు రెండు బిలియన్ డాలర్లకు తగ్గకుండా జరిగిన వ్యయంతో అమెరికా ఖజానా దాదాపుగా నిండుకున్న పరిస్థితికి చేరుకుది. ఈ దశలో పదిశాతం

# సవాళ్ల సుడిగుండంలో 'పెద్దన్న'!

**గన్ని మోహన్**

సుంకాలను కూడా రద్దుచేసి వీటిని రికవరీకోసం మళ్లీ వ్యాజ్యం దాఖలుచేస్తే ట్రంప్ హయాంలో ట్రెజరీకి ఎనలేని కష్టాలు ఎదురవుతాయని చెప్పకపత్పదు. సుప్రీంకోర్టు ఉత్తర్వుల తర్వాతట్రంప్ 1977నాటి అంతర్జాతీయ అత్యవసర ఆర్థిక అధికారాల చట్టం'ఈపా'ను ప్రయోగించారు.అమెరికా వాణిజ్యలోటును పూడ్చుకునేందుకు ఈవ్యవస్థ అమలు తప్పనిసరి అని యంత్రాంగం భావించడంతో ట్రంప్ ఈ పది శాతం సుంకాల ఎగ్జిక్యూటివ్ ఉత్తర్వులపై సంతకాలుచేసారు. అయితే సుప్రీంకోర్టు గత ఫిబ్రవరిలోనే ఈ ఈపా చట్టం ఎలాంటి సుంకాలు విధించేందుకు అధికారాలివ్వలేదని, అమెరికా రాజ్యాంగం కాంగ్రెస్‌కు మాత్రమే సుంకాలు, పన్నులు నిర్ణయించే అధికారాలున్నాయని అభిప్రాయపడింది.



ట్రంప్

అయినా అమెరికా ప్రజాప్రతినిధుల సభ కొన్ని పరిమిత అధికారాలు ట్రంప్‌నకు ఇవ్వవచ్చుని సమగ్ర ట్యారిఫ్‌లకు అధికారాలుండవని చెపుతూ సుంకాలవిధింపును కొట్టివేస్తూ వెంటనే వాటిని తిరిగి చెల్లించాలనికూడా ఆదేశించింది. దీనితో ఒక్కసారిగా సుమారు 15 లక్షలకోట్లకుపైగా సుంకాల చెల్లింపుల రూపంలో ట్రంప్ ఖజానాకు అదనపు భారంపడింది. అయితే ఈ తీర్పుపై అమెరికా కోర్ట్ ఆఫ్అప్పీల్స్‌కు వెళ్లే అవకాశం ఉంది. వాషింగ్టన్‌లో ఉన్న ఈ కోర్టు వివాదాలకు వెళ్లినతర్వాతనే సుప్రీంకోర్టువరకూ మళ్లీ వెళ్లాల్సి ఉంటుంది. చైనా, యూరోపియన్ యూనియన్, జపాన్ వంటి 16వాణిజ్య భాగస్వాములు ఈ పదిశాతం సుంకాలకు భిన్నంగా వారుసైతం అమెరికా నుంచి వచ్చే దిగుమతులపై ప్రతీకార సుంకాలు విధించారు. ప్రపంచంలోని 60 దేశాల నుంచి 99శాతం దిగుమతులు అమెరికాకు జరుగుతున్నాయి. నిజానికి వినియోగరంగ ఉత్పత్తుల నుంచి భారీ ఉత్పత్తుల వరకూ అన్నీ కూడా దిగుమతులపైనే అమెరికా ఆధారపడుతున్నది. ఈసుంకాలతో అమెరికా ట్రెజరీ నిండిందని తాము ఖజానాను భర్తీచేసి ఆర్థిక పరిపుష్టిని చేకూర్చినట్లు ట్రంప్ గర్వపడుతూ ట్రూత్ వ్యాఖ్యలు చేసినప్పటికీ న్యాయస్థానాల్లో ఆయనకు చుక్కెదురవుతోంది. అటు యుద్ధాలతో ప్రపంచ దేశాలనుంచి కూడా ట్రంప్ వ్యతిరేకత ఎదుర్కొంటున్నారు.గల్ఫ్‌దేశాలు కూడా తమకు జరిగిన నష్టానికి పరిహారం కోరుతున్నాయి.మరోపక్క ఇరాన్ కూడా అదే తీరులోఉంది. ఈ క్రమంలోట్రంప్‌నకు అటు న్యాయస్థానాల పరంగా కూడా తీవ్రస్థాయి చిక్కులు ఎదురవుతున్నాయి.ఇప్పటివరకూ దాఖలైన ఏఒక్క వ్యాజ్యంలోనూ దిగువ కోర్టునుంచి సుప్రీంకోర్టు వరకూ పాలన యంత్రాంగాన్ని సమర్థిస్తూ వచ్చిన నిర్ణయాలు లేవు.ఈ వాణిజ్య వివాదాలఅంతర్జాతీయ న్యాయస్థానం కూడా అదేతరహాలో తీర్పునివ్వడంతో ట్రంప్‌నకు రానున్న మధ్యంతర ఎన్నికల్లో మరింతగా ప్రతికూలత ఎదురవుతుందనడంలో ఎలాంటి సందేహంలేదు. ఇప్పటికే అమెరికా వ్యాప్తంగా ట్రంప్ పాలనకు రేటింగ్ పడిపోయింది. 40శాతానికి కూడా రేటింగ్ లేకపోవడంతో సంస్థాగతంగా ఎలాంటి మార్పులు చేయాలన్న అంశంపై ట్రంప్ తన అంతర్గత మిత్రులతో తర్జనభర్జనలుపడుతున్నారు.ఇరాన్‌తో యుద్ధంతోనే అత్యధికశాతం వ్యతిరేకత వ్యక్తం అయింది. గ్రీన్‌ల్యాండ్ స్వాధీనం, క్యూబాపై సైనిక చర్య చేపడతామన్న హెచ్చరికలు వంటివి ట్రంప్‌పాలన తీరును తప్పుపట్టేవిధంగా ఉన్నాయని సొంతపార్టీ నేతలే విమర్శలుగుప్పించారు. చట్టసభల్లో మెజార్టీ ఉందని ఏకపక్ష వైఖరితో వ్యవహరించే అమెరికా అధ్యక్షుడికి న్యాయస్థానాలు వేస్తున్న మొట్టికాయలు ప్రపంచ దేశాల్లో అధ్యక్షుడి ప్రతిష్టకు మచ్చతీసుకురావడంతోపాటు రానున్న మధ్యంతర ఎన్నికల్లో ఇదే అతిపెద్ద అడ్డంకిగా మారుతుందని ట్రంప్ గ్రహించకపోతే భారీ మూల్యం చెల్లించుకోవాల్సి

---

# విద్యార్థుల అధ్యయన విధానాల్లో సంస్కరణలు అవసరం

తల్లిదండ్రులు అక్షరాస్యులైనా నిరక్షరాస్యులైనా వారు పిల్లల పట్ల,వారు చదువులో కనబరిచే ప్రతిభపాటవాల పట్ల ఎప్పుడూ వేయికళ్లతో ఎదురుచూస్తుంటారు.తలిదండ్రులు వలస కార్మికులైనా, దినసరి వేతన కుటుంబమైనా, ఆర్థికపటంలో చివరిస్థానంలో వున్నా మారుతున్న కాలంతో మనం కూడా మారాలనే దృక్పథంతో పిల్లల చదువు, వారి భవిష్యత్తు పట్ల ఊహించని మార్పును మనం చూస్తూనే వున్నాం. రెక్కలకష్టంతో తమ పిల్లల్ని చదివించడానికి ఒంటరి తల్లి సైతం తనవంతు కృషి చేయడం అందరికీ గమనార్హం. తన బిడ్డ తమలా కూలీనాలీ చేయకూడదని చిన్నదైనా సర్కారు లేదా ప్రైవేట్స్కూలువైనా చాలునని తద్వారా బానిస బ్రతుకులకు విమోచన కలుగుతుందని కలలు కనేకాలమిది. వ్యవసాయం సన్నగిల్లింది, వ్యవసాయ భూములు రొయ్యల, చేపల చెరువులుగా మారిపోయాయి. కొంచెం రోడ్డుపరిధిలో ఉంటే రియల్‌ఎస్టేట్ రంగానికి తాకట్టుగా మారిపోతున్నాయి. గ్రామాల్లో వ్యవసాయం కనుమరుగైన తరుణంలో మరే ఇతర నైపుణ్యాలు లేని ఎన్నో గ్రామీణ కుటుంబాలు వలసల బాటలతో సరైన బతుకు లేక ఆర్థికబాధలతో అతలాకుతమౌతున్నారు. ఈకష్టంలో కూడా పిల్లల చదువు భవిష్యత్తుకు భరోసా కల్పించేందుకు తల్లిదండ్రుల యత్నాలు ఇంతాఅంతా కాదు. అందుకే స్వగ్రామమైనా, పరప్రాంతమైనా తమపిల్లలను పాఠశాలకు పంపించడం తప్పనిసరిగా ముందుకు రావడం ఊహించని మార్పుకాదు. అనివార్యమైందని చెప్పకతప్పదు. రాబోవు కాలంలో కొలువు దొరికితేనే బతుకుభరోసాతో అనేక కుటుంబాలు భావిస్తున్నాయి. దీనికితోడు ప్రభుత్వాలు కూడా తదనుగుణమైన ప్రణాళికలతోపిల్లల చదువుకు భరోసాకల్పిస్తూ ఇంతవరకూ బడిచూడని పిల్లలను కూడా వారి వయసు ఆధారిత తరగతిలో నమోదుచేయడం విద్యాహక్కుకు విస్తృత ప్రాధాన్యం కల్పించినప్పటికీ, బడిలో చేరిన పిల్లలు ఎక్కువ శాతం వారి అభ్యసనలో వెనుకబడి ఉండడం ఓపెద్దసవాలు. విద్యాహక్కు చట్టం 2009ప్రభావం దేశంలో 6-14వయసు కలిగిన విద్యార్థుల పాఠశాల నమోదు గత రెండు దశాబ్దాల నుండి 95శాతంకాగా ప్రస్తుతం 98.1 శాతంగా నమోదు కావడం చాలాశుభపరిణామం. అంటే 2018 తోపోల్చుకుంటే 2024 నాటికి నమోదు శాతం 66. 8శాతం పెరిగినట్టు చెప్పవచ్చు. ఒకప్పుడు ప్రభుత్వబడుల్లో విద్యార్థుల నమోదు లేక సతమతమోతూ ఉంటే ప్రభుత్వప్రయత్నాలు, తలిదండ్రుల ఉత్సుకత, ఎలిమెంటరీస్థాయి వరకు ఉచిత నిర్బంధ విద్యకు కంకణంకట్టుకున్న విద్యాహక్కు చట్టం 2009 వెరసి బడి బయటవున్న బడిఈడు పిల్లలను కూడా పరిగణనలోనికి తీసుకొని లెక్కిస్తే పిల్లల నమోదు సుమారు 98.1శాతం వరకు చేరినట్టు గణాంకాలు చెబుతున్నాయి. పిల్లలచేరికసరే వారిరేటెన్షన్ నాణ్యమైనవిద్య , అభ్యసనా సామర్థ్యాల సాధన, తలిదండ్రులు నిరక్షరాస్యులైనా తల్లిదండ్రుల ప్రోత్సహం ,విద్యాహక్కు చట్ట నిబద్ధత, పిల్లలకు ప్రభుత్వం సమకూరుస్తున్న మధ్యాహ్నభోజనం, ఉచితపుస్తకాల, దుస్తుల పంపిణీ అమ్మవొడి లాంటి పిల్లలసంక్షేమానికి ఉపకరించే ఉపకారవేతనాలు సైతం చదువంటే భయపడి బడిమానేసి లేదా చదువుకుందాం సంస్కరించుకుందామని ఎందరో బాలలుబడిలోప్రవేశించారు.అయినా 15 సంవత్సరాల విద్యాహక్కు చట్టం అమలు తర్వాత కూడా బడిలో ప్రవేశించిన మొదటి జనరేషన్ తొలి అక్షరాస్యతకు నోచుకున్న కుటుంబాల పిల్లలు ఇంకా అభ్యసనాలేమితో కొట్టుమిట్టాడడం నిజంగా శోచనీయం. ఈ అభ్యసనాలేమితో సతమతమవుతున్న 40శాతం విద్యార్థుల్లోనే నిజంగా చాలాకాలం చదువుకు నోచుకోని కుటుంబాల నుండి బడిపట్ల ఆసక్తితో బడిబాటపట్టి అభ్యసనాసామర్థ్యాలలేమితో

**మల్లాడిశ్రీనగేష్**

సతమతౌతున్న ఎక్కువ శాతం విద్యార్థులు ఆకోవకుచెందిన వారే ! ఈదుస్థితికి బాధ్యులెవరు?చదువు అనే మహానదిలో సురక్షితంగా ఒడ్డుకురావడానికి సరైన ఈతలో శిక్షణ ఇవ్వ కుండా అభ్యసనా సామర్థ్యాల సర్వేపేరిట విద్యార్థుల మనో భావాలను పెద్ద పరీక్షకు గురిచేయడం



ఎంతవరకు సమం జసం. నేలవీడిసాము చందాన చదువు ఒకటికాదు ఎన్నెన్నో జాతీయ ,రాష్ట్రీయసర్వేలు జరుగుతూనే వున్నాయి. కానీ చదువులో, బోధనాసరళిలో, తరగతి గది నిర్వహణలో, పాఠశాల నిర్వహణలో,పిల్లల ప్రతిభలో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టుగా ఉండడం విద్యా వ్యవస్థకు, ఉపాధ్యాయులకు, తలిదండ్రులకు సమాజానికి ఎప్పటికీ విప్పలేని చిక్కుముడిగా కనబడుతోంది. నేలవీడి సాము చేసినట్టు ఉన్నపరిస్థితులను చక్కబెట్టకుండా, తరగతి వారీసామర్థ్యాలను పెంపొందించడానికి తక్షణవ్యూహాలను రచించకుండా కృత్రిమమేధస్సు, డిజిటల్‌బోధన, ఆంగ్ల మాధ్యమం, అలాగే బోరేటరీలు తప్పనిసరియే కానీ అందరికీ సమాన విద్యను అందించండంలో విఫలమోతున్నాం. విద్యార్థుల తరగతి వారీ లేదా పాఠ్యాంశం పూర్తికా గానే విద్యార్థుల ప్రతిభనురోజు వారీలేదానెలవారీ అంచనా వేయకుండా సిలబస్‌ను పూర్తిచేయడమే ప్రథమకర్తవ్యంగా పాఠశాలలు పరిగెడుతుంటే,తరగతిగదిలో వున్నవందశాతంవిద్యార్థుల ప్రగతిని ఎలా పునరుద్ధరించగలం.ఈపరిస్థితులు ఎప్పటికీ ప్రశ్నార్థకమే. 5వతరగతిలో ప్రవేశించినప్పటికీ 2వ తరగతిపాఠ్యంశాలను కూడా చదవలేని లేదా కనీసగణిత సామర్థ్యాలను సాధించలేని విద్యార్థుల పరిస్థితి ఎలా చక్క బడుతుంది. ఒకవాక్యాన్ని కూడా క్షుణ్ణంగా చదవలేని విద్యార్థి తన తరగతిలో నిర్దేశించిన సబ్జెక్టులను ఎలా చదవగలరు. ఉతీర్ణత ఎలాసాధించగలరు. ఇప్పటికే 8వతరగతిలో ప్రవేశించినప్పటికీ విద్యార్థులు ఒకపేరా కూడా తడబడకుండా తప్పులు లేకుండా చదవలేకపోతున్నారు అంటే ఆకోవకు చెందిన విద్యార్థులుచదువు కాలమంతా ఒక విష వలయంలోనే చిక్కుకుపోతున్నారు. ఈ పరిస్థితిలో పదవ తరగతిలో ప్రవేశించే నాటికి పాఠశాలలు 80శాతం ఉత్తీర్ణత సాధిస్తున్నారు. ఇదే దీక్ష,పట్టుదల, ప్రణాళిక,బోధనా లేదా పరీక్షల్లో ఉతీర్ణతసాధించే వ్యూహాలు ఎందుకు ప్రాథమికపాఠశాల స్థాయి నుండి అమలు కావడంలేదు. ఎన్నాళ్ళీ సర్వేలు చర్చలు అకడెమిక్ చక్రం పరిగెడుతూ వుంది. విద్యార్థులపై తరగతులకు ఉతీర్ణులవుతూనేఉన్నారు. అభ్యసనకు అందని అయోమయంలో పడిపోతున్నారు. ఉదాహరణకు ఈ మధ్యనే యెన్.సి.ఆర్.టి నిర్వహించిన ఫరక్రాష్ట్రీయసేవాక్షన్సర్వే ప్రకారం సుమారు 75శాతంమంది 9 వతరగతి విద్యార్థులు చిన్నచిన్న కాన్సెప్టును కూడా అర్థం చేసుకోనిదుస్థితిలో ఉన్నారు. అంతేకాక చిన్నచిన్న గణిత సంబంధిత సమస్యలను కూడా చేయలేని పరిస్థితిలోఉన్నారు. ఫరక్రాష్ట్రీయ సేవాక్షన్ సర్వేలో ముందంజలో వున్న పంజాబ్, కేరళ, హిమాచప్రదేశ్ వంటి రాష్ట్రాలను ప్రగతిసాధనలో వారు రచించిన వ్యూహాలను అధ్యయనం చేయలేమా? దేశంలో సుమారు 47శాతం 3వతరగతి విద్యార్థులు చిన్న కథను కూడా చదివి అర్థం చేసుకోలేనిస్థితిలో వున్నారు.36 శాతం మంది విద్యార్థులు కూడికలు కూడా చేయలేకపోయారు. 6 వతరగతిలో సుమారు 34శాతం మంది స్థానిక సంస్థలు, మార్కెట్, ఇతరసంస్థల పని గురించి కూడా తెలియపరచలేకపోయారు. 9వతరగతి విద్యార్థులు సుమారు 55 శాతం మంది సోషల్ స్టడీస్ సబ్జెక్టులో రాజ్యాంగం గురించి, వాటి సూత్రాలు, జాతీయఉద్యమాల గురించి వెల్లడించలేని పరిస్థితిలో వున్నారు. ఇకతెలుగురాష్ట్రాలు పరిశీలిస్తే తెలంగాణ రాష్ట్రం జాతీయస్థాయిలో 9వతరగతిలో 17 వస్థానం, 6వ తరగతిలో 26వస్థానంలో ఉన్నట్లు తెలుస్తోంది. 3వతరగతిలో తెలంగాణ రాష్ట్రం 26 వస్థానంలో ఉండగా ఆంధ్రప్రదేశ్ 13వస్థానంలోఉండగా, 6వతరగతిలో తెలంగాణ 26వస్థానం, ఆంధ్రప్రదేశ్33వ స్థానంలో ఉండగా 9వతరగతిలో తెలంగాణ 17వస్థానంలో ఉండగా ఆంధ్రప్రదేశ్ 28 వస్థానంలో ఉన్నట్టుతెలుస్తోంది.విద్యాహక్కు చట్టం 2009 లో పొందుపరచిన బడుగుబలహీన వర్గాలకుచెందిన విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందుబాటులోనికి తీసుకురావడానికి మౌలికవసతులకల్పన,ఉపాధ్యాయుల వృత్తినైపుణ్యాల పెంపు తక్షణమే జరగాలి. కులవర్గ భాష, ప్రాంత లింగ వివక్షలేని సమ్మిళిత అందరికీ సమాన విద్యను అందించడం అనే ప్రాథమిక సూత్రాన్నిదృష్టిలో ఉంచుకొని చదువుకే తొలితరమైన అయిన కుటుంబ విద్యార్థులకు పటిష్టమైనపునాది ఏర్పరచాలి.ఆధునిక విద్యా విధాన ప్రపంచంలో ప్రామాణికాలుగా పరిగణించబడ్డ 21వ శతాబ్దపు నైపుణ్యాలను పుణికిపుచ్చుకొనేలా విద్యావ్యవస్థనుబలపరచాలనేదే మూలసూత్రంగా, ఉపాధ్యాయులను ప్రాతిపదికన నిరంతర శిక్షణా కార్యక్రమాలద్వారా కరికులంలో స్థానికతనుజోడించడం, విశ్లేషణ

# 9 రాష్ట్రాల్లో బిజెపి పాగా



## మోడీ ప్రధాని అయినప్పటి నుంచి పార్టీ త్వరితగతిన విస్తరణ

## హర్యానా నుంచి బెంగాల్ వరకు 'కమల' వికాసం

**న్యూఢిల్లీ, మే 9:** పశ్చిమ బెంగాల్‌లో బిజెపి సాధించిన ఘన విజయం, మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వ 15 ఏళ్ల పాలనకు ముగింపు పలికింది. నరేంద్ర మోడీ 2014లో ప్రధానమంత్రిగా బాధ్యతలు స్వీకరించినప్పటి నుండి, ఇప్పటివరకు మొత్తం తొమ్మిది రాష్ట్రాల్లో బిజెపి తొలిసారిగా ముఖ్యమంత్రి పదవిని కైవసం చేసుకుంది. ఈ ప్రస్థానం 2014లో హర్యానా, మహారాష్ట్రలతో ప్రారంభమైంది. ఆ తర్వాత అసోం (2016), అరుణాచల్ ప్రదేశ్ (2016), మణిపూర్ (2017), త్రిపుర (2018), ఒడిశా (2024), బీహార్ (2026), ఇప్పుడు పశ్చిమ బెంగాల్‌తో ఈ జాబితా కొనసాగుతోంది. హర్యానాలో, బిజెపి తొలిసారిగా సొంతంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి, మనోహర్ లాల్ ఖట్టర్‌ను ముఖ్యమంత్రిగా నియమించింది. మహారాష్ట్రలో, అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి ఏకైక అతిపెద్ద పార్టీగా అవతరించి, 'మహాయుతి' కూటమిలోని మిత్ర పక్షాలతో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన తర్వాత, దేవేంద్ర ఫడ్నవీస్ ఆ రాష్ట్రానికి తొలి బిజెపి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. 2016లో అసోంలో విజయం సాధించడం ద్వారా బిజెపి ఈశాన్య భారతదేశంలో తన విస్తరణను కొనసాగించింది. అక్కడ సర్బానంద సోనోవాల్ ఆ రాష్ట్రానికి బిజెపి తరపున తొలి ముఖ్యమంత్రి అయ్యారు. అప్పటి నుండి, బిజెపి అసోంలో అధికారాన్ని నిలబెట్టుకుంటూ, ఏప్రిల్‌లో జరిగిన ఎన్నికలతో కలిపి వరుసగా మరో రెండు అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించింది. అదే సంవత్సరం (2016)లో, అరుణాచల్ ప్రదేశ్ రాజకీయాల్లో చోటుచేసుకున్న భారీ మార్పుల నేపథ్యంలో, బిజెపి అక్కడ తన తొలి పూర్తిస్థాయి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. జులై 2016లో, సుదీర్ఘ రాజకీయ సంక్షోభం నడుమ కాంగ్రెస్ నాయకుడు పేమా ఖండు ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. అయితే, సెప్టెంబర్ నెలలో ఆయనతో పాటు కాంగ్రెస్ పార్టీకి చెందిన మెజారిటీ ఎమ్మెల్యేలు, బిజెపి మిత్రపక్షమైన 'పీపుల్స్ పార్టీ ఆఫ్ అరుణాచల్' (పిపిఎ)లో చేరారు. కొన్ని నెలల తర్వాత, 2016 డిసెంబర్‌లో, ఖండూ 33 మంది ఎమ్మెల్యేలతో కలిసి బిజెపిలో చేరారు. దీంతో ఆ పార్టీకి రాష్ట్రంలో స్పష్టమైన మెజారిటీ లభించి, మొట్టమొదటి స్థిరమైన ప్రభుత్వం ఏర్పడింది. 2003లో అరుణాచల్ ప్రదేశ్‌లో బిజెపి మాజీ ముఖ్యమంత్రి గెగాంగ్ అపాంగ్ నేతృత్వంలో కొద్దికాలం పాటు ప్రభుత్వాన్ని నడిపింది. ఆ సమయంలో కాంగ్రెస్‌ను వీడి బిజెపిలో చేరిన అపాంగ్, కేవలం 44 రోజులు మాత్రమే ప్రభుత్వానికి నాయకత్వం వహించి తిరిగి కాంగ్రెస్‌లో చేరారు. 2017లో, మణిపూర్‌లో బిజెపి, నేషనల్ పీపుల్స్ పార్టీ (ఎన్‌పిపి), నాగా పీపుల్స్ ఫ్రంట్ (ఎన్‌పిఎఫ్), ఇతర ప్రాంతీయ పార్టీలతో ఎన్నికల అనంతర పొత్తును కుదుర్చుకుని, ఎన్. బీరెన్ సింగ్‌ను ముఖ్యమంత్రిగా నియమించింది. దీంతో ఆ సరిహద్దు రాష్ట్రంలో బిజెపికి ఇదే మొదటి ప్రభుత్వంగా నిలిచింది. 2018లో, త్రిపురలో లెఫ్ట్ ఫ్రంట్ దశాబ్దాల పాలనకు బిజెపి ముగింపు పలికి, బిప్లబ్ కుమార్ దేబ్ నేతృత్వంలో తన తొలి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. 2024లో తూర్పు భారతదేశంలో పార్టీ మరో ముందడుగు వేసింది. ఒడిశాలో బిజు జనతా దళ్‌ను ఓడించడంతో, నవీన్ పట్నాయక్ 24 ఏళ్ల నిరంతర పాలనకు ముగింపు పలుకుతూ, మోహన్ చరణ్ మాఝీ ఆ రాష్ట్రానికి బిజెపి మొదటి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. నితీష్ కుమార్ నేతృత్వంలోని సంకీర్ణ ప్రభుత్వాలలో బిజెపి దీర్ఘకాలంగా భాగస్వామిగా ఉన్న బీహార్‌లో, 2026 వరకు ఆ పార్టీకి ముఖ్యమంత్రి లేరు. రెండు దశాబ్దాలకు పైగా, చిన్న చిన్న అంతరాయాలతో పలు పర్యాయాలు ముఖ్యమంత్రిగా పనిచేసిన నితీష్ కుమార్, ఈ ఏడాది ప్రారంభంలో పదవి నుంచి వైదొలిగి రాజ్యసభకు వెళ్లారు. ఆయన నిష్క్రమణ తర్వాత, బిజెపి ఆ రాష్ట్రానికి పార్టీ నుంచి మొదటి ముఖ్యమంత్రిగా సామ్రాట్ చౌదరిని నియమించింది. ఇటీవలి ఎన్నికలలో పశ్చిమ బెంగాల్‌లో విజయంతో, రాజకీయంగా పార్టీకి అందనిదిగా భావించబడుతున్న రాష్ట్రంలో బిజెపి ఇప్పుడు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ఆ పార్టీ 294 అసెంబ్లీ స్థానాలకు గాను 207 స్థానాలను గెలుచుకుంది.



శనివారం కోల్‌కతాలో బిజెపి సీనియర్ కార్యకర్త మఖన్‌లాల్ సర్కార్‌తో భేటీ అయిన ప్రధాని మోడీ

# మఖన్‌లాల్ సర్కార్ ఓ స్ఫూర్తి

## బిజెపిలో ఇలాంటి కార్యకర్తలు ఉండడం గర్వకారణం : ప్రధాని

## ప్రమాణస్వీకార వేదికపై సర్కార్ ఆశీర్వాదం తీసుకున్న మోడీ

**కోల్‌కతా, మే 9 (ఐఎఎన్‌ఎస్):** బిజెపి అత్యంత సీనియర్ కార్యకర్తలలో ఒకరైన మఖన్‌లాల్ సర్కార్‌తో తాను జరిపిన భేటీకి సంబంధించిన ఫోటోలను ప్రధాని నరేంద్ర మోడీ శనివారం పంచుకున్నారు. ఆయనను ఒక 'స్ఫూర్తిదాయకమైన వ్యక్తి'గా అభివర్ణిస్తూ, అన్ని వర్గాల ప్రజలను పార్టీలో చేరడానికి ఆయన నిరంతరం ప్రేరేపిస్తున్నారని అన్నారు. పశ్చిమ బెంగాల్ తొమ్మిదవ ముఖ్యమంత్రిగా సువేందు అధికారి ప్రమాణ స్వీకార కార్యక్రమంలో, రాష్ట్రంలోని బిజెపి అత్యంత సీనియర్ కార్యకర్తలలో ఒకరైన మఖన్‌లాల్ సర్కార్ ఆశీర్వాదం ప్రధాని నరేంద్ర మోడీ తీసుకున్నారు. ఆయన మఖన్‌లాల్ సర్కార్‌ను పలకరించి, ఒక శాలువా బహూకరించి, ఆశీర్వాదం పొందారు. 98 ఏళ్ల వయసులోనూ, స్వాతంత్ర్యానంతర భారతదేశంలోని జాతీయవాద ఉద్యమంతో సంబంధం ఉన్న తొలితరం క్షేత్రస్థాయి నాయకులలో మఖన్‌లాల్ సర్కార్ ఒకరిగా నిలిచిపోయారు. ఈ మేరకు ప్రధాని మోడీ 'ఎక్స్'లో రాసుకొచ్చారు. "పశ్చిమ బెంగాల్‌లో మొట్టమొదటి బిజెపి ప్రభుత్వం నేడు ప్రమాణ స్వీకారం చేస్తున్న తరుణంలో, దేశానికి, ముఖ్యంగా పశ్చిమ బెంగాల్‌కు డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ చేసిన శాశ్వతమైన సేవను మనమందరం గుర్తు చేసుకోవడం సహజం. ఆయన ఆశయాలను నెరవేర్చడానికి అన్ని విధాలా కృషి చేస్తాం. కోల్‌కతాలో జరిగిన ప్రమాణ స్వీకార కార్యక్రమంలో మఖన్‌లాల్ సర్కార్ జీని కలిసే అవకాశం నాకు లభించింది. నిబద్ధత కలిగిన జాతీయవాది అయిన ఆయన, డాక్టర్ ముఖర్జీతో కలిసి పనిచేశారు. ఆయనతో పాటు జమ్మూ కాశ్మీర్‌లో వెళ్తున్నప్పుడు అరెస్టు కూడా అయ్యారు. ఆయన తన జీవితాన్ని మన పార్టీకి అంకితం చేశారు. పశ్చిమ బెంగాల్ అంతటా పార్టీ పునాదిని విస్తరిస్తూ, అన్ని వర్గాల ప్రజలను పార్టీలో చేరడానికి ప్రేరేపించారు" అని మోడీ పేర్కొన్నారు. "ప్రజల మధ్య పనిచేసి, మన పార్టీని బలోపేతం చేసిన అటువంటి స్ఫూర్తిదాయకమైన వ్యక్తులు మనకు ఉన్నందుకు బిజెపిలో తాము గర్విస్తున్నాము" అని ప్రధాని మోడీ చేతులు జోడించారు.

**జనసంఘ్ నుంచి ప్రస్థానం**

మఖన్‌లాల్ సర్కార్ భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకుల్లో ఒకరైన శ్యామాప్రసాద్ ముఖర్జీ అనుచరుడిగా పేరుగాంచారు. 1952లో, కాశ్మీర్‌లో భారత త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసే ఉద్యమంలో శ్యామా ప్రసాద్ ముఖర్జీతో పాటు సర్కార్ ఉండగా, అరెస్టు అయ్యారు. 1980లో బిజెపి ఏర్పడిన తర్వాత, ఆయన పశ్చిమ దినాజ్‌పూర్, జల్‌పాయిగురి మరియు డార్జిలింగ్ జిల్లాలకు సంస్థాగత సమన్వయకర్త అయ్యారు. కేవలం ఒక సంవత్సరంలోనే, ఆయన దాదాపు 10,000 మంది సభ్యులను చేర్చుకోవడంలో సహాయపడ్డారు. 1981 నుండి, ఆయన ఏడు సంవత్సరాల పాటు నిరంతరాయంగా జిల్లా అధ్యక్షుడిగా సేవలందించారు. సాధారణంగా బిజెపి నాయకులు ఒకే సంస్థాగత పదవిలో రెండేళ్లకు మించి కొనసాగలేని ఆ కాలంలో, ఇది ఒక అసాధారణమైన ఘనతగా పరిగణించబడింది.

**గర్వంగా, సంతోషంగా ఉంది: మఖన్‌లాల్ సర్కార్ కుటుంబం**

పశ్చిమ బెంగాల్‌లోని అత్యంత సీనియర్ భారతీయ జనతా పార్టీ (బిజెపి) కార్యకర్తలలో ఒకరైన మఖన్‌లాల్ సర్కార్ కుటుంబ సభ్యులు శనివారం మీడియాతో మాట్లాడుతూ, ఆయన ఏళ్ల తరబడి చేసిన కృషి ఎట్టకేలకు ఫలించినందుకు తాము 'గర్వంగా', 'సంతోషంగా' ఉన్నామని తెలిపారు.

# పంజాబ్ పరిశ్రమల మంత్రిని అరెస్టు చేసిన ఇడి



**చండీఘడ్, మే 9:** పంజాబ్ పరిశ్రమల, విద్యుత్తు శాఖ మంత్రి సంజీవ్ ఆరోరా నివాసంపై ఇవాళ ఈడీ తనిఖీలు చేపట్టింది. ఆ తర్వాత సంజీవ్ అరోరాను ఈడీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. చండీఘడ్‌లోని సెక్టార్ 2లో ఉన్న నివాసంలో ఆయన్ను అరెస్టు చేశారు. ఢిల్లీ, గురుగ్రామ్, చండీఘ్‌తో పాటు హాంప్టన్ స్కై రియాల్టీ లిమిటెడ్ సంస్థ కార్యాలయంలోనూ తనిఖీలు నిర్వహించారు. ఫేక్ జీఎస్టీలతో కొనుగోళ్లు చేసినట్లు సంజీవ్ అరోరా కంపెనీపై ఫిర్యాదులు ఉన్నాయి. సుమారు వంద కోట్ల ఖరీదైన మొబైల్ ఫోన్లు ఖరీదు చేసినట్లు ఉన్నది. దుబాయ్ నుంచి భారత్‌కు అక్రమ రీతిలో ఫండ్స్ తరలించారు. ఫేక్ జీఎస్టీ బిల్లులు సృష్టించారు. మంత్రి సంజీవ్ అరోరా ఇంటిపై దాడులు చేయడం ఈ ఏడాది ఇది మూడోసారి. మనీల్యాండరింగ్ కేసులో దర్యాప్తు జరుగుతున్నది. ఉదయం 5 గంటలకు చండీఘడ్‌లోని మంత్రి ఇంటికి ఈడీ చేరుకున్నది. ఆపరేషన్ సమయంలో మంత్రి నివాసం ముందు ఈడీ అధికారులకు చెందిన 8 వాహనాలను నిలిపారు. ఏప్రిల్‌లో ఓ సారి ఈడీ దాడులు నిర్వహించింది. ఫెమా చట్టం ఉల్లంఘన కింద ఓ కేసులో దర్యాప్తు కొనసాగుతోంది. దర్యాప్తు ఏజెన్సీలకు సహకరించనున్నట్లు ఆయన గతంలో చెప్పారు. పరిశ్రమలకు కేటాయించిన భూములను రెసిడెన్షియల్ ప్రాజెక్టుల కోసం వాడుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆ కేసుతో లింకున్న మనీల్యాండింగ్ అంశంపై సంజీవ్ అరోరాను ప్రశ్నించారు. అరవింద్ కేజ్రీవాల్, భగవంత్ మాన్ సింగ్ లాంటి ఆప్ నేతలు అరోరాకు అండగా ఉన్నా ఈడీ మాత్రం తన పని తాను చేసుకుపోయింది. 2024లో ఓసారి కూడా ఈడీ తనిఖీ చేపట్టింది. పరిశ్రమలకు కేటాయించిన భూములను రెసిడెన్షియల్ ప్రాజెక్టుల కోసం వాడుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆ కేసుతో లింకున్న మనీల్యాండింగ్ అంశంపై సంజీవ్ ఆరోరాను ప్రశ్నిస్తున్నారు. తొలిసారి ఈడీ దాడి జరిగిన సమయంలో ఆయన రాజ్యసభ ఎంపీగా ఉన్నారు. మళ్లీ సంజీవ్ ఆరోరా నివాసంలో ఈడీ తనిఖీలు మొదలుపెట్టిందని పంజాబ్ సీఎం భగవంత్‌మాన్ తన ఎక్స్‌లో పోస్టు చేశారు. ఈ సంవత్సరంలో ఇది మూడోసారి అని, చర్యలు తీసుకుంటామని, రెయిడ్స్ ఎన్ని సార్లు చేసినా ఏమీ దొరకలేదన్నారు.

# మాపార్టీలో ఏక్‌నాథ్ షిండేలు లేరు..



జమ్ముకాశ్మీర్ సిఎం ఒమర్ అబ్దుల్లా

**శ్రీనగర్, మే 9:** జమ్ముకశ్మీర్‌లో అధికారంలో ఉన్న జమ్ముకశ్మీర్ నేషనల్ కాన్ఫరెన్స్‌లో చీలిక ఊహాగానాలను సీఎం ఒమర్ అబ్దుల్లా ఖండించారు. తమ పార్టీలో ఎక్‌నాథ్ షిండేలు ఎవరూ లేరని అన్నారు. ఫిరాయింపులు జరుగవచ్చన్న బీజేపీ వాదనలను ఆయన తోసిపుచ్చారు. జేకేఎన్‌సీలో అంతర్గత సంక్షోభం ఉన్నదని బీజేపీకి చెందిన ప్రతిపక్ష నేత సునీల్ శర్మ ఆరోపించారు. ఆ పార్టీ నుంచి విడిపోవడానికి సిద్ధంగా ఉన్న ఏక్‌నాథ్ షిండేలు చాలా మంది ఉన్నారని ఆయన తెలిపారు. పార్టీలో నెలకొన్న అసమ్మతి భయంతోనే సీఎం తన మంత్రివర్గాన్ని విస్తరించలేకపోతున్నారని విమర్శించారు. ఒమర్ అబ్దుల్లా తన మంత్రివర్గాన్ని విస్తరించిన వెంటనే జేకేఎన్‌సీ పేక ముక్కలా కూలిపోతుందని వ్యాఖ్యానించారు. బీజేపీకి చెందిన ప్రతిపక్ష నేత సునీల్ శర్మ వ్యాఖ్యలను సీఎం ఒమర్ అబ్దుల్లా ఖండించారు. జేకేఎన్‌సీలో ఫిరాయింపులు జరుగవచ్చని బీజేపీ చేస్తున్న వాదనలు వారి అసలు ఉద్దేశాలను బయటపెడుతున్నాయని విమర్శించారు. జేకేఎన్‌సీ ఎమ్మెల్యేలు పార్టీతోనే దృఢంగా ఉన్నారని స్పష్టం చేశారు. ఏ ఎమ్మెల్యే కూడా తిరుగుబాటు చేసి బీజేపీలో చేరబోరని ఆయన అన్నారు. మరోవైపు బీజేపీ ఉద్దేశాలను ఇది స్పష్టం చేస్తున్నది సీఎం ఒమర్ అబ్దుల్లా విమర్శించారు. బీజేపీ సహాయంతోనే ఏక్‌నాథ్ షిండే పార్టీని వీడినట్లు గుర్తు చేశారు. ప్రతిపక్ష నాయకుడు (శర్మ) జమ్ముకశ్మీర్‌లో ముఖ్యమంత్రి కుర్చీని చేజిక్కించుకోవడానికి చాలా ఆత్రుతగా ఉన్నట్లు కనిపిస్తోంది. నేషనల్ కాన్ఫరెన్స్‌లో ఏక్‌నాథ్ షిండేలు లేరని నేను ఆయనకు చెబుతున్నా అని అన్నారు. ఎన్సీలో అంతర్గత విభేదాలపై ఊహాగానాలను ఆయన కొట్టిపారేశారు. మంత్రివర్గ విస్తరణలో జాప్యానికి, రాష్ట్ర హోదా పునరుద్ధరణకు మధ్య సంబంధం ఉన్నదని ఒమర్ అబ్దుల్లా తెలిపారు. మాకు రాష్ట్ర హోదా కల్పించకపోవడం వల్లే మంత్రివర్గ విస్తరణ జరుగలేదు. జమ్ముకశ్మీర్‌కు రాష్ట్ర హోదా నిరాకరించినందుకు బీజేపీని ప్రజలు క్షమించరు. ఇక్కడ బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తే తప్ప, జమ్ముకశ్మీర్‌కు రాష్ట్ర హోదాను కేంద్రం పునరుద్ధరించకపోవచ్చని ప్రతిపక్ష నాయకుడి ప్రకటన ద్వారా స్పష్టమవుతోందని ఎద్దేవా చేశారు.

# నేను మాజీ కాదు..

## సోషల్ మీడియాలో ప్రొఫైల్‌ను మార్చిన మమత




**కోల్‌కతా, మే 9:** పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రిగా సువేందు అధికారి ప్రమాణ స్వీకారం చేయడంతో, మమతా బెనర్జీ తన 'ఎక్స్' బయోను మార్చారు. ఈ అప్‌డేట్‌లో ఆమెను మాజీ ముఖ్యమంత్రి అని పేర్కొనకుండా జాగ్రత్తపడ్డారు. బెంగాల్ ఎన్నికలలో తృణమూల్ ఘోర పరాజయం తర్వాత, మొండి వైఖరితో ఉన్న మమతా బెనర్జీ ఓటమిని అంగీకరించడానికి నిరాకరించారు. గవర్నర్‌కు తన రాజీ నామాను కూడా సమర్పించలేదు. శనివారం ఉదయం 11 గంటల వరకు, 'ఎక్స్'లోని ఆమె ప్రొఫైల్‌లో ఆమెను "గౌరవనీయ ముఖ్యమంత్రి, పశ్చిమ బెంగాల్" అని పేర్కొన్నారు. "మాజీ" అనే పదాన్ని జాగ్రత్తగా వాడకుండా, మమతా తనను తాను "పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి (15వ, 16వ, 17వ విధానసభ)" అని సంబోధించుకున్నారు. 1997లో కాంగ్రెస్ నుండి విడిపోయి ఆమె స్థాపించిన తృణమూల్ కాంగ్రెస్‌కు ఆమె వ్యవస్థాపక అధ్యక్షురాలని కూడా అందులో పేర్కొనబడింది. ఏదేమైనప్పటికీ, మమతా ఈ చర్యతో ఆమె చివరికి ఓటమిని అంగీకరించినట్లు సూచిస్తుంది.

# సిడిఎస్‌గా రాజాసుబ్రమణి

## నేవీ చీఫ్‌గా వైస్ అడ్మిరల్ కృష్ణస్వామినాథన్



**న్యూఢిల్లీ, మే 9:** భారత రక్షణ దళాల్లో నూతన చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సీడీఎస్)గా లెఫ్టినెంట్ జనరల్ ఎన్.ఎస్. రాజా సుబ్రమణిని కేంద్ర ప్రభుత్వం నియమించింది. నౌకాదళానికి నూతన అధిపతిగా వైస్ అడ్మిరల్ కృష్ణ స్వామినాథన్‌ను ఎంపిక చేసింది. ప్రస్తుత సీడీఎస్ జనరల్ అనిల్ చౌహాన్ ఈనెల 30న పదవీ విరమణ చేయనుండగా, ఆయన స్థానంలో సుబ్రమణి బాధ్యతలు చేపడతారు. ఈయన సీడీఎస్‌గా బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు భారత ప్రభుత్వ సైనిక వ్యవహారాల విభాగం కార్యదర్శిగా కూడా వ్యవహరిస్తారు. ఇక, నేవీ చీఫ్ వైస్ అడ్మిరల్ దినేశ్ కుమార్ త్రిపాఠి మే 31న పదవీ విరమణ చేయనుండటంతో కృష్ణ స్వామినాథన్ ఆ పదవిని చేపట్టనున్నారు. నేషనల్ డిఫెన్స్ అకాడమీ (ఎన్‌డీఏ) పూర్వ విద్యార్థి అయిన సుబ్రమణి, 1985లో గర్వాల్ రైఫిల్స్‌లో సైన్యంలోకి ప్రవేశించారు. 35 ఏళ్లకు పైబడిన తన సుదీర్ఘ కెరీర్‌లో అనేక కీలక పదవులు చేపట్టారు. ఆర్మీ వైస్ చీఫ్‌గా, సెంట్రల్ కమాండ్ చీఫ్‌గా, మిలిటరీ ఇంటెలిజెన్స్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్‌గా పనిచేశారు. లండన్‌లోని కింగ్స్ కాలేజీ నుంచి మాస్టర్ ఆఫ్ ఆర్ట్స్ డిగ్రీ, మద్రాస్ యూనివర్సిటీ నుంచి డిఫెన్స్ స్టడీస్‌లో ఎంఫిల్ పూర్తిచేశారు. కజకిస్థాన్‌లోని భారత రాయబార కార్యాలయంలో డిఫెన్స్ అటాషెగా కూడా సేవలందించారు. సైన్యానికి చేసిన విశిష్ట సేవలకుగానూ పరమ విశిష్ట సేవా పతకం, అతి విశిష్ట సేవా పతకం, సేనా మెడల్, విశిష్ట సేవా పతకంవంటి పలు ప్రతిష్ఠాత్మక పురస్కారాలు అందుకున్నారు. నౌకాదళ నూతన అధిపతిగా నియమితులైన వైస్ అడ్మిరల్ కృష్ణ స్వామినాథన్ 1987లో నేవీలో చేరారు. ఈయన కూడా ఎన్డీఏ పూర్వ విద్యార్థే. తన కెరీర్‌లో ఐఎన్ఎస్ విక్రమాదిత్య అనే విమాన వాహకనౌకతో పాటు పలు క్షిపణి నౌకలకు కమాండర్‌గా వ్యవహరించారు. వెస్టర్న్ ఫ్లీట్ కమాండర్‌గా, నేవీవైస్ చీఫ్‌గా, సదరన్ నేవల్ కమాండ్‌లో చీఫ్ స్టాఫ్ ఆఫీసర్‌గా కీలక బాధ్యతలు నిర్వర్తించారు. నేవీలో శిక్షణ ప్రమాణాలను మెరుగు పరచడంలో, ఆపరేషనల్ సేఫ్టీని పర్యవేక్షించే ఇండియన్ నేవల్ సేఫ్టీ టీమ్‌ను ఏర్పాటు చేయడంలో కీలక పాత్రపోషించారు. ఆయన సేవలకుగానూ అతివిశిష్టసేవాపతకం, విశిష్టసేవా పతకాలను అందుకున్నారు.

# టివికెపై పోలీసులకు దినకరన్ ఫిర్యాదు



**చెన్నై, మే 9:** తమిళనాడులో ప్రభుత్వ ఏర్పాటు చుట్టూ జరుగుతున్న రాజకీయాలు తారస్థాయికి చేరాయి. నటుడు విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే)కు తమ పార్టీ ఎమ్మెల్యే మద్దతు ఇస్తున్నట్లు నకిలీ లేఖను సృష్టించిందని ఆరోపిస్తూ అమ్మ మక్కల్ మున్నేట్ర కళగం (ఏఎంఎంకే) పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వివాదం మరింత ముదిరింది. దీంతో రాష్ట్ర రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి.

ఏఎంఎంకెకు చెందిన ఏకైక ఎమ్మెల్యే ఎస్. కామరాజ్ మద్దతు విషయంలో ఇరు పార్టీల మధ్య తీవ్ర ఘర్షణ వాతావరణం నెలకొంది. తమ ఎమ్మెల్యే మద్దతు లేఖను టీవీకే ఫోర్జరీ చేసి గవర్నర్‌కు సమర్పించిందని ఏఎంఎంకే అధినేత టీటీవీ దినకరన్ ఆరోపించారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తా మని హెచ్చరించిన కొన్ని గంటల్లోనే ఆ పని పూర్తి చేశారు. దినకరన్ ఆరోపణలను టీవీకే వెంటనే తిప్పికొట్టింది.

కామరాజ్ స్వయంగా తమకు మద్దతు లేఖ రాస్తున్న వీడియోను విడుదల చేసి, దినకరన్‌కు కౌంటర్ ఇచ్చింది. దినకరన్ అనుమతితోనే తాను టీవీకేకి మద్దతు ఇస్తున్నట్లు కామరాజ్ ఆ వీడియోలో పేర్కొనడం గమనార్హం. ఏఎంఎంకే ఎమ్మెల్యే కామరాజ్ స్వచ్ఛందంగా, సంతోషంగా మాకు మద్దతు లేఖ రాస్తున్న వీడి యో ఇది. దినకరన్ తప్పుడు ప్రచారం చేస్తు న్నారని టీవీకే ఒక ప్రకటనలో తెలిపింది.

ప్రభుత్వ ఏర్పాటు కోసం తాము ఎవరితోనూ బేరసారాలు ఆడాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. ఈ ఆరోపణలు, ప్రత్యారోపణల నడుమ టీటీవీ దినకరన్ అనూహ్యమైన మలుపు తిప్పారు. తన ఎమ్మెల్యే కామరాజ్‌తో కలిసి నేరుగా గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్‌ను కలిసి, అన్నాడీఎంకే నేత ఎడప్పాడి కె. పళనిస్వామికి తమ మద్దతు ఉంటుందని అధికారికంగా ప్రకటించారు. అంతకు ముందు తన ఎమ్మెల్యే కనిపించడం లేదని, రాజకీయ బేరసారాలకు గురై ఉండొచ్చని ఆరోపించిన దినకరన్, స్వయంగా ఆయన్ను గవర్నర్ వద్దకు తీసుకెళ్లడం చర్చనీయాంశంగా మారింది.



# భారత్ అమ్ముల పొదిలోకి అగ్ని ఎంఐఆర్వీ

## ఒడిశా తీరంలో పరీక్షలు విజయవంతం

**భువనేశ్వర్, మే 9:** భారత అమ్ములపొదిలో అత్యాధునిక క్షిపణి వచ్చి చేరింది. అగ్ని ఎంఐఆర్వీ. ఇంటర్ కాంటినెంటల్ రేంజ్ బాలిస్టిక్ క్షిపణిని పరీక్షించింది. ఈ తరహా క్షిపణి అభివృద్ధి చేయడం ఇదే మొదటిసారి. రక్షణ మంత్రిత్వ శాఖ విజయవంతంగా శనివారం పరీక్షించింది. ఒడిశా తీరంలోని డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ద్వీపం నుండి అగ్ని ఎంఐఆర్వీ ఖండాంతర బాలిస్టిక్ క్షిపణిను విజయవంతంగా పరీక్షించినట్లు ప్రకటించింది. ఈ ప్రయోగం విజయవంతం కావడంతో వ్యూహాత్మక రక్షణ సామర్థ్యాలలో మరో మెట్టు పైకెక్కినట్టయింది. 2026 అసెంబ్లీ ఎన్నికలు వన్ ఇండియాలో పూర్తి వివరాలు డీఆర్డీవో అభివృద్ధి చేసిన క్షిపణి ఇది. దీని ద్వారా మల్టీ పేలోడ్‌లను ప్రయోగించవచ్చు. హిందూ మహాసముద్ర రీజియన్ లోని వివిధ భౌగోళిక ప్రాంతాలలో విస్తరించి ఉన్న లక్ష్యాలను ఛేదించగలిగే సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయి ఈ మిస్సైల్స్. ఈ ప్రయోగం డీఆర్డీవో చాలా కాలంగా పనిచేస్తున్న అగ్ని6 క్షిపణి తయారీలో అడ్డంకులు తొలగిపోయినట్టయింది. అగ్ని6 క్షిపణి ప్రోగ్రామ్ కోసం రక్షణ మంత్రిత్వ శాఖ ఆమోదం కోసం వేచి ఉన్నామని డీఆర్డీవో చైర్‌పర్సన్ సమీర్ వీ కామత్ ఇటీవల వెల్లడించారు. అగ్ని6 క్షిపణి 6,000 నుండి 10,000 కిలోమీటర్ల పరిధిని కలిగి ఉంటుంది. ప్రపంచ దేశాల్లో నెలకొన్న అనిశ్చిత పరిస్థితులు, పశ్చిమాసియాలో ఉద్రిక్తత మధ్య భారత్ ఇటువంటి లాంగ్ రేంజ్ క్షిపణుల అభివృద్ధిని చేపట్టింది. ఈ క్రమంలోనే అగ్ని ఎంఐఆర్వీని తెరమీదికి తీసుకొచ్చింది. విజయవంతంగా పరీక్షించింది. ఎంఐఆర్వీ అంటే మల్టిపుల్ ఇండిపెండెంట్లీ టార్గెటబుల్ రీఎంట్రీ వెహికల్. ఒకే క్షిపణి ద్వారా అనేక లక్ష్యాలను ఛేదించే శక్తిగల క్షిపణిగా రక్షణ శాఖ వివరించింది.

# రెజ్లర్ వినేశ్‌ఫొగట్‌పై రెజ్లింగ్ సమాఖ్య వేటు



**న్యూఢిల్లీ, మే 9:** ప్రముఖ రెజ్లర్ వినేశ్ ఫొగాట్‌పై భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యుఎఫ్ఐ) నిషేధం విధించింది. ఈనెల 10 12 తేదీల మధ్య జరగనున్న నేషనల్ ఓపెన్ ర్యాంకింగ్ టోర్నమెంట్‌లో పోటీ చేయకుండా నిషేధం విధించింది. క్రమశిక్షణారాహిత్యం, డోపింగ్ నిరోధక నిబంధనల ఉల్లంఘనకు పాల్పడిందనే ఆరోపణలపై షోకాజ్ నోటీసులు జారీ చేసింది. దీంతో పాటు జూన్ 26 వరకు దేశీయ పోటీల్లో పాల్గొనేందుకు అనర్హురాలిగా ప్రకటించింది. దీంతో యూపీలోని గోండాలో జరగనున్న నేషనల్ ఓపెన్ ర్యాంకింగ్ టోర్నమెంట్‌కు ఆమె దూరంగా ఉండనుంది. అంతర్జాతీయ నిబంధనల ప్రకారం, రిటైర్మెంట్ తర్వాత తిరిగి పోటీల్లో పాల్గొనేందుకు అవసరమైన ఆరు నెలల నోటీస్ వ్యవధిని పూర్తి చేయడంలో వినేశ్ ఫొగాట్ విఫలమైనట్లు డబ్ల్యూఎఫ్ఐ తెలిపింది. వినేశ్ ప్రవర్తన భారత రెజ్లింగ్ ప్రతిష్ఠను దెబ్బతీసిందని, దేశం అవమానపడేలా ఆమె వ్యవహరించారని పేర్కొంది. జాతీయ, అంతర్జాతీయ రెజ్లింగ్ నిబంధనలు ఉల్లంఘించారని ఆరోపించింది. ప్యారిస్ ఒలింపిక్స్ 2024లో అనర్హురాలిగా వేటుపడటంతో పాటు నాలుగు ప్రధాన ఆరోపణలపై వినేశ్ నుంచి వివరణ కోరింది. డబ్ల్యూఎఫ్ఐ మాజీ అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ సొంత ఊరిలో పోటీలు జరుగుతున్నాయని, ఆ ప్రాంతంలో పోటీపడటం తనను మానసిక ఒత్తిడి గురిచేస్తోందని వినేశ్ ఫొగాట్ ఇటీవల ఆందోళన వ్యక్తం చేసింది. బ్రిజ్ భూషణ్ తమపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారంటూ ఫిర్యాదు చేసిన ఆరుగురు మహిళల్లో తాను కూడా ఉన్నానని చెప్పిన వినేశ్ ఫొగాట్ పోటీల సందర్భంగా తనకు లేదా తన జట్టు సభ్యులకు ఏం జరిగినా కేంద్ర ప్రభుత్వానిదే బాధ్యత అవుతుందని హెచ్చరించింది. పోటీల ప్రారంభానికి ఒకరోజు ముందు డబ్ల్యూఎఫ్ఐ నుంచి ఆమెపై వేటువేస్తూ ప్రకటన వచ్చింది.

# భక్తులకు ప్రసాదంగా డబ్బులు పంపిణీ

## బానోడా బాలాజీ ఆలయంలో వింత ఆచారం



**జైపూర్, మే 9:** ఆలయాల్లో లడ్డూలు, పులిహోర వంటి ప్రసాదాలకు బదులుగా రాజస్థాన్‌లోని బానోడా బాలాజీ ఆలయం తన విశిష్ట ఆచారంతో ప్రత్యేకంగా నిలిచింది. ఇక్కడ భక్తులకు డబ్బును ప్రసాదంగా అందిస్తారు. ఇది ఆలయానికి ఒక ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చింది. దీంతో ఈ వ్యవహారం దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఈ ప్రసాదంగా పొందిన డబ్బును భద్రంగా ఉంచుకోవడం వల్ల తమకు ఐశ్వర్యం సిద్ధిస్తుందని, వ్యాపారాల్లో లాభాలు వస్తాయని భక్తులు ప్రగాఢంగా విశ్వసిస్తారు. కోరికలు నెరవేరిన పిదప, పొందిన సొమ్ముకు మరికొంత కలిపి ఆలయానికి తిరిగి సమర్పించడం ఇక్కడ విలక్షణమైన ఆనవాయితీగా కొనసాగుతోంది. ఈ ప్రత్యేక సంప్రదాయంతో, బానోడా బాలాజీ ఆలయం మహిమాన్విత పుణ్యక్షేత్రంగా ప్రసిద్ధి చెందింది. దూర ప్రాంతాల నుంచీ వేలాది మంది భక్తులు స్వామి దర్శనానికి వస్తారు. నిత్యం ఆలయం కిటకిటలాడుతూ, పండుగలు, ఉత్సవాల వేళ రద్దీ మరింతపెరుగుతుంది. డబ్బు ప్రసాదంతో పాటు, లడ్డు,పులిహోర వంటి ఇతర ప్రసాదాలను ఇక్కడ కొనుగోలు చేయవచ్చు. భక్తుల రద్దీ పెరుగుతుండటంతో, ఆలయ విస్తరణ పనులు చేపట్టారు. ఉత్సవాల సమయంలో నిర్ణీత దర్శన వేళలు పాటిస్తూ నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.

# ఆపరేషన్ సిందూర్‌లో పాక్‌కు సాయం అందించాం

## తొలిసారిగా చైనా బహిరంగంగానే ఒప్పుకోలు

**న్యూఢిల్లీ, మే 9:** భారత్‌చేపట్టిన ఆపరేషన్ సింధూర్ సైనిక ఘర్షణ సమయంలో తాము పాకిస్థాన్‌కు ప్రత్యక్షంగా సాయం అందించామని చైనా తొలిసారి బహిరంగంగా అంగీకరించింది. ఆపరేషన్ సింధూర్ జరిగి ఏడాది పూర్తయిన సందర్భంగా చైనా ప్రభుత్వ మీడియా సంస్థ సీసీటీవీలో ప్రసారమైన కథనాలతో ఈ సంచలన నిజం బయటపడింది. దీనిపై హాంకాంగ్‌కు చెందిన సౌత్ చైనా మార్నింగ్ పోస్ట్ కథనాన్ని ప్రచురించింది. 2025 ఏప్రిల్ 22న జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్‌లో 26మంది పౌరులమృతికి కారణమైన ఉగ్రదాడికి ప్రతీకారంగా, 2025మే 7న భారత్ ఆపరేషన్ సింధూర్ ప్రారంభించింది. ఈ నాలుగు రోజుల ఘర్షణ సమయంలో, చైనాకు చెందిన ఏవియేషన్ ఇండస్ట్రీ కార్పొరేషన్ ఇంజనీర్లు జాంగ్ హెంగ్, జు డా పాక్‌లోని ఎయి ర్‌బేస్‌లో ఉండి అక్కడి వైమానిక దళానికి సాంకేతిక సహకారం అందించారు. ఎయిర్ బేస్‌లో యుద్ధ విమానాల గర్జనలు, హెచ్చరిక సైరన్ల మోత మధ్య, 50డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలో పనిచేశామని ఇంజనీర్ జాంగ్ హెంగ్ సీసీటీవీ ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. ఈ ఘర్షణ సమయంలో పాక్‌కు చైనా శాటిలైట్ ఇంటెలిజెన్స్ కూడా అందించిందని భారత సైన్యం గతంలోనే ఆరోపించింది. ఇప్పుడు చైనా ప్రభుత్వ మీడియానే స్వయంగా ఈ విషయాన్ని అంగీకరించడం, భారత్ చైనా పాకిస్థాన్ సంబంధాలలో కీలక పరిణామంగా మారింది.

-7_-7.qxd 5/9/2026 11:47 PM Page 1



# అమ్మవారి ఆలయ ధర్మకర్త మండలి సభ్యురాలిగా కడియం అనురాధ ప్రమాణ స్వీకారం



**విశాఖపట్నం, మే 9 ప్రభాతవార్త**

విశాఖపట్నంలోని శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి దేవాలయం ధర్మకర్త మండలి సభ్యురాలిగా కడియం అనురాధ ప్రమాణ స్వీకారం చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ పలువురు తెలుగు దేశం పార్టీ నాయకులు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ సీనియర్ నాయకురాలిగా పార్టీకి ఎంతోకాలంగా సేవలందిస్తున్న కడియం అనురాధ గారికి ఈ అవకాశం రావడం ఆనందదాయకమని టీడీపీ యువనాయకులు కర్రి సాయికృష్ణ పేర్కొన్నారు. ఆమె సేవా భావంతో దేవాలయ అభివృద్ధికి, భక్తులకు మరింత మంచి సేవలు అందిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ డైరెక్టర్ భీమరశెట్టి శ్రీనివాసరావు, అడారి మంజు, మళ్ల నరసింగరావు, కోయిలాడ వెంకట్, ఎంవీఆర్ నాయుడు, అడారి జానకి, మళ్ల శేషు మరియు మునగపాక మండలానికి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



విశాఖపట్నం
అనకాపల్లి
అల్లూరి సీతారామరాజు
26
వార్త



## అత్యంత వైభవంగా
# త్రిశూల్ ప్రారంభోత్సవం..

- ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడిన కైలాసగిరి..
- విశాఖ పర్యాటకానికి సరికొత్త చిరునామాగా త్రిశూల్

**విశాఖపట్నం, మే 9 ప్రభాతవార్త**

విశాఖ పర్యాటక మణిహారమైన కైలాసగిరి నూతనంగా ఏర్పాటు చేసిన 65 అడుగుల డమరుకంతో కూడిన త్రిశూల్ ప్రారంభోత్స వం అత్యంత వైభవంగా జరిగింది. శనివారం కైలాసగిరి పై మహా శివుడు కి ప్రత్యేక పూజలు జరిపిన అనంతరం త్రిశూలంకు పూజలు చేశారు. రాష్ట్ర మున్సిపల్ పురపాలక శాఖ మంత్రిపి. నారాయణ, రాష్ట్ర ఎం.ఎస్.ఎం.ఈ., సెర్ప్, ఎన్.ఆర్.ఐ సాధికారత, సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, విశాఖ పార్లమెంట్ సభ్యులు ఎం. శ్రీ భరత్, విజయ నగరం పార్లమెంట్ సభ్యులు కలిశెట్టి అప్పల నాయుడు, ప్రభుత్వ విప్ వేపాడ చిరంజీవి రావు ఎమ్మెల్యేలు విష్ణు కుమార్ రాజు, వంశీ కృష్ణ శ్రీనివాస్, పంచకర్ల రమేష్ బాబు, బండారు సత్యనారాయణ మూర్తి, లోకం నాగ మాధవి , విఎంఆర్డిఏ చైర్మన్ ఎం వి ప్రణవ్ గోపాల్ , మెట్రోపాలిటన్ కమిషనర్ ఎన్ .తేజ్ భరత్, తదితరులు పాల్గొని త్రిశూల్ శిలాఫలకం ఆవిష్కరించారు. అనంతరం రాష్ట్ర మంత్రి పి. నారాయణ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యాటకానికి పెద్ద పీట వేస్తున్నారని, పర్యాటకం ద్వారా ఆదాయం రావటమే కాకుండా ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. కైలాసగిరి ఒక పర్యాటక హబ్ గా తీర్చిదిద్దేందుకు ఇప్పటికే ప్రతిపాదనలు సిద్ధం చేయటం జరిగిందన్నారు. 65 అడుగుల ఎత్తున త్రిశూల్ ను ఏర్పాటుచేసిన వి ఎం ఆర్ డి ఎ చైర్మన్ ఎం వి ప్రణవ్ గోపాల్ ని, మెట్రోపాలిటన్ కమిషనర్ తేజ్ భరత్ కి సిబ్బందికి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

మిగతా 8..లో



# విశాఖ దక్షిణంలో వంశీ హవా..

- ఏపీ టాప్ ఎమ్మెల్యేగా సీఎం ప్రశంసలు
- నాలుగు సర్వేల్లో అగ్రస్థానం..
- ప్రజలకు అందుబాటులో ఉండటమే విజయ మంత్రం

**(ప్రభాతవార్త విశాఖపట్నం)**



విశాఖ దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ రాష్ట్ర రాజకీయాల్లో ప్రత్యేక గుర్తింపు సాధిస్తున్నారు. ప్రజల మధ్య నిరంతరం తిరుగుతూ, సమస్యల పరిష్కారంలో చురుకైన పాత్ర పోషిస్తున్న ఆయన పనితీరుపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేక ప్రశంసలు కురిపించినట్లు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. తాజాగా నిర్వహించిన నాలుగు కీలక సర్వేల్లో వంశీకృష్ణ శ్రీనివాస్ అగ్రస్థానంలో నిలవడం విశాఖ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విశాఖ జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి డీబీవీ స్వామి, ఎంపీ శ్రీభరత్, జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయా ఎమ్మెల్యేల పనితీరుకు సంబంధించిన

మిగతా 8..లో

# కైలాసగిరిలో గ్లాస్ బ్రిడ్జి సందడి..

- పర్యాటకులకు కొత్త ఆకర్షణగా మంత్రి నారాయణ ప్రశంసలు
- ప్రజాదరణ పొందుతున్న గ్లాస్ బ్రిడ్జిని సందర్శించిన మంత్రి బృందం

**విశాఖపట్నం, మే 9, ప్రభాతవార్త**

కైలాసగిరి కొండపై ఇటీవల ప్రారంభించిన గ్లాస్ బ్రిడ్జి నగర పర్యాటక రంగానికి మరో ప్రత్యేక ఆకర్షణగా మారింది. రాష్ట్ర మంత్రి పి. నారాయణ శనివారం ఉదయం కైలాసగిరిలో ఏర్పాటు చేసిన త్రిశూల్‌ను ప్రారంభించిన అనంతరం గ్లాస్ బ్రిడ్జిని సందర్శించి ప్రత్యేక ఆసక్తి కనబరిచారు. ఈ సందర్భంగా వీఎంఆర్‌డీఏ చైర్మన్ ఎం.వి. ప్రణవ్ గోపాల్ గ్లాస్ బ్రిడ్జి ప్రత్యేకతలు, నిర్మాణ విశేషాలను మంత్రి నారాయణకు వివరించారు. అనంతరం మంత్రి గ్లాస్ బ్రిడ్జిపై కొంతసేపు గడుపుతూ అక్కడి అందాలను వీక్షించారు. నగర ప్రజలతో పాటు పర్యాటకులను ఈ గ్లాస్ బ్రిడ్జి మరింత ఆకట్టుకుంటుందని ఆయన పేర్కొన్నారు. మంత్రి వెంట ప్రభుత్వ విప్ శ్రీ వేపాడ చిరంజీవిరావు, ఎమ్మెల్యేలు విష్ణుకుమార్ రాజు, బండారు సత్యనారాయణమూర్తి, లోకం మాధవి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ సతీష్, వీఎంఆర్‌డీఏ చైర్మన్ ఎం.వి. ప్రణవ్ గోపాల్, మెట్రోపాలిటన్ కమిషనర్ ఎన్. తేజ్ భరత్ తదితరులు పాల్గొన్నారు. సుందరమైన సముద్ర తీర దృశ్యాలతో పాటు ఎత్తైన ప్రాంతంలో నిర్మించిన గ్లాస్ బ్రిడ్జి ప్రస్తుతం విశాఖకు వచ్చే పర్యాటకుల ప్రధాన ఆకర్షణగా నిలుస్తోందని అధికారులు తెలిపారు.



## దేశంలోనే
# దూసుకెళ్తున్న విశాఖ పోర్ట్..

- రికార్డు కార్గో హ్యాండ్లింగ్‌పై కేంద్ర మంత్రి ప్రశంసలు
- 91.17 ఎంఎంటీల సరుకు రవాణాతో 10.34 శాతం వృద్ధి నమోదు

**విశాఖపట్నం, మే 9, ప్రభాతవార్త**

దేశంలోని ప్రముఖ పోర్టుల్లో ఒకటిగా నిలుస్తున్న విశాఖపట్నం పోర్ట్ అథారిటీ (వీపీఏ) 2025-26 ఆర్థిక సంవత్సరంలో రికార్డు స్థాయిలో 91.17 మిలియన్ మెట్రిక్ టన్నుల (ఎంఎం టీలు) కార్గో హ్యాండ్లింగ్ నమోదు చేసి 10.34 శాతం వృద్ధిని సాధించింది. ఈ విశిష్ట విజయంపై కేంద్ర పోర్టులు, షిప్పింగ్, జలరవాణా శాఖ మంత్రి శ్రీ సర్బానంద సోనోవాల్ వీపీఏ చైర్‌పర్సన్ డా. ఎం. అంగముత్తుకు ప్రత్యేక అభినందనల పత్రాన్ని పంపించారు. పోర్ట్ చైర్‌పర్సన్, అధికారులు, సిబ్బంది సమిష్టి కృషితో ఈ ఘనత సాధ్యమైందని కేంద్ర మంత్రి తన లేఖలో పేర్కొన్నారు. సమర్థ నాయకత్వం, వ్యూహాత్మక ప్రణాళిక, కార్యనిర్వహణ సామర్థ్యం వల్లే ప్రపంచ వాణిజ్య సవాళ్ల మధ్య కూడా విశాఖ పోర్ట్ నిరంతర కార్గో నిర్వహణలో అద్భుత ఫలితాలు సాధించిందని

మిగతా 8..లో





# ఐటీరంగంలో యువతకు భారీ అవకాశాలు..

- మిలీనియం క్యాంపస్ డ్రైవ్‌లో 43 మందికి ఉద్యోగాలు

8 లో

# ఏపీలో వాహన రిజిస్ట్రేషన్‌కు విప్లవాత్మక మార్పులు

- 24 గంటల్లోనే రిజిస్ట్రేషన్ పూర్తి చేయాలి
- ఆలస్యమైతే ఆటోమేటిక్ ఆమోదం

**(ప్రభాతవార్త, విశాఖపట్నం)**




రాష్ట్రంలో వాహనదారులు ఎదుర్కొంటున్న ఆలస్యాలకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై కొత్త వాహనాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను కేవలం 24 గంటల్లోనే పూర్తి చేయాలని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన సేవలు అందించడమే లక్ష్యంగా ఈ నూతన విధానాన్ని అమలు చేయనున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. సీఎం ఎన్.చంద్రబాబు నాయుడు సమీక్ష సమావేశంలో రవాణా శాఖ పనితీరుపై ప్రత్యేకంగా దృష్టిసారించారు. వాహన రిజిస్ట్రేషన్ విషయంలో ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉండకూడదని, ప్రతి దరఖాస్తును నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కొత్త విధానం ప్రకారం, వాహన రిజిస్ట్రేషన్ దరఖాస్తు సమర్పించిన తర్వాత రవాణా శాఖ

మిగతా 8..లో

## కనకమ్మ ఆలయ అభివృద్ధికి..
# శక్తివంచన లేకుండా సేవచేస్తా..

- కనక మహాలక్ష్మీ ఆలయ నూతన చైర్మన్ డాక్టర్ కందుల నాగరాజు
- కొలువు దీరిన కొత్త పాలకవర్గం హాజరైన ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యేలు వంశీకృష్ణ,పంచకర్ల తదితరులు





**విశాఖపట్నం, మే 9, ప్రభాతవార్త:**

కనక మహాలక్ష్మీ ఆలయ అభివృద్ధికి తన శక్తి వంచన లేకుండా సేవ చేస్తానని ఆ ఆలయ నూతన చైర్మన్ డాక్టర్ కందుల నాగరాజు హామీ ఇచ్చారు. శనివారం ఆలయంలోని నూతన పాలకవర్గం కొలువుదీరింది. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ కమిటీ సభ్యులు, అధికారులతో కలిసి, నగర పౌరులు, భక్తుల సూచనలతో ఆలయాన్ని మరింత సుందరంగా తీర్చిదిద్దుతామన్నారు. కనకమ్మ వారు అత్యంత మహిమాన్వితురాలని, కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారంగా విరాజిల్లే ఈ అమ్మవారు ఉత్తరాంధ్ర ప్రజలకు ఇలవేల్పుగా ఉన్నారని, తన హయాంలో భక్తులకు మరింత దర్శన భాగ్యం కలిగేలా సేవలందిస్తామన్నారు. తనకు అమ్మవారి సేవ చేసుకునే అవకాశం కల్పించిన ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం, తమ పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ పాటు ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యేలు వంశీకృష్ణ శ్రీనివాస్, పంచకర్ల రమేష్ బాబు తదితర నేతలకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

**మెరుగైన సేవలందిం చాలి: ఎంపీ శ్రీ భరత్**

భక్తులకు మరింత మెరుగైన సేవలందించాలని విశాఖ ఎంపీ శ్రీభరత్ కోరారు. నగర పౌరుల భాగస్వామ్యంతో ఈ ఆలయాన్ని మరింత అభివృద్ధి చేద్దామన్నారు. ఆధ్యాత్మిక భక్తి భావంతో తరించాలని, నిరంతరం భక్తులు సేవలోనే తరించాల న్నారు. అనంతరం అమ్మవారికి అంతా ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ మర్యాదలతో ఈవో శోభారాణి, ఏఈవో రాజేంద్ర కుమార్ నూతన పాలక వర్గానికి, ప్రజాప్రతినిధులకు స్వాగతం పలికారు. వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ అర్చక స్వాములు కమిటీ సభ్యులకు ఆశీర్వచనాలు పలికి, తీర్థ ప్రసాదాలు అంద జేశారు. మన్ననలు పొందాలికనక మహాలక్ష్మి ఆలయ నూతన ధర్మకర్తల మండలి పదవీ ప్రమాణ స్వీకారంలో భాగంగా

మిగతా 8..లో

## మొదటిపేజీ తరువాయిలు

### అత్యంత వైభవంగా త్రిశూల్ ప్రారంభోత్సవం..

మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ విశాఖ నగరాన్ని అత్యున్నత నగరంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎనలేని కృషి చేస్తున్నారని, వేల కోట్లు పెట్టుబడులు తీసుకువస్తున్నారు అని పేర్కొన్నారు. త్రిశూల్ అనేది వి ఎం ఆర్ డి ఎ చైర్మన్ ఎం వి ప్రణవ్ గోపాల్ కల అని, అది ఈరోజు సాకారమైందని అన్నారు. కైలాసగిరి పై ప్రారంభించిన త్రిశూల్ విశాఖ పర్యాటకానికి చిహ్నంగా నిలుస్తుందన్నారు. విశాఖ పార్లమెంట్ సభ్యులు ఎం.శ్రీ భరత్ మాట్లాడుతూ కైలాసగిరి పై నలుమూలల నుంచి కనిపించేలా ఏర్పాటుచేసిన త్రిశూల్ ప్రత్యేక ఆకర్షణగా ఉంటుందన్నారు. కైలాసగిరి నీ మరింత అభివృద్ధి చేసేలా మాస్టర్ ప్లాన్ రూపొందించటం కోసం సన్నాహాలు చేస్తున్నామన్నారు. గాలుల తీవ్రతను తట్టుకునేలా త్రిశూల్ నిర్మాణం జరిగిందన్నారు. ప్రభుత్వ విప్ వేపాడ చిరంజీవి రావు, ఎమ్మెల్యే లు పల్లా శ్రీనివాసరావు, విష్ణు కుమార్ రాజు , బండారు సత్యనారాయణ మూర్తి, పంచకర్ల రమేష్ బాబు , లోకం మాధవి , విజయనగరం పార్లమెంట్ సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు. త్రిశూల్ ఏర్పాటు చేసిన ప్రదేశంలో శివ నామస్మరణ మారుమ్రోగింది. త్రిశూల్ నమూనాలతో పలువురు అలరించారు. దీంతో కైలాసగిరి పై సరికొత్త ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో వి ఎం ఆర్ డి ఎ కార్యదర్శి మురళీ కృష్ణ , ప్రధాన ఇంజనీర్ వినయ్ కుమార్ ఎస్ ఈ రాంబాబు, డి ఎఫ్ ఓ శిరీష , సి ఏ వో హరి ప్రసాద్ , ఇతర విభాగాల అధికారులు, సిబ్బంది, పలువురు కూటమి పార్టీల నాయకులు, ప్రజాపిత బ్రహ్మ కుమారీస్ ఈశ్వరీయ విశ్వ విద్యాలయం ప్రతినిధులు, అన్నమయ్య ట్రస్టు సభ్యులు తదితరులు పాల్గొన్నారు. వి ఎం ఆర్ డి ఎ చైర్మన్ఎం వి ప్రణవ్ గోపాల్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఐటీ శాఖ మంత్రి వర్యులు నారా లోకేష్ మార్గదర్శకత్వంలో విశాఖను పర్యాటక హబ్ తీర్చిదిద్దే ప్రయత్నంలో భాగంగా 65 అడుగుల డమరుకం తో కూడిన త్రిశూల్ ను ఏర్పాటు చేశామని వివరించారు. కైలాసగిరి నీ కేవలం పర్యాటక ప్రాంతంగానే కాకుండా ఆధ్యాత్మికత ఉట్టిపడేలా త్రిశూల్ ప్రాజెక్ట్ ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఇప్పటికే కైలాసగిరి పై శివ పార్వతుల విగ్రహాలు పర్యాటకులను ఆకర్షిస్తున్న నేపథ్యంలో మహా శివుని ఆయుధం త్రిశూల్ ను హనుమంతవాక వ్యూ పాయింట్ వద్ద మరింత పర్యాటక చిరునామాగా త్రిశూల్ నిలుస్తుందన్నారు.

### ఏపీలో వాహన రిజిస్ట్రేషన్‌కు విప్లవాత్మక మార్పులు

అధికారులు 24 గంటలలోపు అన్ని ప్రక్రియలను పూర్తి చేయాల్సి ఉంటుంది. ఒకవేళ అధికారులు నిర్దేశిత గడువులోగా ఫైల్‌ను పరిశీలించకపోయినా, లేదా అనుమతి ఇవ్వకపోయినా, ఆ దరఖాస్తు స్వయంచాలకంగా ఆమోదం పొందినట్లుగా పరిగణిస్తారు. దీంతో అనవసర జాప్యాలకు పూర్తిగా అడ్డుకట్ట పడనుంది. ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ నిర్ణయం వల్ల వాహనదారులకు గణనీయమైన ఊరట లభించనుంది. ముఖ్యంగా కొత్త వాహనాలు కొనుగోలు చేసిన తర్వాత రిజిస్ట్రేషన్ కోసం రోజుల తరబడి వేచి ఉండాల్సిన అవసరం లేకుండా పోనుంది. అలాగే మధ్యవర్తుల ప్రమేయం తగ్గడంతో పాటు అవినీతికి కూడా చెక్ పడుతుందని అధికారులు భావిస్తున్నారు. రవాణా శాఖలో సేవల డిజిటలైజేషన్‌ను మరింత వేగవంతం చేయడంతో పాటు, ప్రజలకు సమయపాలనతో కూడిన సేవలు అందించడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. త్వరలోనే ఈ విధానం రాష్ట్రవ్యాప్తంగా అమలులోకి రానుండగా, వాహనదారుల నుంచి ఇప్పటికే హర్షాతిరేక స్పందన వ్యక్తమవుతోంది.

### కనకమ్మ ఆలయ అభివృద్ధికి.. శక్తివంచన లేకుండా సేవ చేస్తా..

జనసేన పార్టీ అర్బన్, రూరల్ అధ్యక్షులు, ఎమ్మెల్యేలు వంశీకృష్ణ శ్రీనివాస్, పంచకర్ల రమేష్ బాబు మాట్లాడుతూ నూతన పాలక మండలి సభ్యులు అమ్మవారి భక్తులకు అన్ని సదుపాయాలు కల్పించి, వారి మన్ననలు పొందాలన్నారు. ఆధ్యాత్మిక భక్తి భావంతో ప్రతి ఒక్కరూ ముందుకు నడిచి, భక్తులకు నిస్వార్థంగా సేవలు అందించాలన్నారు. ఆలయ అభివృద్ధికి పూర్తి స్థాయిలో కృషి చేయడంతో పాటు ఆలయం పేరు ప్రతిష్టలు మరింతగా పెరిగేలా చూడాలని, కూటమి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. ఆలయ అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామన్నారు.అభినందన మందారమాలఆలయ నూతన చైర్మన్ కందుల నాగరాజును ఈ సందర్భంగా టీడీపీ పార్లమెంట్ అధ్యక్షులు చోడే వెంకట పట్టాభిరామ్, డీసీసీబీ చైర్పర్సన్ కోన తాతారావు, డాక్ యార్డ్ కేటీబీ అసోసియేషన్ అధ్యక్షుడు బత్తుల చిరంజీవి, బీజేపీ నాయకులు బొచ్చ సురేష్ కుమార్, కూటమి పార్టీ నేతలు, పలువురు అభిమానులు అభినందించారు. అనంతరం తొలి పాలకవర్గ సమావేశాన్ని కందుల నాగరాజు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వంశీ పర్యవేక్షణలో నిర్వహించారు. నూతన పాలకవర్గం పదవీ ప్రమాణ స్వీకారానికి వేలాదిమంది తరలిరావడంతో కనక మహాలక్ష్మి ఆలయ ప్రాంగణం సందడిగా మారింది.

### విశాఖ దక్షిణంలో వంశీ హవా..

నివేదికలను సీఎం స్వయంగా పరిశీలించి, ప్రజలకు మరింత చేరువ కావాలని సూచించారు. అయితే విశాఖ దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పనితీరును ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ సీఎం అభినందించినట్లు సమాచారం. ప్రజల మధ్యే ఎమ్మెల్యే.. సమస్యల పరిష్కారంలో వేగం ఎమ్మెల్యేగా ఎన్నికైన నాటి నుంచి వంశీకృష్ణ శ్రీనివాస్ తనదైన శైలిలో నియోజకవర్గంలో పర్యటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటున్నారు. ప్రజల నుంచి నేరుగా అర్జీలు స్వీకరించడం, సమస్యలను వెంటనే అధికారుల దృష్టికి తీసుకెళ్లడం, పరిష్కారానికి కృషి చేయడం వల్ల ప్రజల్లో విశ్వాసం పెరిగినట్లు సర్వేల్లో వెల్లడైంది. ముఖ్యంగా యువత, మహిళలు, మధ్యతరగతి కుటుంబాలకు ఆయన మరింత చేరువైనట్లు రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. అభివృద్ధి పనుల్లో దూకుడు.. ప్రభుత్వ పథకాల అమలులో ముందం జనియోజకవర్గంలో రోడ్లు, కాలువలు, తాగునీటి సదుపాయాలు, పారిశుధ్య కార్యక్రమాలు, మౌలిక వసతుల అభివృద్ధిపై ఎమ్మెల్యే ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలుస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికీ చేరేలా క్రమం తప్పకుండా పర్యవేక్షిస్తున్నారని సమాచారం. ప్రజలకు ప్రభుత్వ సేవలు సులభంగా అందేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటుండటంతో దక్షిణ నియోజకవర్గంలో సానుకూల వాతావరణం నెలకొన్నట్లు చెబుతున్నారు. ఇంకా కష్టపడితే ప్రజలు బ్రహ్మరథం పడతార్థు సమీక్ష సమావేశంలో విశాఖ జిల్లా ఎమ్మెల్యేల పనితీరు బాగుందని సీఎం చంద్రబాబు నాయుడు పేర్కొన్నట్లు తెలిసింది. మరింత కష్టపడితే ప్రజల ఆదరణ ఇంకా పెరుగుతుందని ఆయన నవ్వుతూ వ్యాఖ్యానించినట్లు సమాచారం. ముఖ్యంగా వంశీకృష్ణ శ్రీనివాస్ పనితీరు రాష్ట్ర స్థాయిలో చర్చనీయాంశంగా మారిందని, ప్రజలతో మమేకమవడం వల్లే ఆయనకు సర్వేల్లో అగ్రస్థానం దక్కిందని రాజకీయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

### దేశంలోనే దూసుకెళ్తున్న విశాఖపోర్ట్..

అభినందించారు. ఉత్పాదకత పెంపు, టర్న్‌రౌండ్ టైమ్ మెరుగుదల, డిజిటల్ విధానాల అమలు, భాగస్వామ్య సంస్థలతో సమన్వయం, వినియోగదారులకు అనుకూల సేవల అందింపులో విశాఖ పోర్ట్ చూపుతున్న చొరవ ప్రశంసనీయమని తెలిపారు. ప్రపంచ స్థాయి సముద్ర వాణిజ్య కేంద్రంగా ఎదగడంలో విశాఖ పోర్ట్ కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. ఇతర పోర్టులకు కూడా విశాఖపట్నం పోర్ట్ ఆదర్శంగా నిలుస్తోందని, దేశ సముద్ర వాణిజ్య రంగంలో విశాఖ స్థాయిని మరింత బలోపేతం చేసిందని కేంద్ర మంత్రి తన అభినందనల పత్రంలో పేర్కొన్నారు.

### ఐటీ రంగంలో యువతకు భారీ అవకాశాలు..

**విశాఖపట్నం, మే 9, ప్రభాతవార్త**

మిలీనియం సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ, కోజెంట్ క్యూబ్ ఇంక్ సహకారంతో నిర్వహించిన క్యాంపస్ నియామక డ్రైవ్‌లో మొత్తం 43 మంది విద్యార్థులు ఉద్యోగ అవకాశాలు పొందారు. డిజిటల్ నైపుణ్యాల ప్రాధాన్యతపై అవగాహన కల్పిస్తూ ఐటీ రంగంలో విస్తృత అవకాశాలు ఉన్నాయని నిర్వాహకులు తెలిపారు. జావా, పైథాన్, అమెజాన్ వెబ్ సర్వీసెస్, క్లౌడ్ కంప్యూటింగ్ వంటి నైపుణ్యాలపై అవగాహన కలిగిన సుమారు 95 మంది అభ్యర్థులు ఈ నియామక డ్రైవ్‌లో పాల్గొన్నారు. అసోసియేట్ క్వాలిటీ అనలిస్ట్, క్లౌడ్ ఆపరేషన్స్ ట్రైనీ, డెవ్‌ఓప్స్ ట్రైనీ, డేటా అనలిస్ట్ పోస్టులకు నిర్వహించిన ఎంపిక ప్రక్రియలో 43 మంది ఎంపికైనట్లు వెల్లడించారు. విద్యార్థుల్లో ప్రాక్టికల్ సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించేందుకు ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మిలీనియం డిజిటల్ మార్కెటింగ్ మేనేజర్ గంగాధర్, హెచ్‌ఆర్ మేనేజర్ దీప్తి జోషి, హెచ్‌ఆర్ రిక్రూటర్ వరద, హెచ్‌ఆర్ మేనేజర్ విభూతి పాల్గొన్నారు.

### తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ప్రభుత్వ విప్ గణబాబు

**గోపాలపట్నం, మే 9, ప్రభాతవార్త :**



విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ గణబాబు తన 57వ జన్మదినాన్ని పురస్కరించుకుని సతీసమేతంగా శుక్రవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించగా, టీటీడీ అధికారులు ఆయనకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. జన్మదినం సందర్భంగా తెలుగుదేశం పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు, కుటుంబ సభ్యులు, సన్నిహితులు ఫోన్, వాట్సాప్, సోషల్ మీడియా ద్వారా గణబాబుకు శుభాకాంక్షలు తెలిపారు.

### తలసేమియా వ్యాధిపై అవగాహన అవసరం : డాక్టర్ కుప్పిలి సురేష్ బాబు

**పిఎం పాలెం, మే 9, ప్రభాతవార్త :**



ప్రపంచ తలసేమియా దినోత్సవం సందర్భంగా డాక్టర్ కుప్పిలి సురేష్ బాబు తలసేమియా వ్యాధిపై ప్రజల్లో అవగాహన పెంచాల్సిన అవసరం ఉందని తెలిపారు. తలసేమియా అనేది తల్లిదండ్రుల నుంచి పిల్లలకు సంక్రమించే జన్యు వ్యాధి అని, సరైన సమయంలో పరీక్షలు చేయించుకోవడం ద్వారా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవచ్చన్నారు. రక్తహీనత, పెరుగుదల లోపం, జ్వరాలు వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. మేనరికపు వివాహాలను నివారించడం ద్వారా ఈ వ్యాధి ప్రమాదాన్ని తగ్గించవచ్చని తెలిపారు. రక్త మార్పిడి మరియు వైద్య పర్యవేక్షణతో తలసేమియా బాధితులు సాధారణ జీవితం గడపవచ్చని పేర్కొన్నారు.

## పాల సముద్రంలా వంజంగి మేఘాల కొండ..ప్రకృతి దృశ్యాలు

**పాడేరు, మే 9, ప్రభాతవార్త:**

రాష్ట్ర వ్యాప్తంగా ఎండలు మండుతుంటే అల్లూరి జిల్లా ప్రముఖ పర్యాటక కేంద్రం వంజంగి మేఘాల కొండ ప్రదేశంలో మంచు మేఘాలతో పాల సముద్రంలా శనివారం ఉదయం దర్శనం ఇస్తూ చూపరులను తన్మయంకు గురిచేశాయి. చలికాలంలో వచ్చేలా మంచు మేఘాలు ఎంతో ఆకర్షణీయంగా కనిపిస్తున్నాయి. దీంతో ఈ ప్రాంత ప్రజలు ఈ అందాల ప్రకృతి దృశ్యాలను తిలకిస్తూ తన్మయం చెందుతూ సెల్ ఫోన్లో సెల్ఫీలు తీసుకుంటూ ఎంజాయ్ చేసారు. సాధారణంగా వన్జగి మేఘాల కొండలో మంచు మేఘాలను చీల్చుకుంటూ సూర్యుడు ఉదయించే దృశ్యాలు ఈ పర్యాటక కేంద్రంలో ప్రత్యేకం.అయితే చలికాలంలో మాత్రమే పాల సముద్రంలా మంచుమేఘాలు కొండలు మధ్య నుంచి వెళుతూ ఎంతో ఆకర్ష ణీయంగా ఉంటాయి. వేసవికాలం ఎండలు మండుతూ ఉన్న ఈ సీజన్‌లో వంజంగి మేఘాలకొండలో మంచు మేఘాలు ఆకర్షణీయంగా దర్శనంఇవ్వడం ప్రత్యేక ఆకర్షణీయంగా నిలుస్తోంది..





### ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యపై అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపాల్ డా. కె.వి. రమ ణ

**విశాఖపట్నం, మే 9, ప్రభాతవార్త**

విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యపై అవగాహన కల్పిస్తూ, సరైన మార్గనిర్దేశం అందిస్తున్నామని ప్రభుత్వ కెమికల్ ఇంజనీరింగ్ సంస్థ ప్రధానాచార్యులు డా. కె.వి. రమణ తెలిపారు. గత కొన్ని సంవత్సరాలుగా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుండి విద్యార్థులు, తల్లిదండ్రులు ఫోన్ ద్వారా సంప్రదించి బ్రాంచ్ ఎంపిక, కాలేజీల ఎంపిక, ప్రభుత్వ పాలిటెక్నిక్‌లలో ఉన్న అవకాశాలు, వెబ్ ఆప్షన్ల విధానం వంటి అంశాలపై సలహాలు కోరుతున్నారని ఆయన చెప్పారు. వారికి తెలిసిన మేరకు సరైన సమాచారం అందిస్తూ మార్గనిర్దేశం చేస్తున్నట్లు పేర్కొన్నారు. సరైన సమాచారం లేక చాలా మంది విద్యార్థులు మంచి అవకాశాలను కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేసిన డా. రమణ, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని పేద మరియు మధ్యతరగతి విద్యార్థులు ప్రభుత్వ పాలిటెక్నిక్‌ల ద్వారా తక్కువ ఖర్చుతో ఉన్నత భవిష్యత్తును నిర్మించుకోవచ్చని వివరించారు. ప్రభుత్వ పాలిటెక్నిక్‌లపై విద్యార్థుల్లో మరింత నమ్మకం పెరగాలని, దళారులు మరియు తప్పుడు ప్రచారాలకు మోసపోకుండా సరైన నిర్ణయాలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఒక విద్యార్థి మంచి దారిలో నడిస్తే ఆ కుటుంబం మొత్తం అభివృద్ధి చెందుతుందనే నమ్మకంతో ఈ సేవా కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నట్లు తెలిపారు.“విద్య అనేది కేవలం ఉద్యోగం కోసం మాత్రమే కాదు.. ఒక కుటుంబాన్ని నిలబెట్టే శక్తి” అని డా. కె.వి. రమణ పేర్కొన్నారు.

### శిల్పారామంలో నేడు కోలాటం, జానపద నృత్య ప్రదర్శనలు

**విశాఖపట్నం, మే 9, ప్రభాతవార్త :**

విశాఖపట్నంలోని శిల్పారామం లో నిర్వహిస్తున్న వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా ఆదివారం సాయంత్రం ప్రత్యేక సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు పరిపాలన అధికారి రమేష్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం సాయంత్రం 6 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు శివ సాయి కోలాటం గ్రూప్ ఆధ్వర్యంలో కోలాటం, జానపద నృత్య ప్రదర్శనలు ప్రేక్షకులను అలరించనున్నాయని పేర్కొన్నారు. సాంప్రదాయ కళలను ప్రోత్సహించడం, ప్రజలకు సాంస్కృతిక వినోదాన్ని అందించడం లక్ష్యంగా ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కళాభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

### విశాఖ జిల్లాలో 65 సమ్మర్ కోచింగ్ క్యాంపులు ప్రారంభం

**విశాఖపట్నం, మే 9, ప్రభాతవార్త :**



డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా 28 క్రీడా విభాగాల్లో 65 వార్షిక సమ్మర్ కోచింగ్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ, విజయవాడ ఆదేశాలు మరియు జిల్లా కలెక్టర్ చైర్మన్ సూచనల మేరకు ఈ సమ్మర్ కోచింగ్ క్యాంపులు మే 1 నుండి మే 31, 2026 వరకు గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల్లోని వివిధ కేంద్రాల్లో నిర్వహించబడుతున్నాయి. 8 నుండి 16 సంవత్సరాల మధ్య వయస్సు గల బాలబాలికలను క్రీడల వైపు ఆకర్షించడం, చిన్న వయస్సులోనే ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించడం, వేసవి సెలవులను సద్వినియోగం చేసుకునేలా చేయడం ఈ క్యాంపుల ప్రధాన ఉద్దేశమని అధికారులు తెలిపారు.




చిన్నారుల్లో ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవాటు చేయడంలో ఈ శిక్షణా శిబిరాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి శ్రీమతి జూన్ గాలియట్ వివిధ కేంద్రాల్లో నిర్వహిస్తున్న సమ్మర్ కోచింగ్ క్యాంపులను పరిశీలించారు. జిల్లాలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఈ శిక్షణా కార్యక్రమాలు విజయవంతంగా కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ సమాచారాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని జిల్లా క్రీడా శాఖ కోరింది.

### విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు అవంత్తి వారధి

*- మాజీ మంత్రి, విద్యా సంస్థల అధినేత ముత్తంశెట్టి శ్రీనివాసరావు*

**విశాఖపట్నం, మే 9, ప్రభాతవార్త:**



విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో కూడిన విద్యను అందించడమేవిద్యార్థుల బంగారు భవిష్యత్తుకు “అవంత్తి వారధి : ముత్తంశెట్టి శ్రీనివాసరావు తగరపువలస, మే 9: విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో కూడిన విద్యను అందించడమే అవంతి విద్యా సంస్థలు లక్ష్యమని మాజీ మంత్రి, విద్యా సంస్థల అధినేత ముత్తంశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక అవంతి డిగ్రీ కళాశాల ప్రాంగణంలో అత్యాధునిక వసతులతో నిర్మించిన నూతన డిగ్రీ భవనాన్ని ఆయన శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, విద్యార్థుల సృజనాత్మకతను వెలికితీసేలా డిజిటల్ లైబ్రరీ, ఆధునిక ల్యాబ్‌లు భవనంలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలు కూడా అవసరమని పేర్కొన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులపై విద్యార్థులు దృష్టి పెట్టాలని సూచించారు. ఆర్థికంగా వెనుకబడిన ప్రతిభావంతులైన విద్యార్థులకు అవంతి విద్యా సంస్థలు ఎల్లప్పుడూ అండగా ఉంటాయని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్లు, ప్రిన్సిపాళ్లు, అధ్యాపక బృందం పాల్గొన్నారు. మాజీ మంత్రి, విద్యా సంస్థల అధినేత ముత్తంశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక అవంతి డిగ్రీ కళాశాల ప్రాంగణంలో అత్యాధునిక వసతులతో నిర్మించిన నూతన డిగ్రీ భవనాన్ని ఆయన శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, విద్యార్థుల సృజనాత్మకతను వెలికితీసేలా డిజిటల్ లైబ్రరీ, ఆధునిక ల్యాబ్‌లు భవనంలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలు కూడా అవసరమని పేర్కొన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులపై విద్యార్థులు దృష్టి పెట్టాలని సూచించారు. ఆర్థికంగా వెనుకబడిన ప్రతిభావంతులైన విద్యార్థులకు అవంతి విద్యా సంస్థలు ఎల్లప్పుడూ అండగా ఉంటాయని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్లు, ప్రిన్సిపాళ్లు, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

### పది కోట్ల విలువైన ప్రభుత్వ భూమి స్వాధీనం

*- ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు చొరవతో కబ్జాల తొలగింపు*

*- హర్షం వ్యక్తం చేసిన మొల్లి పెంటిరాజు,స్థానికులు*

**గాజువాక, మే 09,ప్రభాతవార్త**



విలువైన ప్రభుత్వ భూమిని ఆక్రమణదారుల నుంచి కాపాడి, తిరిగి ప్రభుత్వ పరమైన జీవీఎంసీ పర్యవేక్షణలోకి తీసుకురావడం అభినందనీయమని ఏపీ రాష్ట్ర గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ మొల్లి పెంటిరాజు పేర్కొన్నారు. విశాఖ జిల్లా గాజువాక నియోజకవర్గం పెదగంట్యాడ 75వ వార్డు పరిధిలోని సర్వే నంబర్లు 81, 109లో సుమారు 2 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న అత్యంత విలువైన భూమిని అధికారుల సాయంతో స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. స్థానిక పెంటమాంబ అమ్మవారి ఆలయం ఎదురుగా ఉన్న ఈ భూమి విలువ ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం సుమారు రూ. 10 కోట్లు ఉంటుందని అంచనా. కొంతకాలంగా కొందరు ప్రైవేటు వ్యక్తులు ఈ స్థలాన్ని అక్రమంగా ఆక్రమించి వ్యాపార కార్యకలాపాలు సాగిస్తున్నారు. దీనిపై స్పందించిన మొల్లి పెంటిరాజు.. గత రెండు నెలల క్రితమే ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు దృష్టికి తీసుకువెళ్లడంతో పాటు జిల్లా కలెక్టర్, జీవీఎంసీ కమిషనర్‌లకు ఫిర్యాదు చేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పెదగంట్యాడ తహసీల్దార్ అమల, స్టీల్ ప్లాంట్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఈ స్థలాన్ని పరిశీలించి నివేదిక సమర్పించారు. దీంతో స్పందించిన జీవీఎంసీ యంత్రాంగం, టౌన్ ప్లానింగ్ అధికారులు వెంటనే రంగంలోకి దిగి అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు. ఈ స్థలాన్ని తిరిగి స్వాధీనం చేసుకుని అధికారులు తాళాలు వేశారు. ఈ సందర్భంగా పెంటిరాజు మాట్లాడుతూ.. గతంలో జీవీఎంసీ నిధులతో ఇక్కడ కాంపౌండ్ వాల్, డ్రైన్ల నిర్మాణం జరిగిందని, ఇది పూర్తిగా ప్రజా అవసరాల కోసం ఉద్దేశించిన స్థలమని స్పష్టం చేశారు. నీలాపు వీధి, మొల్లివానిపాలెం వంటి స్థానిక గ్రామాల ప్రజల అవసరాలకు, ఆలయాల అభివృద్ధికి, అలాగే మొక్కలు నాటి హరితాభివృద్ధి చేయడానికి ఈ స్థలాన్ని ఉపయోగించాలని అధికారులను కోరారు. మరోసారి ఆక్రమణలకు పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని అధికారులు హెచ్చరించినట్లు ఆయన తెలిపారు.

### హైపర్సోనిక్ క్షిపణి అభివృద్ధిలో డీఆర్‌డీఓకు కీలక విజయం

**విశాఖపట్నం, మే 9, ప్రభాతవార్త:**



డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ కు చెందిన డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ల్యాబొరేటరీ హైపర్సోనిక్ క్షిపణి అభివృద్ధిలో కీలక ముందడుగు వేసింది. యాక్టివ్ కూల్డ్ ఫుల్ స్కేల్ స్క్రామ్‌జెట్ కంబస్టర్‌ను విజయవంతంగా దీర్ఘకాల పరీక్ష నిర్వహించింది. హైదరాబాద్‌లోని అత్యాధునిక స్క్రామ్‌జెట్ కనెక్ట్ పైప్ టెస్ట్ ఫెసిలిటీలో నిర్వహించిన ఈ పరీక్షలో 1,200 సెకన్లకు పైగా రన్‌టైమ్ సాధించినట్లు అధికారులు తెలిపారు. ఈ ఏడాది జనవరిలో నిర్వహించిన 700 సెకన్ల పరీక్ష విజయానికి కొనసాగింపుగా ఈ పరీక్ష చేపట్టారు. దేశీయంగా అభివృద్ధి చేసిన లిక్విడ్ హైడ్రోకార్బన్ ఇంధనం, అధునాతన తయారీ సాంకేతికతలతో ఈ స్క్రామ్‌జెట్ ఇంజిన్ రూపొందించినట్లు వెల్లడించారు. ఈ విజయంతో హైపర్సోనిక్ క్రూయిజ్ క్షిపణి అభివృద్ధి కార్యక్రమానికి బలమైన పునాది పడిందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అభినందించారు.


**కెనరా బ్యాంక్ Canara Bank**

ప్రాంతీయ కార్యాలయం : విశాఖపట్నం-1
#9-29-15/7, పద్మావతి టవర్స్, బాలాజీ నగర్, సిరిపురం, విశాఖపట్నం-530003.

**ఋణగ్రహీత/హామీదారు/తనఖాదారులకు డిమాండ్ నోటీసు**

టు:

1. రిషి గాయత్రీ స్పైసెస్ అండ్ ఆగ్రో ప్రొడక్ట్స్, డి.నెం., ఫ్లాట్ నెం HIG 13, హౌసింగ్ బోర్డ్ సి, ఆర్‌టిసి కాంప్లెక్స్ దగ్గర, మధురవాడ, వార్డ్ 05, విశాఖపట్నం, ఆంధ్రప్రదేశ్.
2. శ్రీ అప్పలనాయుడు గొలివి, తండ్రి: యర్రన్నాయుడు, C 255, మెయిన్ వీధి, రేగులపాడు పోస్ట్, రేగులపాడు, శ్రీకాకుళం.
3. శ్రీమతి యాళ్ల భాగ్యశాంతి, భర్త: జి. సత్యం నాయుడు, 1 2 కోటబొమ్మాళి, రేగులపాడు.

డియర్ సర్/మేడమ్,

విషయం: సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 లోని సెక్షన్ 13(2) ప్రకారం డిమాండ్ నోటీసు.

మా కెనరా బ్యాంక్, విశాఖపట్నం సిరిపురం బ్రాంచ్ నుండి రిషి గాయత్రీ స్పైసెస్ & ఆగ్రో ప్రొడక్ట్స్, శ్రీ అప్పలనాయుడు గొలివి మరియు శ్రీమతి యాళ్ల భాగ్యశాంతి గారు పొందిన లోన్/ఋణసౌకర్యాల వివరములు:

| లోన్ స్వభావం & లోన్ అకౌంట్ నెం. | లోన్ మొత్తం మరియు లోన్ తేది | ప్రస్తుత తేదీ నాటికి బకాయి మొత్తం వడ్డీతో | వడ్డీ రేటు (అదనపు ఛార్జీలతో కలిపి) |
|---|---|---|---|
| MSME-OD/OCC అకౌంట్ నెం. 3655261000059 | 21.04.2021 తేదీన రూ. 26,00,000/- | రూ. 25,18,920.24 | 10.25% |

మాకు తనఖా పెట్టిన వ్యక్తి / వ్యక్తులచే వ్రాసి ఇవ్వబడిన సంబంధిత డాక్యుమెంట్ల ద్వారా ఈ నోటీసును షెడ్యూలులో వివరించిన ఆస్తుల తనఖా ద్వారా పైన తెలిపిన ఋణాలు / ఋణసౌకర్యాలకు తగు విధంగా హామీ కల్పించబడినది. పేర్కొన్న నియమ నిబంధనల ప్రకారం తమ ఋణాలను చెల్లించడంలో పైన తెలిపిన మీరు విఫలమైనందున బ్యాంక్ సదరు ఋణాన్ని 31-03-2026 తేదీన నిరర్థక ఆస్తి (ఎన్.పి.ఎ) గా వర్గీకరించింది. అందువలన ఈ నోటీసు తేది నుండి 60 రోజులలోగా రూ.25,18,920.24 (అక్షరాల ఇరవై ఐదు లక్షల పద్దెనిమిది వేల తొమ్మిది వందల ఇరవై రూపాయలు మరియు ఇరవై నాలుగు పైసలు మాత్రమే) + తదుపరి వడ్డీ, ఖర్చులు కలిపి మొత్తమును చెల్లించవలసిందిగా కోరుతూ సంబంధిత చట్టంలోని సెక్షన్ 13(2) క్రింద మీకు ఇందుమూలముగా ఈ నోటీసు జారీ చేయుచున్నాము. చెల్లించడంలో విఫలమైతే సదరు చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద అన్ని లేదా ఏవేని హక్కును మేము వినియోగించుకుంటాము. ఇంతే కాకుండా మా ముందస్తు సమ్మతి లేకుండా ఏ విధంగానూ షెడ్యూలులో తెలిపిన ఏ సెక్యూర్డ్ ఆస్తులతో ఏ రకంగానూ వ్యవహరించకుండా మీరు నిరోధించబడుచున్నారు. సదరు చట్టం మరియు/ లేదా అమలులో ఉన్న చట్టం క్రింద లభించే ఏవేని ఇతర హక్కుకు ఎటువంటి ప్రతికూల అభిప్రాయం లేకుండా ఈ నోటీసు ఇవ్వబడింది.

SARFAESI చట్టం నందలి సెక్షన్ 13, సబ్ సెక్షన్ (8) ప్రకారము మీరు తనఖా ఆస్తులను విడిపించుకోవటానికి ఉన్న కాలవ్యవధిని వినియోగించుకోగలరని సూచించడమైనది. మా బ్రాంచ్ రికార్డులో అందుబాటులో ఉన్న మీ చిరునామాకు తిరుగు రశీదుతో కూడిన రిజిష్టర్డ్ పోస్టు ద్వారా డిమాండ్ నోటీసు పంపించడం జరిగింది.

**తనఖా / తాకట్టు వుంచిన ఆస్తి యొక్క నిర్దిష్ట వివరాలు దిగువ పేర్కొనబడినవి**

**అసెట్ ఐడి: 200055345042:** శ్రీకాకుళం, శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ పరిధి, కొన్నవీధి, రాధా కృష్ణ నగర్ కాలనీ, బలగ వార్డు, ఆర్.ఎస్.నెం. 9/1 మరియు టి.ఎస్.నెం. 1944/1, ప్లాట్ నెం. 15 నందు విస్తీర్ణం 300 చ॥గ॥ల స్థలం మరియు అందులో నిర్మించిన గ్రౌండ్ ఫ్లోర్, మొదటి అంతస్తు మరియు రెండువ అంతస్తులతో ఆర్.సి.సి. స్లాబ్ ఇల్లు బిల్డింగ్. గ్రౌండ్ ఫ్లోర్ 744 చ॥అ॥, మొదటి అంతస్తు 744 చ॥అ॥ మరియు రెండువ అంతస్తు 744 చ॥అ॥, ఆస్తి ట్యాక్స్ అసెస్‌మెంట్ నెం. 1085018228, వాటర్ అసెస్‌మెంట్ నెం. 1085012210 మరియు ఎలక్ట్రిసిటీ సర్వీస్ కనెక్షన్ నెం. 131102A202041386 & నెం. 131102A202043882. **హద్దులు: తూర్పు:** ఇటుక శైలజ ప్లాట్ నెం. 21 రస్తా, **దక్షిణం:** జి రామ్‌తిలక్ యొక్క ప్లాట్ నెం. 16, **పడమర:** 33 అ॥ల లేఅవుట్ రోడ్, **ఉత్తరం:** మున్సిపల్ రోడ్. **టైటిల్ హోల్డర్ పేరు : శ్రీ గొలివి అప్పలనాయుడు.**

తేది: 05.05.2026, ప్రదేశం: విశాఖపట్నం — సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

## శ్రీ ప్రకాష్‌లో ఘనంగా ముగిసిన సమ్మర్ క్యాంపు






పాయకరావుపేట మే 9, ప్రభాతవార్త

శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల్లో గత 15 రోజులుగా నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపు శనివారం ఘనంగా ముగిసింది. విద్యార్థుల్లో దాగి ఉన్న నిగూఢ నైపుణ్యాలను, ప్రతిభా పాటవాలను వెలికితీసేందుకు ఈ సమ్మర్ క్యాంపు నిర్వహిస్తున్నామని శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సిహెచ్ విజయ్ ప్రకాష్ తెలిపారు. ఈ సమ్మర్ క్యాంపులో విద్యార్థులకు యోగా, స్పోకెన్ ఇంగ్లీష్, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, సంగీతం, స్కేటింగ్, బాస్కెట్ బాల్, హ్యాండ్ బాల్, ఖోఖో, వాలీ బాల్, క్రికెట్, కబడ్డీ, డాన్స్, తదితర అంశాలపై నిష్ణాతులైన కోచ్లతో మెలుకువలను నేర్పించారు. ఈ సందర్భంగా జరిగిన ముగింపు సభలో విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి విజయ్ ప్రకాష్ మాట్లాడుతూ గత 25 సంవత్సరాల నుండి నిర్వహిస్తున్న ఈ సమ్మర్ క్యాంపుల్లో విద్యార్థులు వివిధ అంశాలనందు మెళుకువలు నేర్చుకోవడానికి ఆసక్తి కనబరచడం ఆనందదాయకమని, విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలనే విషయానికి శ్రీ ప్రకాష్ విద్యా సంస్థలు ఎప్పుడూ ప్రాధాన్యత ఇస్తాయని, నిత్యం విద్యార్థులు ఆడే ఆటలు వారి శారీరక దారుఢ్యంపై ప్రభావం చూపుతాయని తెలిపారు. విద్యార్థులు ఈ సమ్మర్ క్యాంపులో క్రీడలు, యోగా, స్పోకెన్ ఇంగ్లీషులో నేర్చుకున్న మెలుకువలు నిరంతరం కొనసాగించాలని తెలిపారు. రోజూ ఒక గంట సమయాన్ని వ్యాయామం, క్రీడల కోసం కేటాయించాలని తెలిపారు. ఆటల ద్వారా గెలుపు ఓటములను సమానంగా స్వీకరించే స్థైర్యం వారికి అలవడుతుందని చెప్పారు. క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటలు తమ విద్యా సంస్థల్లో విద్యలో ఒక భాగమని, విద్యతో పాటుగా ఆటలకు కూడా తమ విద్యా సంస్థలు ఇస్తున్న ప్రాధాన్యత ద్వారానే తమ విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో అగ్రగాములుగా నిలుస్తున్నారని తెలిపారు. అనంతరం సమ్మర్ క్యాంపులో పాల్గొన్న విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందచేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అహూతులను ఎంతగానో అలరించాయి. ఈ కార్యక్రమంలో సీనియర్ ప్రిన్సిపల్ ఎమ్ వి వి ఎస్ మూర్తి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, వివిధ ఆటలకు చెందిన కోచ్ లు పాల్గొన్నారు.

## పెళ్లి బృందం వాహనం ప్రమాదం..
### తీవ్ర గాయాలు పాలైన పలువురు



ఎలమంచిలి, మే 09, ప్రభాతవార్త

జాతీయ రహదారి మర్రిబంద జంక్షన్ వద్ద శనివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలైనట్లు రూరల్ ఎస్సై ఉపేంద్ర తెలిపారు. రూరల్ ఎస్సై ఉపేంద్ర తెలిపిన వివరాలు ప్రకారం విశాఖపట్నం నగరంలోని అక్కయ్యపాలెం చెందిన పెళ్లి బృందం వధూవరులతో సహా శుక్రవారం వివాహం జరిగిన అనంతరం అన్నవరం ఆలయానికి వెళ్లడానికి శనివారం ఉదయం బయలుదేరి మర్రిబంద జంక్షన్ వచ్చేసరికి డ్రైవర్ నిద్ర మత్తులో రోడ్డు మధ్యలో ఉండే మిడియన్ డి కొండంతో ఆ తీవ్రతకు అక్కడున్న ఒక పౌర విద్యుత్ స్తంభం కూలిపోయింది ఆ స్తంభానికి అమర్చిన పౌర పరికరాలు పెట్టే జంక్షన్ దాటుతున్న ఒక మహిళ పాదచారికి తగిలి ఆమె తలకు తీవ్ర గాయాలు అయ్యాయని ఈ ప్రమాదంలో డ్రైవర్ తల్లికి కాలు విరిగి మిగిలిన ప్రయాణికులకు స్వల్ప గాయాలు అయ్యాయని గాయపడిన వారిని వెంటనే నేషనల్ హైవే అంబులెన్స్ ద్వారా అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్సై తెలిపారు.

## మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి : కసింకోట సీఐ అల్లు స్వామి నాయుడు



కసింకోట, మే 9, ప్రభాతవార్త

కసింకోట మండలం, కసింకోట గ్రామంలో "100 డేస్ యాంటీ డ్రగ్ 0.2" కార్యక్రమం కింద మాదకద్ర వేల దుష్పరిమానాలపై విశాఖపట్నం రేంజ్ ఐజీ గోపీనాథ్ జెట్టి, అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు, కసింకోట సీఐ అల్లుస్వామి నాయుడు పర్యవేక్షణలో, కసింకోట ఎస్ఐ కె.లక్ష్మణరావు ఈ అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, మాదకద్రవ్యాల వినియోగం వల్ల యువత తప్పుదోవ పట్టే ప్రమాదం ఉండటమే కాకుండా వారి మానసిక స్థితి దెబ్బతినే అవకాశాలు అధికంగా ఉన్నాయని తెలిపారు. నేటి యువతలో చాలామంది మత్తు పదార్థాలకు బానిసై తమ జీవితాలను నాశనం చేసుకోవడమే కాకుండా కుటుంబ సభ్యులు మరియు సమాజంపై కూడా ప్రతికూల ప్రభావం చూపుతున్నారని వివరించారు. మత్తు పదార్థాలకు అలవాటు పడిన వ్యక్తి తన భవిష్యత్తును అంధకారంలోకి నెట్టుకుంటాడని హెచ్చరించారు. అదేవిధంగా మహిళల భద్రత, మహిళలపై జరుగుతున్న నేరాలు వాటి నివారణకు పోలీసులు తీసుకుంటున్న చర్యల గురించి ప్రజలకు వివరించారు. ప్రతి ఒక్కరూ మహిళలను గౌరవించాలని, మహిళల రక్షణకు సమాజం బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు పోలీస్ సేవలను వినియోగించుకోవాలని, పోలీస్ అత్యవసర సహాయం కోసం 112 నంబర్‌కు కాల్ చేయవచ్చని తెలిపారు. అలాగే సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలకు గురైన వెంటనే 1930 హెల్ప్‌లైన్ నంబర్‌కు సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు. అదనంగా "శక్తి యాప్" వంటి అప్లికేషన్లను సద్వినియోగం చేసుకుని మహిళలు మరియు ప్రజలు తక్షణ సహాయం పొందవచ్చని అధికారులు తెలిపారు. ఈ అవగాహన కార్యక్రమంలో కసింకోట గ్రామానికి చెందిన సుమారు 320 మంది ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ఘనంగా శ్రీ వైభవ వెంకటేశ్వర స్వామి వార్షికోత్సవం



ఎస్.రాయవరం,మే 9, ప్రభాతవార్త

మండల కేంద్రమైన ఎస్ రాయవరం గ్రామంలో వేంచేసి యున్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వైభవ వెంకటేశ్వర స్వామి 11వ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. స్వామివారి కళ్యాణంలో భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి పచ్చ ముహూర్తం ఊరేగించారు. మధ్యాహ్నం అన్న సమానంగా కార్యక్రమంలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదములు స్వీకరించారు. పండితులు చక్రవర్తి శర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, సత్తిబాబు, భద్ర రావు, తదితరులు పాల్గొన్నారు.

## అనకాపల్లి వాసికి డాక్టరేట్ ప్రధానం



అనకాపల్లి,మే9 ప్రభాతవార్త

అనకాపల్లి పట్టణానికి చెందిన బొడ్డేడ నరేంద్రకు డాక్టరేట్ పట్టాను ఆచార్య నాగార్జున యూనివర్సిటీ రీసెర్చ్ సెల్ కోఆర్డినేటర్ డా. పి. సుధాకర్ బుధవారం ప్రదానం చేశారు. నగరానికి చెందిన బొడ్డేడ నరేంద్ర ఆచార్య నాగార్జున యూని వర్సిటీలోని కామర్స్ అండ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో మానవ వనరుల అభివృద్ధి విధానాలలో ఆధునిక సాధనాలు సాంకేతికలు ఉద్యోగుల సంతృప్తి స్థాయి అంశంపై చేసిన పరిశోధనకు గాను డాక్టరేట్ పట్టాను అందజేశారు. ఈ పరిశోధనను డాక్టర్ ఎన్. ప్రసన్న కుమార్ ఆధ్వర్యంలో చేసినట్టు తెలిపారు.

## బయ్యవరంలో ట్రాన్స్‌ఫార్మర్ దగ్ధం



కసింకోట, మే 9 ,ప్రభాతవార్త

మండలంలో బయ్యవరం సెంటర్ వద్ద శనివారం ట్రాన్ఫార్మర్ దగ్ధమైంది. స్తంభానికి పెద్ద ఎత్తున మంటలు చెలరేగడంతో అక్కడ వారంతా ఆందోళనకు గురయ్యారు. మంటలు చెలరేగిన స్తంభానికి సీసీ కెమెరాలు కూడా ఉన్నాయి. మంటలు చెలరేగుటకు గల కారణాలు తెలియవలసి ఉంది.

## నేరెళ్లవలస గ్రామాన్ని గంటా దత్తత తీసుకొని అభివృద్ధి చేయాలి



పద్మనాభం,మే 9,ప్రభాతవార్త

అభివృద్ధిలో వెనుకబడి ఉన్న మండలంలో నేరెళ్లవలస గ్రామాన్ని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు దత్తత తీసుకొని అన్ని విధాల అభివృద్ధి చేయాలని గ్రామ నాయకులు రేవళ్ల సూర్యనారాయణ, క్రిష్ణ, చిన్నాపురం మాజీ సర్పంచ్ ఈగల శ్రీరామమూర్తి కోరారు.మీ భూమి మీ హక్కు కార్యక్రమంలో భాగంగా శనివారం తహశీల్దార్ చంద్రశేఖర్ ఏర్పాటు చేసిన సమావేశంలో రాజు ముద్రతో కూడిన పట్టాదారు పాసపుస్తకాలను టీడీపీ నాయకులు రైతులకు అందజేశారు.అనంతరం నాయకులు మాట్లాడుతూ టీడీపీ అవిర్భావం నుండి నేటి వరకు ఎన్నికలలో అన్ని గ్రామాల కంటే ఎక్కువగా మెజారిటీ ఇస్తుందని, కాని తమ గ్రామ అభివృద్ధిని ఎవరూ పట్టించుకోలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు.గ్రామంలో మంచినీటి, డ్రెయినేజీ, సి సి రోడ్ల సమస్యలను పరిష్కరించాలని వారు కోరారు. తమ గ్రామ నాయకులకు ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు.అలాగే సమగ్రంగా సర్వేచేసి భూ సమస్యలను పరిష్కరించేటట్లు ఎమ్మెల్యే చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశానికి వస్తారని చెప్పి చివరి క్షణంలో ఎమ్మెల్యే గంటా రాకపోవడంతో నాయకులు, ప్రజలు నిరాశపడ్డారు.చేసిన ఏర్పాట్లు నిరుపయోగమయ్యాయని నాయకులు బాధపడ్డారు. అనంతరం చంద్రశేఖరను నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు లీలావతి, నందిని నాయకులు దాము, రామరాజు, గంగరాజు, బుచ్చిపంతులు, రొబ్బు సూర్యనారాయణ, పాల్గొన్నారు.

## సోమవారం మాకవరపాలెంలో విద్యుత్ అంతరాయం



మాకవరపాలెం మే 9 ప్రభాతవార్త

మాకవరపాలెం కన్నూరుపాలెం విద్యుత్తు సబ్-స్టేషన్ పరిధిలో సోమవారం అంతరాయం కలగవచ్చునని డి.ఇ. రామకృష్ణ తెలిపారు. ఈమేరకు శనివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మే 11వతేదీ సోమవారం 132 కెవి కసింకోట సబ్ స్టేషన్ లో అత్యవసర మరమ్మత్తులు చేపట్టడం జరుగుతుందన్నారు. దీని కారణంగా 32 కెవి మాకవరపాలెం విద్యుత్ సబ్ స్టేషన్, 32 కెవి కన్నూరిపాలెం సబ్ స్టేషన్ పరిధిలోని విద్యుత్తు అంతరాయం కలిగే అవకాశం ఉందన్నారు.కన్నూరిపాలెం మాకవరపాలెం సభ స్టేషన్ పరిధిలోని వినియోగదారులు సహకరించాల్సిందిగా రామకృష్ణ కోరారు. కార్యక్రమంలో మాకవరపాలెం సబ్ స్టేషన్ విద్యుత్ ఇంజనీర్ బాలకృష్ణ పాల్గొన్నారు.

## విధి నిర్వహణలో ఆర్మీ ఉద్యోగి మృతి



అనకాపల్లి మే 9 ప్రభాతవార్త

అనకాపల్లి మండలం, వెంకుపాలెం గ్రామానికి చెందిన, ఇండియన్ ఆర్మీలో నాయక్‌గా వ్యవహరిస్తున్న రాపేటి పూర్ణచంద్ర శేఖర్ డెహ్రాడూన్ లో ఈనెల 8వ తేదీ రాత్రి ఉద్యోగం చేస్తుండగా బలమైన ఇనుప కడ్డీ మీద పడటంతో ప్రమాదవశాత్తు అక్కడికక్కడే మరణించారు. ఈ విషయం కుటుంబ సభ్యులకి , గ్రామస్తులకు తెలియగా, ఈ విషయాన్ని మాజీ మంత్రి అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణకి తెలియజేయగా, వెంటనే స్పందించి డెహ్రాడూన్ లో అధికారులతో సంఘటన విషయాలు అడిగి తెలుసుకున్నారు. రామకృష్ణ ఆదేశాల మేరకు అనకాపల్లి జనసేన పార్టీ ఇంచార్జ్ భీమరశెట్టి రామ్‌కి వెనువెంటనే వెంకుపాలెం గ్రామానికి చేరుకొని కుటుంబ సభ్యులను పరామర్శించి, ధైర్యం చెప్పి, స్థానిక, డెహ్రాడూన్ సంబంధిత అధికారులతో మాట్లాడి పూర్ణచంద్ర శేఖర్ పార్థవదేహం వెంటనే గ్రామానికి రప్పించే విధంగా చర్యలు చేపట్టారు.

## యువతిపై వేధింపులు.. ప్రశ్నించిన తల్లిపై దాడి

యలమంచిలి, మే 9 ప్రభాతవార్త

అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలం జడ్-చింతువ పంచాయతీ పరిధిలోని లోవపాలెం గ్రామంలో ఓ మహిళపై జరిగిన దాడి ఉద్రిక్తతకు దారితీసింది. గ్రామానికి చెందిన ఎరిపిల్లి సత్యవతి (50) తీవ్రంగా గాయపడగా, ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు.. సత్యవతి చిన్న కుమార్తె సూరాడ భారతి ఈ నెల 8న సాయంత్రం ముత్యాలమ్మపాలెం నుంచి తల్లిని చూసేందుకు లోవపాలెంకు వచ్చింది. ఇంటికి వెళ్తుండగా అదే గ్రామానికి చెందిన గరికిన నూకరాజు ఆమెను అడ్డగించి అసభ్యంగా మాట్లాడటంతో పాటు చేతి పట్టుకుని ఇంట్లోకి లాగేందుకు ప్రయత్నించినట్లు ఆరోపణలు ఉన్నాయి. భయంతో భారతి ఈ విషయాన్ని తల్లి సత్యవతికి చెప్పగా, ఆమె నూకరాజును నిలదీసేందుకు వెళ్లింది. దీంతో ఆగ్రహించిన నూకరాజు దుర్భాషలాడుతూ కర్రతో సత్యవతి తలపై బలంగా కొట్టినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ ఘటనలో ఆమె తీవ్రంగా గాయపడి రక్తస్రావంతో కుప్పకూలిపోయింది. స్థానికులు వెంటనే ఆమెను రాంబిల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, పరిస్థితి విషమంగా ఉండటంతో అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రికి రిఫర్ చేశారు. నిందితుడు తమ కుటుంబాన్ని బెదిరిస్తున్నాడని బాధితులు ఆరోపించారు. ఘటనపై కేసు నమోదు చేసిన రాంబిల్లి పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## గోవిందపాలెం జంక్షన్‌లో విషాదం
### లారీ ఢీకొని జార్ఖండ్ కార్మికుడు మృతి



యలమంచిలి, మే 9 ప్రభాతవార్త

అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలం గోవిందపాలెం జంక్షన్ వద్ద శుక్రవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వలస కార్మికుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జార్ఖండ్ రాష్ట్రం బొకారో జిల్లా సింగర్బౌరా గ్రామానికి చెందిన మహేష్ సింగ్ (31) గోవిందపాలెంలోని చీూాదీలో దినసరి కూలీగా పనిచేస్తున్నాడు. శుక్రవారం రాత్రి సుమారు 11.30 గంటల సమయంలో గోవిందపాలెం జంక్షన్ సమీపంలో రోడ్డు పక్కన నడుచుకుంటూ వెళ్తుండగా, వేగంగా వచ్చిన ఏపీ 39 డబ్ల్యూడీ 32537 నంబరు గల లారీ అతడిని బలంగా ఢీకొట్టింది. ఢీకొన్న తీవ్రతకు మహేష్ సింగ్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనతో గోవిందపాలెం జంక్షన్ ప్రాంతంలో విషాద వాతావరణం నెలకొంది.

## కూటమి ప్రభుత్వంలోనే విద్యుత్ చార్జీలు తగ్గింపు
### మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీష్




అనకాపల్లి మే 9 ప్రభాతవార్త

కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో విద్యుత్ చార్జీలు భవిష్యత్తులో పెంచబోమని, ఇచ్చిన హామీ ప్రకారం అధికారంలోకి వచ్చినప్పటి నుండి ట్రూ ఆఫ్ చార్జీలు పెంచకుండా, జగన్ రెడ్డి వైసీపీ పాలనలో తొమ్మిది సార్లు పెంచిన విద్యుత్ చార్జీలు 72 వేల కోట్ల రూపాయలు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ట్రూ డౌన్ పేరుతో విద్యుత్ చార్జీలను తగ్గించడం వల్ల వినియోగదారుల్లో ఆనందం వ్యక్తపరుస్తున్నారని మాజీ ఎమ్మెల్సీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బుద్ధ నాగ జగదీశ్వరరావు అన్నారు. శనివారం తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తీసుకున్న చర్యలను కొనియాడారు. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే విద్యుత్ చార్జీలను ప్రతినెల ప్రభుత్వం సబ్సిడీతో పాటు జగన్ రెడ్డి పెంచిన చార్జీలను తగ్గిస్తూ రావడం వల్ల ఈరోజున యూనిట్ కి 13 పైసలు తగ్గించడం వల్ల వినియోగదారులకు ప్రతినెలా వచ్చే 800 బిల్లు ఇప్పుడు 400 వస్తుందని మా కార్యకర్తలు ఇంటింటి సర్వే చేయడంతో విద్యుత్ వినియోగదారులు బహిరంగంగా మా విద్యుత్ బిల్లు గతంలో కంటే చాలా తక్కువ వస్తుందని ఆనందాన్ని వ్యక్తపరుస్తున్నారని నాగ జగదీష్ అన్నారు. విద్యుత్ రంగాన్ని గాడిని పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్నా చర్యలు సత్ఫలితాలు ఇస్తున్నాయని, గత వైసీపీ ప్రభుత్వంలో అడ్డగోలుగా చేసిన విద్యుత్ కొనుగోలులో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కట్టడి చేసిందని, ఫలితంగా వైసిపి హయాంలో సగటున యూనిట్ ధర 5.45 పైసాల వరకు ఉండగా దాన్ని ?4.90 కి తగ్గించ గలిగారని, ఒక యూనిట్ పై 55 పైసలు వరకు మిగలడంతో ఏడాదిలో సుమారు ?4,398 కోట్లు ఆదా చేయగలిగారని అన్నారు. దీని మూలంగా ప్రభుత్వం విద్యుత్ వినియోగదారులకు ట్రూ డౌన్ తో యూనిట్ కి 13 పైసలు చొప్పున తగ్గించడంతో విద్యుత్తు వినియోగించే వినియోగదారులకు ఉపశమనం కలిగిందని నాగ జగదీష్ అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ భోగలింగేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ కాండ్రేగుల సత్యనారాయణ రాష్ట్ర విశ్రాంతి ఉద్యోగుల రాష్ట్ర కార్యదర్శి బుద్ధ కాశీ విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## రెండు లారీలు సీజ్



నక్కపల్లి రూరల్, ప్రభాతవార్త

అధికలోడుతో మండలంలోని వేంపాడు టోల్ ప్లాజా ఫీజులను తప్పించుకునేందుకు అక్రమ రహదారుల్లో పయనిస్తున్న రెండు లారీలను నక్కపల్లి పోలీసులు పట్టుకున్నారు. శనివారం ఉదయం ఈ రెండు లారీలు వేంపాడు నుంచి స్టీల్ ప్లాంట్ నిర్మాణం జరుగుతున్న రహదారిలో వెళుతుండగా పట్టుకోవడం జరిగిందని సీఐ మురళి తెలిపారు. పట్టుకున్న లారీలను సీజ్ చేసి తగుచర్య నిమిత్తం ఆర్టీవో కి పంపించడం జరిగిందని పరిశీలించిన ఆర్టీవో రెండు వాహనాలకు 1,40,000 అపరాధ రుసుము విధించినట్లు తెలిపారు. ఈ రహదారుల్లో అధిక లోడు కలిగి ఎటువంటి వాహనాలు తిరిగిన వారి తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని సీఐ మురళి హెచ్చరించారు.

## శ్రీ కనకమహాలక్ష్మి దేవస్థానం ధర్మ కర్తల మండలి సభ్యుడిగా సాలపు రామారావు ప్రమాణ స్వీకారం
### -భారీ ర్యాలీగా తరలివచ్చిన కూటమి శ్రేణులు



గాజువాక, మే 09,ప్రభాతవార్త

శ్రీ శ్రీ శ్రీ కనకమహాలక్ష్మి దేవస్థానం ధర్మ కర్తల మండలి సభ్యుడిగా 72వ వార్డుకు చెందిన సీనియర్ టీడీపీ నాయకులు సాలపు రామారావు శనివారం అత్యంత వైభవంగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆయన తన నివాసం నుండి కూటమి నాయకులు, భారీ సంఖ్యలో అభిమానులతో కలిసి భారీ ర్యాలీగా బయలుదేరి ఆలయానికి చేరుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన గాజువాక టీడీపీ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాసరావు, వార్డు ఇన్చార్జ్ అక్కిన లక్ష్మణరావు మాట్లాడుతూ.. తెలుగుదేశం పార్టీ కోసం నిరంతరం కష్టపడే కార్యకర్తలకు, నాయకులకు పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని అన్నారు. సీనియర్ నాయకుడిగా సాలపు రామారావు అందించిన సేవలకు గుర్తింపుగానే అమ్మవారి పాలకమండలిలో చోటు దక్కిందని, ఆయన భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని వారు ఆకాంక్షించారు. మంగళవాయిద్యాలు, బాణాసంచా పేలుళ్ల మధ్య సాగిన ఈ ర్యాలీలో టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల నాయకులు, మహిళలు మరియు అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అనంతరం ఆలయ అధికారులు రామారావుతో ప్రమాణ స్వీకారం చేయించి, అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేశారు.

## యువతకు మాదకద్రవ్యాలపై అవగాహన కల్పిస్తున్న రూరల్ ఎస్సై ఉపేంద్ర



ఎలమంచిలి, మే 09, ప్రభాతవార్త

మండలంలోని కొక్కిరాపల్లి గ్రామంలో రూరల్ ఎస్ఐ ఉపేంద్ర ఆధ్వర్యంలో మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వంద రోజుల కార్యక్రమంలో భాగంగా గ్రామస్తులు, యువతకు పలు విషయాలపై ఎస్సై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రూరల్ ఎస్సై ఉపేంద్ర మాట్లాడుతూ యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, లేదంటే జీవితాలు నాశనమవుతాయని హెచ్చరించారు. ఈ రోజుల్లో చాలామంది ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగుల వల్ల డబ్బులు పోగొట్టుకుని ఇబ్బందులు పడుతున్నారని, అటువంటి జూదాలకు దూరంగా ఉండాలని సూచించారు. రోడ్డుపై వెళ్లేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని, ట్రాఫిక్ నియమాలు పాటించడం వల్ల ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు. గ్రామంలో అనుమానిత వ్యక్తులు కనిపించినా వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో మార్పులను గమనించాలి

నక్కపల్లి,ప్రభాతవార్త

మండలంలోని ఆదివారం 400 కె.వి కలపాక విద్యుత్ సబ్స్టేషన్ నందు మరమ్మత్తుల కొరకు విద్యుత్ సరఫరాకు ఆటంకం కలుగుచున్న నేపథ్యంలో మండలంలోని ఉప్మాక, వేంపాడు విద్యుత్ సబ్స్టేషన్‌లకు విద్యుత్ సరఫరాను 132/33 కెవి పాయకరావుపేట విద్యుత్ సబ్ స్టేషన్ నుంచి సరఫరా చేయడం జరుగుతుందని ఈఈ చెల్లిబాబు ఆదేశాల మేరకు ఏ.ఈ సత్యనారాయణ ఒక ప్రకటనలో శనివారం తెలిపారు. వ్యవసాయ రంగానికి ఉదయం 4 గంటల నుండి 8 గంటల వరకు, సాయంత్రం 2 గంటల నుండి రాత్రి 7 గంటల వరకు సరఫరా చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ మార్పులు పట్ల అప్రమత్తంగా వినియోగదారులు సహకరించవలసిందిగా కోరారు.

## విద్యార్థి సత్య ప్రశాంత్‌కు ఘన సత్కారం



నక్కపల్లి/అడ్డు రోడ్డు, ప్రభాతవార్త

మండలంలోని అత్యధిక మార్కులు సాధించి మండలానికి ప్రథమ విద్యార్థిగా నిలిచిన సత్య ప్రశాంత్‌లను శనివారం పాయకరావుపేట నియోజకవర్గం టిడిపి కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్ చేతుల మీదుగా ఘనంగా సత్కరించారు. నక్కపల్లి మండలంలోని గొడిచెర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థి ఎస్. సత్య ప్రశాంత్ పబ్లిక్ పరీక్షల్లో 600 మార్కులకు గాను 587 మార్కులు సాధించి నక్కపల్లి మండల టాపర్‌గా నిలిచి పాఠశాలకు, గ్రామానికి గర్వకారణంగా నిలిచిన విషయం తెలిసినదే.!. ఆ విద్యార్థితోపాటు పాఠశాలకు చెందిన కె.సిద్దు అభిలాష్ (574 మార్కులు), జి. దేవిశ్రీ (574 మార్కులు) పాఠశాల ద్వితీయ ర్యాంకును సాధించగా, విజయ స్వాతి (568 మార్కులు), పల్లవి (568 మార్కులు) తృతీయ ర్యాంకును సాధించి ప్రతిభ గ్రామీణ ప్రాంతపు విద్యార్థులు సత్తా చాటడం పట్ల గ్రామస్తులు వెంకటేష్ సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులను నియోజక వర్గ టీడీపీ కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్, మండల పార్టీ అధ్యక్షులు గింజాల లక్ష్మణరావు,టీడీపీ మహిళా నియోజకవర్గ కన్వీనర్ మునిషా బేగం,మాజీ మండల పరిషత్ ఉపాధ్యక్షులు వైబోయిన రమణ, ఎస్ఎంసీ చైర్‌పర్సన్ రేఖా రమణ, గ్రామ నాయకులు నల్లల దొరబాబులు అభినందించారు. ఈ సందర్భంగా కొప్పిశెట్టి వెంకటేష్ మాట్లాడుతూ "గ్రామీణ ప్రాంత విద్యార్థులు పట్టుదలతో చదివితే అత్యున్నత విజయాలు సాధించ గలరని ఈ విద్యార్థులు నిరూపించారని సంతోషం వ్యక్తం చేశారు. విద్యే జీవితాన్ని మలిచే మహత్తర శక్తి. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆశయాలను నెరవేర్చేలా విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని క్రమ శిక్షణతో ముందుకు సాగినప్పుడు ఇటువంటి మంచి ఫలితాలు సాధించగలమనడానికి సంతోష్ ఒక ఉదా హరణని అన్నారు. భవిష్యత్తులో డాక్టర్లు, ఇంజినీర్లు, అధికారులు వంటి ఉన్నత స్థాయికి చేరుకుని సమాజాని కి సేవ చేయాలని ఆకాంక్షించారు. గత మూడు దఫాలుగా గొడిచర్ల ఉన్నత పాఠశాలకు మంచి గుర్తింపు వస్తుందని ఇదే బాటలో కొనసాగాలని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత ఆధ్వర్యంలో భవిష్యత్తులో ఈ పాఠశాల జూనియర్ కళాశాలగా మారబోతుందని వెంకటేష్ అన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్‌బీవీ సత్యకుమార్, ఉపాధ్యాయ సిబ్బంది వారి భవిష్యత్తు విజయవంతం కావాలని ఆకాంక్షించారు.

## మధ్యతరగతి ప్రజల యూరప్ కలను నిజం చేస్తున్న ఆర్‌వి టూర్స్ అండ్ ట్రావెల్స్
### రూ.3 లక్షలకే 13 రోజుల యూరప్ టూర్.. కాశీ, అయోధ్య, అమర్‌నాథ్, కైలాస యాత్రలకు ప్రత్యేక ప్యాకేజీలు



విశాఖపట్నం, ప్రభాతవార్త

ట్రావెల్ రంగంలో వేగవంతమైన సేవలు, నమ్మకమైన పర్యాటక సౌకర్యాలు, అందుబాటు ధరలతో తెలుగు రాష్ట్రాల ప్రజల విశ్వాసాన్ని సంపాదిస్తున్న ఆర్‌వి టూర్స్ అండ్ ట్రావెల్స్ మరోసారి సంచలనాత్మక ఆఫర్లతో ముందుకొచ్చింది. ఈ సందర్భంగా సంయావరం ఉదయం డాబాగార్డెన్స్‌లోని సంస్థ కార్యాలయం లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశం లో సంస్థ చైర్మన్ ఆర్.వి.రమణ మాట్లాడుతూ దేశీయ, అంతర్జాతీయ పర్యాటక రంగంలో సాధారణ మధ్యతరగతి ప్రజలకు కూడా విలాసవంతమైన ప్రయాణ అనుభూతిని అందించాలనే లక్ష్యంతో సంస్థ పలు ప్రత్యేక పర్యాటక ప్యాకేజీలను ప్రకటించింది.బ అదేవిధంగా "ప్రతి భారతీయుడి కలల్లో ఒకటి యూరప్ టూర్ అని అయితే భారీ ఖర్చుల కారణంగా చాలా మంది ఆ కలను నెరవేర్చుకోలేకపోతు న్నారు. అలాంటి వారి కోసం తక్కువ బడ్జెట్‌లో, అన్ని సౌకర్యాలతో యూరప్ దర్శనం కల్పించాలనే సంకల్పం తో 'సమ్మర్ బొనాంజా' ఆఫర్‌ను ప్రారంభించామని తెలిపారు. సాధారణంగా రూ.4 లక్షల వరకు ఖర్చయ్యే 7 దేశాల యూరప్ ప్యాకేజీని ఈ మే నెలాఖరు వరకు బుకింగ్ చేసుకునే కస్టమర్లకు కేవలం రూ.2,99,999 కే అందిస్తున్నట్లు వెల్లడించారు. ఈ 13 రోజుల పర్యటనలో ఫ్రాన్స్, స్విట్జర్లాండ్, ఇటలీ, జర్మనీ, బెల్జియం, నెదర్లాండ్స్, ఆస్ట్రియా వంటి ప్రముఖ యూరప్ దేశాలను సందర్శించే అవకాశం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ ప్యాకేజీలో విమాన ప్రయాణం, వీసా ప్రాసెసింగ్, స్టార్ హోటల్ వసతి, భారతీయ ఆహారం, స్థానిక రవాణా, టూర్ గైడ్స్, ట్రావెల్ ఇన్సూరెన్స్ వంటి అన్ని సౌకర్యాలు ఉంటాయని తెలిపారు. కస్టమర్లు అదనంగా ఒక్క రూపాయి కూడా చెల్లించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ప్రస్తుతం యువత, కుటుంబాలు, హనీమూన్ జంటలు, సీనియర్ సిటిజన్లు విదేశీ పర్యటనలపై ఎక్కువ ఆసక్తి చూపుతున్న నేపథ్యంలో, వారికి ప్రత్యేక సౌకర్యాలు కల్పిస్తున్నామని చెప్పారు. ప్రయాణంలో భాషా సమస్యలు లేకుండా తెలుగు టూర్ కోఆర్డినేటర్లు కూడా అందుబాటులో ఉంటారని వెల్లడించారు.

## అగ్నిబాధితులకు సాయం అందించిన మండల కోఆప్షన సభ్యులు



పద్మనాభం, మే 9,ప్రభాతవార్త

మండల కేంద్రమైన పద్మనాభంలో ఉన్న కన్నయ్య కోనేరు వద్ద ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితులకు శనివారం మండల కోఆప్షన సభ్యులు డి అబ్రహం సాయం అందించారు. ఈ సందర్భంగా బాధుతులకు ఇరవై కేజీల బియ్యం, పప్పులు, బట్టలు, వంటసామగ్రి, నూనె,ఉల్లిపాయలు, తదితర సామగ్రిని అందజేసినట్లు అబ్రహం అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ బొడ్డు శ్రీను పాల్గొన్నారు.

## 62వ వార్డులో ఘనంగా ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే గణబాబు జన్మదిన వేడుకలు



గాజువాక, మే 09,ప్రభాతవార్త

విశాఖ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ గణబాబు జన్మదిన వేడుకలు నియోజకవర్గ వ్యాప్తంగా పండుగ వాతావరణంలో జరిగాయి. శనివారం 62వ వార్డు దుర్గానగర్‌లోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద వార్డు అధ్యక్షులు మజ్జి మాలి నాయుడు ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా యువ నాయకులు మౌర్య సింహ హాజరై కార్యకర్తల మధ్య కేక్ కట్ చేశారు. అనంతరం మౌర్య సింహ మాట్లాడుతూ.. గణబాబు నియోజకవర్గ అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తున్నారని కొనియాడారు. ఆయన నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సేవా దృక్పథంతో వార్డులోని 200 మంది వృద్ధ మహిళలకు చీరలను పంపిణీ చేశారు. జనసేన నాయకులు బలిరెడ్డి అప్పారావు, సీనియర్ నాయకులు కోరిబిల్లి రాము, డోప్ప సన్యాసిరావు, లేళ్ళ కోటేశ్వరరావు, మహిళా అధ్యక్షురాలు సన్నటి లక్ష్మి పాల్గొన్నారు.

## తీరానికి కొట్టుకొచ్చిన గుర్తు తెలియని మృతదేహం



ఆరిలోవ, మే9, ప్రభాతవార్త

ఆరిలోవ స్టేషన్ పరిధి జోడుగుళ్లపాలెం బీచ్ ఒడ్డుకు శనివారం సాయంత్రం సుమారు 35 - 40 మధ్య వయసు ఉన్న వ్యక్తి మృతదేహం కొట్టుకొచ్చినట్లు ఆరిలోవ ఎస్సై వై.కృష్ణ తెలిపారు. మృతుని టీషర్ట్ పై స్వీట్ మంత్ర అనే లేబుల్ ఉన్నట్లు గుర్తించారు. మృతుని ఆచూకీ తెలిసినవారు ఆరిలోవ పోలీస్ స్టేషన్లో తెలియజేయాలని కోరారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్ కి తరలించినట్లు పేర్కొన్నారు. గుర్తుతెలియని మృతదేహంగా కేసు నమోదు చేసి సీఐ మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

CHANGE OF NAME

I, MALLA MANIKYAM DEVI W/o Malla Rajesh resident of D.No. 8-25-13/1, Malla Veedhi, Near Ramalayam, Anakapalli, Anakapalli Dist., stated as in my (Republic of India) Pass port No. H9250300 my name was entered as MALLA MANIKYADEVI instead of MALLA MANIKYAM DEVI. I request Passport authorities rectify my name as MALLA MANIKYAM DEVI vide affidavit dated 07-05-2026 sworn before Notary, Anakapalli.

10-5Pg7exHMNWJQE.qxd:10-5Pg7exHMNWJQE.qxd 1/1/02 7:03 AM Page 1





జూబ్లీహిల్స్‌లో సంఘటన జరిగిన ఇల్లు ఇదే. ఇన్‌సెట్‌- దోపిడీ అనంతరం మాస్క్ ధరించి పారిపోతున్న నిందితుడు (సిసిటివి చిత్రం)

## వినయ్ రంజన్ భార్య హత్య కేసు.. 'మాస్టర్ మైండ్'కోసం పోలీసుల వేట!

### బెంగళూరులోని పనిమనిషి కల్పన భర్తపై అనుమానం

### నిందితులను పట్టుకొనేందుకు సరిహద్దుల్లో మాటువేసిన పోలీసులు.. 225 గ్రాముల బంగారు ఆభరణాలు చోరీ

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), మే 9, ప్రభాతవార్త:** మాజీ ఐపిఎస్ వినయ్ రంజన్ రే సతీమణి తనూజరంజన్ హత్యను హత్యచేసి దోపిడికి పాల్ప డిన సంఘటన వెనుక ఉన్న మాస్టర్ మైండ్‌పై పోలీసులు ఇప్పుడు దృష్టి సారించారు. ఇంట్లో నమ్మకంగా పనిచేసే నేపాలి పనిమనిషి కల్పన భర్త బెంగళూరులో ఉన్నట్లు గుర్తించిన పోలీసులు ఆ దిశగా తమ దర్యాప్తును ముమ్మరం చేశారు. మరోవైపు హత్య, దోపిడికి పాల్పడి పరారైన కల్పనతోపాటు మరో ముగ్గురితో కూడిన నేపాలి ముఠా కోసం ప్రత్యేక బృందాలు విమానాల్లో సరిహద్దులకు చేరుకొని వారిని పట్టుకొనేందుకు మాటు వేశాయి. సాంకేతికంగా నేరస్థుల జాడను అనసరిస్తున్న పోలీసులు కీలకమైన మూడు ప్రాంతాల్లో దృష్టి పెట్టాయి. నిందితులను పట్టుకొనేందుకు అన్ని ప్రయత్నాలను చేస్తున్నారు. జూబ్లీహిల్స్‌లోని ప్రశాసన్‌నగర్ రోడ్ నంబరు 7 ప్లాట్ నంబరు 46లో నివసించే మాజీ అదనపు డీజీపీ వినయ్ రంజన్ రే ఇంట్లో పనిచేసే కల్పన మరో ముగ్గురితో కలిసి గురువారం అర్ధరాత్రి పొద్దుపోయిన తరువాత 1.30 గంటల ప్రాంతంలో మరో ముగ్గురు నేపాలీలతో కలిసి తనూజరంజన్‌ను హత్య చేసి ఇంట్లోని బంగారు ఆభర ణాలు, నగదుతో పరారైన విషయం విదితమే. కాగా సంఘటన నేపథ్యంలో మొదటి అంతస్థులో తనూజ రంజన్ ఒక్కరే ఉండటంతో ఈ దారుణం చోటుచేసుకొంది. ఆమె ఇద్దరు పిల్లలు రెండో అంతస్థులో ఉండటం, భర్త బెంగళూరులో చికిత్స పొందుతుండటంతో అదనుగా భావించిన కల్పన ఈ ఘాతుకానికి పాల్పడింది. కాగా దోపిడి అనంతరం పరారైన నిందితులు నేరుగా నడుచుకుంటూ జూబ్లీహిల్స్‌లోని సీవీఆర్ న్యూస్ ఛానెల్ సమీపానికి చేరుకున్నారు. అక్కడి నుంచి ఆటోలో రైల్వే స్టేషన్ వైపు వెళ్లినట్లు గుర్తించారు. సాంకేతికత ఆధారంగా నిందితులు రైలులో నాగపూర్ వైపు వెళ్లినట్లు పోలీసులు ప్రాథమికంగా ఒక అంచనాకు వచ్చారు. మాజీ అదనపు డీజీపీని హతమార్చి దోపిడి చేయడంతో ఈ కేసును సవాల్‌గా తీసుకున్న పోలీసు శాఖ సంఘటన వెనువెంటనే ప్రత్యేకంగా పోలీసు బృందాలను ఏర్పాటుచేశాయి. ముంబై, లక్నో, ఢిల్లీలకు ఈ బృందాలను ఇప్పటికే పంపించారు. మరోవైపు కల్పన గత చరిత్రపై పోలీసులు దృష్టి సారించారు. కల్పన కాల్‌డేటాను పోలీసులు ఇప్పటికే విశ్లేషించారు. ఈ క్రమంలోనే అంత ధైర్యంగా కల్పన పథకం ఎలా వేసింది, ముగ్గురు అగంతకులతో కలిసి రెక్కీ నిర్వహించడం, ఇంట్లోకి తీసుకెళ్లి, దోపిడికి పాల్పడటం తదితర అంశాలన్నింటిని పోలీసులు లోతుగా విశ్లేషించారు. ఈ క్రమంలోనే ఈ పథకం వెనుక 'మాస్టర్ మైండ్' ఉందనే అంచనాకు వచ్చారు. అందులో భాగంగానే బెంగళూరులో ఉన్న కల్పన భర్త కదలికలపై దృష్టి పెట్టారు. అక్కడికి మరో బృందాన్ని సైతం పోలీసులు పంపించారు. ఇక నిందితులు నాగపూర్ వైపు వెళ్తున్నట్లు ప్రాథమికంగా గుర్తించిన పోలీసులు నేపాల్, బీహార్ సరిహద్దులోనూ ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేశారు. ముంబైలో ఆశ్రయం ఇచ్చే వారి వివరాలను ఇప్పటికే పట్టుబడిన పాతనేరస్థులను విచారించి గుర్తించారు. అక్కడ సైతం పోలీసు బృందాన్ని ఏర్పాటు చేశారు. కల్పన భర్త స్కెచ్ వేయడమే కాకుండా దోపిడిలో భాగస్వాములుగా ఉన్న మిగిలిన ముగ్గురు అగంతకులను అతనే పంపి ఉంటాడనే అనుమానాలను పోలీసులు వ్యక్తం చేస్తున్నారు. నిందితులను వీలైనంత త్వరగా పట్టుకోడవడమే కాకుండా హత్య ఉన్న ప్రధాన సూత్రధారిని గుర్తించేందుకు పోలీసులు అవసరమైన పావులు కదుపుతున్నారు.

## వైద్య పరికరాల కొనుగోలు అక్రమాలపై సమగ్ర నివేదికివ్వండి

- వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశం
- ఆరోపణలకు చోటులేకుండా సంస్కరణలు అమలు
- వైద్య సిబ్బంది సర్వీసు సమస్యలను పరిష్కరించాలి
- రానున్న సాధారణ బదిలీ ప్రక్రియ సజావుగా సాగాలి

**విజయవాడ, మే 9 ప్రభాతవార్త ప్రతినిధి:** వైద్య పరికరాల కొనుగోలులో అక్రమాలు జరుగుతున్నట్లు ఆరోపణలుపై వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ సమగ్ర నివేదికను కోరారు. ఈ విషయంతో పాటు వైద్య ఆరోగ్య శాఖకు సంబంధించిన పలు ఇతర విషయాలపై మంత్రి శనివారం కార్యదర్శి సౌరబ్ గౌర్ లిఖితపూర్వక ఆదేశాలు జారీ చేశారు. ఎక్కువ ధరలకు వైద్య పరికరాలను కొనుగోలు చేస్తున్నట్లు, అవసరంలేని వాటిని కొంటున్నట్లు, కొంతమంది సరఫరాదారులకు అనుగుణంగా ఉండేలా సాంకేతిక ప్రమాణాలు రూపొందిస్తున్నట్లు, గతంలో సరఫరా చేసేందుకు అనర్హులుగా నిర్ణయించిన వారికి తిరిగి అవకాశాలు ఇస్తున్నట్లు వస్తున్న ఆరోపణలపై సమగ్రంగా నివేదికను అతి త్వరలో సమర్పించాలని మంత్రి శాఖ కార్యదర్శిని ఆదేశించారు. ఎటువంటి ఆరోపణలకు తావులేకుండా నియమ నిబంధనలకు అనుగుణంగా మాత్రమే పారదర్శకతతో కూడిన వాతావరణంలో వైద్య పరికరాల కొనుగోలు జరుగుతుందన్న విశ్వాసాన్ని సరఫరాదారులలో కలిగించాల్సిన అవసరాన్ని మంత్రి స్పష్టం చేశారు. ఈ దిశగా సమగ్ర సంస్కరణ ప్రక్రియను సూచించాలని మంత్రి ఆదేశించారు. వైద్య పరికరాల కొనుగోలుకు సంబంధించిన ప్రతిపాదనలను తయారు చేయడం, ఆయా పరికరాలకు సంబంధించిన సాంకేతిక ప్రమాణాల్ని రూపొందించడం, తగు నిబంధనల్ని రూపొందించి టెండర్లను పిలవడం, వాటిపై తుది నిర్ణయాల్ని తీసుకోవడం ఆయా అధికారులే నిర్ణయిస్తారని, దీనిని లోపభూయిష్టంగా చేసేందుకు తగు సూచనలు చేయాలని కూడా మంత్రి సత్యకుమార్ యాదవ్ కార్యదర్శిని ఆదేశించారు. వైద్య పరికరాల కొనుగోలు అక్రమాలు జరిగినట్లు కథనాలు, ఆరోపణలు ట్రోల్ అవుతున్నాయి. ఎపిఎంఎస్ ఐడిసి. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కృష్ణమోహన్ శనివారం ఉదయం మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను కలిసి తన పాత్రపై వివరణ ఇచ్చారు. ఆయా వైద్య పరికరాల కొనుగోలుకు సంబంధించిన సాంకేతిక ప్రమాణాల (టెక్నికల్ స్పెసిఫికేషన్) నిర్ధారణలో తనకు ఎట్టి పాత్ర లేదని, కేవలం రెండు సందర్భాల్లోనే తాను సాంకేతిక ప్రమాణాలను పునః పరిశీలించాలని సూచించానని ఆయన వివరణ ఇచ్చారు. దంత వైద్యులు వాడే పేషెంట్ కుర్చీలకు సంబంధించి ఒక కంపెనీ పేరుతో వారి ప్రమాణాలను వైద్యులు సూచించగా, అది నిబంధనలకు విరుద్ధం కనుక పునః పరిశీలించాలంటూ సూచించానని ఇది వివరించారు. 16 స్లైస్‌తో కూడిన సిటి స్కాన్ కొనుగోలుకు వైద్యులు సూచించగా, అట్టి పరికరాల కొనుగోలు, సరఫరా తగ్గిన నేపథ్యంలో పునః పరిశీలించాలని మాత్రమే సూచించానని ఆయన మంత్రికి తెలిపారు. తానెటువంటి అక్రమాలకు పాల్పడలేదని చెప్పారు.

2026 సంవత్సరానికి సంబంధించి సాధారణ బదిలీలు చేపట్టే అవకాశమున్నందున, గత సంవత్సరం అనుభవాల నేపథ్యంలో ఈసారి చేపట్టే ప్రక్రియ మరింత పటిష్టంగా జరగడడానికి తగు చర్యలు చేపట్టాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ శాఖ కార్యదర్శిని ఆదేశించారు. ఉద్యోగ సంఘాల ప్రతినిధులకు బదిలీల నుండి మినహాయింపులిచ్చే అంశాన్ని లోతుగా పరిశీలించి తగు సూచనలు చేయాలని, సమర్థవంతమైన ఆన్‌లైన్ వ్యవస్థ ద్వారా తక్కువ వ్యవధిలో లోపరహితమైన బదిలీలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. తమ సర్వీసు విషయాలు, సమస్యలకు సంబంధించి పలువురు వైద్యులు, సిబ్బంది సంఘాలు ఇచ్చిన వినతులు అపరిష్కృతంగా ఉన్నాయని, వీటన్నింటినీ పరిశీలించి సాధ్యాసాధ్యాలపై విస్తృత చర్చల కోసం వెంటనే ఒక నివేదికను సమర్పించాలని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ కార్యదర్శి సౌరభ్ గౌర్‌ను ఆదేశించారు.



మంత్రి నారా లోకేష్‌కు దుర్గమ్మవారి చిత్రపటం అందజేస్తున్న దృశ్యం

## దుర్గమ్మ సేవలో మంత్రి నారా లోకేష్

**ఇంద్రకీలాద్రి, మే 9, ప్రభాతవార్త:** విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న శ్రీ దుర్గమ్మని రాష్ట్ర మంత్రి నారా లోకేష్ శనివారం దర్శించుకున్నారు. చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఇఒ వి.కె. శీనా నాయక్, పాలకమండలి సభ్యులు, ఆలయాధికారులు మంత్రికి దుర్గమ్మవారి చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రం అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.

**నిత్యాన్నదాన పథకానికి విరాళం:** శ్రీ కనకదుర్గమ్మ దేవస్థానం అన్నదానం పథకానికి, విజయవాడకి చెందిన పడాల సింహాచలం, సుజాత దంపతులు రూ. 1,01,116 విరాళం అందించారు. దాతలకు దుర్గమ్మ దర్శనం ఏర్పాటు చేసిన అనంతరం శ్రీ అమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, మెమొంటోలు అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.



శిక్షణనిచ్చిన ఐజెఎం ప్రతినిధులను సత్కరిస్తున్న సిపి రాజశేఖరబాబు

## నేరస్తులకు శిక్షలు పడేందుకు సాక్ష్యాధారాల సేకరణే కీలకం

- విజయవాడ పోలీస్ కమిషనర్ సిపి రాజశేఖరబాబు

**విజయవాడ, మే 9 ప్రభాతవార్త:** నేరస్తులకు కోర్టుల్లో శిక్షలు పడేందుకు సాక్ష్యాధారాల సేకరణే కీలకమని విజయవాడ సిపి రాజశేఖరబాబు స్పష్టం చేసారు. మానవ అక్రమరవాణా, వెట్టిచాకిరీ నిర్మూలన తదితర అంశాల్లో చేపట్టాల్సిన చర్యలు, ఈరెండు కేసుల్లో సాక్ష్యాధారాల సేకరణపై పోలీస్ అధికారులు, సిబ్బందికి ఒకరోజు శిక్షణా కార్యక్రమం విజయవాడ సిపి కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ఈకార్యక్రమాన్ని ప్రారంభించిన సిపి మాట్లాడుతూ మానవ అక్రమ రవాణాను అరికట్టేందుకు పోలీసులు మరింత సమర్ధవంతంగా పనిచేయాలని కోరారు. మానవ అక్రమరవాణా, వెట్టిచాకిరీ కారణాలు, మార్గాలు, దర్యాప్తులో అనుసరించాల్సిన విధివిదానాలపై ఐజేయం ప్రతినిధులు కూలంకషంగా వివరించారు. స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గెడ్డం రాజేశ్వరావు పోక్సో కేసుల్లో సాంకేతిక ఆధారాలను గుర్తించటం, సంరక్షించటం, విశ్లేషించటం, డాక్యుమెంట్ చేయటం, దర్యాప్తులో అనుసరించాల్సిన నిర్దేశిత విధివిదానాలను వివరించారు. ఈకేసుల్లో నేరస్తులకు శిక్షపడేలా చేసేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియచేసారు. మహిళలు, చిన్నారుల భద్రత విభాగం ఐజి బి.రాజకుమారి మాట్లాడుతూ ట్రాఫికింగ్ అనేది మిసిసింగ్ కేసులతోనే మొదలవుతుందని, మిసిసింగ్ కేసుల్లో జాప్యం లేకుండా వేగంగా ఛేదించేందుకు కృషిచేయాలని సూచించారు. శిక్షణనిచ్చిన ఐజెయం ప్రతినిధులను, గెడ్డం రాజేశ్వరావులను సిపి సత్కరించారు. ఈకార్యక్రమంలో అడ్మిన్ డిసిపి సరిత, ఎసిపిలు, శక్తి బృందాలు, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ బృందాలు, ఇన్‌స్పెక్టర్లు

## నేడే హైదరాబాద్‌కు ప్రధాని మోడీ రాక

- బేగంపేట విమానాశ్రయంలో భారీ భద్రత
- 2వేల మంది పోలీసులతో బందోబస్త్
- పరేడ్ మైదానం సభా ప్రాంగణం వద్ద 150కి పైగా సిసి కెమెరాలతో నిఘా
- కమాండ్ కంట్రోలు రూం ద్వారా పర్యవేక్షణ



**బేగంపేట, మే 9 ప్రభాతవార్త:** భారత ప్రధాని నరేంద్ర మోడీ హైదరాబాద్ పర్యటనకు వస్తున్న సందర్భంగా తెలంగాణ రాష్ట్ర పోలీసులు భారీ భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. శనివారం హైటెక్ సిటీలో పలు ప్రాజెక్టుల శంకుస్థాపనలు చేసి హైటెక్ సిటీలోని సింధూ ఆసుపత్రి ప్రారంభోత్సవం ప్రధాని మోడీ చేతుల మీదుగా చేయనున్నారు. బెంగళూరు నుంచి బయలు దేరి మధ్యాహ్నం గం.2.20నిలకు బేగంపేట విమానాశ్రయానికి ప్రధాని చేరుకుంటారు. అనంతరం విమానాశ్రయం వద్ద ఏర్పాటు చేసిన వేదిక పై నుంచి వివిధ ప్రభుత్వ కార్యక్రమాలకు మోడీ ప్రారంభోత్సవం చేయనున్నారు. సాయంత్రం గం 5.30నిలకు పరేడ్ మైదానానికి ప్రధాని చేరుకుని బిజెపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రజల నుద్దేశించి ప్రసంగించనున్నారు. అనంతరం గం.7.20 నిలకు బేగంపేట విమానాశ్రయానికి చేరుకుని గుజరాత్‌కు వెళ్లనున్నారు. ప్రధాని పరేడ్ మైదానంలో నిర్వహించనున్న సభలో పాల్గొననుండటంతో పోలీసులు 150సిసి కెమెరాలను ఆ ప్రాంతంలో ఏర్పాటు చేసి వాటిని కమాండ్ కంట్రోల్ రూంకు అనుసంధానం చేసి అనుక్షణం అప్రమత్తంగా పర్యవేక్షిస్తున్నారు. సభకు సమీపంలో ఈ కమాండ్ కంట్రోలు రూం ఏర్పాటు చేసి ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా డేగ కళ్లతో నిఘాను పర్యవేక్షించనున్నారు. ప్రధాని బేగంపేట విమానాశ్రయానికి చేరుకున్న అనంతరం హెచ్ఐసిసిలో జరిగే కార్యక్రమాలకు హెలికాప్టర్‌లో వెళతారా, లేక రోడ్డు మార్గంలో వెళతారా అన్నది అధికారికంగా వెల్లడించలేదు. ముందుగా హెలికాప్టర్‌ను బేగంపేట విమానాశ్రయంలో అందుబాటులో ఉంచారు. హెలికాప్టర్‌ను ట్రయల్ రన్ కూడా పూర్తిచేసారు. మోడీ రాక సందర్భంగా ఆయన ప్రయాణించే మార్గాల్లో దారి పొడవునా విద్యుత్ లైట్లను ఏర్పాటు చేసారు. ప్రధాని ప్రయాణించే సమయంలో రాకపోకలపై ఆంక్షలు ఉంటాయని పోలీసు అధికారులు తెలియజేసారు.

**ప్రధాని సభకు వరంగల్ నుంచి ప్రత్యేక రైలు:** పరేడ్ మైదానంలో ఆదివారం జరిగే ప్రధాని మోడీ సభలో పాల్గొనేందుకు వచ్చే వారి కోసం వరంగల్ రైల్వేస్టేషన్ నుంచి సికింద్రాబాద్‌కు బిజెపి రాష్ట్ర పార్టీ ఆధ్వర్యంలో ప్రత్యేక రైలును ఏర్పాటు చేసారు. మధ్యాహ్నం 12.10గం.లకు వరంగల్ చేరుకుంటుంది. అక్కడి నుంచి బయలు దేరి పరేడ్ మైదానంలో జరిగే ప్రధాని సభ రావచ్చు. ఇదే రైలు ప్రధాని సభ ముగిసిన తర్వాత గం 10.15గం.లకు సికింద్రాబాద్‌లో బయలు దేరి రాత్రి 1గం.లకు వరంగల్ రైల్వేస్టేషన్‌కు చేరుకుంటుంది.





### రూ.252 కోట్ల వ్యయంతో

## అమరావతిలో ఫోరెన్సిక్ భవన సముదాయం

**విజయవాడ, మే 9 ప్రభాతవార్త ప్రతినిధి:** రాజధాని అమరావతిలోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో రూ.252 కోట్ల వ్యయంతో తుళ్లూరు వద్ద ఎన్14, ఈ5 జంక్షన్‌లో నిర్మించిన ఫోరెన్సిక్ భవన సముదాయం పూర్తయింది. ఈ మేరకు పోలీసు అధికారుల కీలక సమాచారం వెల్లడించారు. మెత్తం అయిదు.విస్తీర్ణంలో నిర్మించిన ఈ అంతర్జాతీయ స్థాయి ఫోరెన్సిక్ ల్యాబ్ ఐదు భవనాల సముదాయంగా సిద్ధమైంది. పూర్తయింది. 2017లో ప్రారంభమైన ఈ ప్రాజెక్టు మధ్యలో నిలిచిపోయినా, 2024 తర్వాత మళ్లీ వేగం అందుకుని పూర్తి దశకు చేరుకుంది. త్వరలోనే అత్యాధునిక పరికరాలు అమర్చిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ఇది ప్రారంభం కానుంది. సీఆర్‌డీఏ భవనం తర్వాత రాజధానిలో ప్రారంభం కానున్న రెండో భవన సముదాయం ఇది, రాష్ట్రంలో నేరం చేసినవారు తప్పించుకోలేరనే నమ్మకాన్ని బలోపేతం చేసే దిశగా పోలీసు శాఖ ఫోరెన్సిక్ విభాగాన్ని విస్తరిస్తోంది. కర్నూలు, గుంటూరు, విశాఖపట్నంతో పాటు ఇతర ప్రాంతాల్లో ల్యాబ్‌ల ఏర్పాటు కొనసాగుతోంది. సిబ్బంది నియామకాలు, ఆధునిక సాంకేతిక సదుపాయాలతో ఈ వ్యవస్థను బలోపేతం చేస్తూ, నేరాలపై కఠిన నియంత్రణ లక్ష్యంగా ముందుకు సాగుతోంది. దేశంలోని ఎనిమిది అత్యాధునిక ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్‌ల్లో అమరావతి ల్యాబ్ ఒకటిగా నిలవనుంది. ఈ ల్యాబ్‌లో ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, బాలిస్టిక్ విభాగాలు ప్రత్యేకంగా పనిచేస్తాయి. ఆటోమేటెడ్ ఫింగర్‌ప్రింట్ సిస్టమ్ ద్వారా వేలిముద్రలను డేటాబేస్‌తో సరిపోల్చి నిందితులను గుర్తిస్తారు. కాల్పుల కేసుల్లో తుపాకులు, తూటాల విశ్లేషణ, విషప్రయోగం లేదా మత్తు పదార్థాల కారణాలను నిర్ధారించే టాక్సికాలజీ పరీక్షలు నిర్వహిస్తారు. నార్కోటిక్స్, బయోమెట్రిక్, ఫోరెన్సిక్ అకౌంటింగ్ వంటి విభాగాలు కూడా దర్యాప్తును మరింత సమగ్రంగా మార్చనున్నాయి. పాత విధానాల్లో నెలలు పట్టే నివేదికలు ఇప్పుడు గంటలు లేదా కొన్ని రోజుల్లో అందేలా సాంకేతికతను వినియోగిస్తున్నారు. వీటిలో అవసరమైన పరికరాలను రూ.41 కోట్ల ఖర్చుతో పోలీసు శాఖ తెప్పిస్తోంది.డీఎన్ఏ, నార్కోటిక్స్, సైబర్, బయోమెట్రిక్, బాలిస్టిక్ లాంటి పరీక్షలతో పాటు ఫోరెన్సిక్ అకౌంటింగ్‌కు సంబంధించిన ఎక్సలెన్స్, గత నేరాల నమూనాలతో సరిపోల్చగల డేటాబేస్ యాక్సిక్ కూడా ఇక్కడ అందుబాటులోకి రానుంది. రాష్ట్రవ్యాప్తంగా మొబైల్ ఎఫ్ఎస్ఎల్ వాహనాల ద్వారా ఘటనా స్థలానికి వెంటనే చేరుకుని ఆధారాలు సేకరించి 48 గంటల్లో ప్రాథమిక విశ్లేషణ అందించే వ్యవస్థను అమలు చేస్తున్నారు.

## తుంగభద్ర బోర్డు బిల్లుల్లో పర్సెంటేజీల కోసం కాంట్రాక్టర్లకు కొందరు ఎమ్మెల్యేల ఫోన్లు?

- ఈసడించుకుంటున్న కాంట్రాక్టర్లు
- హెచ్ఎల్‌సి, ఎల్ఎల్‌సి బిల్లుల్లో భారీగా అవినీతి

**అనంతపురం, మే 9 ప్రభాతవార్త బ్యూరో:** అనంతపురం, కర్నూలు జిల్లాలకు సంబంధించి కొందరు ఎమ్మెల్యేలు తుంగభద్ర బోర్డు మంజూరు చేస్తున్న బిల్లుల్లో తమ వాటా ఏంటి..? తమకు కూడా అంతో ఇంతో ఇచ్చుకోవాలని పలువురు కాంట్రాక్టర్లపై ఒత్తిడి తెస్తున్నట్లు తెలియవచ్చింది. మాకు ఖర్చులు ఉంటాయి కదా..అక్కడ చేసిన పనులకు సంబంధించి మాకు సంబంధమే కదా..మాకిచ్చి తీరాల్సిందే.. అంటూ కొందరు ఎమ్మెల్యేలు ఒత్తిడి తెస్తుండగా..కొందరు ఎమ్మెల్యేలు రిక్వెస్ట్ రూపంలో అడుగుతున్నట్లు తెలియవచ్చింది. తుంగభద్ర బోర్డు పరిధిలో కర్ణాటకలో ఎల్ఎల్‌సి, హెచ్ఎల్‌సి కాలువల ఆధునీకరణ పనులకు సంబంధించి గత ఏడాది చేసిన పనులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇటీవల కాలంలో 275 కోట్ల రూపాయలను విడుదల చేసింది. అందులో భాగంగా ఏప్రిల్, మే నెలల్లో గత ఏడాది వివిధ ప్యాకేజీల కింద పనులు చేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు మంజూరు చేస్తున్నారు. ఈ బిల్లుల మంజూరులో పెద్ద ఎత్తున అవినీతి చోటు చేసుకుందని, కోట్లాది రూపాయలు చేతులు మారాయని బలంగా ఆరోపణలు వస్తున్నాయి. బిల్లులు కాంట్రాక్టర్లకు మంజూరులో ఎలాంటి అవినీతి, అక్రమాలకు చోటు లేదని టిబి డ్యాం అధికారులు చెబుతున్నప్పటికీ ఆచరణలో జరిగేది చాలా ఎక్కువగా ఉందని కొందరు కాంట్రాక్టర్లు చెబుతున్నారు. బిల్లుల మంజూరుకే దాదాపు 8 శాతం నుంచి 10 శాతం వరకు పర్సెంటేజీలు అధికారులకు ఇవ్వాల్సి వస్తోందని, డబ్బులు ఇవ్వకపోతే బిల్లులు మంజూరు చేయని పరిస్థితి నెలకొందని ఆరోపణలు వస్తున్నాయి. బిల్లులు మంజూరు విషయంలోనే కాకుండా ఆఫీసులో పనులు జరిగిన సమయంలో ప్రత్యేకంగా మళ్లీ ఇచ్చుకున్నామని కాంట్రాక్టర్లు చెబుతున్నారు. టిబి డ్యాం నుంచి అనంతపురం జిల్లా సరిహద్దుల్లోకి హెచ్ఎల్‌సి కాలువ, కర్నూలు జిల్లా సరిహద్దుల్లోకి ఎల్ఎల్‌సి కాలువ వస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా కర్ణాటకలో హెచ్ఎల్‌సి, ఎల్ఎల్‌సి ఆధునీకరణ పనులు గత ఏడాది జరిగాయి. తాజాగా ఇందుకు సంబంధించిన బడ్జెట్‌ను రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున తుంగభద్ర బోర్డుకు రిలీజ్ చేయడంతో బోర్డు అధికారులకు, కాంట్రాక్టర్లకు కొందరు నాయకులకు పండగొచ్చినట్లు అయింది. బిల్లులు మంజూరు విషయంలో కోట్లాది రూపాయల బిల్లులను కాంట్రాక్టర్లకు మంజూరు విషయంలో రాయలసీమ జిల్లాలకు చెందిన ఒక ఎమ్మెల్యే చక్రం తిప్పుతున్నట్లు ఇటు కాంట్రాక్టర్లు, అధికారులతో సమన్వయం చేసే చర్యలు తీసుకుంటున్నట్లు, అందులో భాగంగా ఇద్దరు ముఖ్యులకు కూడా బిల్లుల పర్సెంటేజీల్లో వాటాలు ఇవ్వాలని మధ్యవర్తిగా వ్యవహరిస్తున్న ఓ ఎమ్మెల్యే చెబుతున్నట్లు కాంట్రాక్టర్లలో చర్చ జరుగుతోంది. పెద్ద ఎత్తున రాష్ట్ర ప్రభుత్వం నుంచి తుంగభద్ర బోర్డుకు బడ్జెట్ నిధులు విడుదల కావడంతో బిల్లుల మంజూరు ప్రక్రియను బోర్డు అధికారులు వేగవంతం చేశారు. కొందరు బోర్డులోని ముఖ్య అధికారులు బిల్లులు మంజూరు విషయంలో భారీగా పర్సెంటేజీలు డిమాండ్ చేస్తుండటంతో కాంట్రాక్టర్లు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ విధంగా ఇబ్బందులకు గురయ్యే కాంట్రాక్టర్లు రాష్ట్ర ముఖ్యులకు ఫిర్యాదు చేసే పనిలో ఉన్నారు. అదే సమయంలో హెచ్ఎల్‌సి, ఎల్ఎల్‌సి ఆధునీకరణ పనులు జరిగినప్పుడు కాంట్రాక్టర్లు సరిగా పనులు చేయక బిల్లులు ఇష్టానుసారంగా పెట్టుకున్నవారు మాత్రం ఇప్పుడు జరుగుతున్న వ్యవహారంపై గట్టిగా స్పందించడం లేదని అభిప్రాయం ఉంది. తుంగభద్ర బోర్డు పరిధిలో ఎన్నో ఏళ్లుగా ఎల్ఎల్‌సి, హెచ్ఎల్‌సి పనుల్లో అవినీతి జరిగేదని బిల్లుల మంజూరు సమయంలో అధికారులు పర్సెంటేజీలు రావడం, ఏ ప్రభుత్వం ఉన్నా జరిగేటివే. అయతే ఈ సారి ఏప్రిల్, మే నెలల్లో బిల్లులు మంజూరు విషయంలో అవినీతి ఎక్కువైందని పర్సెంటేజీలు డిమాండ్ చేయడం ఎక్కువగా ఉందని కొందరు కాంట్రాక్టర్లు అభిప్రాయ పడుతున్నారు. ఒక ఎమ్మెల్యే మొత్తం బిల్లుల వ్యవహారంలో కీలకంగా వ్యవహరిస్తూ బోర్డు అధికారులతోనూ కాంట్రాక్టర్లతోనూ సంప్రదింపులు జరుపుతుండటం హాట్ టాపిక్‌గా మారింది. తుంగభద్ర బోర్డుకు ఆంధ్ర నుంచి వచ్చే పైస్థాయి అధికారులు, ఇంజినీర్లు పైరవీలతో వస్తుంటారని, అందులో భాగంగా బిల్లుల మంజూరు సమయంలో తనదైన శైలిలో కొందరు బోర్డు అధికారులు బడ్జెట్ వచ్చినప్పుడు దండు కోవడం ఎక్కువైందని ఆరోపణలు వస్తున్నాయి. ఈ విషయంపై రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుని విచారణ జరిపితే ఎన్నో అక్రమాలు బహిర్గతం అవుతాయని కొందరు అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు.

## రూ.1.24 లక్షల కోట్లు ఎపి, టిజి నుండి వసూళ్లు

**హైదరాబాద్, మే 9, ప్రభాతవార్త :** తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ప్రస్తుత 2026-27 ఆర్థిక సంవత్సరంలో ఆదాయం పన్ను వసూళ్లలో వృద్ధి నమోదు అయ్యే ఛాన్స్ ఉందని రెండు రాష్ట్రాల ఇన్‌కమ్ టాక్స్ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ బత్తిన సురేష్ తెలిపారు. గత 2025-26కి ఈ రెండు రాష్ట్రాల నుండి ఆదాయపు పన్ను కింద రూ.1.24 లక్షల కోట్లు వసూళ్లు అయ్యాయన్నారు. తెలంగాణ నుండి రూ.1.06 లక్షల కోట్లు, ఆంధ్రప్రదేశ్ నుండి రూ.17 వేల కోట్లకు పైగా ఆర్జించినట్లు తెలిపారు. అంతకు ముందు ఏడాది కంటే 2025-26లో 3.4శాతం మేర ఆదాయ పన్ను వసూళ్ల వృద్ధి నమోదైందన్నారు. ఈ రెండు రాష్ట్రాల్లో ఇంకా రూ.11 వేల కోట్ల పన్ను బకాయిలు వసూలు కావాల్సి ఉందన్నారు. ఒక ప్రశ్నకు సమాధానమిస్తూ, రెండు రాష్ట్రాల్లోని ఫార్మా, ఐటీ, రియల్ ఎస్టేట్ రంగాలపై దృష్టి పెట్టనున్నామని తెలిపారు. డిఫాల్టర్లను పట్టుకోవ డానికి తమ శాఖ నిరంతరం మూడవ పక్షాల నుండి డేటాను సేకరిస్తోందని చెప్పారు.

## మొబైల్ రికవరీలో పల్నాడు, ఎన్టీఆర్ జిల్లాలకు మొదటి, రెండు స్థానాలు

**విజయవాడ, మే 9 ప్రభాతవార్త ప్రతినిధి:** మొబైల్స్ రికవరీలో పల్నాడు, ఎన్టీఆర్, ఏలూరు జిల్లాలు వరుసగా తొలి మూడు స్థానాలు సాధించాయి. పల్నాడు జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు, విజయవాడ నగర పోలీసు కమిషనర్ ఎస్.వి రాజశేఖర్‌బాబు, ఏలూరు జిల్లా ఎస్పీ కె.ప్రతాప శివ కిషోర్ డిజిపి చేతుల మీదుగా బెస్ట్ రికవరీ అవార్డులను అందుకున్నారు. పోగొట్టుకున్న మొబైళ్లను గుర్తించి వాటిని యజమానులకు తిరిగి అప్పగించడంలో విశేష ప్రతిభ కనబర్చినందుకు ఈ అవార్డులను ప్రదానం చేశారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన సిఇఐఆర్. ఇది పోగొట్టుకున్న లేదా చోరీకి గురైన మొబైల్ ఫోన్లను బ్లాక్ చేయడం ట్రాక్ చేయడం, రికవరీ చేయడానికి ఉపయోగించే కేంద్ర ప్రభుత్వ వ్యవస్థ కార్యాకలాపాల పనితీరు విశ్లేషణలో పల్నాడు జిల్లా అగ్రస్థానంలో నిలిచింది. పల్నాడు జిల్లా మొబైల్ రికవరీలో 69.75 అత్యుత్తమ స్కోరుతో రాష్ట్రంలోనే నంబర్ వన్‌గా నిలిచింది. జిల్లాలో ఫిర్యాదు అందిన వెంటనే స్పందించి అత్యధిక సంఖ్యలో 4,303 మొబైళ్లను రికవరీ చేసి బాధితులకు అప్పగించింది.



రాష్ట్రంలో పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ల రికవరీలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన జిల్లాలకు కేంద్ర ప్రభుత్వం సంస్థ డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలీ కమ్యూనికేషన్స్ వారు ప్రకటించిన సిఇఐఆర్ అవార్డులను రాష్ట్ర డిజిపి హరీష్ కుమార్ గుప్తా, హేమంత్ రత్వే ఐటిఎస్ డిడిజి ఎపి ఎల్ఎస్ఏతో కలసి ఎపి పోలీస్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ఒక కార్యక్రమంలో అందజేశారు. ఎన్టీఆర్ జిల్లా 64 స్కోరుతో రెండో స్థానాన్ని దక్కించుకుంది. 2,929 మొబైల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకుని బాధితులకు అప్పగించారు. ఏలూరు జిల్లా 62.18 స్కోరుతో మూడో స్థానంలో నిలిచి 2,796 మొబైళ్లను బాధితులకు అప్పగించింది. ఈ సందర్భంగా డిజిపి హరీష్‌కుమార్ గుప్తా మాట్లాడుతూ సిఇఐఆర్ వ్యవస్థను సమర్థంగా వినియోగించి మొబైల్ రికవరీలో మెరుగైన ఫలితాలు సాధించిన జిల్లాల అధికారులను అభినందించారు. రాష్ట్రవ్యాప్తంగా మొబైల్ ట్రాకింగ్, రికవరీ ప్రక్రియను మరింత వేగవంతం చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు డిజి శాంతిభద్రతలు ఎన్.మధుసూదనరెడ్డి, డిజిపి శ్రీకాంత్, హేమంత్ రత్వే, ఐటిఎస్ డిడిజి ఎపి ఎల్ఎస్ఏ కె.రామ్ మనోహర్, ఐటిఎస్ డైరెక్టర్ ఎపి ఎల్ఎస్ఏ హైదరాబాదు తదితర పోలీసు ఉన్నతాధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

10-5Pg8exHMNWJQE.qxd:10-5Pg8exHMNWJQE.qxd 1/1/02 7:06 AM Page 1



# విజయవంతంగా సాగిన రైతు వారోత్సవాలు

## వ్యవసాయ శాఖ డైరెక్టర్ డా. బి.గోపి వెల్లడి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 9:** తెలంగాణలో వైభవంగా కొనసాగుతున్న రైతు వారోత్సవాలురైతు సంక్షేమం - ఆధునిక వ్యవసాయ అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యంతెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక' 99 రోజుల కార్యక్రమంలో భాగంగా, మే 4 నుండి 9 వరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న 'రైతు వారం" కార్యక్రమాలు విజయవంతంగా కొనసాగాయని వ్యవసాయ సంచాలకులు డా.బి.గోపి వెల్లడించారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. వ్యవసాయ శాఖతో పాటు అనుబంధ శాఖల సమన్వయంతో రైతులకు ఆధునిక సాగు పద్ధతులు, శాస్త్రీయ వ్యవసాయం, మార్కెటింగ్, యాంత్రీకరణ, పశుసంవర్ధక మరియు నీటిపారుదల అంశాలపై విస్తృత స్థాయిలో అవగాహన కల్పిస్తున్నారు.నేల ఆరోగ్యం - శాస్త్రీయ సాగుకు తొలి అడుగుమే 4న వికారాబాద్ జిల్లా తాండూరులో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రైతువారం కార్యక్రమాలను ప్రారంభించారు, సేంద్రియ రైతులు పండించిన పంటల ఉత్పత్తులను క్రయవిక్రయాల కోసం తెలంగాణ రాష్ట్ర విత్తన మరియు సేంద్రీయ ధ్రువీకరణ అథారిటీ డెవలప్ చేసిన టీజీ ఆర్గానిక్స్ మొబైల్ యాప్ గౌరవ మంత్రివర్యుల చేతుల మీదుగా ప్రారంభించబడింది. రాష్ట్ర వ్యాప్తంగా 14,565 మట్టి నమూనాలను సేకరించి, 20,734 మట్టి విశ్లేషణ పత్రాలను రైతులకు అందజేశారు. నానో ఎరువుల వినియోగం, ప్రకృతి వ్యవసాయం, సన్న వరి సాగు వంటి అంశాలపై రైతులకు శాస్త్రీయ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాల్లో 1,32,423 మంది రైతులు ప్రత్యక్షంగా పాల్గొన్నారు.ఆధునిక సాంకేతికతతో ఉద్యానవన రంగానికి ఊతం మే 5న హనుమకొండలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కొండ సురేఖ ఆధ్వర్యంలో మెగా రైతు మేళా నిర్వహించారు. ప్రత్యామ్నాయ పంటల సాగు, ముఖ్యంగా ఆయిల్ పామ్, నూనె గింజలు, పప్పు ధాన్యాల సాగుపై రైతులకు శిక్షణ ఇచ్చారు. బిందు సేద్యం,నీటి పొదుపు సాంకేతికతల వినియోగంపై ప్రత్యేక అవగాహన కల్పించారు.రైతుకు ఆర్థిక భరోసా - మార్కెటింగ్ సదుపాయాలపై దృష్టిమే 6న రైతులకు పంట రుణాలు, కిసాన్ క్రెడిట్ కార్డులు, సహకార సంఘాల సేవలపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా 12,779 మంది రైతులు ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గోదాముల నిల్వ సదుపాయాలు, కనీస మద్దతు ధర,మార్కెటింగ్ అవకాశాలపై మార్కెటింగ్ శాఖ అధికారులు రైతులకు వివరించారు. పశుసంవర్ధక, మత్స్య నీటిపారుదల రంగాలకు ప్రాధాన్యం మే 8న నిర్వహించిన మండల స్థాయి సమావేశాల్లో పశుసంవర్ధక, మత్స్య మరియు నీటిపారుదల శాఖల అధికారులు రైతులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. వేసవిలో పశువుల సంరక్షణ, పచ్చిగడ్డి సాగు, చెరువుల నిర్వహణ, చేపల ఉత్పత్తి పెంపు, కాలువల మరమ్మతులు, గేట్ల నిర్వహణ వంటి అంశాలపై కార్యాచరణ వివరించారు.రైతు వారం కార్యక్రమాల ద్వారా రైతుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించి, వ్యవసాయ ఖర్చులు తగ్గించి, దిగుబడులు మరియు ఆదాయాలు పెంచడం ద్వారా తెలంగాణ వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. మెగా రైతు మేళలో పాల్గొన్న వ్యవసాయ శాఖ మాత్యులు తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ రైతులు పండించిన వరి మొక్కజొన్న జొన్న పంటలను ప్రభుత్వమే కొనుగోలు చేసి రైతులను ఆదుకుంటుం దని రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గ చూపుతూ అధిక ఆదాయం ఇచ్చే ఆయిల్ ఫామ్ పంటను సాగు చేయాలని దీనికి ప్రభుత్వం సబ్సిడీ అందజేస్తుందని ప్రభుత్వం నిర్ణయించిన ధరకే కొనుగోలు చేస్తుందని రైతులు ఈ పంట పండించడం ద్వారా అధిక ఆదాయం పొందే అవకాశం ఉందని వారికి బదులుగా పప్పు దినుసులు కూరగాయ పంటలను పూల మొక్కలను పండించడం ద్వారా అధిక ఆదాయం పొందాలని సూచించారు ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వ్యవసాయ,అనుబంధ రంగాలకు సంబంధించిన ప్రదర్శన స్టాళ్లను తిలకించారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ మాత్యులతో పాటుగా మంత్రులు కొండా సురేఖ,శ్రీహరి,ఎంపీ కావ్య, వ్యవసాయ శాఖ కార్యదర్శి కె. సురేంద్ర మోహన్, వ్యవసాయశాఖ డైరెక్టర్ డా.బి.గోపి, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. చివరి రోజు మే 9న నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో చెరువుల కంపచెట్లు గుర్రపు డెక్క తొలగింపు సమతుల్య నీటి వినియోగం పై రైతులకు అవగాహనతో ఈ రైతు వారోత్సవ అవగాహన కార్యక్రమాలు ముగిసాయి.



# బిజెపి టార్గెట్ తెలంగాణ

## బిఆర్ఎస్ మళ్లీ రాదు.. కాంగ్రెస్ అంటే ప్రజలు విసిగిపోయారు: ఎంపి ఈటల

**హైదరాబాద్, మే 9 ప్రభాతవార్త:** బిజెపి తదుపరి మజిలీ, టార్గెట్ తెలంగాణ అని, బిఆర్ఎస్ మళ్లీ రాదు.. కాంగ్రెస్ అంటే ప్రజలు విసిగిపోయారని బిజెపి ఎంపి ఈటల రాజేందర్ అన్నారు. సికింద్రాబాద్ నిర్వహించిన మీడియా సమావేశంలో ఎంపి ఈటల రాజేందర్ మాట్లాడుతూ మూడవ సారి ప్రధాని అయ్యాక మోడీ తొలిసారి మన రాష్ట్రానికి వస్తున్నారని అన్నారు. భారతదేశాన్ని అస్థిరపరచాలని చూసిన శక్తులను తొక్కి పడేసి అఖండ భారతను సురక్షి తంగా ఉంచుతామని మాట ఇచ్చి, సాధించిన విజయంతో ఆయన తెలంగాణకు వస్తున్నారని అన్నారు. బిజెపి తదుపరి మజిలీ, టార్గెట్ తెలంగాణ అని ప్రజలు అనుకుంటున్నారు. బిఆర్ఎస్ వద్దనుకొని కాంగ్రెస్‌కి ఓటు వేస్తే రెండేళ్లలోనే తేలిపోయిందన్నారు. తెలంగాణ అప్పుల ఊబిలో కోరుకుపోకుండా ఉండాలంటే, నియంతృత్వ పోకడలు పోవాలంటే, అభివృద్ధి చెందాలంటే బిజెపినే అధికారంలోకి రావాలనే భావన ప్రజల్లో ఉంది. రేపు మోడీ మీటింగ్‌కి ప్రజలు స్వచ్ఛందంగా వస్తు న్నారు. ఎన్నికల సమయంలో మోడీ ప్రచారానికి వచ్చినప్పుడు మల్కాజిగిరి ప్రజలు చూపిన ప్రేమను ఎక్కడా చూడలేదు అన్నారు. కంటెన్మెంట్‌లో 16 వేల ఓట్లతో ఎమ్మెల్యే విడిపోయినా మోడీ ప్రభావం వల్ల ఎంపి ఎన్నికల్లో 25 వేల ఓట్ల మెజారిటీ వచ్చిందన్నారు. ప్రజల ఉత్సాహం చూసి మా కార్యకర్తలు కూడా ఉత్సాహం అయ్యారు. ఆదివారం నిర్వహించే సమావేశానికి పెద్దఎత్తున హాజరై బహిరంగ సభను విజయవంతం చేయాలని మల్కాజిగిరి పార్లమెంట్ ప్రజలకు, తెలంగాణ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గత రెండేళ్లుగా మేము చేస్తున్న పనులు చూసి మీరు ఎక్కువ సంఖ్యలో హాజరైతే మాకు కూడా స్ఫూర్తిగా ఉంటుందని, మోడీకి అండగా నిలవాలని కోరుతున్నాను.

## బిజెపి దాడులు ప్రజాస్వామిక వ్యవస్థకు గొడ్డలి పెట్టు : సిపిఎం

**హైదరాబాద్,మే9,ప్రభాతవార్త:** రాష్ట్రంలో బిజెపి పాల్పడుతున్న రాజకీయ దాడులు, ఘటనలను సిపిఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండి స్తోందనీ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజకీయ వైరుధ్యాలను సిద్ధాంతపరంగా ఎదుర్కోవాలే తప్ప, భౌతిక దాడులకు దిగడం సరైంది కాదనీ పేర్కొన్నారు. కరీంనగర్, హుజూ రాబాద్‌లోని బిఆర్ఎస్ ఎంఎల్ఏ క్యాంప్ ఆఫీసులపై, వాహనాలపై, ప్రజా ప్రతినిధుల కార్యాలయాలపై దాడులు జరగడం అమానుషమనీ ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రజాప్రతినిధులు బాధ్యతారాహిత్యంగా వ్యక్తిగతంగా చౌక బారు విమర్శలు చేసుకోవడం శోచనీయమనీ . అధికార, ప్రతిపక్ష పార్టీలు సంయమనం పాటిస్తూ రాజకీయాల్లో విమర్శలు, ప్రతివిమర్శలు ప్రజా స్వామ్య పరిధిలోనే ఉండాలనీ హితవు చెప్పారు. దాడులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సిపిఐ(ఎం) డిమాండ్ చేస్తోందని జాన్ వెస్లీ అన్నారు.

## టిజి ఇఎపిసెట్-2026 ప్రవేశానికి 93శాతం అభ్యర్థులు హాజరు

**హైదరాబాద్, మే 9, ప్రభాతవార్త:** జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలోజీ యూనివర్సిటీ హైదరాబాద్‌లో జరిగిన కౌన్సెలింగ్‌కు శనివారం టిజి ఇఎపిసెట్-2026 అడ్మిషన్‌ల కోసం 93 శాతం అభ్యర్థులు హాజయ్యారు. ఉదయం పూట 34823 మంది రిజిస్ట్రేషన్ చేసుకోగా 32540 మంది హాజరైనారు.2283 మంది అనుపస్థితి చెందారు. అదే విధంగా మధ్యాహ్నం 34808మంది రిజిస్ట్రేషన్ చేసుకోగా 32390 మంది ఉపస్థితైనారు 2418మంది అభ్యర్థులు అనుపస్థితైనారు. ఉదయం 93.44శాతం సాయంత్రం 9305శాతం మంది హాజరైనారు. ఆదిలాబాద్, భద్రాద్రి, హైదరాబాద్ నాలుగు జోన్లు, కరీంనగర్, ఖమ్మం, కోదాడ, మహబూబ్‌నగర్, నల్లగొండ,నిజామాబాద్,సంగారెడ్డి సత్తుపల్లి, సిద్ది పేట, వరంగల్ జోన్‌లలో వివిధ ఇంజనీరింగ్ ప్రొఫెషనల్ కోర్సులలో ప్రవేశాల కోసం ఉదయం 9 నుంచి సాయంత్రం 6గంటల వరకు కాన్ఫిగరేషన్ డ్రైవ్ జరిపారు.

## అనుమానాస్పద స్థితిలో దంపతుల ఆత్మహత్య

### మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో విషాదం

**జడ్చర్ల, మే 9, ప్రభాతవార్త :** భార్యాభర్తలు అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన మహబూబ్ నగర్ జిల్లా జడ్చర్లలో కలకలం రేపింది. వివరాల్లోకి వెళ్తే.. జడ్చర్ల మున్సిపాలిటీలోని 24వ వార్డు విజయనగర్ కాలనీలో దంపతులు ఆకుతోట శేఖర్ (56) వరాలు (49 ) ఇంట్లో పడుకున్న చోటే విగత జీవులుగా పడి ఉండడం చూసి స్థానికులు షాక్ కు గురయ్యారు.



శేఖర్, వరాలు (ఫైల్)

శేఖర్ జడ్చర్లలో బియ్యం వ్యాపారంతో పాటు చీటీల ఏజెంట్‌గా కూడా వ్యవహరించే వారు. కొంతకాలంగా తన భార్య వరాలు అనారోగ్యంతో బాధపడుతుండగా శేఖర్ కూడా ఎక్కువగా బయటకు వెళ్లకుండా ఇంట్లోనే ఉంటున్నట్లు స్థానికులు చెప్పారు. తెల్లవారినా తలుపులు తెరవకపోవడంతో అనుమానం వచ్చిన కుమారుడు కిటికీ ద్వారా చూడగా ఇద్దరు విగత జీవులుగా పడి ఉండటాన్ని గమనించి వెంటనే పోలీసులకు సమాచారాన్ని అందించారు.విషయం తెలుసుకున్న ఎస్ఐలు మల్లేష్ జయప్రద ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. పురుగుమందు సేవించి ఆత్మహత్య చేసుకున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఆరోగ్య సమస్యలా ఇతర ఏవైనా ఆర్థిక సమస్యలు ఉన్నాయా లేదా కుటుంబ సమస్యలు ఉన్నాయా అనే పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. మృతదేహాలను జడ్చర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

# తెలంగాణ అభివృద్ధికి మోడీ గ్యారెంటీ

## కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలది ఎంఐఎం అజెండా

### బిజెపి రాజ్యసభ సభ్యుడు డా. కె.లక్ష్మణ్



**హైదరాబాద్, మే 9, ప్రభాతవార్త:** ప్రధాని నరేంద్ర మోడీ తెలంగాణ పర్యటన రాష్ట్ర రాజకీయాల్లో సరికొత్త ఉత్సాహాన్ని నింపుతోందని, ఇది రాష్ట్ర అభివృద్ధికి పెద్దపీట వేసే పర్యటన అని బిజెపి రాజ్యసభ సభ్యులు డా. కె. లక్ష్మణ్ పేర్కొన్నారు. 'మోడీ అంటే మోడల్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ ఇండియా' అని, దేశ ప్రజలు తమ తీర్పుతో మోడీ పట్ల ఉన్న విశ్వాసాన్ని పదేపదే నిరూపిస్తు న్నారని అన్నారు. శనివారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశవ్యాప్తంగా కమలం జెండా రెపరెపలాడుతున్న వేళ, గోల్కొండ కోటపై కాషాయ జెండా ఎగిరే రోజులు దగ్గరలోనే ఉన్నాయని ఆశాభావం వ్యక్తం చేశారు. నరేంద్ర మోడీ వికాస్, విశ్వాస్, విరాసత్ అనే నినాదాలతో సబ్ కా సాథ్ సబ్ కా వికాస్‌ను ఆచరణలో చూపిస్తుంటే.. కాంగ్రెస్, బిఆర్ఎస్, ఇండి కూటమికి ఎటువంటి అజెండా లేదని లక్ష్మణ్ విమర్శించారు. కాంగ్రెస్ + బిఆర్ఎస్ = ఎంఐఎం అని, ఈ మూడు పార్టీల పేర్లు వేరైనా వారి విధానాలు ఒకటేనని మండిపడ్డారు. అవినీతి, కుటుంబ పాలన, వంశపారంపర్య రాజకీయాలే ఆ పార్టీల లక్ష్యాలని, లౌకిక వాదం పేరుతో ముస్లిం సంతుష్టీకరణ రాజకీయాలకు పాల్పడుతూ హిందువులను, దేవీ దేవతలను కించపరచడమే వీరు పనిగా పెట్టుకున్నారని దుయ్యబట్టారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన నాయకత్వాన్ని మెప్పించుకోవడానికి 'కాంగ్రెస్ ఈజ్ ముస్లిం.. ముస్లిం ఈజ్ కాంగ్రెస్' అనే స్థాయికి దిగజారారని, ఆయన అనుముల రేవంత్ రెడ్డి కాదు.. అనుముల రేవంత రెడ్డిగా మారుతున్నారని ఆరోపించారు. నాడు సోమనాథ్ ఆలయ పునర్నిర్మాణానికి వెళ్లిన రాజేంద్ర ప్రసాద్‌ని అప్పటి ప్రధాని నెహ్రూ అడ్డుకుంటే, నేడు అయోధ్య రామమందిరాన్ని రాహుల్ గాంధీ, కాంగ్రెస్ నేతలు ద్వేషిస్తున్నారని లక్ష్మణ్ ఎద్దేవా చేశారు.
సిఎం రేవంత్ రెడి హేట్ స్పీచ్ చట్టం గురించి మాట్లాడటం దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని, ధైర్యముంటే హిందువులపై విద్వేష వ్యాఖ్యలు చేసిన ఓవైసీని జైల్లో వేయాలని సవాల్ విసిరారు. రాహుల్ గాంధీ విదేశాలకు వెళ్లి పదేపదే భారత ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ సంస్థలను కించపరుస్తున్నారని, ఆపరేషన్ సిందూర్ వంటి సైనిక విజయాలను, మహిళా అధికారులు సోఫియా ఖురేషి, వ్యోమికా సింగ్ వంటి వారి సేవలను కించపరచడం దురదృష్టకరమన్నారు. నిజాం రజాకార్ల అరాచక పాలనను సమర్థించే స్థాయికి దిగజారిన కాంగ్రెస్, బిఆర్ఎస్‌లకు ప్రజలు బుద్ధి చెప్పే రోజులు వచ్చాయన్నారు. సర్దార్ పటేల్ లేకుంటే తెలంగాణ పరిస్థితి ఏమయ్యేదో ఆలోచించుకోవాలని సూచిం చారు. 2029 నాటికి తెలంగాణలో బిజెపి బలమైన ప్రత్యామ్నాయ శక్తిగా ఎదుగుతుందని, ఇతర పార్టీల ప్రముఖులు సైతం మోదీ నాయకత్వాన్ని బలపరిచేందుకు సిద్ధంగా ఉన్నారని డా. కె.లక్ష్మణ్ ధీమా వ్యక్తం చేశారు.

# స్పెషల్ లీవ్ పిటిషన్ హేయమైన చర్య

## 2003 డిఎస్‌సి ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం అమలు చేయాలి

**హైదరాబాద్, మే 9,ప్రభాతవార్త:** డిఎస్‌సి 2003లో నియామకమైన ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం వర్తింప చేయాలని డివిజనల్ బెంచ్ స్పష్టమైన తీర్పు ఇవ్వగా ప్రభుత్వం స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేయడం హేయమైన చర్యగా పిటిఆర్‌టియు రాష్ట్ర అధ్యక్షుడు కార్యదర్శి పుల్గం దామోదర్‌రెడ్డి బిక్షంగౌడ్,మర్రి జయపాల్‌రెడ్డి జి.కృష్ణమూర్తిలు తీవ్రంగా ఖండించారు. కేంద్ర ప్రభుత్వం 2004సెప్టెంబర్ 1కి ముందు జారీ చేసిన నోటిఫికేషన్ ద్వారా నియామకం పొందిన వారికి పాత పెన్షన్ వర్తింప చేయాలని అమలు చేస్తోందని అంతేకాకుండా రాష్ట్రప్రభుత్వాలు కేంద్రం ఇచ్చిన ఉత్తర్వులు 57/4, 57/5 ప్రకారం అమలు చేయాలని కూడా తెలిపిందని వారు గుర్తుచేశారు. ఇటీవల టిజిఇజెఎసితో చర్చలు జరిపిన ముఖ్యమంత్రి ఓల్డ్‌పెన్షన్ విధానంపై సానుకూల నిర్ణయం తీసుకొంటామని హామి ఇచ్చారని ఐనా స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేయడం ద్వంద్వవైఖరీ అని ఆరోపించారు. కేంద్రప్రభుత్వం నిర్ణయాన్ని పరిగణలోకి తీసుకోకుండా అధికార యంత్రాంగం తప్పుదోవ పట్టిస్తోందని ఆవేదన చెందారు. ఉద్యోగుల పట్ల సానుభూతిగా వ్యవహరిస్తూ స్పెషల్ లీవ్‌పిటీషన్ వెనక్కి తీసుకోవాలని కోరారు.

### సిపిఎస్ పెన్షన్ విధానం అమలు చేయడం తగదు : తపస్

ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం వర్తింపజేయాలనీ తపస్ రాష్ట్ర అధ్యక్షులు ఒడ్నాల రాజశేఖర్,ప్రధాన కార్యదర్శి తెల్కలపల్లి పెంటయ్య డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం అమలులోకి వచ్చి నప్పుడు, దానికి అనుబంధంగా కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన 57/4, 57/5 ఉత్తర్వులు అత్యంత కీలకమైనవి అన్నారు. వీటి ప్రకారం సిపిఎస్ అమలుకు ముందు వెలువడిన నోటిఫికేషన్ల ద్వారా నియామకమైన వారికి పాత పెన్షన్ వర్తింపజేయాలనీ కోరారు. మన రాష్ట్రంలో ఐఏఎస్, ఐఎఫ్ఎస్ అధికారులకు ఈ ప్రయోజనాన్ని కల్పించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, సామాన్య ఉద్యోగ ఉపాధ్యాయులకు మాత్రం నిరాకరించడం సరైనది కాదునీ పేర్కొన్నారు .

### 57 మెమో అమలుపై ప్రభుత్వ చర్య అనైతికం : టిఎస్ యుటిఎఫ్ డిమాండ్

జాతీయ పెన్షన్ పథకం సిపిఎస్ అమలు తేదీకి ముందు విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం ఆ తదుపరి నియామకమైన ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని ఎంచుకునే అవకాశం ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం 57 మెమో ద్వారా జారీ చేసిన ఉత్తర్వులను అమలు చేస్తామని హామీ ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వం అందుకు భిన్నంగా హైకోర్టు తీర్పు ను సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేయడం పట్ల టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావ రవి ప్రధాన కార్యదర్శి ఎ వెంకట్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల జెఎసితో జరిపిన చర్చల్లో ఉపముఖ్యమంత్రి, ముఖ్యమంత్రి కూడా పదిహేను రోజుల్లో నిర్వహించే జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశంలో సానుకూల నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చి, అదేరోజు సుప్రీంకోర్టులో కేసు వేయడం అనైతికమని టిఎస్ యుటిఎఫ్ విమర్శించింది.

## రూ. 30,656 కోట్లతో 1,601 ఫుడ్ ప్రాసెసింగ్ ప్రాజెక్టులు

**హైదరాబాద్, మే 9, ప్రభాతవార్త :** ప్రధాన మంత్రి సంపద యోజన పథకంలో భాగంగా దేశ వ్యాప్తంగా 1,601 ప్రాజెక్టులు ఏర్పాటుకు కేంద్రం చర్యలు చేపట్టింది. ఈ ప్రాజెక్టు వ్యయం రూ.30,656.57 కోట్ల కాగా, ఆమోదించబడిన గ్రాంట్లు రూ.8,853.38 కోట్ల సహాయ నిధులు ఉన్నాయి. సంపద యోజన కాంపోనెంట్ స్కీమ్‌ల కింద దాదాపు 60 ప్రాజెక్టులు ఆమోదించబడ్డాయని తాజాగా కేంద్ర అధికారులు తెలిపారు. వాటిలో ఫుడ్ సేఫ్టీ క్వాలిటీ అష్యూరెన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ స్కీమ్ కింద ఒక ప్రాజెక్టు అమలు చేయబడిందని వెల్లడించారు. వ్యవసాయ ఉత్పత్తులకు సంబంధించిన పంటలకోత అనంతర మౌలిక సదుపాయాలు మరియు ప్రాసెసింగ్ సౌకర్యాలను సృష్టించడం వలన రైతులకు అనంతర నష్టాలు తగ్గుతాయని కేంద్రం భావిస్తోంది. కాంపోనెంట్ పథకాలు ఆహార ప్రాసెసింగ్, సంరక్షణ మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయడానికి వ్యవస్థాపకులకు గ్రాంట్ల రూపంలో ఆర్థిక సహాయం అందించనున్నట్లు పేర్కొంది. వీటిలో ఇతరత్రా, పంటకోత అనంతర నష్టాలను తగ్గించడానికి కోల్డ్ స్టోరేజీలు మరియు రిఫ్రిజిరేటెడ్ వాహనాలు కూడా ఉండటం విశేషం. నాబార్డ్ కన్సల్టెన్సీ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమల మంత్రిత్వ శాఖ సహాయంతో ఇంటిగ్రేటెడ్ కోల్డ్ చైన్, విలువ జోడింపు మౌలిక సదుపాయాల పథకం కింద అమలు చేయబడిన యూనిట్ల ప్రభావం పై అధ్యయన నివేదికను సమర్పించింది. ఈ నివేదిక ప్రకారం ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమల మంత్రిత్వ శాఖ యొక్క ఇంటిగ్రేటెడ్ కోల్డ్ చైన్ మరియు విలువ జోడింపు మౌలిక సదుపాయాల పథకం జోక్యం కారణంగా, అన్ని రంగాలు వృధాలో కొంత తగ్గుదల చూపించగా, పండ్లు కూరగాయలు, పాడి, మత్స్య రంగాలు వృధాలో గణనీయమైన తగ్గుదల చూపించాయని పేర్కొంది.

## బదలీల నుండి దివ్యాంగ ఉద్యోగులకు మినహాయింపు

**హైదరాబాద్, మే 9, ప్రభాతవార్త:** ప్రభుత్వ ఉద్యోగుల బదలీల్లో వికలాంగ ఉద్యోగులకు మినహాయింపు ఇవ్వాలని రాష్ట్ర సర్కార్ నిర్ణయించింది. ఇందులో భాగంగా మహిళాభి వృద్ధి, శిశు సంక్షేమ, దివ్యాంగులు, సీనియర్ సిటిజన్ల శాఖ తాజాగా జారీ చేసిన ఉత్తర్వు ప్రకారం, 70 శాతం లేదా అంతకంటే ఎక్కువ వైకల్యం ఉన్న ప్రభుత్వ ఉద్యోగులకు ఇకపై సాధారణ బదిలీలు, రొటేషనల్ బదిలీ విధానాల నుండి మినహాయింపు ఉంటుంది. దివ్యాంగుల హక్కుల చట్టం, 2016 కింద జారీ చేసిన ఉత్తర్వుల్లో, అర్హులైన ఉద్యోగులు పరిపాలనాపరమైన పరిమితులకు లోబడి వారి ప్రస్తుత పోస్టింగ్ స్థానంలో కొనసాగవచ్చని పేర్కొంది. నిర్దిష్ట వైకల్యాలున్న ఉద్యోగుల సేవలను గరిష్టంగా వినియోగించుకునేందుకు వారిని అక్కడే కొనసాగించాలని కూడా అందులో పేర్కొంది. అలాగే మేధో వైకల్యం ఉన్న పిల్లలు గల ప్రభుత్వ ఉద్యోగులకు కూడా ఈ మినహాయింపు వర్తిస్తుంది. 70 శాతం లేదా అంతకంటే ఎక్కువ వైకల్యం ఉన్న ఆధారపడిన కుమార్తెలు, కుమారులు, తల్లిదండ్రులు, జీవిత భాగస్వాములు, సోదరులు లేదా సోదరీమణుల సంరక్షకులకు, పరిపాలనా నిబంధనలకు లోబడి, సాధారణ బదిలీల నుండి మినహాయింపు ఉంటుందని తెలిపింది. కాగా దివ్యాంగులు, వృద్ధులు మరియు ట్రాన్స్‌జెండర్ వ్యక్తుల సాధికారత శాఖ డైరెక్టర్ వీటికి సంబంధించిన ప్రతిపాదనను ప్రభుత్వానికి సమర్పించారు. ఈ ప్రతిపాదనలను కూలంకషంగా పరిశీలించిన అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం తెలిపింది.

## టిజెఎస్ అధ్యక్ష పదవికి ప్రొఫెసర్ కోదండరాం నామినేషన్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 9:** మే 12న హైదరాబాద్‌లో జరగనున్న తెలంగాణ జన సమితి (టిజెఎస్) పార్టీ రాష్ట్ర 4వ ప్లీనరీ నేపథ్యంలో పార్టీ రాష్ట్ర అధ్యక్ష ఎన్నికల ప్రక్రియ కొనసాగుతోంది. పార్టీ రాష్ట్ర అధ్యక్ష ఎన్నికల నోటిఫికేషన్ ఇదివరకే విడుదల కాగా శనివారం ప్రొఫెసర్ కోదండరాంను అధ్యక్షులుగా బలపరుస్తూ పార్టీ నాయకులు 3 సెట్ల నామినేషన్లను దాఖలు చేశారు. ఈ ఎన్నికల ప్రక్రియకు పార్టీ సీనియర్ నేతలు ప్రొఫెసర్ పిఎల్ విశ్వేశ్వరరావు ప్రధాన ఎన్నికల అధికారిగా, మహమ్మద్ అఫ్జల్ ఎన్నికల అధికారిగా వ్యవహరిస్తున్నారు. ఈ నెల 12న జరిగే ప్లీనరీలో నూతన అధ్యక్షుని ఎన్నికను లాంఛనంగా ప్రకటించనున్నారు.




బిఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో లింగ వివక్ష నివారణపై డబ్ల్యుఎస్‌డబ్ల్యు ఆధ్వర్యంలో జరిగిన చర్చాగోష్టిలో పాల్గొన్న డిజి చారు సిన్హా. చిత్రంలో వివిధ రంగాల ప్రముఖులు

## లింగ వివక్ష నివారణపై డబ్ల్యుఎస్‌డబ్ల్యు ఆధ్వర్యంలో చర్చాగోష్టి

**హైదరాబాద్, మే 9, ప్రభాతవార్త:** సమాజంలో మహిళలకు ఎదురవుతున్న చిన్నచూపు, లింగ వివక్షత వారి మానసిక భద్రతపై తీవ్ర ప్రభా వం చూపుతుందని రాష్ట్ర మహిళా భద్రత విభాగం (డబ్ల్యుఎస్‌డబ్ల్యు) డిజి చారు సిన్హా తెలిపారు. బిఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం లో శనివారం నాడు డబ్ల్యుఎస్‌డబ్ల్యు ఆధ్వర్యంలో వీ హబ్ వేదికగా జరిగిన స్టాండ్ విత్ హర్ చర్చాగోష్టి కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో చారు సిన్హా మాట్లాడుతూ మహిళల పట్ల ఆయా రంగాలలో కొనసాగుతున్న వివక్షత సమూలంగా అంతరించాలని అన్నారు. ఉద్యోగాలు చేసే ప్రాంతంలో ఎగతాళి, అసభ్యకరంగా జోకులు వేయడం వంటి వి ప్రమాదకరంగా మారుతున్నాయని ఆమె తెలిపారు. ఇటువంటివి రూపుమాపాలని ఆమె కోరారు. ఇలాంటి తప్పిదాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. ఈ విషయంలో పురుషులు తమ ఆలోచన విధానాన్ని మార్చుకోవాలని ఆమె తెలిపారు. కార్పొరేట్ రంగ ం ప్రతినిధి శైలజ జోత్యుల మాట్లాడుతూ మహిళల ఎంపికను అందరు గౌరవించాలని కోరారు. ఇది సమాజ ఎదుగుదలలో కీలకమని ఆమె అ న్నారు. ఈ సమావేశంలొ సినీ దర్శకుడు శైలేష్ కొలను, టాటా అడ్వాన్స్ సిస్టం ఈడీ మసూద్ హుస్సేని, జర్నలిస్టు ప్రేమ మాలిని తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి భవిష్యత్తు కోసం 9 కొత్త గనులు

## ఇంధన అవసరాలు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు

### సింగరేణి సిఎండి డాక్టర్ బుద్ధప్రకాష్

**హైదరాబాద్, మే 9, ప్రభాతవార్త:** సంస్థకు ఉజ్వల భవిష్యత్తు అందించాలన్న ఉద్దేశంతో కొత్త గనుల ఏర్పాటుకు సింగరేణి ముమ్మర సన్నాహాలు చేస్తోంది. బొగ్గు నిల్వలు అయిపోగా మూతపడుతున్న గనుల ఉత్పత్తిని భర్తీ చేయడంతో పాటు, కార్మికులకు ఉపాధిని కొనసాగించడానికి, పెరుగుతున్న రాష్ట్ర ఇంధన అవసరాలు తీర్చడానికి కొత్త గనులను ప్రారంభించాలని నిర్ణయించినట్లు సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి వెల్లడించారు. హైదరాబాద్‌లో శనివారం సాయంత్రం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ సింగరేణి ప్రాంతంలో 9 ప్రాజెక్టులు చేపట్టడానికి ప్రణాళిక రూపొందించి, కేంద్ర బొగ్గు, అటవీ, పర్యావరణ శాఖల అనుమతికి ప్రతిపాదనలు సమర్పించినట్లు తెలిపారు. ఇప్పటికే 3 గనులకు అనుమతులు రాగా. వీటిలో ఒడిశా లోని నైనీ బ్లాక్‌లో బొగ్గు ఉత్పత్తిని ప్రారంభించడం జరిగిందన్నారు. దాదాపు దశాబ్ద కాలంగా పెండింగ్ లో ఉన్న ఈ ప్రాజెక్టు రాష్ట్ర ప్రభుత్వ చొరవతో కార్యరూపం దాల్చిందని చెప్పారు. అలాగే కొత్తగూడెంలో వీకే కోల్ మైన్ కూడా దాదాపు అన్ని అనుమతులను పూర్తి చేసుకుని బొగ్గు ఉత్పత్తికి సిద్ధమైందన్నారు. 2027-28 నాటికి సింగరేణిలో 4 గనులు మూతపడుతుండగా. ఏడాదికి 12.51 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి నిలిచిపోనుందని వివరించారు. అయితే కొత్తగా ప్రారంభించనున్న ఐదు ప్రాజెక్టుల వల్ల ఈ లోటును భర్తీ చేసుకునే అవకాశం ఏర్పడుతుందన్నారు. సింగరేణి ప్రాంతంలో ఇప్పటికే బొగ్గు తవ్వకాలు పూర్తి చేసుకొని మూతబడిన భూగర్భ గనుల లోతుల్లో ఇంకా మిగిలి ఉన్న బొగ్గు ఖనిజాన్ని వెలికి తీయడానికి ఈ ప్రాజెక్టులను చేపట్టినట్లు తెలిపారు. సింగరేణి రూపకల్పన చేసిన కొత్త ప్రాజెక్టుల్లో కొత్తగూడెం ఏరియాలో బొగ్గు తవ్వకాలు పూర్తిచేసిన భూగర్భ గనుల నుండి 190 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు గల వీకే కోల్ మైన్ ప్రధానమైనదిగా పేర్కొనవచ్చున్నారు. ఈ గనికి సంబంధించి ఇప్పటికే దాదాపు అన్ని అనుమతులు రాగా ఓవర్ బర్డెన్ తొలగింపు ప్రక్రియ ప్రారంభమైంది, త్వరలో బొగ్గు ఉత్పత్తి ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. ఇక జేకే ఓపెన్ కాస్ట్ గని (ఇల్లందు ఏరియా) 19.68 మిలియన్ టన్నులు. రామగుండం ఓసీ1 విస్తరణ ప్రాజెక్టు (రామగుండం3 ఏరియా) 181.60 మిలియన్ టన్నులు.గోలేటి ఓపెన్ కాస్ట్ (బెల్లంపల్లి ఏరియా) 38.98 మిలియన్ టన్నులు.ఎం.వి.కె ఓపెన్ కాస్ట్30.34 మిలియన్ టన్నులు.మణుగూరు ఓపెన్ కాస్ట్ ఎక్స్ టెన్షన్ (మణుగూరు ఏరియా) 40.45 మిలియన్ టన్నులు.ఆర్.కె.పి ఓసీపీ ఫేజ్2 (మందమర్రి ఏరియా) 34.42 మిలియన్ టన్నులు. పీకే కోల్ మైన్, కొండాపూర్ (మణుగూరు ఏరియా) 62 మిలియన్ టన్నులు కలిగిన వీటి పనులు వేగతంగా జరుగుతున్నాయన్నారు. ఈ సమావేశంలో సంస్థ డైరెక్టర్లు ఎల్.వి సూర్యనారాయణ, కె. వెంకటేశ్వర్లు, పోత్రు గౌతమ్, తిరుమల రావు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో డాక్టర్ విజయ్‌కుమార్ మృతి

**కల్వకుర్తి, మే 9 ప్రభాతవార్త:** జడ్చర్ల-కోదాడ ప్రధాన రహదారిపై కల్వకుర్తి సమీపంలోని సీబీఎం కళాశాల వద్ద శనివారం ఉదయం 7 గంటలకు చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో ప్రముఖ వైద్యులు గైనకాలజిస్ట్ డాక్టర్ విజయ్ కుమార్ మృతి చెందారు. సంఘటనకు సంబంధించిన స్థానికులు తెలిపిన వివరాల మేరకు... అక్షరవనంలో డాక్టర్ విజయ్‌కుమార్ ప్రతి రోజు ఉదయం షెటిల్ బ్యాడ్మింటిన్ ఆడేవారు. రోజు లాగానే షెటిల్ అడి కల్వకుర్తికి తన కారులో వస్తున్న సందర్భంగా ఎదురుగా వస్తున్న స్కూల్ బస్సు ఎదు రెదురుగా ఢీకొన్న సంఘటనలో డాక్టర్ విజయ్‌కుమార్ తీవ్రంగా గాయ పడ్డారు. వెంటనే 108లో కల్వకుర్తిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి వైద్య చికిత్సలు అందిస్తుంగా మృతి చెందినట్లు తోటి వైద్యులు తెలిపారు. మృతుడు డాక్టర్ విజయ్‌కుమార్ స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో విధులు నిర్వహించే వారని అది కాకుండా ప్రయివేటు ఆసుపత్రి ప్రజావైద్యశాలలో పని చేస్తున్నారని తెలిపారు. పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించారని, చిన్న వయస్సులోనే అకాల మరణం చెందడం చాలా బాధకర మని కల్వకుర్తి వాసులు కన్నీంటిపర్యంతమయ్యారు. ఆసుపత్రి ఆవరణలో విషాద ఛాయలు అలుముకున్నాయి.



విజయ్‌కుమార్ (ఫైల్)

చెలి




# భగవంతుని ప్రతిరూపం అమ్మ ఒకటే !

మాతృదేవో భవ, పితృదేవో భవ, ఆచార్యదేవో భవ అనే మన పురాణాలలో ప్రథమ స్తుతి తల్లితో మనం ప్రారంభించి తండ్రిని, గురువును, అతిథిని ఇలా ప్రణామ క్రమం చెప్పమని సంప్రదాయం నేర్పింది. ఆకలేస్తే అమ్మ, ఆపదొస్తే అమ్మ, ఆప్యాయత ఇస్తే అమ్మ, ఆదమరిస్తే జాగృతం చేసేది అమ్మ, మన అభివృద్ధిని కాంక్షించేది అమ్మ, మనకొక ఆకృతి ఇచ్చి భువిపై ఉనికిని ప్రసాదించేది అమ్మ.

ఈ మానవ జన్మకే కాదు, జంతువులకు, పక్షులకు, వృక్షాలకు కూడా తల్లి రక్షణలోనే సాగుతుంది జీవనం. అరమరికలేని ఆప్యాయతను అందించే అమ్మ ప్రత్యామ్నాయం లేని పవిత్ర ప్రేమకు చలనరూపం. తల్లే దైవమని ఘోషించిన సకల వేద రూపం మాతృమూర్తి. అందుకే మాతృదేవతగా చెప్పబడుతోంది. తారతమ్యం చూపని చైతన్య మూర్తి అమ్మ. అటువంటి మాతృమూర్తి కోసం సంవత్సరంలో ఒకే ఒక్క రోజును కేటాయించే సంప్రదాయం కాదు భారతీ యులది. హిందూ దేశంలో జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసి" అనే ఉపనిషత్సారం మనం గౌరవిస్తాం. కన్నతల్లి, మాతృభూమి స్వర్గం కంటే గొప్పవని తెలుసుకోవాలి. బిడ్డల ఆలనాపాలన చూస్తూ చక్కని భవిష్యత్తు నిర్మాణం కోసం నిరంతరం శ్రమిస్తూ బిడ్డల ఎదుగుదల చూసి నిస్వార్థంగా సంతోషించే మాతృమూర్తికోసం జీవితకాలం వెచ్చించాల్సిన కనీస ధర్మం. పాశ్చాత్యదేశాలలో పిల్లలు ఎదిగి తమతమ బాధ్యత తెలుసుకొని జీవించవలసిన స్థాయికి చేరుకుని తల్లి దండ్రులను వదలి వెళ్లిపోయి ఏడాదికి ఒక రోజు జననీజనకులకోసం మాతృదినోత్సవం, పితృదినోత్సవం వంటివి జరుపుకుంటారు. ప్రపంచ వ్యాప్తంగా 40కి పైగా దేశాలు ఈ సంప్రదాయం అనుసరిస్తున్నాయి మన చరిత్రలో శివాజీ తల్లి జిజియాబాయి తన కుమారునికి బాల్యం నుంచి స్త్రీల పట్ల గౌరవభావం, ధర్మానువర్తన, సమాజం కొరకు త్యాగనిరతి మొదలైన విషయాలపై అవగాహన కలిగించటం వలన మహిళలను గౌరవించటంలో అధికప్రాధాన్య మిచ్చేవాడు. కనుకనే చరిత్రలో శివాజీకి ఓ ప్రత్యేక స్థానం ఇస్తున్నాము. అది అతని మాతృమూర్తి పెంపకం వలన వచ్చిన వ్యక్తిత్వం. నేడు తల్లిపాత్ర తన ధర్మం మరచి విచక్షణ కోల్పోయి కన్నబిడ్డలను అతి చిన్న కారణాలకు పొట్టన పెట్టుకొనే కలియుగ మాతృమూర్తులు అక్కడక్కడ తారసపడుతున్నారు. వర్తమానంలో టీవీ చూడనివ్వడం లేదని 5 సం.ల పిల్లవాడిని తల్లి హతమార్చింది. ఏడాది బిడ్డ అడ్డుగా వస్తోందని హతమార్చి ప్రియునితో వెళ్ళిపోయినదొక తల్లి. మనసంతా కెలుకుతున్న అనుభూతి కలుగుతోంది. భారతదేశం మనకు అందించిన కొంతమంది మాతృమూర్తులు సర్వేపల్లి రాధాకృష్ణకు జన్మనిచ్చిన సీతమ్మ, సరోజినీదేవి మాతృమూర్తురాలు వరద సుందరీదేవి, రవీంద్రనాథ్ ఠాగూర్ మాతృమూర్తి శారదాదేవి, పీ.వి. నరసింహారావు తల్లి రుక్మాబాయి, అటల్ బిహారీ వాజపేయి తల్లి కృష్ణాదేవి, అబ్దుల్ కలాం తల్లి ఆషియమ్మ, భగత్సింగ్ తల్లి విద్యావతి, నేతాజీ సుభాష్ చంద్రబోస్ తల్లి ప్రభావతీదేవి ఇలా అనేకమంది మాతృమూర్తులు అపురూప కానుకలుగా వారి సంతానాన్ని మనకు అందించి భారతదేశ గౌరవ ప్రతిష్ఠలను ఇనుమడింపచేసారు. మాతృత్వం భగవంతు డిచ్చిన వరం. అది పొందలేని మహిళలు ఎంతో కృంగిపోతున్నారు. విలాసాల కోసమో, స్వేచ్ఛ కోసమో బిడ్డలకు దూరమయి వారికి మాతృవియోగం కలిగించటం నేరం కాదా. ఇక్కడ ఆలోచించవలసిన విషయం ప్రాణం పోసే తల్లే బిడ్డల ప్రాణం తీసే దిశగా వెళ్ళడం. ఇది సమాజానికి హానికరం మరియు చెడు సంకేతం. దయచేసి మాతృమూర్తులందరూ అమ్మాఅనే పిలుపుకి కళంకం తీసుకొని రావద్దు. మనకు స్ఫూర్తినిచ్చిన మాతృమూర్తులకు కృతజ్ఞతలు.

**- డాక్టర్ దేవులపల్లి పద్మజ**

**చిట్కా:** లెదర్ వస్తువులు మురికి పట్టి వుంటే నిమ్మబద్దతో రుద్దండి.

## అంతర్వాణి

# అందరికీ మేలు చేద్దాం..

మేలైనది చేయవలెనను కోరిక నాకు కలుగుచున్నది గాని, దానిని చేయుట నాకు కలుగుటలేదు. నేను చేయగోరు మేలు చేయగోరని కీడు చేయుచున్నాను (రోమా 7:18). మనం ఎవరికీ కీడు తలపెట్టాలని అనుకోం. సాధ్యమైనంతవరకు ఇతరులకు మేలుచేయాలని తపిస్తుంటాం. కానీ పైవాక్యం దేవుడి దృష్టిలో చూడాలి. ఆయన దృష్టిలో మనం మేలైనది చేయాలనే ఆశ ఉంటుంది. కోరికూడా ఉంటుంది. అందుకు ప్రయత్నిస్తుంటాం. ఇక్కడే మనం పొరపాట్లు చేస్తుంటాం. ఎందుకంటే ఎప్పుడైతే మనం దేవుడి రక్తంలోకడుగబడి, రక్షణ అనే ధన్యతలోకి వస్తామో అప్పుడు మనం అపవాదికి టార్గెట్గా మారిపోతాం. ఇక వాడు మనతో పోరాడుతూనేఉంటాడు. దేవుడికి ఇష్టమైన పనులు చేయకుండా ఆటంకపరుస్తూ ఉంటాడు. ప్రార్థన చేసుకోనివ్వడు, బైబిల్ చదువుకోనివ్వడు, ఇతరులు మనపై నిఘా ఉంచి, మన లోపాలను, తప్పులను ఎత్తిచూపాలని ప్రయత్నిస్తుంటారు. మనం క్రైస్తవులుగా మారితే ప్రపంచం మనల్నిదేవదూతలా మారిపోవాలని చూస్తుంది. అందుకే విశ్వాసులు నలిగిపోయినంతగా మరెవ్వరూ నలిగిపోరు. ప్రతి చోటా నీతిగా, నియితీగా ఉండాలి. అబద్దాలు చెప్పకూడదు. ఈ ప్రయత్నంలో మనం ఉంటే, లోకం మాత్రం మనల్ని నిందించేందుకు, విమర్శించేందుకుయత్ని స్తుంటుంది. మనల్ని అబద్ధికులుగా, అన్యాయస్తులుగా ముద్రించేందుకు ప్రయత్నిస్తుంది. అయినా పర్వాలేదు దేవుడి కోసంనమ్మకంగా జీవించాలి. సరే కొన్నిసార్లు కాదు చాలాసార్లు పొరపాట్లు చేస్తూనే ఉంటాం. అది మన శరీరంలో ఉన్న బలహీనత, దేవుడినియమానికి వ్యతిరేకంగా పోరాడే ఒక ముల్లు మన దేహంలో ఉంది. కానీ పూర్తిగా దేవుడిపై ఆధారపడినప్పుడు ఇలాంటి బలహీనతలనుమెల్లమెల్లగా జయిస్తుంటాం. సాధ్యమైనంతవరకు అందరికీ మేలు చేద్దాం. దేవుడు అట్టి కృప మనకు దయచేయునుగాక..

**- పి.వాణిపుష్ప**

# 'ఆమె' భద్రతకు 'సుమతి' భరోసా !



**అది అర్థరాత్రి 1 గంట సమయం. నిశిరాత్రివేళ..**

ఎవరో ఒకామె బస్టాండ్‌లో నిలుచుని ఉంది. అలా ఒక్కతే ఒంటరిగా ఎవరికోసమో ఎదురు చూస్తున్నట్లు అనిపిస్తుంది భారీగానూ ఉండదు. అలా అని బక్కపలచని ఆకారమూ కాదు. ఆమెను చూస్తే పెద్దామె కాదు అలా అని చిన్న వయస్కురాలిగానూ అనిపించదు. ఎవరైతేనేమి? ఆమె ఒక 'ఆడపిల్ల'. ఎక్కడ్నించి చూసారో ఏమో! కొందరు ఆకతాయిలు. అంగలు వేసుకుంటూ అక్కడికి నడిచొచ్చేసారు.

'అర్థరాత్రి ఆడపిల్ల ఒంటరిగా నడిరోడ్డుమీద నడిచి వెళ్లగలిగినపుడే దేశానికి స్వాతంత్ర్యం వచ్చినట్లని జాతిపిత మహాత్మాగాంధీ ఏనాడైతే అన్నారో గానీ స్వాతంత్ర్యం సిద్ధించి 79 ఏళ్ల గడచినా ఆయన కలలు కన్న 'స్త్రీ స్వాతంత్ర్యం' వచ్చినట్లు లేదు. మళ్లీ మళ్లీ అవే వ్యాఖ్యలు చెప్పుకుంటుంటాం. అందుకే ఈ సన్నివేశానికి అంతటి ప్రాధాన్యత. ఆమె ఉన్నది హైదరాబాద్‌లోని దిల్‌షుక్‌నగర్. బస్టాండులో బెదురు చూపులు లేవుకానీ ఎంతో ధైర్యంగా నిలబడి ఉంది. అలా అక్కడ ఆ సమయంలో ఆడపిల్ల ఉందంటే ఏ ప్రియుని కోసమో ఎదురు చూస్తూ ఉండచ్చు. లేదా ఎవరితోనో లేచి వచ్చేసెనా ఉండాలి. లేదా బతుకు తెరువు కోసం పొట్ట పోసుకుందామని ఊరినుంచి వచ్చెనైనా ఉండాలి లేదా పడుపుకత్తె అయినా అయి ఉండాలి. దూరంగా చూసే ఏ ఆకతాయి అయినా



ఇలాగే విశ్లేషించుకుంటారు ఎందుకంటే ఇది పాడు లోకం. ఏమైతేనే ఒంటరిగా ఉంది. అది పసికట్టిన పోకిరీలు, అర్థరాత్రి పూట 'టీ'కోసమంటూ బయటికొచ్చిన ఆకతాయిలైనా అయిఉండాలి. దిల్‌సుఖ్‌నగర్ రాజీవ్‌చౌక్‌లోని ఓ లాడ్జి సమీపంలో 'ఒక ఆమె' ఒంటరిగా నిలబడి ఉంది. ఎక్కడ్నించో గమనించిన 'ఆకలి కళ్లు' (చూపులు) ఆమెను గమనించి చుట్టూ చేరాయి. ఒకరు ఇద్దరు ముగ్గరు ఇలా దాదాపు 40 మంది వరకు ఆమె ముందు నుంచి 'గేలి' చేస్తున్నారు. ఎంత తీసుకుంటావని అసభ్యకరమైన మాటలతో విసిగిస్తున్నా ఆమె మారు మాటలాడలేదు. మౌనంగా ఉండిపోయింది వారి వ్యంగ్య వచనాలకు ఆమెలో ఏ ఫీలింగూ లేదు. ఆమెకు ఏ మాత్రం భయం లేకపోయినా బిత్తర చూపులు చూస్తోంది. 'భీతహరిణేక్షణి'గా అనుకుంటారు కాబోలు ఆమెను చూసి. కొందరు ద్విచక్రవాహనాలపై ఆమెకు దగ్గరగా వచ్చి చేరారు. వెకిలి మాటలు తాకాలని ప్రయత్నించడం... మందుబాబులైతే మరీను. అయినా ఆమె ఓర్చుకుంది. పైగా నిదానించింది కూడా. ఆమెపై అసభ్యకర వ్యాఖ్యానాలు చేస్తూనేఉన్నారు. వారిలో వాళ్లకి ఒళ్ళు పైకి తెలియడం లేదు. వారి వెకిలిచేష్టలకు ఎక్కడికీ పరిగెత్తకుండా విసవిసలు పడకుండా అంత ధైర్యంగా ఉంటే వారు మరీ కేరింతలు కొట్టారు. ఉండుండి మరీ పేట్రేగిపోతున్నారు. అదే సమయంలో ఆ మహిళకు ఓ పోలీసు కానిస్టేబుల్ వచ్చి సెల్యూట్ చేశారు. అపుడు కానీ ఆ పోకిరీలకు అకతాయిలకు బుర్ర వెలగలేదు. వెంటనే అక్కడ్నించి పరుగు లంఖించుకున్నారు. ఆమె ఎవరో కాదు. మల్కాజ్‌గిరి పోలీసు కమిషనర్ సుమతి. విధి నిర్వహణలో ఎంతో చురుగ్గా వ్యవహరిస్తారని ప్రతీతి. అంతమంది పోకిరీలు, ఆకతాయిలూ ఒక్క పక్క విసిగి స్తున్నా కదలకుండా పరిస్థితులను పరిశీలి స్తున్న 'సుమతి' విశ్వరూపం బయట పడగానే వారంతా ఎక్కడి దొంగలు అక్కడినే గప్‌చిప్! అనుకున్నారు. తలోదారినా పారి పోయారు. ఐనా 'సుమతి' చుట్టూ మూగి అల్లరి చేసిన వారిని పోలీసులు వెదికి మరీ తీసుకొచ్చారు. వారందరికీ కౌన్సిలింగ్ ఇచ్చివదిలేసారు. మరోసారి వాళ్లలా ప్రవర్తించరని ఆశిద్దాం. నైట్ డ్యూటీ ఎస్ఐ గంగాధర్‌రెడ్డి కంట్రోల్‌రూంకు నుంచి వచ్చిన ఫోన్‌కాల్‌లో హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు. ఆ మూడు గంటల పాటు పోకిరీల వేధింపులకు మౌనం వహిస్తున్నా, అదే సమయంలో ఏ ఒక పోలీసు అటువైపు గస్తీ తిరగకపోవడమూ ఆమె కళ్లు పరిశీలించాయి. గాంధీతాత ఆశయాలు ఎందుకు నెరవేరవో, ఆయన కలలు ఎందుకు తీరవో అప్పుడు తెలిసింది. కొత్తగా కమిషనర్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత కేవలం కొన్ని గంటల్లోనే ఆమె తన పరిధిలో క్షేత్రస్థాయిలో ఏం జరుగుతుందో తెలుసుకోవాలనుకుంది. అందుకే ఎవరికీ చెప్పకుండా నేరుగా నడచుకుంటూ దిల్‌సుఖ్‌నగర్‌కు వెళ్లింది. ఎవరికీ అనుమానం రాకుండా అక్కడే నిలబడి పరిసరాలను పరిశీలించింది. సివిల్‌డ్రెస్‌లో (మఫ్టీ) వెళ్లడంతో ఎవరి బాగోతం ఏమిటో తెలిసింది.. నిజానికి సరూర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో రాత్రివేళల్లో ఆకతాయిల అల్లర్లు, పోకిరీల పొగరుబోతు వ్యవహారాలు బాగా ఎక్కువని ప్రతీతి. కానీ ఇంత క్రితం ఏ అధికారీ ఇలాంటి నిఘా ఏర్పాటు చేయలేకపోయారు. నిందితుల విశ్వరూపం ఏమిటో కూడా ఏ పోలీసు అధికారీ పసిగట్టినట్టులేదు. లేకుంటే అలాంటి దృశ్యం మనకు కనపడేదికాదు. ఆ ప్రాంతంలోని బాధితులు కూడా పోలీసులకు చెప్పేందుకు ముందుకు వచ్చేవారుకాదు. దాంతో పేట్రేగి పోయారు. ఈ ఒక్క 'సుమతి' మేడమ్ తప్ప ఏ ఇతర పోలీసు అధికారీ అక్కడున్న పోకిరీలకు 'సుమతీ'శతకం బోధించేందుకు ముందుకు రాలేదంటే నమ్మండి! అయినా మనకెందుకులే..! అని మొహం తిప్పుకుని వెళ్లిపోయిన వారే! ఈసారి నగరంలో ఏ బస్టాండ్‌లో ఒంటరి ఆడపిల్ల కనబడినా ఆమె 'సుమతి' కావచ్చుననే ఆలోచన యువతలో, ఆకతాయిల్లో వస్తే గాంధీమహాత్ముని కలగన్న రోజు కళ్లెదుట కన్పిస్తుంది. మహిళల రక్షణ కోసం రాజీలేని పోరాటం చేసేందుకు తానున్నానంటూ పోలీస్ కమిషనర్ బి.సుమతి అభయమిచ్చారు. ఎవరేనా మహిళలు వేధింపులకు గురైతే 87126 62111 వాట్సప్ నంబర్‌కు ఫిర్యాదు చేయమని కోరారు.

# 'రాయవలస' టీజర్ లాంచ్

రాయవలస టీజర్ చాలా కనెక్టింగ్‌గా ఉంది. : టీజర్ లాంచ్ ఈవెంట్‌లో హీరో ఆకాశ్ జగన్నాథ్ రాయవలస మీ అందరికీ నచ్చే సినిమా అవుతుంది. కంటెంట్ నచ్చితే తప్పకుండా సపోర్ట్ చేయండి: హీరో కార్తీక్ జయంతి కార్తిక్ జయంతిని హీరోగా పరిచయం చేస్తూ RaysuN ప్రొడక్షన్స్ నిర్మిస్తున్న యాక్షన్ ఎంటర్టైనర్ "రాయవలస". ఈ చిత్రాన్ని గోపీ కృష్ణ జె నిర్మించగా మహిళా దర్శకురాలు రాధిక జయంతి దర్శకత్వం వహించారు. Love Tied by Fate అనే ట్యాగ్‌లైన్ వస్తున్న ఈ సినిమా ఫస్ట్ లుక్ మంచి రెస్పాన్స్ వచ్చింది. ఈ రోజు మేకర్స్ టీజర్ లాంచ్ చేశారు. యంగ్ హీరో ఆకాష్ జగన్నాథ్ ఈ వేడుకకు హాజరయ్యారు. టీజర్ లాంచ్ ఈవెంట్‌లో ఆకాష్ జగన్నాథ్ మాట్లాడుతూ.. ఈ వేడుకకు రావడం చాలా ఆనందంగా ఉంది. ఈ టీజర్ చూసినప్పుడు చాలా హ్యాపీగా అనిపించింది. టీజర్ చాలా బాగుంది. కార్తీక్ హీరోగా, వాళ్ల అమ్మ డైరెక్టర్‌గా, వాళ్ల నాన్న ప్రొడ్యూసర్‌గా ఉండడం చాలా క్రేజీగా అనిపించింది. కేఎల్ దామోదర్ ప్రసాద్ మాట్లాడుతూ.. ఈ సినిమా చాలా ప్రత్యేకంగా ఉంది. కార్తీక్‌ని వాళ్ల తల్లిదండ్రులే ప్రొడ్యూస్ చేస్తూ డైరెక్ట్ చేయడం విశేషం. తల్లి డైరెక్ట్ చేయడం, ఫాదర్ ప్రొడ్యూస్ చేయడం, కొడుకు హీరోగా చేయడం ఈ కాంబినేషన్ చాలా ప్రత్యేకంగా ఉంది. ఈ ముగ్గురూ ఒకే ఫ్యామిలీ కావడం వల్ల సినిమా ఇంకా ఈజీ అయింది. హీరోకార్తీక్ మాట్లాడుతూ... ఈ వేడుకకు అతిథులుగా వచ్చిన దామోదర్ ప్రసాద్‌కి, ఆకాష్‌కి ధన్యవాదాలు. మీడియా అందరికీ థాంక్స్. టీజర్ మీ అందరికీ నచ్చడం చాలా ఆనందంగా ఉంది. ఈ సినిమా జరగడానికి కారణమైన మా అమ్మ, నాన్న, రాఖీకి థాంక్యూ. డైరెక్టర్ రాధిక జయంతి మాట్లాడుతూ... ఈ వేడుకకు వచ్చిన అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు.



# రికార్డ్ క్రియేట్ చేసిన రామ్‌చరణ్ 'పెద్ది'



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ మోస్ట్ ఎవైటెడ్ రూరల్ స్పోర్ట్స్ డ్రామా 'పెద్ది' థియేటర్లలోకి రాకముందే సంచలనాలు సృష్టిస్తోంది. బుచ్చిబాబు సానా దర్శకత్వం లో తెరకెక్కుతున్న ఈ భారీ పాన్ ఇండియా చిత్రానికి నార్త్ అమెరికాలో అడ్వాన్స్ బుకింగ్స్ తుఫాన్‌లా దూసుకెళ్తున్నాయి. బుకింగ్స్ ప్రారంభమైన కేవలం నాలుగు గంటల్లోనే సినిమా 100కే డాలర్ల మార్క్‌ను దాటేసి ఆల్‌టైమ్ రికార్డ్ నమోదు చేసింది. ట్రైలర్ కూడా విడుదల కాకముందే ఈ స్థాయి ఓపెనింగ్ రావడం సెన్సేషనల్‌గా మారింది. రామ్ చరణ్ స్టార్ పవర్‌పై ప్రేక్షకులకు ఉన్న నమ్మకం, బుచ్చిబాబు స్టోరీ టెల్లింగ్ ప్రత్యేకత కలిసివచ్చి ఈ భారీ హైప్‌ను క్రియేట్ చేశాయి. నార్త్ అమెరికా రిలీజ్ ప్రత్యంగిరా సినిమాస్ నిర్వహి స్తోంది. వారి రిలీజ్ ప్లానింగ్ కూడా భారీ స్థాయిలో ఉంది. నార్త్ అమెరికాతో పాటు శ్రీలంక, ఆస్ట్రేలియా, సింగపూర్ సహా పలు దేశాల్లో ఈ చిత్రాన్ని గ్రాండ్‌గా విడుదల చేయనున్నారు. ఇప్పటివరకు 'పెద్ది' నుంచి విడుదలైన రెండు పాటలు, రెండు గ్లింప్స్, పోస్టర్లు.. ప్రతి అప్డేట్‌కు ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన వచ్చింది. రస్టిక్ మూడ్, రూరల్ బ్యాక్ డ్రాప్, రామ్ చరణ్ రగ్డ్ లుక్ అన్నీ సినిమాపై భారీ అంచనాలను పెంచాయి. ఇప్పటికే ఫైనల్ చేసిన థియేట్రికల్ ట్రైలర్ విడుదలైతే ఈ హైప్ మరింత రెట్టింపు అవుతుందని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి. వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని మైత్రి మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పిస్తున్నాయి. 'పెద్ది' జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా భారీ స్థాయిలో విడుదల కానుండగా, జూన్ 3 నుంచే ప్రీమియర్ షోలు ప్రారంభం కానున్నాయి.

# తెర

## హ్యాపీ బర్త్ డే విజయ్ దేవరకొండ



స్టార్ గా, పర్సన్‌గా విజయ్ దేవరకొండ జర్నీ ఎప్పుడూ ప్రత్యేకమే. ఒక్కొక్కటిగా ఆయన అనౌన్స్ చేస్తున్న భారీ పాన్ ఇండియా సినిమాలు అందరినీ ఆశ్చర్య పరుస్తున్నాయి. హీరో కొత్త సినిమా ఆయన గత సినిమా సాధించిన బాక్సాఫీస్ కలెక్షన్స్ మీద, ఆ సినిమా సాధించిన సక్సెస్ మీద ఆధారపడి ఉంటుంది. కానీ జయాపజయాలకు అతీతంగా విజయ్ దేవరకొండ క్రేజ్ ఎవరూ కదిలించలేని, శంకించలేని స్థాయికి చేరుకున్నట్లు ఆయన లైనప్ చూస్తే తెలుస్తోంది. రౌడీ జనార్ధన, రణబాలి, శౌర్యవ్, వైరా బ్యానర్ కొత్త సినిమా.. ఈ మూడు చిత్రాలు ఏమాత్రం మారని విజయ్ స్టార్ డమ్, రేంజ్‌ను చూపిస్తున్నాయి. స్టార్‌గా తను ఎదగడమే కాదు తన ఆకర్షణతో తెలుగు సినిమాను కూడా మరింత ఎత్తుకి తీసుకెళ్తున్నాడు విజయ్. నిర్మాతలు విజయ్ స్టార్‌డమ్‌ను, థియేటర్ పుల్లింగ్ క్రేజ్‌ను, ఆయన స్టామినాను నమ్ముతున్నారు. దర్శకులు తాము ఊహించుకున్న పాత్రలను విజయ్ సమర్థవంతంగా పోషించగలడని, ఆ పాత్రలకు లైఫ్ ఇవ్వగలడని విశ్వసిస్తున్నారు. విజయ్ కెరీర్ ప్రతి ఒక్కరికీ తెలిసిందే. మూవీ లవర్స్ కు ఆయన ఫిల్మోగ్రఫీలో 90 పర్సెంట్ ఫేవరేట్ మూవీస్ ఉంటాయి. అతి తక్కువ కాలంలో పాన్ ఇండియా ఆడియెన్స్ ఆదరణ, ప్రేమ పొందడం విజయ్ ప్రత్యేకత. పెళ్లి చూపులు మూవీ విజయ్ కెరీర్‌కు గట్టి పునాది వేసింది. విరోష్ పెళ్లికి సంబంధించిన ప్రతి విశేషం సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. ప్రధాని మోదీ ఆశీస్సులతో పాటు ఎందరో ప్రముఖ సినీ, రాజకీయ, క్రీడా, వ్యాపారవేత్తలు, వివిధ రాష్ట్రాల అభిమానులు, ప్రజలు విరోష్ ను హృదయపూర్వకంగా ఆశీర్వదించారు.

# కృతి స్టన్నింగ్ లుక్



డిజైనర్ లుక్ తో మెరిసిపోయింది. కృతి రెడ్ టాప్ షార్ట్స్ ధరించి ఇచ్చిన పోజులు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి వెండితెరపై తన అద్భుత నటనతో కోట్లాదిమంది అభిమానుల మనసు గెలుచుకున్న నటి కృతి సనన్ ఇప్పుడు వ్యాపార రంగంలోనూ అప్రతిహతంగా దూసుకుపోతోంది. ఇటీవల ముంబైలో జరిగిన ప్రతిష్టాత్మక ఫెమినా బ్యూటీ అవార్డ్స్ 2026 వేడుకలో బ్యూటీ అంట్రప్రెన్యూర్ ఆఫ్ ది ఇయర్ పురస్కారాన్ని అందుకున్నారు. కేవలం గ్లామర్ ప్రపంచానికే పరిమితం కాకుండా.. ఒక పారిశ్రామికవేత్తగా కృతి సాధిస్తున్న విజయాలు సినిమా రంగానికి ఆవల తనకు ఉన్న బలమైన పనితనాన్ని నిరూపిస్తున్నాయి. స్కిన్ కేర్ రంగంలో నూతన ఒరవడికి శ్రీకారం చుడుతూ కృతి ప్రారంభించిన వ్యాపార ప్రయాణం ఇప్పుడు ఒక మైలురాయిని చేరుకుంది. కృతి సనన్ స్థాపించిన స్కిన్ కేర్ బ్రాండ్ హైఫన్ అనతి కాలంలోనే సౌందర్య సాధనాల పరిశ్రమలో బలమైన ముద్ర వేసింది. సాధారణంగా సెలబ్రిటీలు బ్రాండ్ అంబాసిడర్లుగా మాత్రమే వ్యవహరిస్తుంటారు.. కానీ కృతి మాత్రం అందుకు భిన్నంగా ఉత్పత్తుల అభివృద్ధి.. బ్రాండ్ విజన్ .. క్వాలిటీ కంట్రోల్ వంటి విషయాల్లో స్వయంగా పాల్గొంటున్నారు. శరీరతత్వాన్ని బట్టి హైపెర్ఫార్మింగ్ సన్‌స్క్రీన్‌లు, బారియర్ రిపేర్ క్రీమ్‌లు గ్లో బూస్టింగ్ సీరమ్స్ వంటి వినూత్న ఉత్పత్తులను పరిచయం చేస్తూ వినియోగదారుల నమ్మకాన్ని గెలుచుకున్నారు. తన వ్యాపారాన్ని సామాన్యులకు చేరువ చేయడంలో కృతి అనుసరిస్తున్న వ్యూహాలు అద్భుతమనే చెప్పాలి. ఈ రంగంలో ఇప్పటికే పోటీపడుతున్న దీపిక పదుకొనే, కత్రిన లాంటి సీనియర్లకు భిన్నంగా కృతి తన బ్రాండ్ ని సక్సెస్ చేయడంలో సఫలమైంది. సామాన్యుల చర్మ సమస్యలను అర్థం చేసుకుంటూ.. అందరికీ అందుబాటులో ఉండే ధరలలో నాణ్యమైన ఉత్పత్తులను అందించడంలో విజయవంతమైంది. ఈ పారదర్శకతే తనను ఒక సక్సెస్ ఫుల్ అంట్రప్రెన్యూర్‌గా నిలబెట్టింది. వ్యాపారవేత్తగా బిజీగా ఉన్నా.. కృతి తన గ్లామర్ ప్రపంచాన్ని ఏమాత్రం విస్మరించడం లేదు. తాజాగా ప్రఖ్యాత మెరిసిపోయింది. కృతి రెడ్ టాప్ షార్ట్స్ ధరించి ఇచ్చిన పోజులు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఈ సమ్మర్ కి అనుగుణంగా ఉండే విభిన్నమైన డిజైనర్ దుస్తులను ధరించి ఫోజు లిచ్చింది. ఈ బ్యూటీ ఆకర్షణీయమైన రూపంతో పాటు తను షేర్ చేస్తున్న వ్యక్తిగత విషయాలు కూడా నెటిజన్లను ఆకట్టుకుంటున్నాయి.

# అమెజాన్ ప్రైమ్‌లో 'డెకాయిట్'

అమెజాన్ ప్రైమ్‌లో ఓటీటీ స్పేస్‌ను డామినేట్ చేస్తూ ఇండియా వైడ్ నెంబర్ 1 ట్రెండింగ్‌లో దూసుకెళ్తున్న అడివి శేష్



'డెకాయిట్'అడివి శేష్ మరోసారి డిజిటల్ స్పేస్‌పై తనకున్న పట్టుని నిరూపించారు. ఆయన నటించిన యాక్షన్ థ్రిల్లర్ 'డెకాయిట్' ఓటీటీలో సెన్సేషన్ సృష్టిస్తోంది. ఈ చిత్రం మే 8, 2026న అమెజాన్ ప్రైమ్ వీడియోలో విడుదలైన వెంటనే ఇండియా వైడ్ నెంబర్ 1 స్థానాన్ని దక్కించుకుంది. థియేటర్లలో విజయవంత మైన ప్రదర్శన అనంతరం ఓటీటీలోకి వచ్చిన ఈ సినిమా ఇప్పుడు డిజిటల్ స్పేస్‌లో కూడా భారీ విజయాన్ని అందుకుంది. ప్రస్తుతం తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో స్ట్రీమింగ్ అవుతున్న ఈ చిత్రానికి సోషల్ మీడియాలో అద్భుతమైన స్పందన లభిస్తోంది. మంచి కంటెంట్‌ను ఎంపిక చేసుకోవడంలో అడివి శేష్‌కు ఉన్న విజన్‌ని మరోసారి ప్రేక్షకులను ఆకట్టుకుంది. విభిన్న కథలు, బలమైన కథనాలతో ఆయనకు ఉన్న క్రేజ్ 'డెకాయిట్'తో మరింత బలపడింది. ఈ చిత్రంలో మృణాల్ ఠాకూర్ కథానాయికగా నటించగా, ఇద్దరి నటన సినిమాకి ప్రధాన బలంగా నిలిచింది. అనురాగ్ కశ్యప్, ప్రకాశ్ రాజ్, సునీల్, అతుల్ కులకర్ణి, జైన్ మేరీ ఖాన్, కామాక్షి భాస్కర్ల వంటి ప్రముఖ నటీ నటులు కీలక పాత్రల్లో కనిపించారు. దర్శకుడిగా పరిచయమైన షనీల్ డియో ఈ చిత్రాన్ని స్టైలిష్‌గా, గ్రిప్పింగ్‌గా తెరకెక్కించారు. సినిమాటో గ్రాఫర్ ధనుష్ భాస్కర్ విజువల్స్, కొదాటి పవన్ కళ్యాణ్ ఎడిటింగ్, భీమ్స్ సిసిరోలియో సంగీతం సినిమాకి మరింత బలం చేకూర్చాయి. అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్‌పై సుప్రియా యార్లగడ్డ, సునీల్ నారంగ్ నిర్మించిన ఈ చిత్రంలో ఉన్న హై ప్రొడక్షన్ వాల్యూస్ డిజిటల్ స్క్రీన్‌పైనా స్పష్టంగా కనిపిస్తున్నాయి. థ్రిల్లింగ్ కథనం, అద్భుతమైన టెక్నికల్ వాల్యూస్‌తో'డెకాయిట్' స్ట్రీమింగ్ చార్ట్స్‌ను షేక్ చేస్తోంది. మంచి కంటెంట్‌కు ఎప్పుడూ ప్రేక్షకాదరణ ఉంటుందనే విషయాన్ని ఈ సినిమా మరోసారి నిరూపించింది.

# 'రావు బహదూర్' జూలై 3న వరల్డ్ వైడ్ రిలీజ్



సూపర్‌స్టార్ మహేష్ బాబు, నమ్రతా శిరోద్కర్ జిఎంబి ఎంటర్‌టైన్‌మెంట్, ప్రముఖ దర్శకుడు వెంకటేష్ మహా దర్శకత్వంలో, వెర్సటైల్ యాక్టర్ సత్యదేవ్ కథానాయకుడిగా నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ సైకాలజికల్ థ్రిల్లర్ 'రావు బహదూర్' చిత్రాన్ని సగర్వంగా సమర్పిస్తున్నారు. తాజాగా మేకర్స్ ఈ చిత్రాన్ని జూలై 3న ప్రపంచ వ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. రిలీజ్ డేట్ పోస్టర్‌లో సత్యదేవ్ వయసు పైబడిన రాయల్ లుక్‌లో కనిపించారు. రాయల్ పర్పుల్ దుస్తులు, ముత్యాల అలంకరణలు, హ్యాండ్ ఫ్యాన్, వెనుక గ్రాండ్ సెటప్ కలిసి ఓ మిస్టీరియస్ అరిస్టోక్రాటిక్ ప్రపంచాన్ని చూపిస్తున్నాయి. పోస్టర్ మొత్తం సైకాలజికల్ డ్రామాకు తగ్గట్టుగా ఇంటెన్స్ వాతావరణాన్ని సృష్టిస్తోంది. ఈ చిత్రంలో దీపా థామస్ కథానాయికగా నటిస్తుండగా, వికాస్ ముప్పాల, బాలా పరాశర్, ఆనంద్ భారతి, ప్రణయ్ వాక, మాస్టర్ కిరణ్ ఇతర కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ చిత్రానికి స్ట్రాంగ్ టెక్నికల్ టీమ్ పని చేస్తోంది. కార్తిక్ పరమార్ సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, స్మరణ్ సాయి సంగీతాన్ని సమకూరుస్తున్నారు. ప్రొడక్షన్ డిజైన్ బాధ్యతలను రోహన్ సింగ్ నిర్వహిస్తున్నారు.

## రెవెన్యూ యంత్రాంగం నిద్రావస్థలో ఉందా : ఎమ్మెల్యే



పార్వతీపురం, మే 9, ప్రభాతవార్త: ప్రభుత్వ స్థలాన్ని ప్రైవేటు వ్యక్తులు ఎలా లీజుకు ఇస్తారని, రెవిన్యూ అధికారులు జిల్లా అధికారులు చూస్తూ ఎలా ఊరుకున్నారు అంటూ స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర ప్రభుత్వ అధికారులపై విరుచుకుపడ్డారు. శనివారం ఎమ్మెల్యే మండలం అడ్డాపుశీల రెవెన్యూ పరిధిలో గల సర్వే నంబర్ 70/2లో గల సుమారు మూడున్నర ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించారు. ఆ స్థలంలో ఉన్న ఇటుకు తయారు చేసే ఇటుక బట్టి వారిని, ఇతర దుకాణదారులను ఆ స్థలంలో షాపులు నిర్వహణకు ఎవరు అనుమతి ఇచ్చారని అడగగా వారు బంటు వాని వలస గ్రామానికి చెందిన బంటు దాసు ఇచ్చారని అద్దె కూడా చెల్లిస్తున్నామని చెప్పడంతో ప్రభుత్వ స్థలంలో ఆయన ఎలా అనుమతిస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత 5 సంవత్సరాల నుంచి బంటు దాసు అనే వ్యక్తి ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి దందాలు జరుపుతున్నారని తనకు గతంలోనే ఫిర్యాదు అందిందని ఈ విషయంపై సాక్షాత్తు ఇంచార్జ్ మంత్రి దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని, అలాగే జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌లకు నా లెటర్ పై లిఖితపూర్వక రాసి ఫిర్యాదు చేయడం జరిగిందనిన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బోను చంటి, మజ్జి వెంకటేష్‌తో పాటు తెలుగుదేశం పార్టీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## భారీ త్రిశూల్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే మాధవి



డెంకాడ, మే 9 ప్రభాతవార్త: విశాఖ కైలాసగిరి పై భారీ త్రిశూలం ప్రారంభోత్సవంలో నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగ మాధవి పాల్గొన్నారు. శనివారం ప్రారంభోత్సవం అనంతరం ఎమ్మెల్యే రాష్ట్ర సుభిక్షంగా ఉండాలని ప్రజలందరికీ ఆయురారోగ్యాలు సుఖ సంతోషాలు కలగాలని ఆమె ఈ సందర్భంగా ఆ పరమశివుని కోరారు వాటికోసం విశేష పూజలు నిర్వహించారు. విశాఖపట్నం పర్యాటక రంగానికి ఆధ్యాత్మిక శోభకు ప్రత్యేకగా ఈ త్రిశూల ఏర్పాట్లు కొనియాడ వచ్చని ఆమె అన్నారు. అన్ని రంగాల్లో మన విశాఖ నగరం అద్భుత ఆవిష్కరణలకు ప్రతిజ్ఞ నిలుస్తుందని ఈ త్రిశూల ఏర్పాట్లు మరింత ఆధ్యాత్మిక, పర్యాటకానికి మరింత ఊతమిస్తుంది అన్నారు. కార్యక్రమంలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్ విఆర్‌డిప చైర్మన్ ప్రవీణ్ గోపాల్, కమిషనర్ తేజ్‌భరత్, తదితరులు పాల్గొన్నారు.

## మత్తు పదార్థాలకు బానిసలై జీవితాలు నాశనం చేసుకోవద్దు : డీఎస్పీ



చీపురుపల్లి , మే 9, ప్రభాతవార్త : నేటి యువత గంజాయి, డ్రగ్స్, వంటి మత్తు పదార్థాలకు బానిసలై జీవితాలను నాశనం చేసుకోకూడదని చీపురుపల్లి డిఎస్పి ఎస్ రాఘవులు సూచించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు శనివారం నాడు చీపురుపల్లి పట్టణ పరిధిలోని అంబేద్కర్ కాలనీ, రామాంజనేయ కాలనీ ప్రాంతాలలో కార్డెన్ ఎండ్ చర్చ్ కార్యక్రమాన్ని ఉదయం ఐదు గంటల నుంచి ఏడు గంటల వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇళ్ల వద్ద ఉన్న ప్రతి వాహనాన్ని తనిఖీ చేయడంతో పాటు అనుమానం ఉన్నచోట్ల చర్చలు జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత తప్పుడు మార్గాల వైపు ప్రయాణించకుండా చూసుకోవలసిన బాధ్యత తల్లిదండ్రుల పైన కూడా ఉందన్నారు. మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా ప్రతి ఒక్క తల్లిదండ్రులు కూడా పిల్లల నడవడిక పైన దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో చీపురుపల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్ జి శంకర్రావు, ఎస్సై ఎల్ దామోదర్ రావు, గరివిడి ఎస్ఐ లోకేష్, గుర్ల ఎస్సై నారాయణరావు, చీపురుపల్లి గరివిడి బుధ రాయవలస గుర్ల పోలీస్ స్టేషన్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి : సీఐ



చీపురుపల్లి, మే 9, ప్రభాతవార్త : చీపురుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న రౌడీ షీటర్లు మంచి ప్రవర్తనతో వారి నడవడికను మార్చుకోవాలని చీపురుపల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్ జి. శంకర్రావు హెచ్చరిం చారు. శనివారం నాడు చీపురుపల్లి సర్కిల్ కార్యాలయంలో స్టేషన్ పరిధిలో గల రౌడీషీటర్లకు రప్పించి వారి ప్రవర్తన మార్చుకొని మంచివారిగా మారకపోతే భవిష్యత్తులో ఇబ్బందులు ఎదుర్కొంటారని పలు సూచనలు చేశారు. ఇటువంటి చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడిన వారి పైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రౌడీ షీటర్లుగా సంఘవిద్రోహ చర్యలకు పాల్పడితే చట్ట పరధిలో కఠిన చర్యలు తీసుకొని శిక్షింపబడతారని సూచించారు .సర్కిల్ పరిధిలో నమోదైన ప్రతి రౌడీషీటర్ పైన పోలీసులు ప్రత్యేక గస్తీ నిర్వహిస్తూ నిఘా ఏర్పాటు చేశామని ఈ సందర్భంగా ఆయన సూచించారు. కార్యక్రమంలో చీపురుపల్లి ఎస్సై ఎల్ దామోదర్ రావు, గరివిడిఎస్ఐ లోకేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ కాంప్లెక్స్‌లో గంజాయి రవాణాపై నిఘా : డీఎం



సాలూరు, మే 9, ప్రభాతవార్త : రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఆదేశాలతో మాదక రవ్యాల రహిత సమాజమే లక్ష్యంగా ఆర్టీసీ కాంప్లెక్స్‌లో శనివారం ఉదయం డిపో మేనేజర్ పి ఆచారి ఆధ్వర్యంలో హెడ్ కానిస్టేబుల్ ముమ్మర తనిఖీలు చేపట్టారు. ఈ మేరకు బస్సుల్లో ఇంకా పార్సెల్ సర్వీసుల ద్వారా గంజాయి అక్రమరవాణా జరగకుండా క్షుణ్ణంగా పరిశీలించారు. అలాగే లైసెన్స్డ్ పోర్టర్లు, డ్రైవర్లు ఇంకా కండక్టర్లతో సమావేశమై మాదక ద్రవ్యాల నియంత్రణపై అవగాహన కల్పించారు. బస్సుల్లో ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే లేదా అపరిచిత వ్యక్తులు ఇచ్చే పార్సెల్స్ పట్ల సిబ్బంది, ప్రయాణికులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. మాదక ద్రవ్యాల రవాణాకు సంబంధించిన సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు కానీ ఆర్టీసీ అధికారులకు తెలపాలన్నారు. సామాజిక బాధ్యతగా యాంటీడ్రగ్ ప్రోగ్రామ్‌లో అందరూ భాగస్వాములు కావాలని డిఎం పిలుపునిచ్చారు.

## ఆలయాలకు 1.40 కోట్ల నిధులు మంజూరు : ఎమ్మెల్యే



లక్కవరపుకోట , మే 9, ప్రభాత వార్త: శృంగవరపుకోట నియోజకవర్గం లోని ఆధ్యాత్మిక కేంద్రాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం భారీగా నిధులు మంజూరు చేసింది. తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అనుబంధ సంస్థ అయిన శ్రీవాణి ట్రస్ట్ ద్వారా నియోజకవర్గంలోని ఏడు ప్రధాన ఆలయాలలో భజన మందిరాల నిర్మాణానికి రూ. 1.40 కోట్ల నిధులను కేటాయిస్తూ దేవాదాయ శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు శనివారం ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా నిధులు మంజూరు చేసిన సీఎం చంద్రబాబుకి టి టి డి చైర్మన్‌కి ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆధ్యాత్మిక వికాసానికి పెద్దపీట వేయడం లో భాగంగా నియోజకవర్గంలో పురాతన కాలం నుండి భక్తుల ఆదరణ పొందుతున్న ఆలయాలను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ఈ నిధులను తీసుకువచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఒక్కో ఆలయానికి రూ. 20 లక్షల చొప్పున మొత్తం 7 ఆలయాలకు ఈ నిధులు వెచ్చించనున్నామని ఎమ్మెల్యే తెలిపారు. నియోజకవర్గంపై ప్రత్యేక మమకారంతో అడిగిన వెంటనే నిధులు మంజూరు చేసిన గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి, దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డికి ఎమ్మెల్యే ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అలాగే టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడి సహకారాన్ని ఆమె కొనియాడారు. భజన మందిరాల నిర్మాణంతో స్థానిక భక్తులకు భజనలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించుకోవడానికి ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందని ఆమె పేర్కొన్నారు. త్వరలోనే ఈ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి, నాణ్యతతో పూర్తి చేస్తామని ఎమ్మెల్యే లలితకుమారి స్పష్టం చేశారు.

## పోయిన సెల్‌ఫోన్ అప్పగింత



సాలూరు, మే9, ప్రభాతవార్త: సెల్‌ఫోన్ పోగొట్టుకున్న వ్యక్తికి కొద్ది రోజులలోనే ఆధునిక టెక్నాలజీ సహాయంతో ట్రాక్ చేసి అతనికి ఫోన్ అందజేసిన ఘటన టౌన్ పోలీస్ స్టేషన్ చోటుచేసుకుంది. ఆ వివరాలు కొద్దిగా చూద్దాం ఈమధ్య బొబ్బిలిలో జరిగిన దాడితల్లమ్మ పండగలో బోగి చంటి (అలజంగి)అనే వ్యక్తి సెల్‌ఫోన్ పోవడంతో అక్కడ పోలీస్ స్టేషన్‌లో కంప్లైంట్ చేయడం జరిగింది. అలాగే కేసు నమోదు చేసుకున్న పోలీసులు సెల్ ఫోన్ ఐఎంఇఐ (ఇంటర్నేషనల్ మొబైల్ ఎక్విప్మెంట్ ఐడెంటి) నెంబర్ తో ట్రేస్ చేసి ఆఫోన్ సిమ్ ఏ టవర్ సిగ్నల్ ద్వారా పని చేస్తుందో కనుగొన్నారు. దీనితో సెల్ ఫోన్ రికవరీ చేసుకుని శనివారం టౌన్ పోలీస్ స్టేషన్ ఏఎస్ఐ శ్రీనివాసరావు చేతుల మీదుగా ఫోన్ పోగొట్టుకున్న వ్యక్తికి ఫోన్ అందజేసారు. అంతేకాకుండా సెల్ ఫోన్ పోయిన కొద్ది రోజులలోనే తన ఫోన్ తిరిగి జాగ్రత్తగా అందజేయడంతో టౌన్ సీఐ అప్పలనాయుడు, పోలీస్ సిబ్బందికి భోగి. చంటి కృతజ్ఞతలు తెలిపారు.

## కొబ్బరి అభివృద్ధి కోసం రైతులకు భారీ సబ్సిడీలు



శృంగవరపుకోట, మే9, ప్రభాతవార్త: కొబ్బరి అభివృద్ధి కోసం ప్రభుత్వం రైతులకు భారీ సబ్సిడీలు ప్రకటించిందని మండల ఉద్యానవన శాఖాధికారి పూసర్ల స్వాతి తెలిపారు. కొత్తగా తోటలు వేసే రైతులకు మొక్కలు కొనుగోలు, పాత తోటలు పునరుద్ధరణ, నాణ్యమైన నర్సరీలు ఏర్పాటు ఇందుకు సంబంధించి నిర్వాహణ కోసం ప్రభుత్వం ఆర్థిక సాయం అందజేయనున్నట్లు తెలిపారు. రైతుకు గరిష్టంగా రెండు హెక్టార్ల భూమి కలిగి ఉండాలని ఒక హెక్టార్ కు160మొక్కలు నాటాలని తెలిపారు. గోదావరి గంగ మొక్కలు కావాలంటే అంబాజీపేటలోని రీసెర్చ్ స్టేషన్ లో ముందుగా ఆన్ లైన్ లో బుక్ చేసుకోవాలని తెలిపారు. ఇక సబ్సిడీ విషయానికొస్తే ఒక హెక్టార్ కు రెండేళ్లకు 56,000వేల రూపాయలు అందజేస్తామని తెలిపారు. మొదటి ఏడాది 28,000వేలు, రెండో ఏడాది 28,000 వేలు సబ్సిడీ రైతులకు అందజేయడం జరుగుతుందన్నారు. సబ్సిడీ పొందాలంటే కొత్తగా మొక్కలు నాటిన ప్రాంతంలో జియోట్యాగ్ చేయబడిన ఫోటోతో దరఖాస్తు పెట్టాలని అలాగే దరఖాస్తు దారునికి ఆస్తిపై చట్టం పరమైన హక్కులు కలిగి ఉండాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నుండి స్వీకరించబడిన ధ్రువీకరించబడిన దరఖాస్తు ఆధారంగా సీడీబీ నుంచి డీబీటీ ద్వారా సబ్సిడీ నేరుగా రైతు బ్యాంకు ఖాతాకు జమ చేయడం జరుగుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్ ఉద్యానవన శాఖ, కొబ్బరి అభివృద్ధి సంస్థ సంయుక్తంగా కొబ్బరి రైతులకు సబ్సిడీలు అందిస్తుందని కొబ్బరి రైతులు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఉద్యానవన శాఖ అధికారి స్వాతి తెలిపారు.

## యువత మత్తుకు బానిస కావొద్దు : సీఐ

కురుపాం, మే 10 ప్రభాతవార్త : యువత మత్తు పదార్థాలకు బానిసై తమ బంగారు జీవితాన్ని పాడు చేసుకుంటున్నారని ఎల్విన్ పేట సర్కిల్ ఇన్స్పెక్టర్ హరి అన్నారు. శనివారం సర్కిల్ పరిధిలో నీలకంఠాపురం, కురుపాం పోలీస్‌స్టేషన్ పరిధిలలో యువతకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. నీలకంఠాపురం పోలీస్ స్టేషన్ పరిధిలో లేవిడి జంక్షన్ వద్ద సిఐ మాట్లాడుతూ యువత గంజాయి డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు బానిసై జీవితాలు నాశనం చేసుకోకూడదు అని సూచించారు. వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా లైసెన్స్ కలిగి హెల్మెట్ ధరించుకోవాలని కోరారు. కురుపాంలో రోడ్డు భద్రతపై ఎస్సై నారాయణరావు యువతకు అవగాహన కల్పించారు. వాహనం మీద పెట్టేటప్పుడు తప్పనిసరిగా లైసెన్సు కలిగి ఉండాలని అలాగే హెల్మెట్ ధరించాలని, మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించరాదని సైబర్ నేరాలు పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కురుపాం, నీలకంఠాపురం ఎస్ఐలు నీలకంటారావ్, నారాయణరావు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా సాయిబాబా విగ్రహ ప్రతిష్ట

దత్తిరాజేరు, మే9, ప్రభాతవార్త మండలంలోని మరడ్నా గ్రామంలో నూతనంగా షిరిడి సాయి బాబా మందిరాన్ని నిర్మించారు. విగ్రహానికి శ్రీనివాస్ రాజేష్ పురోహితులు ఆలయ నిర్వాహకులతో ప్రతిష్ట పూజలు శనివారం ఘనంగా చేశారు. పలు రాజకీయ నాయకులు పాల్గొన్నారు . వీరికి పురోహితులు మంత్రోచ్చారణతో పూజలు చేశారు షిరిడి సాయి మందిరానికి గ్రామ ప్రజలు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. వీరికి పురోహితులు అభిషేక పూజలు చేశారు. 11 గంటలకు శిరిడి సాయి బాబా విగ్రహ ప్రతిష్టించారు అనంతరం మహా హారతిని బాబాకు సమర్పించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదాన్ని ఏర్పాటు చేశారు. సాయంకాలం స్వామివారి పల్లకి సేవ ఊరేగింపు చేస్తామన్నారు. ప్రతిష్ట కార్యక్రమాన్ని కమిటీ సభ్యులు సహకారంతో ప్రతిష్ట దివ్యంగా పూర్తి చేశామని ఆలయ నిర్వహకులు అన్నారు గ్రామస్తులు సహకారము , దాతల సహకారం వల్ల శిరిడి సాయి బాబా ఆలయాన్ని వేగవంతంగా నిర్మించడం జరిగిందని ఆలయ నిర్వాహకులు మరియు కమిటీ సభ్యులు తెలిపారు భక్తులు యావన్మంది ఆనందోత్సవంతో శిరిడి సాయి బాబా ప్రతిష్ట కార్యక్రమానికి వచ్చిన భక్తులందరికీ శిరిడి సాయిబాబా ఆశీస్సులు పొందాలని సాయిబాబా కరుణ కటాక్షంమన అందరిపై చూపాలని బాబాను వేడుకుంటున్నా కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు పాకలపాటి రఘువర్మ మాజీ వైస్ ఎంపీపీ పెద్దింటి మోహన్ వైసిపి మాజీ జడ్పిటిసి మంత్రి అప్పలనాయుడు మిత్తిరెడ్డి వెంకట రామ గ్రామ పెద్దలు గోపి శంకర్రావు కృష్ణ మురళి పాల్గొన్నారు.

## మత్తు పదార్థాలపై అవగాహన

మెరకముడిదాం, ఏప్రిల్ 9, ప్రభాతవార్త: మండలంలో జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సంకల్పం 2.0 లో భాగంగా డ్రగ్స్‌కు వ్యతిరేకంగా గర్భాం, భైరిపురం గ్రామాల్లో అవగాహన కార్యక్రమం బుధరాయవలస ఎ.ఎస్.ఐ. ఆరి ఆధ్వర్యంలో యువతకు, ప్రజలకు డ్రగ్స్ గంజాయి వల్ల కలిగే దుష్ప్రభావాలు గురించి అవగాహన కల్పించారు. అనంతరం మహిళల భద్రత సైబర్ నేరాలు, దొంగతనాలు విషయాలు గురించి తెలియజేశారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

## లాడ్జీల తనిఖీ



గరివిడి, మే 9, ప్రభాత వార్త : గరివిడి పోలీస్ స్టేషన పరిదిలోగల పలు లాడ్జీలను గరివిడి ఎస్ఐ బి.లోకేశ్వరరావు తనిఖీ చేశారు. లాడ్జీ ల్లో ఎటువంటి అకృత్యాలు జరగకుండా ఉండేందుకు గాను ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా లాడ్జీలు తనిఖీ చేపట్టారు. లాడ్జీ గదులను పరిశీలించారు. అలాగే లాడ్జీల్లో విశ్రాంతి తీసుకునే వారి వివరాలను ఆధార్ కార్డుల చిరునామాలను పరిశీలించారు. అపరిచిత వ్యక్తులు లాడ్జీలను వస్తే సమాచారం ఇవ్వాలని సంబంధిత లాడ్జీ యజమానులకి ఆదేశించారు. తనిఖీల్లో ఎటువంటి లోపాలు కనిపించలేదు అన్ని లాడ్జీల యజమానులు సక్రమంగా నిబంధనలు పాటించి లాడ్జీలు నడుపుతున్నారని ఎస్ఐ స్పష్టం చేశారు.

విజయనగరం పార్వతీపురం మన్యం వార్త 25

## శ్రీ విజయ హాస్పిటల్‌లో ఉచిత కంటి ఆపరేషన్లు

పార్వతీపురం, మే 9, ప్రభాతవార్త: ఉన్నవారు, లేనివారు అని తారతమ్యం లేకుండా అందరికీ అందుబాటులో ఉచితంగా కంటి ఆపరేషన్లు అందించాలనే లక్ష్యంతో పాలకొండలో ఉన్న శ్రీ విజయ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో ఉచితంగా కంటి ఆపరేషన్లను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ దూబ పద్మావతి అన్నారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ సర్వేంద్రియానం నయనం ప్రధానం అన్నారు పెద్దలు. అన్ని అవయ వాల్లో కన్నా కన్ను ప్రధానమైనదని దీని అర్థం. ఆర్థిక స్తోమత లేక కంటి చికిత్స కోసం, ఆపరేషన్ల కోసం దూరప్రాంతాలకు వెళ్లలేని వారికోసం తమ హాస్పిటల్‌లోనే ఉచిత కంటి ఆపరేషన్ చేయడం జరుగుతుందని అన్నారు. పేద ప్రజలకు కంటి చూపును అందించాలని లక్ష్యంతో ఈ కంటి ఆపరేషన్‌లను మా విజయ హాస్పిటల్ లో ఏర్పాటు చేశామన్నారు. క్యాట్ రాక్ట్, రెటీనా కేర్, గ్లూకోమా, డిజిటల్ ఐ స్ట్రయిన్, కంప్యూటర్ విజన్ సిండ్రోమ్ మొదలైన సేవలు ఆరోగ్యశ్రీ, ఆరోగ్య రక్ష, ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్, పెన్సనర్ హెల్త్ స్కీం, ద్వారా అందించడం జరుగుతుందన్నారు. ఫుల్ హైజీనిక్ ఆపరేషన్ థియేటర్ తో పాటు అత్యంత అనుభవం కలిగిన వైద్యులు సిబ్బంది సేవలు అందించడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. గిరిజన ప్రజలకు, సామాన్య ప్రజలకు, పార్వతీపురం మన్యం జిల్లాతో పాటు సుధీర ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలకు అత్యంత శ్రద్ధతో కంటి ఆపరేషన్లు చేసి వారి జీవితాలలో వెలుగులు నింపడమే మా లక్ష్యం అని పద్మావతి అన్నారు. ప్రతిఒక్కరూ ఈ అవకాశాన్ని వినియోగించు కోవాలని ఆమె కోరారు.

## సాలూరు చిన్నవీధిలో కార్డన్ సెర్చ్

సాలూరు, మే 9, ప్రభాతవార్త: సాలూరు పట్టణ పోలీస్ వారు సీఏఎస్ఓ(కార్డాన్ అండ్ సెర్చ్ ఆపరేషన్)లో భాగంగ చిన్నవీధిలో ఉన్న పాత నేరస్థుల ఇళ్లల్లో ఇంకా వాహనాలను ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. శనివారం టౌన్ సీఐ అప్పలనాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్టూన్‌చర్చ్‌లో 15 మోటార్ సైకిళ్లను గుర్తించి వాటిని పూర్తిగా పరిశీలించి యజమానులను నిర్ధారించారు. అక్కడ ఎటువంటి అనుమానించదగిన వ్యక్తులు ఇంకా నిషేధిత వస్తువులు అలాగే చట్టవిరుద్ధ పనులులేవని గుర్తించారు. అంతేకాకుండ డ్రగ్స్ భూతం తరిమికొడదాం అవగాహన ప్రోగ్రాం నిర్వహించి ఏవైనా అసాంఘిక కార్యక్రమాలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించి సహకరించాలని సీఐ కోరారు.

## డయేరియాపై ఇంటింటా సర్వే

రామభద్రపురం, మే 9 ప్రభాతవార్త: డయేరియా వ్యాధిపై గ్రామాల్లో ఇంటింటి సర్వే చేపట్టామని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి పి. దిలీప్‌కుమార్ తెలిపారు. స్థానిక పీహెచ్సీలో శుక్రవారం ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ ఇటీవల కాలంలో పండగలు, పెళ్ళిళ్ల ఎక్కువగా ఉండడంతో ఈ డయేరియా ప్రబలే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అలాగే ఈ వేసవికాలంలో జ్వరాలు వచ్చే ప్రమాదం ఉందని, అవసరమైతే తప్ప ప్రజలు బయటకు వెళ్లరాదని సూచించారు. ముఖ్యంగా వడదెబ్బకు గురికాకుండా ప్రజలు అన్ని చర్యలు తీసుకోవాలని తెలిపారు. కొబ్బరినీళ్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. అనంతరం ప్రతీ ఇంటికి ఓఆర్ఎస్ పంపిణీ చేశామని తెలిపారు.


కెనరా బ్యాంక్ Canara Bank
భారత ప్రభుత్వ రంగ సంస్థ / A Government of India Undertaking

ఎ ఆర్ ఎమ్ బ్రాంచ్ (13591), విశాఖపట్నం
మెలొడీ సినిమా థియేటర్ ఎదురుగా, సూర్యాబాగ్, విశాఖపట్నం-530020.
ఫోన్: 8332956773, 7095199455, ఇ-మెయిల్: cb13591@canarabank.com

### స్థిరాస్తుల అమ్మకానికి వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని 8(6) & 9(1) నిబంధనలతో చదవబడు సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకానికి ఇ-వేలం అమ్మకం ప్రకటన.

కెనరా బ్యాంక్ ఎ.ఆర్.ఎం బ్రాంచ్ విశాఖపట్నం వారికి దిగువ తెలిపిన ఋణగ్రహీత(లు)/హామీదారు(లు) చెల్లించవలసిన బకాయి మొత్తంను రాబట్టుకొనుటకు కెనరా బ్యాంక్ అధీకృత అధికారిచే లాంఛనంగా/భౌతికంగా స్వాధీనం చేసుకున్న, సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తనఖా పెట్టిన/ఛార్జి చేసిన దిగువ వివరించిన స్థిరాస్తులను తేది 29.05.2026 న "ఎక్కడ ఎలా ఉన్నది" "అక్కడ అలా" మరియు "అక్కడ ఏమున్నదో అది" అనే ప్రాతిపదికన విక్రయించబడునని యావన్మంది ప్రజానీకానికి మరియు ముఖ్యంగా దిగువ తెలిపిన ఋణగ్రహీతలు మరియు హామీదారులకు తెలియజేయడమైనది. బ్యాంకు వారి పరిజ్ఞానం మేరకు తాకట్టు రుణభారాలు లేని స్థిరాస్తుల వివరములు.

ఇ-వేలం తేది & సమయం: 29.05.2026, మ॥ 01.00 గం.ల నుండి మ॥ 02.00 గం.ల వరకు (అమ్మకం ముగిసేవరకు ప్రతి 5 నిమిషముల వ్యవధిలో అపరిమిత పొడిగింపుతో)

ధరావత్తు సమర్పించుటకు ఆఖరి తేది: 28.05.2026, సాయంత్రం 6.00 గం॥ల లోపు

| వ. నెం. | ఋణగ్రహీత / హామీదారులు (అన్ని ఖాతాలు ఎ.ఆర్.ఎం బ్రాంచ్ విశాఖపట్నంకు బదిలీ చేయడమైనవి) | తనఖాలో ఉన్న ఆస్తి వివరములు | రిజర్వు ధర (రూ.) | ఇ.ఎం.డి (రిజర్వు ధరలో 10%) |
|---|---|---|---|---|
| 1 | M/s నాగసుధా & కో, ప్రొప్రయిటర్: శ్రీమతి. దానరి శేషారత్నం, భర్త: డి. కృపాచార్యులు మరియు హామీదారు : శ్రీ దానరి వేణుగోపాలరావు, తండ్రి: డి. కృపాచార్యులు. తేది 30.04.2026 నాటికి బకాయి మొత్తం: రూ. 515.02 లక్షలు + తదుపరి వడ్డీ + ఇతర ఛార్జీలు (ఏవైనా ఉంటే). | విజయనగరం జిల్లా, నెల్లిమర్ల ఎస్ఆర్ఒ, నెల్లిమర్ల మండలం, కొండగుంపం గ్రామం మరియు గ్రామపంచాయతీ, శ్రీ గృహ జ్యోతి వ్యాలీ అనే పేరు గల లే-అవుటు, సర్వే నెం.94/6, ప్లాట్ నెంలు. 30,31,34 & 35 నందు 841.6 చ॥గ॥ల విస్తీర్ణం గల స్థలం శ్రీమతి దానరి శేషారత్నం పేరున గలదు. హద్దులు డీడ్ ప్రకారం. | రూ. 13.63 లక్షలు | రూ. 1.37 లక్షలు |
| 2 | M/s. నందా అండ్ కో, ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రొప్రయిటర్: శ్రీ దేవర వెంకట కాశి సూక రాజు, తండ్రి: డి అప్పారావు తేది 30.04.2026 నాటికి బకాయి మొత్తం: రూ. 897.05 లక్షలు + తదుపరి వడ్డీ + ఇతర ఛార్జీలు (ఏవైనా ఉంటే). | ఆస్తి-1: విశాఖపట్నం జిల్లా, చోడవరం ఎస్ఆర్ఒ, చోడవరం మండలం మరియు గ్రామం, వార్డ్ నెం.2, బ్లాక్ నెం.2, ఎస్.నెం. 153/2, సమీప డి.నెం.2-11, పట్టా నెం.21204, ఎ. 0.15 సెంట్లు లేదా 0.060 హెక్టార్లు లేదా 726 చ॥గ॥ జిరాయితీ మెట్ట. హద్దులు డీడ్ ప్రకారం. | రూ. 9.44 లక్షలు | రూ. 0.95 లక్షలు |
| | ఆస్తి-2: నెల్లిమర్ల సబ్- జిల్లా, నెల్లిమర్ల మండలం, కొండ గుంపం పంచాయతీ, కొండ గుంపం గ్రామం, ఎల్.పి.నెం.33/2007/V1, ఎస్.నెం. 98p, 99p, 116p, 100/1p, ప్లాట్ నెం.134, 135 మరియు 208, మొత్తం విస్తీర్ణం 926.57 చ॥గ॥. హద్దులు డీడ్ ప్రకారం. | | రూ. 15.80 లక్షలు | రూ. 1.58 లక్షలు |
| 3 | M/s. పర్ఫెక్ట్ బైండ్స్, యజమానురాలు: మిడతన పావని, మిడతన పావని (యజమానురాలు), తండ్రి: ఎం. ఈశ్వరరావు & హామీదారు /తనఖాదారు: శ్రీ చిటిమిరెడ్డి మహేష్, తండ్రి: శ్రీ చిటిమిరెడ్డి సూర్యనారాయణ. తేది 30.04.2026 నాటికి బకాయి మొత్తం: రూ. 103.61 లక్షలు + తదుపరి వడ్డీ + ఇతర ఛార్జీలు (ఏవైనా ఉంటే). | ఆస్తి-1: విజయనగరం జిల్లా, కొత్తవలస యస్ఆర్ఒ, లక్కవరపుకోట మండలం, భీమాలి గ్రామం, సర్వే నెం. 27-3 లో మొత్తం విస్తీర్ణం 4,480 చ॥గ॥ లేదా 1471.36 చ॥మీ॥లో అవిభాజ్యపు మరియు అనిర్దేశ్యపు వాటా 4,480 చ॥గ॥ లేదా 1471 చ॥మీ॥ల స్థలం. హద్దులు డీడ్ ప్రకారం. | రూ. 127.77 లక్షలు | రూ. 12.78 లక్షలు |
| | ఆస్తి-2: విజయనగరం జిల్లా, కొత్తవలస ఎస్ఆర్ఒ, లక్కవరపుకోట మండలం, భీమాలి పంచాయితీ, భీమాలి రెవిన్యూ గ్రామం, అసెస్‌మెంట్ నెం. 148, కరెంట్ సర్వీస్ నెం. 54, సర్వే నెం. 21-2 భాగం నందు 182.55 చ॥గ॥ల విస్తీర్ణంలోని డోర్ నెం. 1-205 కలిగిన ఆర్‌సిసి శ్లాబ్ ఇల్లు. హద్దులు డీడ్ ప్రకారం. | | రూ. 19.20 లక్షలు | రూ. 1.92 లక్షలు |
| 4 | మెస్సర్స్ దేవర ఇన్నోవేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్, ప్రాతినిధ్యం వహిస్తున్న సంస్థ డైరెక్టర్లు: 1. శ్రీ దేవర వెంకట కాశి సూకరాజు, 2. శ్రీమతి దేవర నాగ సునంద దేవి, 3. శ్రీ. గొలగాని అశోక్ కుమార్ తేది 30.04.2026 నాటికి బకాయి మొత్తం: రూ. 1918.44 లక్షలు + తదుపరి వడ్డీ + ఇతర ఛార్జీలు (ఏవైనా ఉంటే). | విజయనగరం జిల్లా-535217, నెల్లిమర్ల సబ్-రిజిస్ట్రేషన్ జిల్లా, నెల్లిమర్ల మండలం, కొండగుంపం గ్రామం మరియు గ్రామపంచాయతీ, సర్వే నెం. 94/6, 97/1, 98 పార్ట్, 99 పార్ట్, 100/1 పార్ట్, 116 పార్ట్ మరియు 120/2 పార్ట్, ఎల్.పి. నెం. 33/2007/VI తేది: 11.06.2007 ప్రకారం డైరెక్టర్ ఆఫ్ టౌనింగ్ అండ్ కంట్రీ ప్లానింగ్, హైదరాబాద్ వారిచే ఆమోదించబడిన 'శ్రీ గృహ జ్యోతి వ్యాలీ' అనే పేరు గల డెవలప్డ్ లేఅవుట్, ప్లాట్ నెంలు. 68, 69, 70, 73, 74, 88, 90, 91, 92, 93, 94, 100, 101,108, 109, 110, 111, 115, 128, 132, 133, 186, 193 మరియు 215 ఖాళీ ప్లాట్లు. | రూ. 106.67 లక్షలు | రూ. 10.67 లక్షలు |

| | | |
|---|---|---|
| ప్లాట్ నెం 68: విస్తీర్ణం 222 చదరపు గజాలు. హద్దులు డీడ్ ప్రకారం. | రిజర్వు ధర : రూ. 3.59 లక్షలు | ధరావత్తు (ఇ.ఎం.డి): రూ. 0.36 లక్షలు |
| ప్లాట్ నెం 69: విస్తీర్ణం 221.6 చదరపు గజాలు. హద్దులు డీడ్ ప్రకారం. | రిజర్వు ధర : రూ. 3.58 లక్షలు | ధరావత్తు (ఇ.ఎం.డి): రూ. 0.36 లక్షలు |
| ప్లాట్ నెం 70: విస్తీర్ణం 221.6 చదరపు గజాలు. హద్దులు డీడ్ ప్రకారం. | రిజర్వు ధర : రూ. 3.58 లక్షలు | ధరావత్తు (ఇ.ఎం.డి): రూ. 0.36 లక్షలు |
| ప్లాట్ నెం 73: విస్తీర్ణం 307.38 చదరపు గజాలు. హద్దులు డీడ్ ప్రకారం. | రిజర్వు ధర : రూ. 4.97 లక్షలు | ధరావత్తు (ఇ.ఎం.డి): రూ. 0.50 లక్షలు |
| ప్లాట్ నెం 74: విస్తీర్ణం 110 చదరపు గజాలు. హద్దులు డీడ్ ప్రకారం. | రిజర్వు ధర : రూ. 1.78 లక్షలు | ధరావత్తు (ఇ.ఎం.డి): రూ. 0.18 లక్షలు |
| ప్లాట్ నెం 88: విస్తీర్ణం 208 చదరపు గజాలు. హద్దులు డీడ్ ప్రకారం. | రిజర్వు ధర : రూ. 3.36 లక్షలు | ధరావత్తు (ఇ.ఎం.డి): రూ. 0.34 లక్షలు |
| ప్లాట్ నెం 90: విస్తీర్ణం 202.22 చదరపు గజాలు. హద్దులు డీడ్ ప్రకారం. | రిజర్వు ధర : రూ. 3.27 లక్షలు | ధరావత్తు (ఇ.ఎం.డి): రూ. 0.33 లక్షలు |
| ప్లాట్ నెం 91: విస్తీర్ణం 365 చదరపు గజాలు. హద్దులు డీడ్ ప్రకారం. | రిజర్వు ధర : రూ. 5.90 లక్షలు | ధరావత్తు (ఇ.ఎం.డి): రూ. 0.59 లక్షలు |
| ప్లాట్ నెం 92: విస్తీర్ణం 324.4 చదరపు గజాలు. హద్దులు డీడ్ ప్రకారం. | రిజర్వు ధర : రూ. 5.24 లక్షలు | ధరావత్తు (ఇ.ఎం.డి): రూ. 0.53 లక్షలు |
| ప్లాట్ నెం 93: విస్తీర్ణం 324.4 చదరపు గజాలు. హద్దులు డీడ్ ప్రకారం. | రిజర్వు ధర : రూ. 5.24 లక్షలు | ధరావత్తు (ఇ.ఎం.డి): రూ. 0.53 లక్షలు |
| ప్లాట్ నెం 94: విస్తీర్ణం 324.4 చదరపు గజాలు. హద్దులు డీడ్ ప్రకారం. | రిజర్వు ధర : రూ. 5.24 లక్షలు | ధరావత్తు (ఇ.ఎం.డి): రూ. 0.53 లక్షలు |
| ప్లాట్ నెం 100: విస్తీర్ణం 370 చదరపు గజాలు. హద్దులు డీడ్ ప్రకారం. | రిజర్వు ధర : రూ. 5.98 లక్షలు | ధరావత్తు (ఇ.ఎం.డి): రూ. 0.60 లక్షలు |
| ప్లాట్ నెం 101: విస్తీర్ణం 375 చదరపు గజాలు. హద్దులు డీడ్ ప్రకారం. | రిజర్వు ధర : రూ. 6.06 లక్షలు | ధరావత్తు (ఇ.ఎం.డి): రూ. 0.61 లక్షలు |
| ప్లాట్ నెం 108: విస్తీర్ణం 254 చదరపు గజాలు. హద్దులు డీడ్ ప్రకారం. | రిజర్వు ధర : రూ. 4.10 లక్షలు | ధరావత్తు (ఇ.ఎం.డి): రూ. 0.41 లక్షలు |
| ప్లాట్ నెం 109: విస్తీర్ణం 254 చదరపు గజాలు. హద్దులు డీడ్ ప్రకారం. | రిజర్వు ధర : రూ. 4.10 లక్షలు | ధరావత్తు (ఇ.ఎం.డి): రూ. 0.41 లక్షలు |
| ప్లాట్ నెం 110: విస్తీర్ణం 254 చదరపు గజాలు. హద్దులు డీడ్ ప్రకారం. | రిజర్వు ధర : రూ. 4.10 లక్షలు | ధరావత్తు (ఇ.ఎం.డి): రూ. 0.41 లక్షలు |
| ప్లాట్ నెం 111: విస్తీర్ణం 259.77 చదరపు గజాలు. హద్దులు డీడ్ ప్రకారం. | రిజర్వు ధర : రూ. 4.20 లక్షలు | ధరావత్తు (ఇ.ఎం.డి): రూ. 0.42 లక్షలు |
| ప్లాట్ నెం 115: విస్తీర్ణం 267 చదరపు గజాలు. హద్దులు డీడ్ ప్రకారం. | రిజర్వు ధర : రూ. 4.32 లక్షలు | ధరావత్తు (ఇ.ఎం.డి): రూ. 0.44 లక్షలు |
| ప్లాట్ నెం 128: విస్తీర్ణం 267 చదరపు గజాలు. హద్దులు డీడ్ ప్రకారం. | రిజర్వు ధర : రూ. 4.32 లక్షలు | ధరావత్తు (ఇ.ఎం.డి): రూ. 0.44 లక్షలు |
| ప్లాట్ నెం 132: విస్తీర్ణం 324.44 చదరపు గజాలు. హద్దులు డీడ్ ప్రకారం. | రిజర్వు ధర : రూ. 5.25 లక్షలు | ధరావత్తు (ఇ.ఎం.డి): రూ. 0.53 లక్షలు |
| ప్లాట్ నెం 133: విస్తీర్ణం 324.44 చదరపు గజాలు. హద్దులు డీడ్ ప్రకారం. | రిజర్వు ధర : రూ. 5.25 లక్షలు | ధరావత్తు (ఇ.ఎం.డి): రూ. 0.53 లక్షలు |
| ప్లాట్ నెం 186: విస్తీర్ణం 286.66 చదరపు గజాలు. హద్దులు డీడ్ ప్రకారం. | రిజర్వు ధర : రూ. 4.64 లక్షలు | ధరావత్తు (ఇ.ఎం.డి): రూ. 0.47 లక్షలు |
| ప్లాట్ నెం 193: విస్తీర్ణం 265 చదరపు గజాలు. హద్దులు డీడ్ ప్రకారం. | రిజర్వు ధర : రూ. 4.28 లక్షలు | ధరావత్తు (ఇ.ఎం.డి): రూ. 0.43 లక్షలు |
| ప్లాట్ నెం 215: విస్తీర్ణం 267 చదరపు గజాలు. హద్దులు డీడ్ ప్రకారం. | రిజర్వు ధర : రూ. 4.32 లక్షలు | ధరావత్తు (ఇ.ఎం.డి): రూ. 0.44 లక్షలు |

ఆస్తి తనిఖీ తేది & సమయం : 22.05.2026, ఉ॥ 10.00 గం॥ల నుండి సా॥ 4.00 గం॥ల వరకు
అమ్మకానికి సంబంధించిన సవివరమైన నియమ నిబంధనలకు కెనరా బ్యాంక్ వెబ్‌సైట్ www.canarabank.com లో ఏర్పాటు చేసిన "ఇ-వేలం" లింక్‌ను రిఫర్ చేయండి లేదా కెనరా బ్యాంక్ ఎ.ఆర్.ఎం బ్రాంచ్, విశాఖపట్నం అధీకృత అధికారి గారిని ఆఫీసు పనివేళలలో సంప్రదించగలరు. ఫోన్ : 83329 56773, 70951 99455

రిజర్వు ధరలో 10% సొమ్మును ధరావత్తుగా ఆర్.టి.జి.ఎస్/నెఫ్ట్/ఫండ్ ట్రాన్స్‌ఫర్ ద్వారా https://baanknet.com లోని E-వాలెట్‌కు బిడ్డర్ లాగిన్ అయి తేది.28.05.2026, సా॥ 6:00 గం.ల లోపుగా చెల్లించవలెను.
* బ్యాంకుకు తెలిసిన/తెలియని బకాయిలు/టాక్స్‌లు ఏవైనా ఉన్నచో అవి వేలం కొనుగోలుదారే భరించాలి మరియు తుది బిడ్ మొత్తంతోపాటు అవి కూడా చెల్లించవలసి ఉంటుంది. బిడ్డర్లు తమ ఆఫర్‌లను, ఆస్తి రిజర్వు ధర 25 లక్షల వరకు ఉన్నవాటికి రూ. 10,000/- గుణింపులో హెచ్చించవలెను. రిజర్వు ధర 25 లక్షల నుండి 100 లక్షల వరకు ఉన్నవాటికి రూ. 25,000/- గుణింపులో హెచ్చించవలెను మరియు రిజర్వు ధర 100 లక్షల కన్నా ఎక్కువ ఉన్నట్లయితే రూ. 50,000/- గుణింపులో హెచ్చించవలెను. 'ఆన్‌లైన్' వేలం ముగిసేలోపు అత్యధిక బిడ్ (రిజర్వు ధర కన్నా ఎక్కువ) సమర్పించిన బిడ్డర్ విజయవంతమైన బిడ్డర్‌గా ప్రకటించబడతారు.
ఇ-వేలం విధానం, నియమ నిబంధనల కొరకు సర్వీసు ప్రొవైడర్‌ను సంప్రదించండి: మెస్సర్స్ పిఎస్‌బి అలయన్స్(baanknet), వెబ్‌పోర్టల్ https://baanknet.com, హెల్ప్‌డెస్క్: 7046612345/6354910172/8291220220/9892219848 / 8160205051, ఇ-మెయిల్: support.baanknet@psballiance.com

తేది.06.05.2026, ప్రదేశం : విశాఖపట్నం — సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

10-05pg10exHMNWJQEG.qxd:10-05pg10exHMNWJQEG.qxd 1/1/02 6:59 AM Page 1



# వినేష్‌తో రెజ్లింగ్ సమాఖ్య కుస్తీ



**న్యూఢిల్లీ:** భారత మేటి రెజ్లర్ వినేష్ ఫోగట్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. వినేష్ ఫోగట్ జూన్ 26 వరకు జాతీయ పోటీల్లో పోటీ చేసేందుకు అనర్హురాలిగా భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యుఎఫ్ఐ) ప్రకటించింది. క్రమశిక్షణా రాహిత్యం, డోపింగ్ నిరోధక నిబంధనల ఉల్లంఘనకు పాల్పడినట్లు ఆరోపిస్తూ నోటీసులు జారీ చేసింది. దీంతో ఉత్తర్‌ప్రదేశ్‌లోని గొండాలో నేటి నుంచి ప్రారంభమయ్యే జాతీయ ఓపెన్ ర్యాంకింగ్ రెజ్లింగ్ టోర్నీకి వినేష్ ఫోగట్ మిస్సయింది.

ఇటీవల తిరిగి రెజ్లింగ్‌లోకి పునర్ ఎంట్రీ ఇచ్చిన వినేష్ ఫోగట్... యూపీలోని గోండాలో జరిగే జాతీయ పోటీల్లో పాల్గొనాలని నిర్ణయించుకుంది. అయితే రిజిస్ట్రేషన్ మొదలు పలు అంశాలు వివాదాస్పదమయ్యాయి. బ్రిజ్‌భూషణ్ సొంత ప్రాంతంలో పోటీపడడం తనను మానసిక ఒత్తిడికి గురి చేస్తోందని వినేష్ ఆందోళన వ్యక్తంచేసింది. పోటీల సందర్భంగా తనకు ఏం జరిగినా కేంద్ర ప్రభుత్వానిదే బాధ్యత అవుతుందని హెచ్చరించింది.

అయితే, పోటీలు ప్రారంభానికి ఒకరోజు ముందే డబ్ల్యూఎఫ్ఐ నుంచి ఈ ప్రకటన వచ్చింది. ఈ క్రమంలో ఏకంగా డబ్ల్యుఎఫ్ఐ... పోటీల్లో పాల్గొనకుండా జూన్ 26 వరకు అనర్హత ప్రకటించడం సంచలనంగా మారింది. రిటైర్మెంట్ నుంచి తిరిగి పోటీల్లో పాల్గొనేందుకు అవసరమైన ఆరు నెలల నోటీస్ వ్యవధిని పూర్తి చేయడంలో వినేష్ విఫలమైనట్లు డబ్ల్యూఎఫ్ఐ తెలిపింది. వినేశ్ ప్రవర్తన భారత రెజ్లింగ్ ప్రతిష్ఠను దెబ్బతీసిందని, దేశం అవమానపడేలా వ్యవహరించారని పేర్కొంది. జాతీయ, అంతర్జాతీయ రెజ్లింగ్ నిబంధనలు ఉల్లంఘించారని ఆరోపించింది.

మహిళా రెజ్లింగ్‌కు ఆదరణ తెచ్చిన వినేష్ ఫోగట్...రెండుసార్లు ప్రపంచ ఛాంపియన్‌షిప్ మెడలిస్ట్. ఆసియా క్రీడల్లో స్వర్ణం, సిల్వర్ మెడల్స్.. కామన్‌వెల్త్ క్రీడల్లో మూడు స్వర్ణాలు, ఏషియన్ ఛాంపియన్ షిప్‌లో మెడల్స్‌తో మెరిశారు. 2024 పారిస్ ఒలింపిక్స్‌లో ఏకంగా ఫైనల్ చేరింది. అయితే ఫైనల్‌కు ముందు నిర్వహించిన వెయిట్‌లో వంద గ్రాములు ఎక్కువగా ఉందని వినేష్ ఫోగట్‌పై అనర్హత వేటు పడింది. దీన్ని ఛాలెంజ్ చేసిన ఫోగట్... అదే ఏడాది అగస్టులో రెజ్లింగ్‌కు గుడ్‌బై చెప్పింది. రాజకీయాల్లోకి ఎంట్రీ ఇచ్చి 2024లో హర్యానాలోని జులానా నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2023లో డబ్ల్యుఎఫ్ఐ అప్పటి అధ్యక్షుడు బ్రిజ్



భూషణ్‌పై లైంగిక వేధింపుల ఆరోపణలపై మహిళా రెజ్లర్లకు మద్దతుగా వినేష్ ఫోగట్ నిలిచింది.

## జైస్వాల్, షఫాలీ డోప్ కష్టాలు

**ముంబై:** భారత క్రికెటర్లు యశస్వీ జైస్వాల్, షఫాలీ వర్మలు డోప్ చిక్కుల్లో పడ్డారు. వీరిద్దరికి జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ(నాడా) నోటీసులు జారీ చేసింది. గతేడాది నిర్ణీత డోప్ పరీక్షలకు హాజరుకాకపోవడంతో ఈ నోటీసులు ఇచ్చింది. దీనిపై వివరణ ఇచ్చుకునేందుకు జైస్వాల్, షఫాలీకి వారం రోజుల గడువిచ్చింది. గత డిసెంబర్ 17న యశస్వీ జైస్వాల్‌కు, నవంబర్ 7న షఫాలికి డోప్ పరీక్షలు జరగాల్సింది. అయితే వీటికి వీరు అందుబాటులోకి రాకపోవడంతో నాడా.. ఫిబ్రవరిలో వీరిద్దరి నుంచి వివరణ కోరింది. వీరు స్పందించక పోవడంతో తాజాగా నోటీసులు జారీ చేసింది. 12 నెలల వ్యవధిలో మూడుసార్లు డోపింగ్ పరీక్షలకు హాజరుకాకపోతే రెండేళ్లపాటు నిషేధం పడుతుంది. జైస్వాల్ ప్రస్తుతం ఐపీఎల్ 2026లో బిజీగా ఉండగా.. జూన్ 12 నుంచి ప్రారంభం కానున్న టీ20 మహిళా ప్రపంచ కప్‌కు షఫాలీ వర్మ సద్ధమవుతోంది. కాగా పరీక్షలకు హాజరు కాకపోవడంపై నాడా నుండి సమాచారం అందిందని బీసీసీఐ తెలిపింది. ఇది ఎలా జరిగిందో తాము వారితో తనిఖీ చేస్తామని, భవిష్యత్తులో ఇలాంటివి జరగకుండా అవసరమైన చర్యలు తీసుకుంటామని బీసీసీఐ పేర్కొంది.









## శుభ్‌మన్ గిల్ కెప్టెన్ ఇన్నింగ్
# గుజరాత్ మరో విజయం

**జైపూర్:** గుజరాత్ టైటాన్స్ వరుసగా నాలుగో విక్టరీతో పాయింట్ల పట్టికలో రెండో స్థానంలోకి దూసుకెళ్లింది. జైపూర్‌లో జరిగిన మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్‌పై 77పరుగుల తేడాతో గెలుపొందింది. మొదట బ్యాటింగ్ చేసిన గుజరాత్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్లకు 229 రన్స్ చేసింది. శుభ్‌మన్ గిల్(44 బంతుల్లో 84; 9 ఫోర్లు, 3 సిక్స్‌లు) కెప్టెన్ ఇన్నింగ్స్‌కు తోడు సాయి సుదర్శన్(36 బంతుల్లో 55; 6 ఫోర్లు, 2 సిక్స్‌లు) మెరుపులు మెరిపించారు. ధాటిగా ఆడుతూ పవర్ ప్లే తొలి 6 ఓవర్లలోనే 82 రన్స్ సాధించారు. అదే జోరు కొనసాగిస్తూ తొలి వికెట్‌కు 118 రన్స్ జోడించారు. సుదర్శన్ అవుటైనా గిల్ మెరుపు ఇన్నింగ్స్ కొనసాగింది. గుజరాత్ స్కోరును 150 దాటించి అవుటయ్యాడు. స్లాగ్‌ఓవర్లలో వాషింగ్టన్ సుందర్(20 బంతుల్లో 37 నాటౌట్) ధాటిగా ఆడగా, తెవాటియా(14) చివరి ఓవర్లో 2 సిక్స్‌లు బాదాడంతో గుజరాత్ స్కోరు 229కు చేరింది.

230రన్స్‌తో బ్యాటింగ్‌కు దిగిన రాజస్తాన్ టాప్ ఆర్డర్‌ను సిరాజ్, రబడా కూల్చాగా, ఏస్ స్పిన్నర్ రషీద్‌ఖాన్ మిడిల్ ఆర్డర్, హోల్డర్ లోయర్ ఆర్డర్ పనిపెట్టాడు. దీంతో రాజస్థాన్ 16.3 ఓవర్లలో 152కు కుప్పకూలింది. జడేజా(38) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. రాజస్థాన్ బౌలర్లలో రషీద్ 4, రబడా రెండు, హోల్డర్ 3 వికెట్లు పడగొట్టారు. ఈ ఓటమితో రాజస్థాన్ టాప్-4 నుంచి 5వ స్థానానికి చేరింది.

## తొలి రౌండ్‌లోనే జొకోవిచ్ ఔట్



**రోమ్:** టెన్నిస్ స్టార్ నోవాక్ జొకోవిచ్ ఇటాలియన్ ఓపెన్ తొలి రౌండ్‌లోనే నిష్క్రమించాడు. అతనిపై 2-6, 6-2, 6-4 తేడాతో క్వాలిఫయర్ డైనో ప్రిజ్నిక్ గెలుపొందాడు. కెరీర్‌లోనే అతిపెద్ద విజయాన్ని నమోదు చేశాడు. గాయంతో పలు టోర్నీలకు దూరమైన జొకోవిచ్... కోలుకుని ఇటాలియన్ ఓపెన్ బరిలో దిగాడు. అయితే తొలి రౌండ్ పోరులో జొకోవిచ్ ఇబ్బంది పడ్డాడు. దీంతో అతని ఫిట్‌నెస్‌పై సందేహాలు ఏర్పడ్డాయి. 25వ గ్రాండ్ స్లామ్ టైటిల్‌పై ఫోకస్ పెట్టిన జొకోవిచ్...ఫ్రెంచ్ ఓపెన్‌కు ముందు ఇలా తొలి రౌండ్‌లోనే ఓటమి పొందడం ఆశ్చర్యం. గత ఏడాది మాడ్రిడ్ ఓపెన్ తర్వాత జొకోవిచ్ ఓ టోర్నీలో ఇంత త్వరగా నిష్క్రమించడం ఇదే మొదటిసారి,

ఇండియన్ వెల్స్ తర్వాత మొదటిసారి బరిలోకి దిగిన జొకోవిచ్... తొలి సెట్‌లో జోరు చూపాడు. క్వాలిఫయర్ డైనో ప్రిజ్నిక్ సర్వీసులను రెండు సార్లు బ్రేక్ చేసి తొలి సెట్‌ను 6-2తో ముగించి ఆధిక్యం చాటాడు. అయితే రెండో సెట్ నుంచి జొకోవిచ్ భుజం గాయం తిరగబెట్టినట్లు కనిపించాడు. ఇదే అదనుగా ప్రిజ్నిక్ మెరుగైన ఆటతో వరుసగా రెండు సెట్లను గెలుపొంది తరువాతి రౌండ్‌లో ప్రవేశించాడు. కాగా అలెగ్జాండర్ జ్వెరెవ్ తన తోటి జర్మన్ ఆటగాడైన డేనియల్ ఆల్ట్‌మాయర్‌ను 7-5, 6-3తో వరుస సెట్లలో సునాయాసంగా ఓడించి మూడో రౌండ్‌లోకి ప్రవేశించాడు.

## నిరాశపరిచిన వైభవ్ సూర్య

విధ్వంసకర ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ(16 బంతుల్లో 36) మరోసారి నిరాశపరిచాడు. గత మ్యాచ్‌లో డీసీపై 4 రన్స్‌కే అవుటైన వైభవ్‌పై ఈ మ్యాచ్‌లో భారీ ఎక్స్‌పెక్టేషన్స్ పెట్టుకున్నారు. తాను ఎదుర్కొన తొలి బంతినే లాంగ్‌ఆన్ మీదుగా సిక్స్‌గా మలిచాడు. ఇక రబడ వేసిన రెండో ఓవర్లో ఫైన్ లెగ్ మీదుగా , మిడ్ వికెట్ మీదుగా స్టాండ్స్‌లోకి పంపాడు. ఇక సిరాజ్ ఓవర్లో మొదటి బంతికి కవర్ బౌండరీ, రెండో బంతి డాట్, మూడో బంతి బ్యాక్ వర్డ్ పాయింట్ బౌండరీ, నాలుగో బంతికి మిడాఫ్ బౌండరీ ఇలా మూడు ఫోర్లు బాదాడు. షార్ట్ బాల్‌గా వచ్చిన అయిదో బంతిని ఆడబోయి అర్షద్‌కు మ్యాచ్ ఇచ్చి వైభవ్ పెవిలియన్ చేరాడు. రాజస్థాన్ స్కోరు 38లో 36 పరుగులు వైభవ్ బ్యాట్ నుంచి వచ్చినవే.



## ప్రైజ్‌మనీ ఇప్పించండి: చెస్ జీఎం అభిజిత్

**ఢిల్లీ:** గెలిచి టోర్నీ ప్రైజ్‌మనీ ఇప్పించండి మొర్రో అనవేడుకుంటున్నాడు చెస్ గ్రాండ్‌మాస్టర్ అభిజిత్ గుపా. ఈ ఏడాది జనవరిలో ఒడిషా ఓపెన్ చెస్ టైటిల్‌ను అభిజిత్ గెలుపొందాడు. అపుడు నిర్వాహకులు ట్రోఫీ అందించినా అయిదున్నర లక్షల ప్రైజ్‌మనీ ఇవ్వలేదు. తరువాత తరువాత అంటూ అయిదునెలలుగా నెట్టుకొంటూ వస్తున్నారు. దీంతో పలుమార్లు అడిగి వేసారిన అభిజిత్.. చివరకు కేంద్ర క్రీడా మంత్రిత్వశాఖను ఆశ్రయించారు. నెలలోగా ప్రైజ్‌మనీ సొమ్ముఉ చెల్లిస్తామని నిర్వాహకులు హామీ ఇచ్చి తప్పారని వాపోయారు.



# పెరగనున్న పెట్రోల్, డీజిల్ ధరలు!





**న్యూఢిల్లీ,మే 9:**వాహనదారులపై పెట్రోల్, డీజిల్ ధరల భారం పడే సూచనలు కనిపిస్తున్నాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిచమురు ధరలు భారీగా పెరగడంతో, ప్రభుత్వ రంగ చమురు సంస్థలు ఎదుర్కొంటున్న నష్టాలను భర్తీచేసేందుకు ఇంధన ధరల పెంపు తప్పకపోవచ్చని తెలుస్తోంది. అంతర్జాతీయంగా ముడిచమురు ధర బ్యారెల్‌కు 70 డాలర్ల నుండి ఏకంగా 126 డాలర్లకు చేరుకోవడంతో, చమురు సంస్థలు ప్రతి నెలా దాదాపు రూ. 30వేల కోట్ల నష్టాన్ని చవిచూస్తున్నాయి. ప్రస్తుతం ప్రభుత్వం, చమురు సంస్థలు కలిసి లీటర్ పెట్రోల్‌పై దాదాపు రూ.24 భారాన్ని భరిస్తూ వినియోగదారులకు ఉపశమనం కలిగిస్తున్నాయి. పెరుగుతున్న ఆర్థిక ఒత్తిడి వల్ల ధరల సవరణ అనివార్యంగా కనిపిస్తోంది. ఒకవేళ ధరల పెంపునకు ఆమోదం లభిస్తే పెట్రోల్, డీజిల్‌పై లీటరుకు రూ.4 నుండి రూ. 5 వరకు పెరగవచ్చు. వంట గ్యాస్ సిలిండర్‌పై రూ.40 నుండి రూ.50 వరకు పెరిగే అవకాశం ఉంది. గత నాలుగు ఏళ్లుగా (2022 నుండి) ఇంధన ధరల్లో పెద్దగా మార్పులు లేవు,ఈపరిణామం వాహనదారులపై గణనీయమైన ప్రభావం చూపే అవకాశం ఉంది. మధ్య ప్రాచ్యంలో నెలకొన్న ఉద్రిక్తతలు మరియు హోర్ముజ్ జలసంధిలో సరఫరాకు అంతరాయం కలగడం వల్ల ప్రపంచవ్యాప్త చమురు సరఫరాలో 20 శాతం ప్రభావితమైంది. ఇది ముడి చమురు ధరలను ఆకాశానికి చేర్చింది. భారత్ ప్రస్తుతం రష్యా, అమెరికా, పశ్చిమ ఆఫ్రికా దేశాల నుండి దిగుమతులను పెంచడం, ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించడం ద్వారా పరిస్థితిని చక్కదిద్దే ప్రయత్నం చేస్తోంది. ద్రవ్యోల్బణం పెరగకుండా ఉండటానికి, చమురు సంస్థల ఆర్థిక స్థితిని కాపాడటానికి ప్రభుత్వం ఇప్పుడు సమతుల్య నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

## అనిల్ అంబానీ ఇల్లు, కార్యాలయాల్లో
# సిబిఐ సోదాలు

**ముంబయి, మే 9:** రిలయన్స్ అనిల్ ధీరూబాయ్ అంబానీ గ్రూప్ అధినేత అనిల్ అంబానీకి చెందిన కార్యాలయాల్లో సీబీఐ సోదాలు నిర్వహిస్తోంది. అనిల్ నేతృత్వంలోని రిలయన్స్ గ్రూప్ కంపెనీలైన రిలయన్స్ టెలికాం లిమిటెడ్, రిలయన్స్ కమర్షియల్ ఫైనాన్స్ లిమిటెడ్, రిలయన్స్ హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్‌లపై నమోదైన కేసులకు సంబంధించి ఈ సోదాలు జరిగినట్లు తెలుస్తోంది. బ్యాంకు మోసం కేసులో ముంబైలో అనిల్ అంబానీకి సంబంధించిన 17 ప్రాంగణాల్లో సోదాలు నిర్వహించినట్లు సీబీఐ తెలిపింది. కంపెనీల డైరెక్టర్ల నివాసాలు, మధ్యవర్తిత్వం వహించిన సంస్థల కార్యాలయాల్లో కూడా సోదాలు జరుపుతున్నట్లు సీబీఐ అధికారులు తెలిపారు. ఒకే చిరునామా నుంచి పలు మధ్యవర్తి కంపెనీలు పనిచేస్తున్నట్లు గుర్తించామని, దర్యాప్తు కొనసాగుతోందని పేర్కొన్నారు.వేల కోట్ల రూపాయల మోసాలకు పాల్పడినట్లు ప్రభుత్వరంగ బ్యాంకులు, ఎల్ఐసీ ఇచ్చిన ఫిర్యాదుల ఆధారంగా అనిల్ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ గ్రూప్‌పై 7 కేసులు నమోదయ్యాయి.రిలయన్స్ టెలికామ్, రిలయన్స్ కమర్షియల్ ఫైనాన్స్, రిలయన్స్ హోంఫైనాన్స్ వంటి సంస్థల డైరెక్టర్లు,కార్యాలయాలు,ఇళ్లల్లో సోదాలు నిర్వహించారు. ముంబయి స్పెషల్‌కోర్టు జడ్జి జారీచేసిన వారంట్ల ఆధారంగా సోదాలు జరిపారు. ఈకేసుల్లో మొత్తం నష్టం రూ.27,337 కోట్లుగా ఉన్నట్లు సిబిఐ చెపుతోంది. అంతకుముందు కూడా సిబిఐ 14 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహించింది. రిలయన్స్‌కమ్యూనికేషన్స్ అధికారులు డి.విశ్వనాథ్, జాయింట్ ప్రెసిడెంట్ అనిల్ కాల్యాలను గతనెల 20నే అరెస్టుచేసినట్లు తెలిపారు. ఈకేసులో కాల్యా విశ్వనాథ్‌ను బ్యాంకింగ్ కార్యకలాపాల నిర్వహణలో సాయంచేసారని, నిధుల వినియోగంలో కూడా ఆయన హస్తం ఉందని సిబిఐ వెల్లడించింది. ప్రస్తుతం వీరు జ్యుడిషియల్ కస్టడీలో ఉన్నారు.









## 2.57 లక్షల కోట్ల పన్ను బకాయిలపై సిబిడిటి ఫోకస్

**న్యూఢిల్లీ, మే 9:** దేశంలో ఇప్పటికీ వసూలు కావాల్సి ఉన్న రూ.2.57 లక్షలకోట్ల పన్ను బకాయిలను రాబట్టేందుకు కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు రంగంలోకి దిగింది. పన్ను విభాగం వివరాలను చూస్తే ప్రత్యేక బృందాలు ముందుగా 2027 ఆర్థిక సంవత్సరంలో పదివేల ఎక్కువ విలువల బకాయిలున్న కేసులపై ఫోకస్ పెంచారు. దాడులు సోదాలతోపాటు ముందు టెక్నాలజీ సాయంతో వీటి సమగ్ర వివరాలను సేకరించి ఆతర్వాతనే దాడులకు ఉపక్రమిస్తోంది. సెర్సాయ్ తనఖా, అసెట్ డేటాబేస్‌ను వినియోగించి బకాయిదారుల ఆస్తులు, సురక్షిత రాబడుల వివరాలను సేకరిస్తున్నారు.మినహాయింపులు, తగ్గింపులను దుర్వినియోగం చేయకుండా ఉండే చర్యలు కూడా చేపట్టింది.2026 ఆర్థికసంవత్సరంలో ఐటిశాఖ ఇప్పటివరకూ 2.24 లక్షల అప్పీళ్లను పరిష్కరించింది. రూ.8.27లక్షలకోట్లకు సంబంధించిన వివాదాలు పరిష్కరం అయ్యాయి. పెండింగ్‌లో ఉన్న అప్పీళ్లు ప్రస్తుతం 5.40 లక్షల నుంచి 4.95 లక్షలకు తగ్గించినట్లు సిబిడిటి వెల్లడించింది.బడ్జెట్ లక్ష్యాలప్రకారం ప్రత్యక్ష పన్నుల వసూళ్లు రూ.26.97 లక్షల కోట్లుగా ఉంది. నికరంగా ప్రత్యక్ష పన్నుల వసూళ్లు 5.1శాతం వార్షిక వృద్ధితో రూ.23.4 లక్షల కోట్లుగా ఉన్నాయి. సవరించిన అంచనాలు రూ.24.21 లక్షలకోట్లకంటే తగ్గాయి.


गृह मंत्रालय
भारत सरकार

మన జనాభా లెక్కలు
మన అభివృద్ధి

2027 జనాభా లెక్కల యొక్క మొదటి దశ
ఇళ్ల జాబితా మరియు ఇంటింటి జనాభా లెక్కలు

జనాభా లెక్కలు: ప్రైవసీ యొక్క హామీ
మీ సమాచారానికి సంపూర్ణ భద్రత ఉంటుంది

- సెన్సస్ చట్టం, 1948 క్రింద పూర్తి రహస్యం
- భద్రమైన సర్వర్స్‌పై గూఢంగా వుండే డేటా
- నివేదికలలో మొత్తంగా కలిపివున్న సంఖ్యలు మాత్రమే ప్రచురింపబడుతాయి
- మీ పేరు మరియు చిరునామా ఎవరితోనూ పంచుకోబడదు
- పన్నుకు, పోలీసింగ్ లేదా విచారణలకు వినియోగించబడదు

జనాభా లెక్కలు 2027
నమ్మకం మరియు పాల్గొనటం
- నిక్కచ్చి సమాచారం ఇవ్వండి
- నిర్భయంగా సమాచారం ఇవ్వండి
- జాతి ప్రగతికి చేయూత ఇవ్వండి

హామీ ఇస్తున్నాం
మీ సమాచారం
- గోప్యంగా ఉంటుంది
- ఎవరికీ తెలియకుండా రహస్యంగా ఉంటుంది
- జాతి-నిర్మాణానికి మాత్రమే వినియోగించబడుతుంది

మనబాధ్యతను సక్రమంగా నెరవేరుద్దాం
మరియు జనాభా లెక్కలలో పాల్గొందాం



టోల్ ఉచితం - 1855
CensusIndia2027
CBC 19108/13/0090/2627


Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 1 -187, Kushalpuram, Srikakulam Dist. PIN: 532005 Ph. 270684, 271144, 9848387562 Fax : 08942-271146, RNI No. AP TEL/2004/13708 Editor :*Damerla Sai Baba *Responsible for selection of News under the PRB Act. Regd.: No.J/RNP/VM111 Air Surcharge: Delhi : 40 Ps.